www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 28-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 314 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: చవితి తె. 4.20 తదుపరి పంచమి; నక్షత్రం: హస్త ఉ. 7.34 తదుపరి చిత్త; వర్జ్యం: సా. 4.30-6.17; దుర్ముహూర్తం: ఉ.12.05-12.52; అమృతఘడియలు: తె. 3.13-5.01; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.39; సూర్యాస్తమయం: 6.18 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

లోక్‌పాల్‌గా జస్టిస్ ఖాన్విల్కర్

సుప్రీం కోర్టు మాజీ జడ్జిని నియమిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు

రెండేళ్ల తర్వాత లోక్‌పాల్ నియామకం

సభ్యులుగా జస్టిస్ లింగప్ప నారాయణ స్వామి, జస్టిస్ సంజయ్ యాదవ్, జస్టిస్ రితు రాజ్ అవస్థి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: లోక్‌పాల్ చైర్‌పర్సన్‌గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అజయ్ మాణిక్‌రావు ఖాన్విల్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్రపతి భవన్ ప్రకటన విడుదల చేసింది. ఈ పదవి సుమారు రెండేళ్లపాటు ఖాళీగా ఉండడం గమనార్హం. కడపటి లోక్‌పాల్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన

మిగతా 2వ పేజీలో...



సోమవారం ఉదయం 11.30 గంటలు.. దృశ్యం 1

చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం రాజుపేట వద్ద కుప్పం బ్రాంచి కాలువ గేటును బటన్ నొక్కి, సీఎం జగన్ పైకెత్తారు. అప్పటికి రెండు రోజులుగా అధికారులు ఆపసోపాలు పడి ఆపి పెట్టిన నీళ్లు ముందుకు దూకాయి.



మంగళవారం ఉదయం 10.30 గంటలు దృశ్యం 2

జగన్ బటన్ నొక్కి, ఎత్తిన గేటును ఒక భారీ యంత్రంతో పెకలించి, లారీలో వేసి తీసుకువెళ్లిపోయారు.

అమ్మ.. జగనా!

గేటు సెటప్‌తో నీళ్ల నాటకం.. కుప్పానికి కృష్ణా నీళ్ల పేరిట 'షో'



మంగళవారం మధ్యాహ్నం 1.00 గంట దృశ్యం 3

మొదటి రెండు ఫొటోలూ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మళ్లీ లారీలో గేటు తెచ్చి యథాస్థానంలో బిగించేశారు.

బటన్ నొక్కి నీళ్లు వదిలిన గేటు ఉత్తుత్తిదే.. పని కాగానే గేటు ఎత్తేసిన అధికారులు

ఫొటోలు వైరల్ కావడంతో ఉలికిపాటు.. మళ్లీ యథాతథంగా అక్కడే పెట్టి పరార్

నిన్న వదిలిన నీళ్లు నేడు మాయం.. నీటి చెమ్మా లేని కాల్వలో నేతల నిరసన

కుప్పం/రామకుప్పం, ఫిబ్రవరి 27: పనులు నాటకం! నీళ్లు బూటకం! చివరికి.. పూజలు చేసి గేటు ఎత్తడమూ నాటకమే! ఇదీ... ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన 'షో'! 'చంద్రబాబు చేయలేని పని మేం చేశాం. ఆయన సొంత నియోజకవర్గం కుప్పానికి కృష్ణా నీళ్లు ఇచ్చేశాం' అని చెప్పుకొనేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆడిన హైడ్రామా! ఈ నాటకం 24 గంటల్లోనే బట్టబయలైంది. సోమవారం చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం రాజుపేట వద్ద కుప్పం బ్రాంచి కాలువ గేటును జగన్ బటన్ నొక్కి పైకెత్తారు. ఆ గేటును పూలతో చక్కగా అలంకరించారు. అయితే... మంగళవారం ఉదయం అధికారులు జేసీబీని తీసుకొచ్చి మొత్తం గేటును ఎత్తి లారీలో పెట్టి తరలించుకుపోయారు. ఈ ఫొటోలు కాస్తా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. టీడీపీ హయాంలోనే దాదాపు 85 శాతం పూర్తయిన కెనాల్ ఇది! మిగిలిన పనులనూ జగన్ ప్రభుత్వం పూర్తిచేయలేకపోయింది. ఎన్నికల ముందు 'కుప్పానికి కృష్ణా జలాలు' పేరుతో భారీ హంగామా చేసింది. అదంతా ఉత్తుత్తిదే అని

మిగతా 12వ పేజీలో...

కోడ్ కూయకముందే కోట్లు పంచుడు



ఓటర్లకు వైసీపీ నేతల తాయిలాలు

నాలుగున్నరేళ్లుగా ప్రజలను, ప్రజా సమస్యలనూ అధికార పార్టీ నేతలు పట్టించుకోలేదు. 'గడప గడప'లో తీవ్ర నిరసనలు, నిలదీతలు ఎదురయ్యాయి. ఇప్పుడు కానుకలు పంచి ఓట్లు వేయించుకోవాలని వ్యూహం పన్నారు.

మహిళలకైతే చీర, జాకెట్, ఇతర కానుకలు! మగవారికైతే మందు ప్రత్యేకం. ఇక స్వీట్లు, బిర్యానీ, డబ్బు. విలేకరులు, వలంటీర్లకైతే మరింత స్పెషల్. వైసీపీ నేతలు కానుకల పేరిట ఒక్కో నియోజకవర్గంలో కోట్లు ఖర్చు చేస్తున్నారు.

వైసీపీ నేతలు వలంటీర్లతో ప్రత్యేక 'ఆత్మీయ' సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. వారి పరిధిలోని ఓటర్ల ఫోన్ నంబర్లు సేకరిస్తున్నారు. 'ఇప్పుడు ఐదు వేలు తీసుకోండి, తర్వాత మరో పదివేలు ఇస్తాం' అని వలంటీర్లపై వల విసురుతున్నారు.



రాష్ట్రమంతా రకరకాల కానుకల పంపిణీ

మహిళలకు చీర, జాకెట్.. మగవారికి మందు

బిర్యానీ, 500 నోటు, ఇతర కానుకలు కామన్

వలంటీర్లతో 'ఆత్మీయ' సమావేశాల ఏర్పాటు

మొబైల్ ఫోన్లు, కుక్కర్లు, నగదు పంపిణీ

గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రలోభాలు

బహిరంగంగా పంచుతున్నా పట్టించుకోని ఈసీ

కోడ్ వస్తే తప్ప 'కోరలు' రావా?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'మీ బిడ్డ వల్ల మంచి జరిగిందని భావిస్తే మాకే ఓటు వేయండి'... అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మైకు పట్టుకుని హోరెత్తిస్తున్నారు. చేసిన మంచి ఏమీ లేదని గ్రహించిన వైసీపీ నేతలు మాత్రం ఓటర్లను 'మంచి' చేసుకునేందుకు ప్రలోభాల వల విసురుతున్నారు. ఇంకా ఎన్నికల షెడ్యూల్ రాలేదు. కోడ్ అమల్లోకి రాలేదు. అసలు నామినేషన్లే వేయలేదు. అధికార వైసీపీ నేతలు ఇప్పటి నుంచే ఓట్ల కోసం తాయిలాలు ఎరవేస్తున్నారు. షెడ్యూలు విడుదలకు

మిగతా 12వ పేజీలో...

కేడర్‌తోనూ కోతలే!



మార్చాల్సిన సీట్లు మార్చేశారట.. ఇక మార్పులు లేవట!


ఏడు విడతల్లో తిప్పితిప్పి మార్చింది 70 మందిని 11

మొత్తం మార్చేశామంటూ శ్రేణులకు జగన్ మాయమాటలు

87 నుంచి 95% ఇళ్లకు లబ్ధి చేరిందని బుకాయింపు

ప్రతి బూత్‌లో ఓటర్ల ఫోన్ నంబర్లు తీసుకోండి

'మా పోలింగ్ బూత్ సిద్ధం' వర్క్‌షాప్‌లో జగన్ ఆదేశం



బుజ్జగింపులు.. హామీలు!

అసంతుష్ట నేతలతో చంద్రబాబు వరుస భేటీలు

ఉండవల్లికి పిలిపించి చర్చలు

అసంతృప్తి చల్లార్చేందుకు యత్నం

సర్వేల ఆధారంగానే నిర్ణయాలు తీసుకున్నామని వెల్లడి

పార్టీ నిర్ణయాన్ని గౌరవించాలని సూచన

ప్రత్యామ్నాయ అవకాశాలిస్తానని వాగ్దానం

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తొలి జాబితా ప్రకటన తర్వాత కొన్ని నియోజకవర్గాల నేతల్లో నెలకొన్న అసంతృప్తిని చల్లార్చడానికి ఆ పార్టీ అధినేత చంద్రబాబు చర్చలు మొదలుపెట్టారు. మంగళవారం ఉండవల్లి నివాసానికి పలు జిల్లాల నేతలను పిలిపించి మాట్లాడారు. పార్టీ నిర్ణయాన్ని గౌరవించి సహకరించాలని కొందరిని కోరారు. మరికొందరికి ప్రత్యామ్నాయ అవకాశాలపై హామీలు ఇచ్చారు. ఇంకొందరు నేతలతో అక్కడి రాజకీయ సమీకరణలపై చర్చించారు. మంగళవారం రాత్రి పొద్దుపోయేవరకూ ఈ సమావేశాలు జరుగుతూనే ఉన్నాయి. సీటు

మిగతా 11వ పేజీలో...

నేడే ఉమ్మడి భేరి!

తాడేపల్లిగూడెం ప్రత్తిపాడు వద్ద

25 ఎకరాల విస్తీర్ణంలో భారీ బహిరంగ సభ

హాజరుకానున్న చంద్రబాబు, పవన్



అంబాజీపేటలో టీడీపీ అమలాపురం లోక్‌సభ ఇన్‌చార్జి హరీశ్ మాథుర్ ఎదుట నినాదాలు చేస్తున్న జన సైనికులు

పి.గన్నవరం సీటు మహాసేన రాజేశ్‌కు ఇవ్వొద్దు!

జన సైనికుల పట్టు

11

టీడీపీ సమన్వయ భేటీలో తీవ్ర ఉద్రిక్తత

సమావేశ హాల్లోకి దూసుకొచ్చిన కార్యకర్తలు

కుర్చీలు, బెంచీలు గాల్లోకి విసిరిన వైనం

లోక్‌సభ ఇన్‌చార్జి హరీశ్ కారు అద్దాలు ధ్వంసం

పిఠాపురం నుంచి పవన్!



సీఆర్డీయే 'రద్దు' ఉత్తర్వులు రద్దు!

రాజధాని రైతులకు హైకోర్టులో ఊరట

ప్లాట్ల రద్దు, మరో చోట కేటాయింపులో సహజ న్యాయసూత్రాలు పాటించలేదు

సీఆర్డీయే ప్రక్రియ పూర్తిగా లోపభూయిష్ఠం

రాతపూర్వకంగా రైతులకు తెలియజేయలేదు

నిబంధనలు పాటించడంలో విఫలమయ్యారు

సీఆర్డీయే, రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆక్షేపణ

ప్రొసీడింగ్స్, ఉత్తర్వులను రద్దు చేస్తున్నాం

వారంలో తాజాగా నోటీసులివ్వాలని ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజధాని రైతుల ప్లాట్ల విషయంలో చట్టం నిర్దేశించిన విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం, సీఆర్డీయే అనుసరించలేదని హైకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. భూసేకరణలో భాగంగా రైతులకు కేటాయించిన ప్లాట్లను రద్దు చేసి మరోచోట వారికి కేటాయించే విషయాల్లో సీఆర్డీయే అనుసరించిన విధానం లోపభూయిష్ఠంగా

మిగతా 3వ పేజీలో...

అప్పు ప్లీజ్!

ఇంకో 19 వేల కోట్లు ఇవ్వండి 2

బేవరేజెస్ ద్వారా ప్రయత్నాలు

బ్రోకరేజ్ సంస్థ ట్రస్ట్ క్యాపిటల్‌కు మరో ఏడాది కాంట్రాక్టు పొడిగింపు

మరోవైపు కొత్త అప్పుల అనుమతికి ఢిల్లీలో రాష్ట్ర అధికారుల మకాం

'పతంజలి'కి కోర్టు ధిక్కరణ నోటీసులు

తదుపరి ఆదేశాలిచ్చే వరకూ వైద్య ఉత్పత్తుల ప్రకటనలపై సుప్రీం ఆంక్షలు 2

యోగాతో మధుమేహం, ఉబ్బసం పూర్తిగా తగ్గుతాయనడంపై ఐఎంఏ ఫిర్యాదు

ఆ రైళ్లలో మళ్లీ ఆర్డినరీ చార్జీలు!

'ఎక్స్‌ప్రెస్ స్పెషల్స్'గా పేరు మార్చిన ప్యాసింజర్ రైళ్లలో చార్జీల తగ్గింపు 2

కనీస చార్జీ రూ.30 నుంచి రూ.10కి!

గగన వీరులు వీరే

గగన్‌యాన్ వ్యోమగాములను దేశానికి పరిచయం చేసిన మోదీ

వైమానిక దళం నుంచి నలుగురిని 2019లోనే ఎంపిక చేసిన ఇస్రో

యూపీ నుంచి ఇద్దరు, తమిళనాడు, కేరళ నుంచి ఒక్కొక్కరు ఎంపిక

నాలుగేళ్లుగా వివిధ స్థాయిల్లో శిక్షణ

వీరు వ్యక్తులు కాదు.. ప్రజల ఆకాంక్షలను అంతరిక్షంలోకి తీసుకెళ్లే శక్తులు

సరికొత్త శిఖరాలకు భారత కీర్తి

2035 నాటికి సొంత అంతరిక్ష కేంద్రం

ఇస్రోలో మహిళా శక్తి అనిర్వచనీయం

'ఆగస్టు 23' ఇక.. జాతీయ అంతరిక్ష దినోత్సవం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యలు

మూడు కీలక ప్రాజెక్టులు జాతికి అంకితం



ప్రశాంత్ నాయర్, అజిత్ క్రిష్ణన్, అంగద్ ప్రతాప్, సుభాంశు శుక్లా

తిరువనంతపురం, ఫిబ్రవరి 27: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న మానవ సహిత అంతరిక్ష యాత్ర.. గగన్‌యాన్ ద్వారా రోదసీలోకి వెళ్లే వ్యోమగాములను ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి పరిచయం చేశారు. గగన్‌యాన్ కోసం భారత వైమానిక దళానికి(ఐఏఎఫ్) చెందిన మొత్తం నలుగురిని 2019లోనే ఎంపిక చేశారు. వీరిలో గ్రూప్ కెప్టెన్లు ప్రశాంత్ నాయర్, అంగద్ ప్రతాప్, అజిత్ కృష్ణన్, సుభాంశు శుక్లా ఉన్నారు. వీరిని ప్రత్యేకంగా అభినందించిన ప్రధాని, భారత దేశం నుంచి రోదసీలోకి వెళ్లనున్న వ్యోమగాములు వీరేనని పరిచయం చేశారు. మంగళవారం కేరళలోని తిరువనంతపురంలో పర్యటించిన ప్రధాని తుంబాలోని విక్రమ్ సారాభాయ్ అంతరిక్ష కేంద్రానికి (వీఎస్ఎస్‌సీ) వెళ్లారు. రోదసీలోకి వెళ్లనున్న వ్యోమగాములను అభినందించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "40 ఏళ్ల తర్వాత

మిగతా 2వ పేజీలో...



కర్ణాటక అసెంబ్లీలో మాజీ సీఎం కుమార స్వామి, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి కరచాలనం

రాజ్యసభ ఎన్నికల్లో హైడ్రామా!

మూడు రాష్ట్రాల్లోనూ క్రాస్ ఓటింగ్

కర్ణాటకలో బీజేపీ-జేడీఎస్‌కు ఎదురుదెబ్బ

ఉమ్మడి అభ్యర్థి కుపేంద్ర రెడ్డి పరాజయం

3 స్థానాలు 'హస్త'గతం.. కమలానికి ఒకటే

హిమాచల్‌లో కాంగ్రెస్ నేత సింఘ్వీ ఓటమి

సమానంగా ఓట్లు.. 'డ్రా'లో బీజేపీదే అదృష్టం

9 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల క్రాస్ ఓటింగ్!

అవిశ్వాస తీర్మానం పెట్టే ప్రయత్నాల్లో బీజేపీ

కాంగ్రెస్ అప్రమత్తం.. నేడు సిమ్లాకు డీకే 2

యూపీలో కమలానికి దక్కిన అదనపు సీటు

బీజేపీకి 8.. సమాజ్‌వాదీ పార్టీకి రెండు సీట్లే!

అమరావతే రాజధాని

ఏపీలో వచ్చేది మన ప్రభుత్వమే: రాజ్‌నాథ్



ఏలూరు సమావేశంలో రాజ్‌నాథ్, ఇతర నేతల అభివాదం

రాష్ట్రంలో ప్రజావ్యతిరేక సర్కారు.. దౌర్జన్యాలపై పోరాడండి

ఏపీ అప్పులపాలు.. కేంద్ర నిధులు ఎటు పోతున్నాయో?

లిక్కర్, మైనింగ్ మాఫియాలతో అవినీతిమయం

ఇక్కడ బీజేపీ ప్రభుత్వం వస్తేనే పోలవరం పూర్తి: మంత్రి

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించడం లేదు: పురందేశ్వరి

అమరావతి/విశాఖపట్నం/ఏలూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది మన ప్రభుత్వమే. రాజధాని అమరావతే.. ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. కేంద్రం నిధులిచ్చింది. రాష్ట్ర పార్టీ కూడా ఏకైక రాజధాని అమరావతేనని తీర్మానం చేసింది. ఇదే విషయాన్ని ప్రజలకు చెప్పండి' అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బీజేపీ శ్రేణులకు పిలుపిచ్చారు. మంగళవారం విశాఖపట్నంలో

మిగతా 11వ పేజీలో...

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధానికి విరామం!

» 40 రోజుల పాటు కాల్పుల విరమణ

(సెంట్రల్ డెస్క్)

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధానికి విరామం పడనుంది. రంజాన్ నెలలో కాల్పుల విరమణకు ఈజిప్టు, ఖతార్ దేశాలు ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో.. ఇజ్రాయెల్ ఓ అడుగు ముందుకు వేసింది. 40 రోజుల పాటు అన్నిరకాల సైనిక కార్యకలాపాలకు విరామమివ్వాలనే పారిస్ చర్చల ప్రతిపాదనలకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఇజ్రాయెల్ అధికారి ఒకరిని ఉటంకిస్తూ రాయిటర్స్ ఓ కథనాన్ని ప్రచురించింది. అంతేకాదు.. 1:10 నిష్పత్తిలో హమాస్ చెరలో ఉన్న బందీలు, పాలస్తీనా ఖైదీల మార్పిడికి ఇజ్రాయెల్ అంగీకారం తెలిపినట్లు పేర్కొంది. ఒకట్రెండ్రోజుల్లో హమాస్ నాయకత్వం ఈ ప్రతిపాదనకు ఓకే చెబితే.. రంజాన్(మార్చి 11 నుంచి) మాసమంతా గాజాలో శాంతి నెలకొంటుందని ఈజిప్టు, ఖతార్ భావిస్తున్నాయి. ఒప్పందం అమలైతే ఇజ్రాయెల్ వైమానిక దళం గాజాపై నిఘాను రోజులో 8గంటల పాటు నిలిపివేస్తుంది. గాజాలో మానవతా సాయం కోసం రోజుకు 500 ట్రక్కులను తరలించేందుకు అనుమతి ఉంటుంది. శరణార్థులు, ఇళ్లను కోల్పోయిన గాజా పౌరుల కోసం 2 లక్షల టెంట్లు, 60 వేల మొబైల్ షెల్టర్ల ఏర్పాటుకు ఇజ్రాయెల్ సహకరిస్తుంది.

ఆ రైళ్లలో మళ్లీ ఆర్డినరీ చార్జీలు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: రైలు ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. 'ఎక్స్‌ప్రెస్ స్పెషల్స్'గా పేరు మార్చిన ప్యాసింజర్ రైళ్లలో సెకండ్ క్లాస్ ఆర్డినరీ చార్జీలను మంగళవారం నుంచి పునరుద్ధరించింది. దీంతో ఆ రైళ్లలో టికెట్ చార్జీలు 50% వరకు తగ్గాయి. లాక్‌డౌన్ తర్వాత రైల్వే శాఖ ప్యాసింజర్ రైళ్ల పేరును 'ఎక్స్‌ప్రెస్ స్పెషల్స్'గా మారుస్తూ వచ్చింది. కొత్త పేరు ఆధారంగా చార్జీలు వసూలు చేస్తూ ఆర్డినరీ చార్జీలకు చెల్లుచీటీ చెప్పింది. దీంతో కనీస టికెట్ ధర ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సమానంగా రూ.10 నుంచి రూ.30కు పెరిగింది. అదే రైలు.. అదే వేగం.. కేవలం పేరు మార్చి రైల్వే శాఖ ప్రయాణికులపై, ముఖ్యంగా చిరు వ్యాపారులు, రోజువారీ కూలీలు, పేదలపై భారం వేయడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో సోమవారం రైల్వే బోర్డు సమీక్షా సమావేశం నిర్వహించి.. మంగళవారం అర్ధరాత్రి నుంచి పాత చార్జీలనే వసూలు చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అన్ని రైల్వే జోన్లకు ఆదేశాలు పంపింది.

జయప్రద పరారీలో ఉన్న నిందితురాలు

» ఆమెను అరెస్టు చేయండి.. యూపీ ప్రత్యేక కోర్టు ఆదేశం

రాంపూర్ (యూపీ), ఫిబ్రవరి 27: ప్రముఖ సినీనటి, మాజీ ఎంపీ, బీజేపీ నాయకురాలు జయప్రదను అరెస్టు చేయాలని ఉత్తరప్రదేశ్‌లోని ప్రత్యేక కోర్టు మంగళవారం పోలీసులను ఆదేశించింది. ఆమె 'పరారీలో ఉన్న నిందితురాలు' అని అధికారికంగా ప్రకటించింది. ఆమెపై ఉన్న రెండు కేసుల విచారణ నిమిత్తం ఏడుసార్లు నాన్‌బెయిలబుల్ వారెంట్లు పంపించినప్పటికీ హాజరు కాకపోవడంతో ఆ ఆదేశాలిచ్చింది. ఆమెను పట్టుకునేందుకు డీఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని రాంపూర్‌లోని ఎంపీ/ఎమ్మెల్యేల ప్రత్యేక న్యాయస్థానం జడ్జి శోభిత్ బన్సల్ జిల్లా ఎస్పీని ఆదేశించారు. ఆమెను మార్చి 6న కోర్టులో హాజరుపరచాలని సూచించారు. 2019 లోక్‌సభ ఎలక్షన్ల సందర్భంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించారన్న ఆరోపణలతో జయప్రద మీద రెండు కేసులు నమోదయ్యాయి. ఆ ఎన్నికల్లో ఆమె బీజేపీ తరఫున రాంపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి, సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి ఆజాం ఖాన్ చేతిలో ఓటమిపాలయ్యారు.

పూవర్తి కేంద్రంగా ఆపరేషన్ హిడ్మా

చర్ల/దమ్ముగూడెం, ఫిబ్రవరి 27: పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, మోస్ట్‌వాంటెడ్ మడివి హిడ్మా కోసం కేంద్ర బలగాలు 'ఆపరేషన్ హిడ్మా'ను ప్రారంభించాయి. హిడ్మా సొంతూరు-- ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా పూవర్తి గ్రామం నుంచే బలగాలు పావులు కదుపుతున్నాయి. ఇంతకాలం మావోయిస్టులకు కంచుకోటగా.. వ్యూహాత్మక గ్రామంగా పూవర్తి ఉండేది. 2021లో తెర్రాం వద్ద 23 మంది సీఆర్పీఎఫ్ జవాన్లను వ్యూహాత్మకంగా చంపేయడానికి హిడ్మా స్కెచ్ వేసింది కూడా పూవర్తి నుంచే..! దీంతో మావోయిస్టుల వ్యూహాత్మక ప్రాంతంలో పాగా వేయాలని సీఆర్పీఎఫ్ నిర్ణయించింది. పూవర్తిని తమ ఆధీనంలోకి తీసుకుంది. హిడ్మా ఇల్లు, గెస్ట్‌హౌస్‌లనూ స్వాధీనం చేసుకుంది. 'ఆపరేషన్ హిడ్మా'కు సీఆర్పీఎఫ్ ఐదు కంపెనీల బలగాలను నియమించింది. ఒక్కో కంపెనీలో సుమారు 200 మంది జవాన్లు ఉంటారు. కాగా, బీజాపూర్ జిల్లా జంగ్లా పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం పోలీసు, మావోయిస్టుల మధ్య హోరాహోరీ కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు చనిపోయారు.

సుప్రీంనే ధిక్కరిస్తారా.. పతంజలికి నోటీసులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారన్న ఆరోపణలపై యోగా గురు బాబా రాందేవ్ ఆధ్వర్యంలోని పతంజలి ఆయుర్వేద సంస్థకు, దాని ఎండీ ఆచార్య బాలకృష్ణకు మంగళవారం సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది. తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇవ్వకూడదన్న కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారన్న ఫిర్యాదు మేరకు ఈ నోటీసులు జారీ చేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు పతంజలి సంస్థ తయారు చేసే వైద్య ఉత్పత్తుల ప్రకటనలపై ఆంక్షలు విధించింది. అలోపతిపై 'పతంజలి' తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తోందంటూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. కొవిడ్ వ్యాక్సినేషన్‌కు వ్యతిరేకంగా పతంజలి సంస్థ తప్పుడు ప్రచారం చేస్తోందంటూ గత ఏడాది ఐఎంఏ పిటిషన్ వేసింది. ప్రత్యామ్నాయ వైద్య విధానాల పేరుతో కొన్ని సూచనలు చేసి తప్పుడు ప్రకటనలు ఇచ్చిందని ఆరోపించింది. విచారణ జరిపిన ధర్మాసనం తప్పుడు, తప్పుదోవ పట్టించే ప్రకటనలను వెంటనే నిలిపివేయాలని ఆదేశించింది. అయితే ఆ ఆదేశాలు అమలు కావడం లేదని ఐఎంఏ తరఫున సీనియర్ న్యాయవాది పి.ఎస్.పట్వాలియా కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. యోగా ద్వారా మధుమేహం, ఉబ్బస వ్యాధులు పూర్తిగా నయమవుతాయంటూ ప్రకటనలు ఇచ్చిందని తెలిపారు. ఈ వాదనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం పతంజలి సంస్థకు నోటీసులు జారీ చేసి తదుపరి విచారణను మార్చి 15కు వాయిదా వేసింది.

మెడికోల ఆత్మహత్యలపై టాస్క్‌ఫోర్స్

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్యార్థుల ఆత్మహత్యలపై జాతీయ వైద్య కమిషన్ దృష్టిసారించింది. విద్యార్థుల మానసిక ఆరోగ్యం, ఆత్మహత్యలపై అధ్యయనం చేసేందుకు నేషనల్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఈ టాస్క్‌ఫోర్స్‌లో 15 మంది సభ్యులుంటారు. దీనికి ఛైర్మన్‌గా డాక్టర్ సురేష్‌ను నియమించింది. ప్రస్తుతం ఆయన బెంగళూరు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్‌లోని సైకియాట్రీ విభాగపు ప్రొఫెసర్‌గా పనిజేస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ బృందం మే 31 నాటికి తన అధ్యయన నివేదికను అందించాలని ఎన్ఎంసీ ఆదేశించింది.

వచ్చే నెల నుంచే సీఏఏ అమలు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: పౌరసత్వ సవరణ చట్టా (సీఏఏ)న్ని కేంద్ర ప్రభుత్వం వచ్చే నెల నుంచి అమలు చేయనున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దీని కారణంగా ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి శరణార్థులుగా వచ్చిన మతపర మైనార్టీలకు భారత దేశ పౌరసత్వం లభిస్తుంది. పేర్లను నమోదు చేసుకోవడానికి కేంద్ర హోంశాఖ పోర్టల్‌ను సిద్ధం చేసింది. దాని పనితీరును ప్రయోగాత్మకంగా పరిశీలించింది. శరణార్థులుగా వచ్చిన వారికి దీర్ఘకాలిక వీసాలు ఇచ్చే అవకాశం కూడా ఉంది. ఆ 3 దేశాల నుంచి వచ్చిన హిందువులు, బౌద్ధులు, జైన్లు, సిక్కులు, పార్సీలు, క్రైస్తవులకు ఈ సౌకర్యం వర్తిస్తుంది.

లోక్‌పాల్‌గా జస్టిస్ ఖన్విల్కర్

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ 2022 మే 27న పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి ఆ పదవి భర్తీ కాలేదు. లోక్‌పాల్ జ్యుడీషియల్ సభ్యుడు ప్రదీప్ కుమార్ మహంతి ప్రస్తుతం తాత్కాలిక ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. ఎ.ఎం.ఖాన్విల్కర్ 2022 జులైలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేశారు. లోక్‌పాల్ జ్యుడీషియల్ సభ్యులుగా విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ లింగప్ప నారాయణ స్వామి, జస్టిస్ సంజయ్ యాదవ్, జస్టిస్ రితు రాజ్ అవస్థిలు నియమితులయ్యారు. నాన్ జ్యుడీషియల్ సభ్యులుగా సుశీల్ చంద్ర, పంకజ్ కుమార్, అజయ్ టిర్కేలు నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వారి పదవీ కాలం మొదలవుతుంది. ప్రధాన మంత్రి ఆధ్వర్యంలోని సెలక్షన్ కమిటీ వీరిని ఎంపిక చేసింది. లోక్‌పాల్‌లో ఒక ఛైర్మన్, ఎనిమిది మంది సభ్యులు ఉంటారు. సభ్యుల్లో నలుగురు జ్యుడీషియల్, మరో నలుగురు నాన్ జ్యుడీషియల్ విభాగాలకు చెందిన వారు ఉంటారు.

గగన వీరులు వీరే..!

(మొదటి పేజీ తరువాయి)

భారతీయులు అంతరిక్షంలోకి వెళ్లనున్నారు. 'సమయం మనదే-కౌంట్‌డౌన్ కూడా మనదే'. ప్రతి దేశ అభివృద్ధిలో ఒక సమయం ఆసన్నమవుతుంది. ఈ రోజు ఆ సమయం భారత్‌కు వచ్చింది. మన ప్రస్తుత తరం ఎంతో ధన్యమైంది. ఎందుకంటే, వారు నీటిలోను, భూమి మీద, ఇప్పుడు అంతరిక్షంలో కూడా విజయాన్ని చూడగలుగుతారు. ఇది ఒక కొత్త శకానికి నాంది. ప్రపంచ స్థాయిలో భారత్ విస్తరిస్తోంది. ఇప్పుడు అంతరిక్ష రంగంలోనూ స్పష్టంగా కనిపిస్తోంది" అని అన్నారు. "గతేడాది చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్ ప్రయోగించి ప్రపంచంలోనే తొలిదేశంగా కీర్తిగడించాం. నేడు మరో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. తొలిసారి ఈ దేశం నుంచి నలుగురు వ్యోమగాములు అంతరిక్షంలోకి వెళ్లనున్నారు. ఈ నలుగురు కేవలం వ్యక్తులు కారు. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను అంతరిక్షంలోకి తీసుకువెళ్లే శక్తులు" అని మోదీ పేర్కొన్నారు. 21వ శతాబ్దంలో ఈ నలుగురి పేర్లు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. నాలుగేళ్లుగా వీరు కఠిన శిక్షణ పొందారని, దీనిలో యోగా కీలక పాత్ర పోషించిందని వివరించారు.

> మూడు రోజులపాటు సాగే 'గగన్‌యాన్'లో వ్యోమగాములను 400 కిలోమీటర్ల కక్ష్యలోకి ప్రవేశపెడతారు. అనంతరం వారిని సురక్షితంగా కిందికి తీసుకువస్తారు. 2025లో ఈ ప్రయోగాన్ని చేపట్టాలని ఇస్రో లక్ష్యంగా పెట్టుకొంది.

తపస్సు చేశారు: మోదీ

"రోదసీలోకి వెళ్లే ఈ నలుగురు వీరులు గత నాలుగు సంవత్సరాలుగా తపస్సు చేశారు. వారు ఇంకా చాలా దూరం(అంతరిక్షం) వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో అనేక సవాళ్లు ఉన్నాయి. అయితే, వారు ఇప్పుడు సెలబ్రిటీలు. నాకు తెలుసు.. ప్రజలు వీరితో సెల్ఫీలు దిగాలని, ఆటోగ్రాఫ్ తీసుకోవాలని ఉత్సుకతతో ఉన్నారు. వారి జీవిత విశేషాలు తెలుసుకునేందుకు ఆతృతగా కూడా ఉన్నారు. కానీ, ఇలా చేయడం వారి విజయాలకు ఇబ్బంది కలిగిస్తుంది. అసలు కథ ఇప్పుడే మొదలైంది. మనమంతా వారికి, వారి కుటుంబాలకు సహకరించాలి. లక్ష్య సాధన దిశగా వారిని ముందుకు నడిపించాలి" అని మోదీ అన్నారు.

మహిళల పాత్ర అమోఘం

అంతరిక్ష రంగంలో మహిళల శక్తి కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని కొనియాడారు. "చంద్రయాన్, గగన్‌యాన్ ఇలా ఏది రూపుదాల్చినా మహిళా శక్తిని విస్మరించలేం. వారి పాత్ర అమోఘం. దాదాపు 500 మంది మహిళలు ఇస్రోలో నాయకత్వ పాత్ర పోషిస్తున్నారు. వారందరినీ నేను అభినందిస్తున్నా" అన్నారు. అంతరిక్ష రంగం యువతను ఎంతో ఆకర్షిస్తోందని తెలిపారు. ఇస్రో సాధిస్తున్న అద్భుతాలను చూసిన చిన్నారులు సైతం శాస్త్రవేత్తలు కావాలని అభిలషిస్తున్నారని, లక్షల మంది చిన్నారులకు ఇస్రో స్ఫూర్తిగా నిలిచిందని పేర్కొన్నారు. "చంద్రయాన్-2 ల్యాండింగ్ సమయంలో ఎంతో మంది చిన్నారులు దీనిని వీక్షించారు. ఎన్నో నేర్చుకున్నారు. చంద్రయాన్-3 ఆగస్టు 23న విజయవంతంగా ల్యాండైంది. ఈ నేపథ్యంలో రానున్న ఆగస్టు 23, 2024ను 'జాతీయ అంతరిక్ష దినోత్సవం'గా పేరు పెట్టనున్నాం. ఇస్రో అనేక అద్భుత రికార్డులను సొంతం చేసుకుంది" అని ప్రధాని తెలిపారు. అనేక దేశాలు సాధించడంలో విఫలమైన ఆదిత్య-ఎల్ 1(సూర్యుడిపై ప్రయోగం)ను ఇస్రో సాధించిందని కొనియాడారు. ఈ సందర్భంగా మూడు కీలక ప్రాజెక్టులను ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. వీటిలో శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పీఎస్ఎల్వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ కూడా ఉంది.

ప్రపంచం మనవైపే

"పలు కీలక ప్రయోగాల ద్వారా ఇస్రోను పరుగులు పెట్టిస్తున్నాం. ముఖ్యంగా చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్ 1 వంటివి ప్రపంచం మొత్తం భారతదేశం వైపు చూసేలా చేశాయి. 2047 నాటికి దేశాన్ని 'వికసిత భారత్'గా అభివృద్ధి పరచాలన్న కీలక లక్ష్యంలో ఇస్రో కూడా ముఖ్య భూమిక పోషిస్తుంది. ఆదిశగా అడుగులు వేస్తోంది" అని ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ తెలిపారు. 40 ఏళ్లలో దేశ ప్రధాని ఇస్రోని సందర్శించడం ఇదే తొలిసారని పేర్కొన్నారు.

సుదీర్ఘ శిక్షణ

రోదసీ ప్రయాణానికి 2019లో మొత్తం 12 మంది టెస్ట్ పైలట్‌లు దరఖాస్తు చేసుకున్నారు. అయితే, అనేక వడపోతల తర్వాత ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోస్పేస్ మెడిసిన్, ఇస్రో సంయుక్తంగా నలుగురిని ఎంపిక చేశాయి. తర్వాత వారిని రష్యాలో ప్రాథమిక శిక్షణకు పంపించారు. అయితే, కరోనా నేపథ్యంలో ఈ శిక్షణ కొంత ఆలస్యంగా 2021 నాటికి పూర్తయింది. అప్పటి నుంచి దేశంలోనే వారికి వివిధ మాడ్యూల్స్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కోసం సాయుధ బలగాలు సహా పలు ఏజెన్సీలతో ఇస్రో ఒప్పందం చేసుకుంది. వైమానిక దళంలోనూ వీరికి మరింత శిక్షణ ఇచ్చారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంలోనూ అనేక జాగ్రత్తలు పాటించారు. భారత్ నుంచి స్వదేశీ వ్యోమనౌకలో అంతరిక్షంలోకి వెళ్లనున్న మొదటి భారతీయ బృందంగా వీరు రికార్డు సృష్టించనున్నారు.

2035లో అంతరిక్ష కేంద్రం

ఈ ఏడాది స్వల్ప కాలంలో ఎక్స్‌పోశాట్, ఇన్‌శాట్-3డీఎస్ వంటివి పూర్తి చేసుకోవడం హర్షణీయమని పేర్కొన్నారు. రానున్న పదేళ్లలో భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ 40 బిలియన్ డాలర్లకు చేరుకోనుందని ప్రధాని తెలిపారు. అంతరిక్ష రంగంలో భారత్ అతి పెద్ద వాణిజ్య కేంద్రంగా అవతరించనుందని వెల్లడించారు. 2035 నాటికి భారత్ సొంతగా అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయనుందని తెలిపారు. "ఇది మాత్రమేకాదు, ఈ అమృత కాలంలో భారత వ్యోమగామి.. చంద్రునిపై కాలు మోపే రోజు త్వరలోనే రానుంది" అని మోదీ పేర్కొన్నారు.



ప్రశాంత్ నాయర్: కేరళలో 1976లో జన్మించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థి. ఖడ్గ సత్కార గ్రహీత. 1998లో ఐఏఎఫ్ యుద్ధ విమానాల విభాగంలో నియామకం పొందారు. 3000 గంటల అనుభవం ఉంది. ఎస్‌యూ-30 ఎంకేఐ, మిగ్-21, మిగ్-29, హాక్, డార్నియర్, ఏఎన్-32లను నడిపిన అనుభవం ఉంది.



అజిత్ కృష్ణన్: చెన్నైలో 1982లో జన్మించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థి. రాష్ట్రపతి పసిడి పతకంతో సహా వైమానిక అకాడమీలో ఖడ్గ సత్కార గ్రహీత. 2003లో ఐఏఎఫ్ యుద్ధ విమానాల విభాగంలో నియామకం పొందారు. 2900 గంటల అనుభవం ఉంది. ఎస్‌యూ-30 ఎంకేఐ, మిగ్-21, మిగ్-29, హాక్, డార్నియర్, ఏఎన్-32లను నడిపిన అనుభవం ఉంది.



అంగద్ ప్రతాప్: యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో 1982లో జన్మించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థి. 2004లో ఐఏఎఫ్ యుద్ధ విమానాల విభాగంలో నియామకం పొందారు. 2000 గంటల అనుభవం ఉంది. ఎస్‌యూ-30 ఎంకేఐ, మిగ్-21, మిగ్-29, హాక్, డార్నియర్, జాగ్వార్, ఏఎన్-32లను నడిపిన అనుభవం ఉంది.



సుభాంశు శుక్లా: ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవులో 1985లో జన్మించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థి. 2006లో ఐఏఎఫ్ యుద్ధ విమానాల విభాగంలో నియామకం పొందారు. 2000 గంటల అనుభవం ఉంది. ఎస్‌యూ-30 ఎంకేఐ, మిగ్-21, మిగ్-29, హాక్, డార్నియర్, జాగ్వార్, ఏఎన్-32లను నడిపిన అనుభవం ఉంది.

లోకం తీరు



కేరళలో కుస్తీ.. బయట దోస్తీ

» కాంగ్రెస్-లెఫ్ట్ తీరుపై మోదీ ఆగ్రహం

చెన్నై-ఆంధ్రజ్యోతి/తిరువనంతపురం, ఫిబ్రవరి 27: కాంగ్రెస్, వామపక్షాల బంధంపై ప్రధాని మోదీ మండిపడ్డారు. కేరళలో శత్రువుల్లా కుస్తీలు పడుతున్నాయని.. మిగతా రాష్ట్రాల్లో మాత్రం బాయ్‌ఫ్రెండ్స్‌లా కౌగలించుకుంటున్నాయని ఎద్దేవాచేశారు. మంగళవారం ఉదయం తిరువనంతపురంలో, సాయంత్రం తిరుప్పూరు జిల్లా మాదాపురం బహిరంగసభల్లో మోదీ ప్రసంగించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేది లేదని ఇండియా కూటమికి అర్థమైందన్నారు. కేరళలోని లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం ఫాసిస్టు సర్కారని కాంగ్రెస్ విమర్శిస్తోంది. కాంగ్రెస్ కార్యకర్తలపై కమ్యూనిస్టులు లాఠీచార్జి చేయిస్తున్నారు. కానీ ఇండియా కూటమి సమావేశాల్లో వీరంత కలిసి కూర్చుని సమోసాలు, బిస్కెట్లు తింటారు. వీళ్ల మోసాలకు కేరళ ప్రజలు తగు విధంగా బుద్ధి చెబుతారు' అని వ్యాఖ్యానించారు. దేశం కంటే ఒక్క కుటుంబ ప్రయోజనాలే కాంగ్రెస్‌కు ముఖ్యమని, ఇప్పుడు కమ్యూనిస్టులు కూడా ఇదే పాటిస్తున్నారని అన్నారు. వయనాడ్‌లో యువరాజు (రాహుల్‌గాంధీ) పోటీచేయొద్దంటూ కాంగ్రెస్‌కు వారు సలహా ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. తమిళనాడులో దివంగత ఎంజీఆర్ కుటుంబ రాజకీయాలను ప్రోత్సహించలేదని.. డీఎంకే కుటుంబ రాజకీయాలు ఆయనకు అవమానమని పేర్కొన్నారు. 'అమ్మ' జయలలిత తన యావజ్జీవితాన్ని ప్రజాసంక్షేమానికి అంకితం చేశారని కొనియాడారు. ఉత్తరాదిన తమ పప్పులు ఉడకవని గ్రహించిన 'ఇండియా' కూటమి నేతలు తమిళనాడును కొల్లగొట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని, ఆ దోపిడీగాళ్ల దుకాణానికి తాళం వేయడమే తన కర్తవ్యమని పేర్కొన్నారు.

అధిక పింఛన్ కల్లేనా?

» లెక్కింపులో ఈపీఎఫ్‌వో కొత్త నిబంధన

» పింఛన్ మొత్తం 30% తగ్గే అవకాశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: అధిక పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న సభ్యుల పింఛన్ లెక్కింపులో ఈపీఎఫ్‌వో కొత్త నిబంధనను ఎంచుకున్నట్టు తెలిసింది. 2014 సెప్టెంబరు 1న లేదా ఆ తర్వాత రిటైరైన సభ్యుల సర్వీసు కాలాన్ని రెండు భాగాలుగా విభజించి, దామాషా పద్ధతిలో పింఛన్ లెక్కిస్తున్నట్టు సమాచారం. దీనివల్ల ఉద్యోగుల పింఛన్ పథకం(ఈపీఎస్ 95) సభ్యుల పింఛన్ 30% నుంచి 40% వరకు తగ్గే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వివిధ ప్రాంతాల్లోని ఈపీఎఫ్‌వో కార్యాలయాల నుంచి అనధికారికంగా ఈ సమాచారం అందినట్టు న్యాయవాద శిక్షణ సంస్థ 'ఎకనమిక్ లాస్ ప్రాక్టీస్'కు చెందిన కార్మిక, ఉపాధి శిక్షణ విభాగం అధిపతి పీవీ మూర్తి తెలిపారు. అయితే, ఈ విషయంపై ఈపీఎఫ్‌వో సర్క్యులర్ విడుదల చేయలేదు. ఇప్పటికీ ఉద్యోగం చేస్తున్న, లేదా 2014 సెప్టెంబరు 1నగానీ, ఆ తర్వాతగానీ రిటైరైన సభ్యులపై ఈ కొత్త నిబంధన ప్రభావం చూపనుంది. సగటు పెన్షనబుల్ వేతనం లెక్కింపు కోసం వీరి సర్వీసు కాలాన్ని రెండు భాగాలుగా విభజిస్తున్నారు. ఇందులో మొదటి భాగం 16-11-1995(ఈపీఎస్-95 అమల్లోకి వచ్చిన తేదీ) నుంచి 31-08-2014 వరకు, రెండో భాగం 01-09-2014 నుంచి రిటైర్మెంట్ తేదీ వరకు ఉంటుందని పీవీ మూర్తి తెలిపారు. పింఛన్ లెక్కింపు కోసం మొదటి భాగంలోని చివరి 60 నెలల సగటు వేతనాన్ని, అలాగే, రెండో భాగంలోని చివరి 60 నెలల సగటు వేతనాన్ని వేర్వేరుగా లెక్కిస్తున్నారని వివరించారు.

రాజ్యసభ ఎన్నికల్లో హైడ్రామా!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: మూడు రాష్ట్రాల్లో రాజ్యసభ ఎన్నికలు అత్యంత ఉత్కంఠ భరితంగా సాగాయి. ఉత్తరప్రదేశ్‌లో 10, కర్ణాటకలో 4, హిమాచల్ ప్రదేశ్‌లో ఒక రాజ్యసభ స్థానానికి మంగళవారం పోలింగ్ నిర్వహించారు. కర్ణాటకలో కాంగ్రెస్ మూడు స్థానాలను కైవసం చేసుకుంది. బీజేపీ ఒక స్థానంలో విజయం సాధించింది. ఇంకో స్థానం కోసం బరిలోకి దిగిన బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి, పారిశ్రామికవేత్త కుపేంద్రరెడ్డి ఓటమిపాలయ్యారు. బీజేపీ ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్ కాంగ్రెస్ అభ్యర్థి అజయ్ మాకన్‌కు క్రాస్ ఓటింగ్ చేశారు. హిమాచల్‌లో రోజంతా హైడ్రామా సాగింది. కాంగ్రెస్‌కు 45 మంది, బీజేపీకి 25 మంది ఎమ్మెల్యేలు ఉండగా, మరో ముగ్గురు ఇండిపెండెంట్లు. మొత్తం 68 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వీ, బీజేపీ అభ్యర్థి హర్ష్ మహాజన్‌కు సమానంగా చెరో 34 ఓట్లు వచ్చాయి. దీంతో డ్రా తీయగా విజయం మహాజన్‌ను వరించింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు 9 మంది బీజేపీకి అనుకూలంగా క్రాస్ ఓటింగ్ చేసినట్టు ఫలితాలు వెల్లడిస్తున్నాయి. తాజా ఓటమి దరిమిలా హిమాచల్‌లో కాంగ్రెస్ మైనారిటీలో పడిపోయిందని బీజేపీ వాదిస్తోంది. ఉత్తరప్రదేశ్‌లో 10 రాజ్యసభ సీట్లకు ఎన్నిక జరగ్గా.. ప్రస్తుత బలాల్ని బట్టి బీజేపీ 7, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) 3 సీట్లు గెలుచుకునే అవకాశం ఉంది. కానీ, బీజేపీ ఎనిమిదో అభ్యర్థిని బరిలో నిలిపి.. పోటీని ఆసక్తికరంగా మార్చింది. ఎస్పీ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేయడంతో కమలం పార్టీ 8 సీట్లు గెలుచుకోగలిగింది. ఎస్పీకి రెండు సీట్లే దక్కాయి. పార్టీ సోమవారం నిర్వహించిన సమావేశానికి 8 మంది ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడం గమనార్హం.



కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ రాజ్యసభ సభ్యులతో డీకే శివకుమార్

బీజేపీ-జేడీఎస్‌కు రెండో ఓటమి!

బెంగళూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ముగ్గురూ విజయం సాధించడంతో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ హర్షం వ్యక్తం చేశారు. తమ ఎమ్మెల్యేలను బీజేపీ ఎంత ప్రలోభపెట్టినా లొంగకుండా కాంగ్రెస్‌పై విధేయత చాటుకున్నారని ప్రశంసించారు. మరోవైపు, లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిగిన రెండు ఎన్నికల్లోనూ బీజేపీ-జేడీఎస్ కూటమి పరాజయాలను మూటగట్టుకుంది. ఇటీవల జరిగిన టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు ఇప్పుడు రాజ్యసభ ఎన్నికల్లోనూ ఉమ్మడి అభ్యర్థులు ఓడిపోయారు.

పాక్ అనుకూల నినాదాల కలకలం

విజయోత్సవంలో కాంగ్రెస్ అభ్యర్థి సయ్యద్ నాసిర్ హుస్సేన్ మద్దతుదారులు విధానసౌధ వద్ద పాకిస్థాన్ అనుకూల నినాదాలు చేయడం కలకలం రేపింది. నాసిర్ వారించినా ఓ కార్యకర్త బిగ్గరగా నినాదాలు చేయడంతో గద్దించి తరిమేశారు. ఆ వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని ప్రతిపక్ష బీజేపీ డిమాండ్ చేసింది. విధాన సౌధ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

అప్పు ప్లీజ్..!

ఇంకో 19 వేల కోట్లు ఇవ్వండి.. బేవరేజెస్ ద్వారా ప్రయత్నాలు

» బ్రోకరేజ్ సంస్థ ట్రస్ట్ క్యాపిటల్‌కు మరో ఏడాది కాంట్రాక్టు పొడిగింపు

» ఇటీవల జీవో జారీ చేసిన ప్రభుత్వం

» మరోవైపు కొత్త అప్పుల అనుమతికి ఢిల్లీలో రాష్ట్ర అధికారుల మకాం

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తికావస్తున్నా వైసీపీ ప్రభుత్వం ఇంకా అప్పుల వేట కొనసాగిస్తూనే ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అప్పుల అనుమతి అయిపోవడంతో, తమకు అలవాటైన అడ్డదారిలో బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా అప్పులు తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. దీనిలో భాగంగానే బేవరేజెస్ కార్పొరేషన్ తరఫున మార్కెట్లో బ్రోకరేజ్ వ్యవహారాలు చూసే కంపెనీ 'ట్రస్ట్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్'తో కాంట్రాక్టును మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చింది. ప్రభుత్వ అవసరాల కోసం మరో రూ.19,000 కోట్ల అప్పు కావాలని, ఈ మొత్తాన్ని బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా తెచ్చేందుకు ఈ కంపెనీతో ఒప్పందం గడువును మరో ఏడాది పొడిగిస్తున్నామని జీవోలో పేర్కొంది. 2023, డిసెంబరులోనే ఈ సంస్థతో ఒప్పందం ముగిసిపోయింది. ఇప్పుడు మరో ఏడాది అంటే 2024, డిసెంబరు 31 వరకు ఒప్పందం గడువును ప్రభుత్వం పొడిగించింది. మార్కెట్లో బేవరేజెస్ కార్పొరేషన్ బాండ్లు ఎప్పుడు విడుదల చేసినా కనీసం రూ.2,000 కోట్లు లేదా ఆపైన అప్పు ఖచ్చితంగా తేవాలని, రూ.2,000 కోట్లకు తక్కువగా తేకూడదని జీవోలో నిబంధన విధించడం గమనార్హం. గత ఏడాది ఆగస్టులో బేవరేజెస్ కార్పొరేషన్ తరఫున ఈ సంస్థ రూ.11,600 కోట్ల అప్పు కోసం బాండ్లు విడుదల చేయగా, ఒక్కటంటే ఒక్క బాండు కూడా అమ్ముడుపోలేదు. అంతకుముందు 2023, మే 15న కూడా విఫలమైంది. ఏపీ ప్రభుత్వం బేవరేజెస్ ద్వారా తెచ్చిన అప్పులను ఆదాయం సమకూర్చే ప్రాజెక్టుల్లో కాకుండా, రాజకీయ స్వప్రయోజనాల కోసం వాడుతోందని ఇన్వెస్టర్లకు ఒక స్పష్టత ఉంది. అందుకే ఒక్క బాండు కూడా అమ్ముడుపోలేదు. ఇప్పుడు మరో రూ.19,000 కోట్ల అప్పునకు ప్లాన్ చేస్తున్నారు. కానీ, వీటిని కూడా ఎవ్వరూ కొనే అవకాశం ఉండదని, ఇప్పటికే మార్కెట్లో ఉన్న బాండ్ల రేటింగ్ 'ఏఏ+' నుంచి 'బీ'కి తగ్గిపోయిందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

ఫీజు ఎంత?

ట్రస్ట్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థకు ఇచ్చే ఫీజును 1.44 శాతంగా నిర్ణయించారు. అయితే, ఈ 1.44 శాతం దేనిలో అనేది జీవోలో పేర్కొనలేదు. తెచ్చిన మొత్తం అప్పులోనా, బేవరేజెస్ కార్పొరేషన్‌కు మళ్లిస్తున్న ఆదాయంలోనా, ఖజానాకు చేరే మద్యం ఆదాయంలోనా అనేది స్పష్టత లేదు. ఇప్పటి వరకు బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా దాదాపు రూ.25,000 కోట్ల అప్పు తెచ్చారు. ఒకవేళ ఇందులో 1.44 శాతం అనుకుంటే దాదాపు రూ.28 కోట్ల వరకు ఆ సంస్థకు ఫీజు కింద చెల్లించినట్టు. ఇది కాకుండా ఇంకేదైనా ఉందా అనేది స్పష్టత లేదు. కాగా, 2021లో టెండర్ ద్వారా ట్రస్ట్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌ను నియమించుకున్నారు. ఆ తర్వాత ఏడాది టెండర్ లేకుండా నామినేషన్ విధానంలో మళ్లీ ఆ సంస్థనే కొనసాగించారు. ఇటీవల ఆ సంస్థనే మరో ఏడాదిపాటు కొనసాగిస్తూ జీవో ఇచ్చారు.

తగ్గిపోయిన రేటింగ్

మూడేళ్ల నుంచి బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా పలు దఫాలుగా లిస్టెడ్, నాన్ లిస్టెడ్ కేటగిరీల కింద రూ.25,000 కోట్ల అప్పు తెచ్చారు. ప్రస్తుతం మార్కెట్లో ఈ బాండ్ల రేటింగ్‌ను సంస్థలు తగ్గించాయి. ఈ రూ.25,000 కోట్ల విలువైన బాండ్లు కొన్న ఇన్వెస్టర్లు ఇప్పుడు వాటిని అమ్ముకొని బయటపడదామని చూస్తున్నప్పటికీ, కొనేవారెవరూ లేకపోవడంతో లబోదిబోమంటున్నారు.

ఢిల్లీలో మకాం

కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్రానికి 4 విడతలుగా రూ.69,000 కోట్ల అప్పులు తెచ్చుకునేందుకు అనుమతి ఇచ్చింది. 10 రోజుల క్రితమే ఈ మొత్తాన్ని ప్రభుత్వం వాడేసింది. దీంతో రాష్ట్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారి కొత్త అప్పుల అనుమతి కోసం ఢిల్లీలో మకాం వేశారు. మరోవైపు బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా కూడా అప్పుల కోసం ప్రయత్నిస్తున్నారు.

కేజ్రీవాల్‌కు ఎనిమిదో సారి
ఈడీ నోటీసులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత కేజ్రీవాల్‌కు ఈడీ మంగళవారం ఎనిమిదోసారి నోటీసులు జారీ చేసింది. ఢిల్లీ లిక్కర్ స్కాంలో విచారణ కోసం మార్చి 4న తమ ముందు హాజరుకావాలని ఆదేశించింది. ఆయనకు ఈడీ ఇప్పటికే ఏడుసార్లు నోటీసులు పంపించగా వాటన్నింటినీ నిరాకరించారు. ఏడో సారి జారీ చేసిన నోటీసుల గడువు సోమవారం ముగియగా మరుసటి రోజే ఇంకో సారి నోటీసులు ఇచ్చింది.

నా తొలి ఓటు
దేశం కోసం..

» కేంద్రం ప్రచారం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: కొత్తగా ఓటరుగా నమోదైన యువతకు ఓటు హక్కు వినియోగంపై మరింత అవగాహన కల్పించడమే లక్ష్యంగా "మేరా పెహ్లా ఓట్ దేశ్‌కేలియే(నా తొలి ఓటు దేశం కోసం)" అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం ఓ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందుకు సంబంధించి కేంద్ర సమాచార, ప్రసార శాఖ ఓ వీడియో గీతాన్ని విడుదల చేసింది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారి ఓటు వేయనున్న 1.85 కోట్ల మంది యువతను ప్రోత్సహించేందుకే ఈ ప్రచారాన్ని చేపట్టామని తెలిపింది.


పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

యుద్ధానికి సిద్ధంకండి!

- మా కోసం కాదు.. మీ కోసం.. రాష్ట్రం కోసం
- ఓటు వేసేందుకు ఎవరికీ భయపడొద్దు
- నారా భువనేశ్వరి పిలుపు
- సాలూరులో ఎన్టీఆర్ ట్రస్ట్ సంజీవని ఉచిత ఆరోగ్య కేంద్రం ప్రారంభం

సాలూరు, ఫిబ్రవరి 27: 'మరో రెండు, మూడు నెలల్లో ఎన్నికల యుద్ధానికి ప్రజలంతా సిద్ధంగా ఉండాలి. ఇది మా కుంటుంబం కోసం కాదు. మీ కోసం. మన రాష్ట్రం కోసం' అని ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. మంగళవారం ఆమె పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలో ఎన్టీఆర్ ట్రస్ట్ సంజీవని ఉచిత ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఓటు వేయడానికి వెనుకడుగు వేయవద్దని, ఎవరికీ భయపడవద్దని పిలుపునిచ్చారు. ఆరోజు ధైర్యం చేసి అందరం మరో పది మందిని తీసుకుని వెళ్లి ఓటు వేయాలని కోరారు. కార్యకర్తలందరూ చేయి చేయి కలిపి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఎన్టీఆర్ ట్రస్ట్ సంజీవని ఉచిత ఆరోగ్య క్లినిక్‌ను ఏర్పాటు చేశామన్నారు. విలేకరులతో ఆమె మాట్లాడుతూ ప్రజలే దేవుళ్లు అని నమ్మిన ఎన్టీఆర్ స్ఫూర్తితోనే ఆయన పేరు మీదుగా చంద్రబాబు ఎన్టీఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేశారని తెలిపారు. ఇప్పటి వరకు ఈ ట్రస్ట్ ద్వారా 12,900 ఉచిత మెడికల్ క్యాంప్‌లు నిర్వహించినట్లు చెప్పారు. 19.43 లక్షల మందికి రూ.20 కోట్ల విలువైన మందులు ఇచ్చామన్నారు. మూడు బ్లడ్‌బ్యాంక్‌ల ద్వారా ఎనిమిది లక్షల మందికి రక్తదానం చేసి వారి ప్రాణాలను ట్రస్ట్ కాపాడినట్లు చెప్పారు. ఇప్పటి వరకు సంజీవని ద్వారా 67,104 కుటుంబాలు లబ్ధి పొందాయని తెలిపారు.

189 మంది వైద్యుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య మిషన్ కింద 189 పోస్టుల్ని కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, అర్బన్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో ఖాళీగా ఉన్న 102 మెడికల్ ఆఫీసర్లు, 87 స్టాఫ్ నర్సుల పోస్టుల్ని భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నియామక బోర్డ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన అర్హతా ప్రమాణాలు, సవివరమైన మార్గదర్శకాలను ఏపీఎంఎస్ఆర్‌బీ వెబ్‌సైట్, ఏపీడీఎంతో వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ నుంచి మార్చి 10వ తేదీలోపు ఏపీఎంఎస్ఆర్‌బీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చే సుకోవాలని సూచించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో నిరంతరం నియామక ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

డాక్టర్ ఎక్కడో.. స్కానింగ్ ఇక్కడ!



ఎంవోలియో వ్యాక్సిన్ రిఫ్రిజిరేటర్

- రోబోతో దూరం నుంచే అల్ట్రా సౌండ్ స్కానింగ్
- ఇంట్లోనే చిన్నారులకు డయేరియా పరీక్షకు కిట్
- పెద్దవయసు వారు పడిపోకుండా ఆపే హిప్ ప్రో
- అంధ విద్యార్థులకు లెక్కలు నేర్పే టచింగ్ మ్యాథ్
- వినూత్న ఆవిష్కరణల వేదికగా బయో ఆసియా

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్‌లో జరుగుతున్న బయోఆసియా సదస్సు వినూత్న ఆవిష్కరణలకు వేదికగా మారింది. ఈ సదస్సులో భాగంగా నిర్వహిస్తున్న ట్రేడ్ ఫెయిర్‌లో పాల్గొన్న పలు సంస్థలు ఆరోగ్య సంరక్షణ రంగానికి సంబంధించి కొత్త కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను ప్రదర్శించాయి. బయోటెక్నాలజీ తదితర రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా అగ్రగామి సంస్థల నుంచి.. ఔత్సాహిక స్టార్టప్స్ వరకూ పలు సంస్థలు ఈ ట్రేడ్ ఫెయిర్‌లో పాల్గొన్నాయి. వీటిలో చాలావరకూ సంస్థలకు ఉపయోగపడే (బిజినెస్ టు బిజినెస్) ఆవిష్కరణలను ప్రదర్శించగా.. కొన్ని సంస్థలు నేరుగా రోగులకు ఉపయోగపడే టెక్నాలజీలను ప్రదర్శించాయి. వాటిలో కొన్ని..

వృద్ధులకు పట్టునిచ్చే హిప్ ప్రో

ఒక వయసు వచ్చిన తరువాత కాళ్లలో పట్టుండదు. ఎప్పుడు తూలి పడిపోతారో తెలియదు. దీనివల్ల తుంటి ఎముక విరగడం, ఫ్రాక్చర్ల ముప్పు వారికి చాలా ఎక్కువ. ఈ సమస్యకు పరిష్కారంగా రిపుల్ హెల్త్‌కేర్ సంస్థ కృత్రిమ మేధ సాయంతో పనిచేసే హిప్ ప్రో అనే స్మార్ట్ వేరబుల్ డివైజ్‌ను అభివృద్ధి చేసింది. ఈ పరికరం పెద్ద వయసువారు కింద పడిపోకుండా హెచ్చరిస్తుందని.. ఒకవేళ పడ్డా తుంటి గాయాలను నిరోధిస్తుందని దీని రూపకర్తలు తెలిపారు. అతి తేలికగా ఇది ఉండటం వల్ల ధరించడం కూడా సులభమేనని వారు తెలిపారు.

ఇంట్లోనే డయేరియా టెస్ట్ కిట్

మన దేశంలో 1990ల నాటికి ఐదేళ్లలోపు చిన్నారుల్లో ఏటా ప్రతి లక్ష మందికిగాను సగటున 126 మంది డయేరియా కారణంగా చనిపోయేవారు. అందరికీ వైద్యం అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో 2019నాటికి ఆ సంఖ్య 45కు తగ్గింది. కానీ, ఇప్పటికీ అది ఒక సమస్యే. ఆ సమస్య బ్యాక్టీరియా వల్ల వచ్చిందా? లేక ఇతర కారణాల వల్ల వచ్చిందా? అనే విషయాన్ని త్వరగా గుర్తించి చికిత్స చేయిస్తే మరణాల ముప్పు ఉండదు. దాన్ని సులువుగా గుర్తించేలా 'బేబీ క్యూ' అనే సంస్థ.. మైక్రోఫ్లూయిడిక్ పేపర్ బేస్డ్ టెక్నాలజీని అభివృద్ధి చేసింది. కేవలం రూ.100తో ఇంట్లోనే చేసుకోగలిగే మలపరీక్ష ఇది. మూలం తెలిస్తే చికిత్స చేయడం వైద్యులకు చాలా సులువవుతుంది.

టీకాలను భద్రపరిచే మినీ ఫ్రిజ్

కొవిడ్ లాంటి మహమ్మారులకు అడ్డుకట్ట వేసిన వ్యాక్సిన్‌లను మారుమూల ప్రాంతాలకు తరలించడం కాస్త కష్టమైన పని! నిర్దిష్ట ఉష్ణోగ్రత వద్ద మాత్రమే సమర్థంగా పనిచేసే ఈ వ్యాక్సిన్‌లు పాడైపోకుండా ఉండాలంటే రవాణాలో శీతలీకరణ కీలకం. అలాంటి రిఫ్రిజిరేషన్ సాంకేతికతలు చాలా ఉన్నాయి. వాటికి భిన్నంగా ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) సాంకేతికతతో పనిచేసే ఎంవోలియో అనే రిఫ్రిజిరేటర్‌ను బ్లాక్ ఫ్రాగ్ టెక్నాలజీస్ రూపొందించింది. వ్యాక్సిన్‌లతో పాటు బ్లడ్, సీరమ్, వైరల్ కల్చర్‌లను సైతం దీంట్లో తీసుకెళ్లొచ్చు. ధర రూ.2.6 లక్షలు. ఐవోటీ సాంకేతికతతో పనిచేయడం వల్ల ఎక్కడి నుంచైనా ఈడివైజ్‌ను మానిటర్ చేయొచ్చు.


హిప్ ప్రో

రిథమ్‌తో రిథమ్ తెలుస్తుంది..!

ఆస్పత్రిలో మంచంపై ఉన్నవారి హృదయ స్పందనల వేగం, రక్తపోటు, ఆక్సిజన్ స్థాయిలను యంత్రాల సాయంతో నిరంతరం పర్యవేక్షించవచ్చు. కానీ.. వారు మంచం దిగి బాత్‌రూమ్‌కు వెళ్లినప్పుడు కింద పడిపోతే? అలా వెళ్లినప్పుడు రోగి ఆరోగ్య స్థితి తెలుసుకోవడం ఎలా? ఈ ప్రశ్నకు సమాధానమే 'రిథమ్'. డీప్ ఫ్యాక్ట్స్ అనే సంస్థ దీన్ని తయారు చేసింది. ధర రూ.35 వేలు. ఈ రిథమ్ డివైజ్‌తో ఈసీజీ, రక్తపోటు, గుండె కొట్టుకునేవేగం, శరీర ఉష్ణోగ్రత సహా పలు అంశాలను తెలుసుకోవచ్చని.. ప్రో రిథమ్ సేవల కోసం తాము రోజుకు 200 రూపాయలు చార్జ్ చేస్తామని ఆ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. హాస్పిటల్స్‌కు తాము ఈ డివైజ్‌లను అందిస్తున్నామని చెప్పారు.

అంధుల కోసం.. టచింగ్ మ్యాథ్

హైదరాబాద్‌లోని బీవీఆర్‌ఐటీలో చదువుతున్న ఈఈఈ విద్యార్థులు పవన్ తేజ, రోహన్‌రాజ్.. కొన్నాళ్ల క్రితం ప్రత్యేక టూర్‌లో భాగంగా అంధుల పాఠశాలను సందర్శించారు. బ్రెయిలీ లిపిలో గణితం నేర్చుకునేందుకు అంధ విద్యార్థులు పడుతున్న ప్రయాసను గమనించిన వీరిద్దరూ.. వారికి ఉపకరించే పరికరం తయారు చేయాలని నిర్ణయించుకున్నారు. తమ కళాశాలలో ఉన్న వనరులతోనే.. టచింగ్ మ్యాథ్ అనే పరికరాన్ని రూపొందించారు. ఈ పరికరంలో లెర్నింగ్, టెస్టింగ్, అర్థమాటిక్ మాడ్యూల్స్‌తోపాటు స్పీకర్‌ను కూడా అమర్చారు. ఈ పరికరం తమకు గణితంపై ఆసక్తిని పెంచిదంటూ పలువురు అంధ విద్యార్థులు సంతోషం వెలిబుచ్చారని వారు తెలిపారు.

కణాలకు ఆక్సిజన్ కొరతతో పెనుముప్పు

- క్యాన్సర్ బాధితులు, కిడ్నీ, హృద్రోగుల్లో శరీరకణాలకు తగినంత ప్రాణవాయువు అందకపోవడంవల్లే చిక్కు
- బయోఆసియా సదస్సులో నోబెల్ విజేత ప్రొఫెసర్ గ్రెగ్ సెమెంజా వెల్లడి

క్యాన్సర్ బాధితుల్లో, హృద్రోగాలు, కిడ్నీ, శ్వాసకోశ సమస్యలు ఉన్నవారి శరీరాల్లో కణాలకు ఆక్సిజన్ తగినంతగా సరఫరా కాకపోవడమే వారి సమస్యలకు మూలకారణంగా గుర్తించామని 2019 వైద్య నోబెల్ గ్రహీత ప్రొఫెసర్ గ్రెగ్ సెమెంజా వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన బయోఆసియా-2024 సదస్సులో జీనోమ్ వ్యాలీ అవార్డు అందుకున్న అనంతరం ఆయన కీలక ఉపన్యాసం చేశారు. "మానవ దేహంలో 50 ట్రిలియన్లకు పైగా కణాలు ఉంటాయి. వాటి డిమాండ్‌కు అనుగుణంగా ఆక్సిజన్‌ను సరఫరా చేసే అద్భుత యంత్రాంగం దేశంలో ఉంది. ఎర్ర రక్త కణాల ద్వారా రక్తనాళాల నుంచి మన శరీరంలోని కణాలన్నింటికీ ఆక్సిజన్ సరఫరా అవుతుంది. కానీ.. హృద్రోగులు, క్యాన్సర్ పేషెంట్లు, కిడ్నీ, శ్వాసకోశ సమస్యలు ఉన్న వారి దేహంలోని కణాలకు ఆక్సిజన్ సరఫరాలో సమతౌల్యం దెబ్బతిన డాన్ని గుర్తించాం" అని ఆయన వివరించారు. "దీర్ఘకాలంగా మూత్రపిండాల వ్యాధి బారిన పడినవారిలో ఎరిత్రోపొయిటిన్ అనే హార్మోన్ వల్ల ఎర్రరక్తకణాల ఉత్పత్తి నిలిచిపోతుంది. అలా నిలిచిపోయిన ఎర్రరక్తకణాల ఉత్పత్తిని పెంపొందించడానికి ఎరిత్రోపొయిటిన్‌ను ఇంజక్షన్ ద్వారా అందించడం మొదలైంది. మా పరిశోధన సాధించిన తొలి విజయం ఇది' అని డాక్టర్ సెమెంజా వివరించారు. ఇదే పద్ధతిలో క్యాన్సర్‌ను కూడా కట్టడి చేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. క్యాన్సర్ ఉన్న వారిలో కణాలు వేగంగా పెరగడం వల్ల ఆక్సిజన్ సరఫరా తగ్గుతుందని.. ఫలితంగా క్యాన్సర్ కణాలు చనిపోతాయి. కానీ ఆ చనిపోయేది క్యాన్సర్ కణితికి దూరంగా ఉన్న కణాలు మాత్రమేనని, దగ్గరగా ఉన్నవి తగినంత ఆక్సిజన్ లభించడంతో యథాతథంగా ఉంటాయని వెల్లడించారు. అవి ఎలాంటి చికిత్సకూ లొంగకుండా పోతున్నాయని.. అది మరింత ప్రమాదమని ఆందోళన వెలిబుచ్చారు. వాటినీ నిర్మూలించే దిశగా పరిశోధనలు చేస్తున్నామని తెలిపారు.

-స్పెషల్ డెస్క్

'ఆకాశ్ బైజూస్'లో అగ్ని ప్రమాదం

- రూ.కోటికి పైగా ఆస్తినష్టం.. ఫర్నిచర్, రికార్డులు దగ్ధం
- షార్ట్ సర్క్యూట్ వల్లే.. గాజువాకలో ఘటన


గాజువాకలో ఆకాశ్ బైజూస్ అకాడమీలో ఎగసిపడుతున్న మంటలు

గాజువాక, ఫిబ్రవరి 27: విశాఖపట్నం నగర పరిధిలోని గాజువాకలో గల ఆకాష్ బైజూస్ అకాడమీలో మంగళవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. భవనంలో ఉన్న వస్తు సామగ్రి మొత్తం కాలిపోయింది. నష్టం రూ.కోటి వరకూ ఉంటుందంటున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం సంభవించి ఉంటుందని అగ్నిమాపక శాఖ అధికారులు ప్రాథమికంగా అభిప్రాయపడుతున్నారు. గాజువాక సినిమాహాల్ జంక్షన్‌లో గల నాలుగంతస్తుల (జీ+4) భవనంలోని రెండో ఫ్లోర్‌లో ఆకాష్ బైజూస్ అకాడమీ నడుస్తోంది. మంగళవారం ఉదయం 5.30 గంటల సమయంలో ఆ ఫ్లోర్ నుంచి పొగతో పాటు చిన్న మంటలు రావడాన్ని కిందన ఉన్న సెక్యూరిటీ సిబ్బంది గమనించి సమాచారం ఇవ్వడంతో పెదగంట్యాడ అగ్నిమాపక శాఖ సిబ్బంది తరలి వచ్చారు. అయితే అప్పటికే మంటలు మరింత వ్యాపించడంతో అగ్నిమాపక శాఖ అధికారి జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. చుట్టుపక్కల ఉన్న పరిశ్రమలకు చెందిన ఏడు అగ్నిమాపక శకటాలను రప్పించి మంటలను అదుపు చేసేందుకు యత్నించారు. అయితే మంటలు క్షణాల్లో రెండో ఫ్లోర్ మొత్తం వ్యాపించాయి. పరిస్థితి చేయిదాటడంతో జీవీఎంసీకి చెందిన స్కై లిఫ్ట్ ఫైరింజన్‌ను కూడా రంగంలోకి దింపారు. మంటలు చుట్టుపక్కల భవనాలకు, కింద ఉన్న వైభవ్ జ్యూవెలర్స్‌కు, పైన ఉన్న మూడు, నాలుగు అంతస్తులకు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది అతికష్టమ్మీద అదుపుచేశారు. ఆకాష్ బైజూస్ అకాడమీ నిర్వహిస్తున్న ఫ్లోర్ మొత్తం ఉడెన్ వాల్స్ ఉండడం వల్ల మంటలు వేగంగా వ్యాపించాయని అగ్నిమాపక అధికారులు చెబుతున్నారు.

బండి శ్రీనివాసరావుపై పోలీసులకు ఫిర్యాదు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 27: ఉద్యోగ, ఉపాధ్యాయుల ఏపీ జేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావుపై చీటింగ్ కేసు నమోదు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.సంపత్‌బాబు, గౌరవాధ్యక్షుడు పమ్మి వెంకటరెడ్డి మంగళవారం పల్నాడు జిల్లా నరసరావుపేటరూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణను చైర్మన్ బండి శ్రీనివాసరావు ప్రకటించారని, నరసరావుపేటలో జరిగిన మొదటి తాలూకా స్థాయి ఉద్యమంలో ఆయన స్వయంగా పాల్గొని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని విరమించేది లేదని హామీ ఇచ్చారని తెలిపారు. రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు గత రెండు వారాలుగా అనేక వ్యయప్రయాసల కోర్చి ఉద్యమ కార్యాచరణలో భాగంగా చలో విజయవాడను నిర్వహించాల్సిన సమయంలో చైర్మన్ బండి శ్రీనివాసరావు మోసం చేశారని ఆరోపించారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లేకపోయినా, భాగస్వామ్య సంఘాలతో ఎటువంటి చర్చలూ లేకుండానే అర్థంతరంగా రాత్రికిరాత్రి ఉద్యమాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించడం దారుణమన్నారు.

జగన్ ఓటమే ధ్యేయం కావాలి

- వైవీబీ

డాబాగార్డెన్స్ (విశాఖపట్నం), ఫిబ్రవరి 27: రానున్న ఎన్నికల్లో సీఎం జగన్ ఓటమే ప్రతి ఒక్కరి ధ్యేయం కావాలని ఏపీ పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పంచాయతీలకు కేంద్రం విడుదల చేసిన రూ.6,848 కోట్ల నిధులను దారి మళ్లించిన జగన్.. గ్రామాల అభివృద్ధిని కాలరాశాడని మండిపడ్డారు. పంచాయతీలకు సంబంధించిన 16 డిమాండ్ల నెరవేర్చేంత వరకూ నిరసనలు కొనసాగిస్తామన్నారు. అన్ని రాజకీయ పార్టీల సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ద్వారా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో అధికార వైసీపీ ఓటమి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చామన్నారు. సర్పంచులా.. వలంటీర్లా.. ఎవరు కావాలో జగన్ తేల్చుకోవాలన్నారు. సమావేశంలో రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మి పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు భూముల విక్రయానికి పెట్టుబడిదారుల సమావేశం

- భూముల వివరాలు, రిజర్వు ధర వెల్లడి
- హెచ్‌బీ కాలనీలో 11.8 ఎకరాలు, ఆటోనగర్‌లో 2, పెదగంట్యాడలో 0.089 ఎకరాలు
- మొత్తం 13.89 ఎకరాలు.. 130 ప్లాట్లు
- ఈఎండీలు సమర్పణకు 5 వరకు గడువు, 14న వేలం

విశాఖపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం నాన్-కోర్ భూముల విక్రయానికి నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం పెట్టుబడిదారుల సమావేశం నిర్వహించారు. ఇటీవల ఈ భూములకు సంబంధించి వేలం ప్రకటన ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆయా భూములు, వాటి విస్తీర్ణం, రిజర్వ్ చేసిన ధరలు వెల్లడించేందుకు ఈ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ బాధ్యతలను తీసుకున్న నేషనల్ బిల్డింగ్స్ కనస్ట్రక్షన్స్ కార్పొరేషన్ (ఎన్‌బీసీసీ), నేషనల్ ల్యాండ్ మోనటైజేషన్ కార్పొరేషన్ (ఎన్ఎల్ఎంసీ) అధికారులు ఇందులో పాల్గొని వివరాలు వెల్లడించారు. నగరంలోని హెచ్‌బీ కాలనీలో 11.8 ఎకరాలు, ఆటోనగర్‌లో 2 ఎకరాలు, పెదగంట్యాడలో 0.089 ఎకరాలు కలిపి 13.89 ఎకరాలు విక్రయించనున్నట్టు వెల్లడించారు. మొత్తం 67,277 చదరపు గజాల విస్తీర్ణంలో 130 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. హెచ్‌బీ కాలనీలో రిజర్వుడ్ ధర గజానికి రూ.70,200 నుంచి రూ.85,800 వరకు ఉండగా ఇక్కడే 111 ప్లాట్లు ఉన్నాయి. ఆటోనగర్‌లో గజం రిజర్వ్ ధర రూ.30 వేల నుంచి రూ.32 వేల వరకు నిర్ణయించారు. పెదగంట్యాడలో 435 గజాల స్థలం ఉండగా, అక్కడ గజం రిజర్వ్ ధర రూ.20,500గా నిర్ణయించారు. ఈ మూడు ప్రాంతాల్లో గల భూముల రిజర్వు ధర రూ.480 కోట్లు వరకూ ఉంటుందని అంచనా వేశారు. వీటికి ఈఎండీలు సమర్పించడానికి మార్చి 5వ తేదీ వరకు గడువు ఉందని, మార్చి 14న వేలం నిర్వహిస్తామని అధికారులు వెల్లడించారు. ఈ సమావేశంలో పెట్టుబడిదారులు సందేహాలు, ప్రశ్నలకు ఇంజనీరింగ్ జీఎం రాజారామ్ (ఎన్‌బీసీసీ), సీజీఎం గాంధీ (ఆర్ఐఎన్ఎల్), కె.రోహిన్ (ఎన్ఎల్ఎంసీ) సమాధానాలు ఇచ్చారు.

20 నుంచి శ్రీవారి తెప్పోత్సవాలు

తిరుమల, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మార్చి 20 నుంచి 24వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు జరుగనున్నాయి. తొలిరోజు సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రమూర్తి అవతారంలో స్వామివారు తెప్పలపై పుష్కరిణిలో మూడు చుట్లు తిరిగి భక్తులకు కనువిందు చేస్తారు. రెండోరోజు రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి అవతారంలో, చివరి మూడురోజులూ శ్రీభూ సమేతంగా మలయప్పస్వామి పుష్కరిణిలో విహరించి భక్తులను కటాక్షిస్తారు.

సీఆర్డీయే 'రద్దు' ఉత్తర్వులు రద్దు!

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నదని తప్పుబట్టింది. అది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని తేల్చింది. ఈ మేరకు సీఆర్డీయే ప్రొసీడింగ్స్‌ను, రైతులకు ఇచ్చిన నోటీసులను రద్దుచేసింది. రైతులకు కేటాయించిన ప్లాట్లను రద్దు చేసే ముందు నోటీసులు ఇచ్చి వారి అభ్యంతరాలు స్వీకరించకపోవడం ఏమిటని ప్రశ్నించింది. చట్టనిబంధనలు అనుసరించడంలో అధికారులు విఫలమయ్యారని స్పష్టం చేసింది. అధికారుల చర్యలు సివిల్ వివాదాలకు దారితీసేవిగా ఉన్నాయని హెచ్చరించింది. యజమానులకు నోటీసులు ఇచ్చి, వారి అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకున్న తరువాత ప్లాట్ల రద్దుపై రాతపూర్వక ఆదేశాలు ఇచ్చి ఉండాల్సిందని అభిప్రాయపడింది. ప్రాథమిక న్యాయసూత్రాలను అనుసరించడంలో అధికారులు విఫలమయ్యారని తేల్చింది. అయితే చట్ట నిబంధనలు, సహజ న్యాయసూత్రాలను అనుసరించి రైతులకు మరోచోట ప్లాట్ల కేటాయించే ప్రక్రియను కొనసాగించేందుకు తమ ఉత్తర్వులు అడ్డంకి కాబోవని సీఆర్డీయే, ప్రభుత్వానికి స్పష్టం చేసింది. తీర్పు ప్రతి అందిన తరువాత వారం రోజుల్లో ప్లాట్ల యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది. ప్లాట్లను ఎందుకు రద్దు చేయాల్సి వస్తుందో, చట్టంలోని ఏ నిబంధన ఆ అధికారం కల్పిస్తుందో అందులో పేర్కొనాలంది. ఆ తరువాత మూడు వారాల పాటు వారి నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని అధికారులకు స్పష్టం చేసింది. అనంతరం రైతులు తమ వాదనను నేరుగా వినిపించేందుకు రెండువారాల గడువు ఇవ్వాలని ఆదేశించింది. తదనంతరం రాతపూర్వకంగా తగిన ఉత్తర్వులు జారీ చేయాలని సీఆర్డీయే, రాష్ట్ర ప్రభుత్వానికి నిర్దేశించింది. సీఆర్డీయే నుంచి దస్త్రాలు కోరేందుకు పిటిషనర్లకు వెసులుబాటు ఇచ్చింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం ఆదేశాలు జారీచేసింది.

నిబంధనలు పాటించాల్సిందే..

రాజధాని అమరావతిలో భూసేకరణ ప్రక్రియ ద్వారా సేకరించిన భూముల్లో రైతులకు ఇచ్చిన ప్లాట్లను రద్దు చేసి మరోచోట కేటాయించేందుకు సీఆర్డీయే ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడాన్ని సవాల్ చేస్తూ కొండెపాటి కరుణ, మరికొందరు రైతులు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలను విచారించిన సింగిల్ జడ్జి తాము తగిన ఉత్తర్వులు జారీ చేసేవరకు పిటిషనర్లకు ఇప్పటికే కేటాయించిన ప్లాట్లను రద్దు చేయవద్దని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. మరోచోట ప్లాటు తీసుకొనేందుకు సమ్మతించిన రైతుల విషయంలో నిబంధనలను అనుసరించి కేటాయింపు ప్రక్రియను కొనసాగించవచ్చని స్పష్టం చేశారు. సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, సీఆర్డీయే అప్పీల్ దాఖలు చేశాయి. వారి తరఫున అడిషనల్ అడ్వకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. "సీఆర్డీయే చట్టం ప్రకారం భూ సేకరణవిధానం కింద తీసుకున్న భూముల్లో మాత్రమే రైతులకు ప్లాట్లు కేటాయించాల్సి ఉంది. పిటిషనర్లలో కొందరికి భూసేకరణ ద్వారా తీసుకున్న భూమిలో ప్లాటు కేటాయించారు. ఈ నేపథ్యంలోనే వారికి కేటాయించిన ప్లాటును రద్దు చేసి, వేరే చోట ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు, న్యాయవాదులు సాయి సంజయ్ సూరనేని, కారుమంచి ఇంద్రనీల్ బాబు వాదనలు వినిపించారు. "పిటిషనర్ల ప్లాట్లను రద్దు చేస్తూ సీఆర్డీయే ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంది. పిటిషనర్లకు నోటీసులు ఇచ్చి అభ్యంతరాలు స్వీకరించలేదు. కేటాయించిన ప్లాటును రద్దు చేసే అధికారం సీఆర్డీయేకు లేదు. రద్దు చేసి మరోచోట కేటాయించాలనుకుంటే సీఆర్డీయే అధికారులు తగిన కారణాన్ని చూపించాలి. ప్రస్తుత కేసులో ఏ కారణంతో పిటిషనర్ ప్లాటు రద్దు చేశారో చెప్పలేదు. చట్ట నిబంధనలు అనుసరించడంలో అధికారులు విఫలమయ్యారు" అని తెలిపారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.... రైతులకు ఇచ్చిన ప్లాట్లు రద్దు చేసే విషయంలో ప్రాథమిక, సహజ న్యాయ సూత్రాలు పాటించడంలో అధికారులు విఫలమయ్యారని ధర్మాసనం పేర్కొంది. ఈ నేపథ్యంలో రైతులకు మరోచోట తిరిగి ప్లాట్లు కేటాయించే విషయంలో సీఆర్డీయే ఇచ్చిన ప్రొసీడింగ్స్ తదనంతరం రైతులకు ఇచ్చిన నోటీసులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.



రోజుకు రూ.275 కోట్ల అప్పు!

- జంకు బొంకు లేకుండా బుగ్గన అబద్ధాలు
- రాష్ట్ర ఆదాయం ఎటు పోతోందో తెలియట్లేదు
- పెట్టుబడుల్లో దేశంలో 15వ స్థానంలో రాష్ట్రం
- ఆదాయ సముపార్జనలో చివరి స్థానం
- టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ ధ్వజం



అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఇంతగా అప్పులు చేస్తూ, ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటడం లేదని ఆర్థిక మంత్రి బుగ్గన, ఆ శాఖ అధికారులు జంకు బొంకు లేకుండా అబద్ధాలు చెబుతున్నారని టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శించారు. మంగళవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ పాలనలో సాధారణ పాలన అస్తవ్యస్తంగా మారిందని, ఆర్థికపరమైన వ్యవహారాల్లో అంతకంటే దారుణంగా తయారైందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం రోజుకు రూ.257 కోట్లు అప్పు చేసిందనడానికి కాగ్ లెక్కలే నిదర్శనమన్నారు. ప్రభుత్వం కాంట్రాక్టర్లకు, టీచర్లకు, ఉద్యోగులకు రూ.వేల కోట్లు చెల్లించాల్సి ఉందని, రాష్ట్రానికి వస్తున్న ఆదాయం ఎటు పోతోందో తెలియట్లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు రోజుకు రూ.257 కోట్లు చొప్పున అప్పు చేసిందని, ఈ సత్యం ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని చెప్పారు. కాగా, జగన్ ప్రభుత్వం రోజుకు పెట్టే ఖర్చు రూ.698 కోట్లు అని, ప్రభుత్వానికి సొంతంగా వస్తున్న ఆదాయం ఇందులో మూడో వంతు(రూ.264 కోట్లు) మాత్రమేనని వివరించారు. మిగతా రూ.434 కోట్లలో రూ.257 కోట్లు అప్పుల సొమ్ము, రూ.73 కోట్లు కేంద్రం నుంచి వచ్చిన పన్నుల వాటా, కేంద్ర గ్రాంటులు రూ.89 కోట్లు, కేంద్రం నుంచి వచ్చే ఇతర రుణాలు రూ.50 కోట్లు ఉన్నాయని తెలిపారు. రూ.257 కోట్ల రోజువారీ అప్పులు కేవలం ఆర్‌బీఐ ద్వారా తీసుకున్న సొమ్మేనని, కార్పొరేషన్ అప్పులు వేరే అని, అవి కూడా కలిపితే రోజుకు సులభంగా రూ.300 కోట్లు దాటిపోయే అవకాశముందని పేర్కొన్నారు. అప్పులు తీసుకోవడం తప్పేమీ కాదని, కేంద్రం కూడా అప్పులు చేస్తోందని మంత్రి బుగ్గన, ఆర్థికశాఖ కార్యదర్శి రావత్ అబద్ధాలు చెప్పడం ఇంకా పెద్ద తప్పన్నారు. 2023-24 ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 9 నెలలకు ఇచ్చిన అప్పు పరిమితి ఎంతో చెప్పాలని టీడీపీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. డిసెంబరు కాగ్ రిపోర్ట్‌లో ఇచ్చిన రూ.69736.83 కోట్ల అప్పు నిజమో? కాదో ప్రభుత్వం తేల్చి చెప్పాలన్నారు. మార్చి 2024 నాటికి రాష్ట్ర అప్పు రూ.4.85 లక్షల కోట్లు అని ఆర్‌బీఐ అంచనా వేసిందని తెలిపారు. ఆర్‌బీఐ నివేదిక ప్రకారం ఆర్‌బీఐ ద్వారా మాత్రమే తీసుకున్న ఆంధ్రప్రదేశ్ అప్పులు 2019 నాటికి రూ.2,64,451 కోట్లు, 2023 నాటికి రూ.4,28,715 కోట్లు, 2023-24 ఏప్రిల్-సెప్టెంబర్ మధ్యలో రూ.41,500 కోట్లు అంటే మొత్తంగా ఈ ఐదేళ్లలో ఏపీ ఆర్‌బీఐ ద్వారా చేసిన స్థూల అప్పులు రూ.2.50 లక్షల కోట్లకు పైమాటేనన్నారు. ఇవి కాకుండా కార్పొరేషన్ అప్పులు తదితర అన్నీ కలిస్తే రూ.11 లక్షల కోట్లకు చేరతాయన్నారు. రోజువారీ ఖర్చు రూ.698 కోట్లలో వడ్డీలకే రూ.85 కోట్లు ఖర్చవుతోందన్నారు. వచ్చే ఆదాయంలో మన కంటే తక్కువ వడ్డీలు కట్టే రాష్ట్రాలు దేశంలో 21 ఉంటే మనం 22వ స్థానంలో ఉన్నామని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడుల మీద పెట్టే ఖర్చు 2022-23లో రూ.16,846 కోట్లు మాత్రమేనని, పెట్టుబడుల్లో దేశంలో ఏపీ 15వ స్థానంలో ఉందని పేర్కొన్నారు. మొత్తం ఆదాయంలో రాష్ట్రానికి పన్నులపై వచ్చే సొంత ఆదాయంలో ఏపీది 9వ స్థానమని తెలిపారు. బ్యాంక్ గ్యారెంటీలు ఇవ్వడంలో కూడా దేశంలోనే మన రాష్ట్రం అగ్రస్థానంలో ఉందన్నారు. ఆదాయ సముపార్జనలో, ప్రాధాన్య రంగాలకు న్యాయం చేయడంలో, అభివృద్ధిని పరుగులు పెట్టించడంలో జగన్ అంచనాలు దారుణంగా దెబ్బతిని రాష్ట్రం చివరిస్థానంలో నిలిచిందని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పెద్దల ఎన్నికలోనూ...!

మూడు రాష్ట్రాల్లో పదిహేను రాజ్యసభ స్థానాలకు పోలింగ్ తప్పనిసరి కావడంతోనే క్రాస్ ఓటింగ్ అనుమానాలూ రాజుకున్నాయి. ఏప్రిల్ మొదటి వారానికి యాభైఆరు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్న నేపథ్యంలో, నలభైఒక్కస్థానాలు ఏకగ్రీవంతో బుద్ధిగా నిండిపోయాయి. కానీ, ఉత్తర్‌ప్రదేశ్‌లో పది, కర్ణాటకలో నాలుగు, హిమాచల్‌ప్రదేశ్‌లో ఒకే ఒక్క స్థానానికి మంగళవారం జరిగిన పోలింగ్‌లో భారీ క్రాస్ ఓటింగ్ జరిగి యూపీ, హిమాచల్‌లో బీజేపీ లాభపడితే, కర్ణాటకలో పైచేయి సాధించిన కాంగ్రెస్ ఇప్పుడు ఉత్తర భారతంలో తాను అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం హిమాచల్‌ప్రదేశ్‌లో ఏకంగా ప్రభుత్వాన్నే కోల్పోయే ప్రమాదంలోకి జారుకుంది.

ఇది నరేంద్రమోదీ, అమిత్ షా విజయం అని సవినయంగా ప్రకటించారు హిమాచల్‌లో ఆ ఒక్క స్థానాన్నీ దక్కించుకున్న బీజేపీ అభ్యర్థి హర్ష్ మహాజన్. నలభైమంది ఎమ్మెల్యేలతో, ఆపైన ముగ్గురు ఇండిపెండెంట్ల మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వం అంత బలంగా ఉండగా అభిషేక్ మనుసింఘ్వీ వంటి ఓ యోధుడు ఇంత ఘోరంగా ఓడిపోతాడని ఎవరూ ఊహించరు. అధికార కాంగ్రెస్‌లో అసమ్మతి, ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుక్కూ మీద కొంతమంది ఎమ్మెల్యేలలో వ్యతిరేకత నిజమే కావచ్చు కానీ, కేవలం పాతికమంది ఎమ్మెల్యేలతో ఏ మాత్రం గెలవగలిగే అవకాశాలు లేని బీజేపీ అంత ధైర్యంగా తన అభ్యర్థిని నిలబెట్టినప్పుడే రిసార్ట్ రాజకీయాలకు, క్రాస్ ఓటింగ్‌కు రంగం సిద్ధమైందని అర్థం. కనుచూపుమేర విజయావకాశాలు లేకున్నా కుట్ర రాజకీయం మీద ఉన్న ఆ నమ్మకం వమ్ముకాలేదు. ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముగ్గురు స్వతంత్రులు 'ఆత్మప్రబోధం' మేరకు ఓటు చేయడంతో ఇద్దరు అభ్యర్థుల బలాబలాలు సమానమైనాయి, ఆ పైన లాటరీతో బీజేపీ అభ్యర్థి నెగ్గుకొచ్చారు. సింఘ్వీ విజయం మీద ఎంతో నమ్మకం పెట్టుకున్న సుక్కూ ఇప్పుడు హర్యానా పంచకులలోని ఓ గెస్ట్‌హౌస్‌లో కుట్ర జరిగిందంటూ ఏవో కొన్ని వీడియోలు విడుదల చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీజేపీ అపహరించిందంటూ ఆరోపణలు చేస్తున్నారు. సింఘ్వీ ఓటమితో కథ ముగియలేదని, అసలు నాటకం ముందున్నదని బీజేపీ నాయకుల వ్యాఖ్యలు చెబుతున్నాయి. మెజారిటీ లేని ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని వెంటనే డిమాండ్ చేసిన బీజేపీ, మరికొందరిని చీల్చి అవిశ్వాస తీర్మానంతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎప్పుడైనా కూల్చివేయవచ్చు. పాతిక మంది ఎమ్మెల్యేలున్న బీజేపీ, నాలుగు దశాబ్దాలపాటు కాంగ్రెస్‌లో ఉన్న నాయకుడిని ఆఖరురోజున ముందుకు తెచ్చి నిలబెట్టి, నలభై మూడు మంది ఎమ్మెల్యేల మద్దతున్న కాంగ్రెస్ నుంచి ఇలా రాజ్యసభ స్థానాన్ని గుంజుకొని, ప్రభుత్వాన్ని కూల్చడానికి సిద్ధపడుతూండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. గెలిచేంత సంఖ్యాబలం లేదని తెలిసి కూడా బీజేపీ కేంద్ర నాయకత్వం ఆశీస్సులు అందించినందువల్లనే కాబోలు, బీజేపీ మాజీ ముఖ్యమంత్రి జైరామ్ ఠాకూర్ ఈ విజయాన్ని అమిత్‌షా, జేపీ నడ్డాలకే అంకితం చేశారు.

ఇది 'విధేయత పరీక్ష' అని అఖిలేశ్ యాదవ్ మొఖం చెల్లక ఏవో సమర్థింపుమాటలు అంటున్నారు కానీ, ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్రధానంగా ముగ్గురు బీజేపీ అభ్యర్థుల విజయంలో, ఒక ఎస్పీ అభ్యర్థి ఓటమిలో క్రాస్ ఓటింగ్ ఉపకరించింది. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ఏడుగురు ఎమ్మెల్యేల సహాయసహకారాలతో బీజేపీ తాను పోటీలో ఉంచిన ఎనిమిదిమందినీ గెలిపించుకుంది. ఓటింగ్ జరుగుతూండగానే పార్టీ చీఫ్‌విప్ సహా ఐదుగురు ఎమ్మెల్యేలు యోగి ఆదిత్యనాథ్‌ను దర్శించుకోవడం, అంతకుముందు ఓ ఎనిమిదిమంది విందుకు హాజరుకాకపోవడం అఖిలేశ్‌కు అవమానకరమైన పరిణామాలు. కర్ణాటకలో మొత్తం మూడు స్థానాలనూ కాంగ్రెస్ సునాయాసంగా గెలిచినప్పటికీ, ఒక బీజేపీ ఎమ్మెల్యే క్రాస్ ఓటింగ్, మరొకరి గైర్హాజరీ బీజేపీ–జేడిఎస్ కూటమికి అవమానకరమైన పరిణామం. ఈ ఎన్నికల్లో మొత్తం పదిహేను రాజ్యసభ స్థానాల్లో పదింటిని కైవసం చేసుకున్న బీజేపీ ప్రధానంగా కాంగ్రెస్, దాని మిత్రపక్షమైన సమాజ్‌వాదీ పార్టీకి సార్వత్రిక ఎన్నికలముందు పెద్ద షాక్ అయితే ఇచ్చింది. ఎన్నికల పొత్తులతో యుద్ధానికి సిద్ధమవుతున్న ఇండియా కూటమి ఉత్సాహం మీద నీళ్ళుజల్లే ప్రయత్నమైతే బలంగానే జరిగింది.

మీడియాపై దాడులు మీ మెడకే చుట్టుకుంటాయి!

అధికారం గల్లంతవుతుందన్న భయం పట్టుకున్నవాళ్ళు, తమ ఘనకార్యాలు ప్రజలకు తెలిసిపోతున్నాయని పసిగట్టినవారు నిస్పృహతో చేసే ప్రధానమైన పని భావప్రకటన స్వేచ్ఛను హరించడం. అందులో భాగంగా, సత్యాన్ని ప్రజలకు నివేదించే మీడియా పీకనొక్కుతారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు జరుగుతున్నది అదే. ఇప్పటికే ప్రత్యర్థులపై దాడులు, దొంగ కేసులు, బెదిరింపులతో జనసామాన్యాన్ని గడగడ వణికిస్తున్న పాలకపక్షం ఇప్పుడు ఏకంగా జర్నలిస్టులపై దాడులకు పాల్పడడం భీతి కొల్పుతోంది.

సమాజంలో జరుగుతున్న పరిణామాలు మంచివైనా, చెడువైనా ప్రజలకు చెప్పడం మీడియా బాధ్యత. ప్రజాస్వామిక వ్యవస్థలో మీడియా తమ పాత్రను పోషించడంలో వివక్షను కనబరుస్తుంటే దాన్ని ఎత్తి చూపడానికి, సవరించడానికి, నిరసనకు అనేక మార్గాలు ఉన్నాయి. ఈ ప్రజాస్వామిక అవకాశాలను కాదని ఆటవికమైన దాడులకు పాల్పడటం దారుణం. మూక దాడులతో మీడియాను అణచివేయగలమని అనుకోవడం అవివేకమే అవుతుందని చరిత్రలో అనేకసార్లు నిరూపితమైంది. అయినా ఏపీ ప్రభుతం ఈ అప్రజాస్వామిక, అనాగరిక సిద్ధాంతాన్నే నమ్ముకోవడం దురదృష్టం.

జమిలి ఎన్నికలకు తెరలేస్తున్న వేళ ఏపీలో మీడియాపై దాడులు ఎక్కువవుతున్నాయి. పచ్చ మీడియా అన్న ముద్రవేసి కొన్ని పత్రికలను, చానెళ్లను మీడియా సమావేశాల నుంచి బహిష్కరించిన ప్రభుత్వం కనుసన్నల్లోనే ఈ దాడులు జరుగుతున్నాయన్న అనుమానం బలపడుతోంది. పత్తికొండలో ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్‌పై స్థానిక ప్రజాప్రతినిధి సమక్షంలోనే అల్లరి మూకలు దాడికి పాల్పడటం, రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడి, కర్నూలు ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై పోలీసుల సమక్షంలోనే ఒక రాజకీయ పార్టీ కార్యకర్తలు రాళ్ల వర్షం కురిపించడం, అధికార పార్టీకి సంబంధించిన మరో ప్రజాప్రతినిధి ఇలాంటి దాడులను సమర్థిస్తూ మాట్లాడటం, వీటన్నింటి పైన ప్రభుత్వం నుంచి ఏ మాత్రం స్పందన లేకపోవడం... ఈ పరిణామాలు జర్నలిజానికి గడ్డుకాలంగానే గోచరిస్తున్నాయి.



మీడియా స్వేచ్ఛ భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కు. ఇది స్వతంత్ర జర్నలిజాన్ని ప్రోత్సహిస్తుంది. ప్రభుత్వ చర్యలకు అనుకూలంగా లేదా వ్యతిరేకంగా ప్రజలు తమ అభిప్రాయాలను తెలియచేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని సుస్థిరపరుస్తుంది. దీన్ని అర్థం చేసుకుని, పత్రికా కథనాలపై రాజకీయ పక్షాలు సంయమనం పాటించాలి.

ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న మీడియాను స్వతంత్రంగా పనిచేయనివ్వకుండా, మీడియా స్వేచ్ఛపై దాడులు, పీక నొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ ఈ మధ్యనే దేశంలోని ప్రధాన మీడియా సంస్థలు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు లేఖ రాశాయి. తమపై ప్రతీకార దాడులు జరుగుతాయన్న భయంతో దేశంలోని చాలామంది జర్నలిస్టులు పని చేస్తున్నారని లేఖలో వారు పేర్కొన్నారు. వారి భయాలు ఏపీలో నిజమవుతున్నాయి.

న్యూస్ క్లిక్‌పై జరిగిన దాడులకు నిరసనగా దేశవ్యాప్తంగా జర్నలిస్టు సంఘాలు, మేధావులు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, కవులు, కళాకారులూ రోడ్డెక్కారు. ఇంతటి నిరసన వస్తుందని బహుశా కేంద్ర ప్రభుత్వం కూడా ఊహించి ఉండదు. నిరసనల్లో హైకోర్టు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు, ప్రముఖ జర్నలిస్టులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని సంఘీభావం తెలపడం విశేషం. పాత్రికేయులు చట్టానికి అతీతంగా ఉండాలని తాము కూడా కోరుకోవడం లేదని, కానీ పత్రికా స్వేచ్ఛను అడ్డుకుంటే ప్రజాస్వామ్య పునాదులపై ప్రతికూల ప్రభావం చూపుతుందని నిరసనకారులు పేర్కొన్నారు.

పత్రికా స్వేచ్ఛ లేదా మీడియా స్వేచ్ఛ అనేది ఆర్టికల్ 19(1)(ఎ)లో వాక్ స్వాతంత్ర్యం, భావ వ్యక్తీకరణ కింద భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కు. ఇది స్వతంత్ర జర్నలిజాన్ని ప్రోత్సహిస్తుంది. ప్రభుత్వ చర్యలకు అనుకూలంగా లేదా వ్యతిరేకంగా ప్రజలు తమ అభిప్రాయాలను తెలియచేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని సుస్థిరపరుస్తుంది. దీన్ని అర్థం చేసుకుని, పత్రికా కథనాలపై రాజకీయ పక్షాలు సంయమనం పాటించాలి.

కోట్ల విజయభాస్కరరెడ్డి, ఎన్.టి. రామారావు, నారా చంద్రబాబునాయుడు, వైఎస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రులుగా మీడియా పట్ల వ్యవహరించిన తీరు ప్రస్తుత పరిస్థితికి భిన్నం. వారు తమపై వచ్చిన విమర్శలను హుందాగా స్వీకరించేవారు. నిర్మాణాత్మక విమర్శలను స్వాగతించేవారు. పాలనలో, రాజకీయాల్లో మీడియా ఎత్తి చూపుతున్న లోపాలను పరిశీలించి సవరించుకొనే ప్రయత్నం చేసేవారు. పాత్రికేయులను కొట్టి చంపాలన్నట్లు వారు వ్యవహరించేవారు కాదు.

ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు, మీడియా కీలక భూమిక పోషిస్తాయి. ఈ రెండింటిలో ఏ ఒక్క వ్యవస్థ గాడి తప్పినా అది సమాజ ప్రగతికి ఆటంకమవుతుంది. ఈ రెండు వ్యవస్థలకు ప్రజాహితమే ప్రధాన ఎజెండా. రాజకీయ పార్టీలు ప్రజాహితం నుండి పక్కదారి పట్టకుండా చూడాల్సిన బాధ్యతను పత్రికా వ్యవస్థలు నిర్వహిస్తాయన్న స్పృహతో పాలిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. మీడియాపై నిస్పృహతో జరిపే ప్రతి దాడీ ప్రజల్లో తమ పట్ల ఉన్న వ్యతిరేకతను అనేక రెట్లు పెంచుతుందన్న నగ్న సత్యాన్ని గుర్తించకపోతే అది ప్రభుత్వానికే శాపమై మెడకు చుట్టుకుంటుంది.

■ వి.ఎస్.ఆర్. నాయుడు
సీనియర్ కమ్యూనికేషన్ నిపుణుడు, రాజకీయ విశ్లేషకుడు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

నారిమన్ స్మృతి న్యాయనిష్ఠకు స్ఫూర్తి

పాతికేళ్ల నాటి మాట. 1999లో ఒక రోజు అప్పటి కేంద్ర హోంమంత్రి లాల్‌కృష్ణ అడ్వాణీ నుంచి సీనియర్ న్యాయవాది ఫాలి నారిమన్‌కు ఫోన్ వచ్చింది. 'రాజ్యసభకు మిమ్మల్ని నామినేట్ చేయాలనుకుంటున్నాము' అని అడ్వాణీ ఆయనకు చెప్పారు. 'నాకు ఇష్టం లేదు..' నారిమన్ అని జవాబిచ్చారు. 'నేను, వాజపేయి కలిసి నిర్ణయించాం. మీరు అంగీకరించాల్సిందే.. నేను ఇప్పుడే రాష్ట్రపతి వద్దకు వెళుతున్నాను' అని అడ్వాణీ చెప్పారు. అనేక ఒత్తిళ్ల మధ్య నారిమన్ అందుకు అంగీకరించారు. అంతకు ముందు ఆయనను అటార్నీ జనరల్‌గా నియమించాలని దేవెగౌడ, వాజపేయి అనుకున్నప్పటికీ నారిమన్ అందుకు నిరాకరించారు. తనకు ఒక పార్టీ మనిషిగా గుర్తింపు రాకూడదని ఆయన భావించడమే ఇందుకు కారణం.

నారిమన్‌ను రాజ్యసభ సభ్యుడుగా బీజేపీ ప్రభుత్వం నామినేట్ చేసినప్పటికీ అయన వాజపేయి ప్రభుత్వ విధానాలను విమర్శించకుండా ఉండలేదు. గుజరాత్ అల్లర్ల హింసాకాండను, ప్రజల మధ్య ద్వేషాన్ని రెచ్చగొట్టే రాజకీయాలను ఆయన తీవ్రంగా నిరసించారు. ప్రతిపక్ష నేత సోనియా గాంధీతో పాటు గుజరాత్‌కు వెళ్లి ప్రజల మధ్య శాంతి నెలకొనేలా చేయాలని మరో నామినేటెడ్ సభ్యుడు నానాజీ దేశ్‌ముఖ్ చేసిన సూచనను అమలు చేయాలని కోరారు. 1947లో కోల్‌కతా, నౌఖాలిలో అల్లర్లు జరిగినప్పుడు ప్రజల ప్రాణాలు కాపాడేందుకు మహాత్మాగాంధీ ముస్లింలీగ్ నాయకుడు సుహ్రావర్దీతో కలిసి అక్కడికి వెళ్ళిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గుజరాత్ అల్లర్లపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో విచారణ కమిషన్ నియమిస్తే దర్యాప్తు సరిగా జరుగుతుందని, ఈ కమిషన్‌కు విస్తృతాధికారాలు ఉంటాయని అడ్వాణీకి సభాముఖంగా నారిమన్ చెప్పారు. మోదీని కాపాడాలనే ఉద్దేశంతో ఉన్న అడ్వాణీ, నారిమన్ సూచనను పాటించలేదన్నది వేరే విషయం. 'అధికార దురహంకారంతో ఉన్న వారు తాము చేసేవన్నీ సరైనవని భావిస్తారు. కాని అది వాస్తవం కాదు' అని నారిమన్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. తమను బీజేపీ ప్రభుత్వమే నామినేట్ చేసిందని తెలిసినప్పటికీ నానాజీ దేశ్‌ముఖ్, నారిమన్ లాంటి ఉన్నత వ్యక్తిత్వం గల వ్యక్తులు ఎక్కడ ఉన్నా వాస్తవాలు చెప్పేందుకు వెనుకాడలేదు. అయినా వాజపేయి, అడ్వాణీ లాంటి నేతలు వారి పట్ల వ్యతిరేకత వ్యక్తం చేయలేదు. అది నాటి కాలం.

ఈ నెల 21న తన 93వ ఏట మరణించిన ఫాలీ నారిమన్ (1929–2024) సుదీర్ఘకాలం న్యాయవాద వృత్తిలో ఉన్నప్పటికీ ప్రజల హక్కుల గురించి పెద్దగా పోరాడిన వ్యక్తి కాకపోవచ్చు. భోపాల్ విషవాయు ఘటనకు కారణమైన యూనియన్ కార్బైడ్ తరఫున వాదించి ఉండవచ్చు. రాజకీయ పార్టీలు, పారిశ్రామికవేత్తలు అప్పగించిన పలు కేసులకు ప్రాతినిధ్యం వహించి ఉండవచ్చు. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ న్యాయకళాశాలలో చదువుకుని న్యాయవాద వృత్తి చేపట్టిన తొలితరం న్యాయవాదుల్లో నారిమన్ ఒకరు. వలసవాదం నుంచి భారతదేశాన్ని విముక్తం చేసి మనం రూపొందించుకున్న భారత రాజ్యాంగాన్ని చట్టాలకు, ప్రభుత్వ విధానాలకు అన్వయించేందుకు కృషి చేసిన న్యాయవాదుల్లో నారిమన్ ప్రముఖుడని ప్రముఖ న్యాయవాది ఇందిరా జై సింగ్ వ్యాఖ్యానించారు. తాను ప్రజల తరఫునా, ఆయన పరిశ్రమ తరఫునా వాదించినప్పటికీ తన క్లయింట్లు ఏది కోరుకుంటున్నారో అందుకు అనుగుణంగా నిర్దిష్టంగా, న్యాయసూత్రాలకు అనుగుణంగా వాదించి ఫలితాలను సాధించగల వృత్తి నైపుణ్యం ఆయనకు ఉండేదని ఆమె ప్రశంసించారు. న్యాయమూర్తిగా పనిచేసే అవకాశాలు కూడా కాదనుకుని జీవితాంతం న్యాయవాదిగానే ప్రాక్టీసు చేయడం ద్వారా ఆ వృత్తికి విలువ తీసుకువచ్చి తన తర్వాతి తరాల న్యాయవాదులను ప్రభావితం చేసిన వారిలో నారిమన్ ప్రథమ శ్రేణిలో ఉంటారనడంలో సందేహం లేదు.



నారిమన్ మరణించిన వేళ ఆయన సుదీర్ఘకాలం వాదించిన సుప్రీంకోర్టు నిష్పాక్షికంగా వ్యవహరిస్తోందా అన్న ప్రశ్నను వేసుకోవడం అవసరం. తమిళనాడులో ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి జిల్లా కలెక్టర్లకు మనీలాండరింగ్ చట్టం క్రింద సమన్లు జారీ చేసే అధికారం ఈడీకి ఉంటుందని సుప్రీంకోర్టు మంగళవారం తీర్పుచెప్పింది. ఏపీ, గుజరాత్‌తో సహా అన్ని రాష్ట్రాల్లో అక్రమ ఇసుక తవ్వకాలపై ఈడీ విచారించి అక్కడి కలెక్టర్లందరినీ కోర్టుకీడ్చాలని సుప్రీంకోర్టు చెప్పగలదా?



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

ఫ్రీ మార్కెట్‌ను నారిమన్ విశ్వసించినప్పటికీ కొన్ని విలువలకు కట్టుబడి ఉన్నారని ఆయన జీవితంలో అనేక ఉదంతాలు నిరూపిస్తాయి. ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ ఆయన తనకు ఇందిరాగాంధీ ప్రభుత్వం ఇచ్చిన అదనపు సొలిసిటర్ జనరల్ పదవికి రాజీనామా చేశారు. ప్రభుత్వం కేటాయించిన బంగళాను ఖాళీ చేయాల్సి రావడంతో ఆయనకు అద్దె ఇల్లు ఇచ్చేందుకు ఢిల్లీలో పలువురు నిరాకరించారు. 'ఈ దేశంలో రాజ్యాంగ నిర్వాహకులపైనే ఆధారపడలేం' అని ఆయన ఎమర్జెన్సీ గురించి రాశారు. మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, చివరకు భారత రాష్ట్రపతి మొదలైన రాజ్యాంగ నిర్వాహకులు కూడా రాజ్యాంగాన్ని పరిరక్షించలేకపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

'బిఫోర్ ద మెమోరీ ఫేడ్స్' (జ్ఞాపకాలు చెరిగిపోక ముందు) అన్న శీర్షికతో రాసిన తన ఆత్మకథలో నారిమన్ ఎమర్జెన్సీ సమయంలో తనకు ఎదురైన ఒక అనుభవాన్ని వివరించారు. అదనపు సొలిసిటర్ జనరల్‌గా రాజీనామా చేసిన తర్వాత విశాఖపట్టణంలో న్యాయవాదుల సదస్సుకు హాజరైనప్పుడు ఒక నిర్వాహకుడు ఆయన వద్దకు వచ్చి లా కాలేజీలో చదువుతున్న తన కుమారుడిని మీసా కింద అరెస్టు చేశారని ఆందోళనతో చెప్పారు. ఇందిరాగాంధీ 20 సూత్రాలకు మద్దతుగా మరుసటి రోజు ఊరేగింపు జరపాలని క్లాసులో లెక్చరర్ చెప్పడంతో ఆ విద్యార్థి లేచి నిలబడి క్లాసులు జరుగుతున్న సమయంలో ఊరేగింపులేమిటి? అని అడిగాడట. ఇది అతడికి, కొందరు తోటి విద్యార్థులకూ మధ్య వాదనకు దారితీసింది. ఈ విషయం బయటకు పొక్కడంతో దేశ భద్రతకు ఆ విద్యార్థి ముప్పుగా పరిణమించాడని జిల్లా మెజిస్ట్రేట్ నిర్ధారించడంతో పోలీసులు అర్ధరాత్రి వెళ్లి ఆ విద్యార్థిని అరెస్టు చేశారు. న్యాయవాదుల సదస్సుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణయ్యర్ కూడా హాజరు కావడం, కొంతమంది పెద్దలు కలుగ చేసుకోవడంతో అతడి నిర్బంధపు టుత్తర్వులు రద్దు అయ్యాయి. కాని అప్పటికే ఆ విద్యార్థిని పోలీసులు రాష్ట్రంలో ఏదో మారుమూల జైలుకు తరలించారు. ఎందరో ప్రయత్నించిన మీదట అరెస్టయిన మూడు వారాల తర్వాత ఆ విద్యార్థి విడుదలయ్యాడు!

ఈ విషయాన్ని ఉటంకిస్తూ మీసా వంటి దుర్మార్గపు చట్టాలు అమలు చేసేటప్పుడు అధికారులు బాధ్యతారహితంగా, నిర్విచక్షణగా వ్యవహరిస్తారని, కోర్టులు కూడా అనేక సందర్భాల్లో జోక్యం చేసుకోబోవని నారిమన్ లాంటి ప్రముఖ న్యాయవాదే వ్యాఖ్యానించారు. ఇవాళ దేశంలో ఇదే పరిస్థితి కనపడుతోంది. ఎమర్జెన్సీలోనే కాదు, గుజరాత్‌లో క్రైస్తవ మతస్థులపై దాడులు జరిగినప్పుడు నారిమన్ గుజరాత్ ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహించకుండా ఒక కేసు నుంచి తప్పుకున్నారు.

పలు రాష్ట్రాల ప్రభుత్వాధినేతలు నారిమన్ సలహాపై ఆధారపడేవారు. ఆలమట్టి కేసులో కర్ణాటక తరఫున నారిమన్, ఏపీ తరఫున గంగూలీ వాదించడం చూసినప్పుడు కళ్ల ముందు నదులు ప్రవహిస్తున్నట్లుండేది. నారిమన్ మూలంగా నీటిపారుదల రంగంలో కర్ణాటక అనేక ప్రయోజనాలు పొందింది.

భోపాల్ గ్యాస్ లీక్ కేసులో యూనియన్ కార్బైడ్‌కు ప్రాతినిధ్యం వహించినందుకు ఆయన పలు సందర్భాల్లో విచారం వ్యక్తం చేశారు. 'ఫాలీ టూ వాజ్ ఫాలిబుల్' (ఫాలీ నారిమన్ కూడా తప్పులు చేస్తాడు). 'ఇది నేను జీవితంలో చేసిన అతి పెద్ద తప్పు' అని ఆయన ఒక ఇంటర్వ్యూలో అన్నారు. 'ఎంత మంది న్యాయవాదులు తాము వృత్తి జీవితంలో చేసిన తప్పులు అంగీకరిస్తారు?' అని ఇందిరా జై సింగ్ ప్రశ్నించారు.

నారిమన్ మరణించిన వేళ ఆయన సుదీర్ఘ కాలం వాదించిన సుప్రీంకోర్టు నిష్పాక్షికంగా వ్యవహరిస్తోందా అన్న ప్రశ్నను వేసుకోవడం అవసరం. తమిళనాడులో ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి జిల్లా కలెక్టర్లకు మనీలాండరింగ్ చట్టం క్రింద సమన్లు జారీ చేసే అధికారం ఈడీకి ఉంటుందని సుప్రీంకోర్టు మంగళవారం తీర్పుచెప్పింది. దీనితో అన్ని రాష్ట్ర ప్రభుత్వాల మెడలు కేంద్రం చేతుల్లోకి చిక్కుకోకతప్పదు. ఆంధ్రప్రదేశ్‌లో వేల కోట్ల మేరకు అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు నివేదికలు అందినప్పటికీ అలాంటివేవీ జరగలేదని జిల్లా కలెక్టర్లందరూ ఒకే వివరణ ఇచ్చారని సుప్రీంకోర్టుకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నివేదించింది. గుజరాత్‌లో కూడా పెద్ద ఎత్తున అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని వార్తలు వస్తున్నాయి. ఏపీ, గుజరాత్‌తో సహా అన్ని రాష్ట్రాల్లో అక్రమ ఇసుక తవ్వకాలపై ఈడీ విచారించి అక్కడి కలెక్టర్లందరినీ కోర్టుకీడ్చాలని సుప్రీంకోర్టు చెప్పగలదా?


'భగవంతుడే సుప్రీంకోర్టును కాపాడాలి' అని దేశ సర్వోన్నత న్యాయస్థానంలో జరుగుతున్న పరిణామాలపై నారిమన్ ఒక పుస్తకం రాశారు. తాను వృద్ధుడవుతున్న కొద్దీ, భారత రాజ్యాంగాన్ని, దాని పీఠికలో చేర్చిన లౌకిక వాదాన్ని పరిరక్షించాల్సిన బాధ్యతను ఆయన అధికంగా గుర్తించారు. భారత రాజ్యాంగం ప్రతి ఒక వ్యక్తినీ దృష్టిలో ఉంచుకుని రూపొందించిందని, సమూహాన్ని దృష్టిలో పెట్టుకుని కాదనే విలువను ఆయన విశ్వసించారు. భారత దేశంలో లౌకికవాదం అంటే ఏమిటో స్పష్టత లేదని, న్యాయ వ్యవస్థ కూడా ఈ స్పష్టత నీయలేదని నారిమన్ మరో ప్రముఖ న్యాయవాది రాజీవ్ ధావన్‌తో కలిసి రాసిన ఒక వ్యాసంలో అన్నారు. మతాన్ని రాజకీయాల నుంచి దూరం చేయాల్సిన అవసరం గురించి ఆయన ప్రస్తావించారు. మైనారిటీలను పరిరక్షించడానికే కాదు, మెజారిటేరియనిజం దాడినుంచి సమాజాన్ని కాపాడేందుకూ సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు.

ఒక మత శిబిరంలో రాకాసి బల్లుల జనాభా పెరిగితే, అది మరో మత శిబిరంలో వాటి పెంపకానికి దారితీస్తుందని ఆయన తన ఆత్మకథలో ఆవేదన వ్యక్తం చేశారు. 'నేను ఒక మైనారిటీని అయినప్పటికీ లౌకిక భారతదేశంలోనే నాకు అన్ని అవకాశాలు లభించాయి. నేను లౌకిక భారతదేశంలోనే మరణించాలనుకున్నాను.' అని తన జీవిత చరిత్ర చివరి వాక్యంలో ఆయన అన్నారు. తాను ఎలాంటి భారత దేశంలో మరణించారో ఆయనకు అర్థమై ఉండొచ్చు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఆర్టికల్ 142 – రాజ్యాంగ మౌలికత

రాజ్యాంగ మౌలిక స్వరూపం అనే దాని మీద చాలా చర్చే జరిగింది. కేశవానంద భారతి-కేరళ ప్రభుత్వం(1973) కేసులో దీనిపై సుప్రీంకోర్టు స్పష్టతను ఇచ్చింది. జనహితం కోసం ప్రాథమిక హక్కులను సైతం సవరించే హక్కు పార్లమెంటుకు ఉన్నప్పటికీ రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మాత్రం అది హరించజాలదని 13 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలోని ఏడుగురు సభ్యుల మెజారిటీ ఇచ్చిన తీర్పు ఇప్పటికీ శిరోధార్యంగా ఉంది. అప్పటి కేరళ ప్రభుత్వం తెచ్చిన భూసంస్కరణల చట్టాన్ని కేశవానంద భారతి అనే భూస్వామి సవాలు చేశారు. ఆస్తి హక్కు ప్రాథమిక హక్కు కాబట్టి దానిని హరించే కేరళ ప్రభుత్వ చట్టం చెల్లదని ఆయన తరఫున సుప్రీంకోర్టులో కేసు దాఖలైంది. ఈ వాదనకు అనుకూలంగా, ప్రతికూలంగా అనేక అనుబంధ పిటిషన్లు దాఖలయ్యాయి.



చివరికి రాజ్యాంగ ఔన్నత్యాన్ని స్థిరపరుస్తూ పార్లమెంటుకు గల సవరణ అధికారాలను మాత్రం సుప్రీంకోర్టు ధ్రువపరిచింది. మనది రాజ్యాంగ ప్రాబల్య ప్రజాస్వామ్యమే గాని, పార్లమెంటు ప్రాబల్యమైనది కాదని నిపుణులు తేల్చారు.

జాతీయ న్యాయ నియామకాల కమిషన్ (ఎన్‌జెఎసి)ని నియమించిన రాజ్యాంగ సవరణను రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పులో సుప్రీం విస్తృత ధర్మాసనం దీనిని సందేహాతీతంగా చెప్పింది. రాజ్యాంగ ఔన్నత్యమంటే సుప్రీంకోర్టుకు ఉండే అనుల్లంఘనీయతే కదా! ఈ వాస్తవాన్ని గమనించకుండా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ వంటివారు కొలీజియం వివాదంలో సుప్రీంకోర్టును తృణీకరించి మాట్లాడారు. ఉన్నత న్యాయమూర్తుల నియామకంలో ప్రభుత్వానికి అధికారాలు కట్టబెడుతూ 2015లో పార్లమెంటు ఆమోదించిన ఎన్‌జెఎసి చట్టాన్ని (రాజ్యాంగం 99వ సవరణ) సుప్రీంకోర్టు అయిదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 4:1మెజారిటీ తీర్పుతో తోసిపుచ్చడాన్ని ధన్‌ఖడ్ తీవ్రంగా విమర్శించారు. ఇది పార్లమెంట్ అగ్రాధిపత్యాన్ని కాలరాయడమేనని అన్నారు. పార్లమెంటు సార్వభౌమాధికారం అనుల్లంఘనీయమైనదని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ మౌలిక స్వరూపం మీద కూడా పార్లమెంటువే సర్వాధికారాలన్నారు. అప్పటి కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు కూడా కొలీజియం వివాదంలో న్యాయవ్యవస్థ మీద అవాకులు చెవాకులు పేలారు.

న్యాయ వ్యవస్థను ఇతర పాలనా వ్యవస్థల నుంచి స్వతంత్రంగా ఉంచినప్పుడే ఈ దేశ పౌరుల హక్కుల పరిరక్షణ బాధ్యతను అది సక్రమంగా నిర్వర్తించగలుగుతుందని ఈ కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయపడింది. చండీగఢ్ మేయర్ కేసు చిన్నదే కావచ్చు.. కానీ ఆర్టికల్ 142 ద్వారా సుప్రీంకోర్టు పెద్ద కర్రనే ఉపయోగించింది. ఇటువంటి కుయుక్తుల ద్వారా ప్రజాస్వామ్యానికి ముంచుకు రాగల ముప్పును కోర్టు ముందుగా ఊహించింది అనాలి. అందుచేత ప్రజాస్వామ్య మౌలికత అయిన ఎన్నికల ప్రక్రియను కాపాడడం కూడా రాజ్యాంగ మౌలికతగా భావించాలి. అందుకు అత్యంత అరుదుగా సుప్రీంకోర్టు ఉపయోగించిన 142 అధికరణకు రాజ్యాంగ మౌలికతలో అంతర్భాగం కాగల గౌరవాన్ని ఎందుకు ఇవ్వకూడదు?

– జి. శ్రీరామమూర్తి, సీనియర్ జర్నలిస్ట్

చట్టబద్ధ ఎంఎస్‌పితోనే రైతులకు న్యాయం!

సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో 350కి పైగా రైతు సంఘాలకు చెందిన లక్షలాదిమంది రైతులు లోగడ ఉద్యమించారు. ఆ సందర్భంగా చలి, మండు టెండల దుష్ప్రభావంతో అనారోగ్యాల పాలై 750 మంది రైతులు చనిపోయినా, పట్టుదలతో శాంతియుతంగా ప్రభుత్వ కవ్వింపు చర్యలకు రెచ్చిపోకుండా 13 మాసాల పాటు చారిత్రాత్మక రైతు ఉద్యమాన్ని కొనసాగించారు. దరిమిలా, ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగ విరుద్ధంగా, అప్రజాస్వామికంగా తెచ్చిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలను ఉపసంహరించి, భారత రైతాంగానికి క్షమాపణ చెప్పి, త్వరలో రైతుల డిమాండ్లను సానుకూలంగా పరిష్కరించడానికి లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారు. కానీ దానిని అమలుచేయనందున రైతు సంఘాలు తిరిగి ఉద్యమబాట పట్టవలసి వచ్చింది.

రెండవ పర్యాయం సంయుక్త కిసాన్ మోర్చా (నాన్-పొలిటికల్), కిసాన్ మజ్దూర్ సంఘ్‌ల నాయకత్వంలో పంజాబ్ రైతులు చేపట్టిన 'కిసాన్ ఢిల్లీ మార్చ్'ని అడ్డుకోవడానికి కనీవినీ ఎరుగని రీతిలో కేంద్రం దమనకాండకు పాల్పడుతోంది. కొద్దిరోజుల క్రితమే ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త డా. ఎం.ఎస్. స్వామినాథన్‌కి 'భారతరత్న' పురస్కారాన్ని మోదీ ప్రభుత్వం ప్రదానం చేసింది. దశాబ్దాలుగా భారత రైతాంగం వెనుకబాటుతనానికి, ఆత్మహత్యల పరంపరకు అడ్డుకట్ట వేసి, రైతులు సమాజంలోని ఇతర వర్గాలవారితో పాటు ఆత్మగౌరవంతో జీవించడానికి వీలుగా స్వామినాథన్ కమిషన్ కొన్ని సిఫార్సులు చేసింది. రైతులు పండిస్తున్న పంటలకు సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయం (C2)నకు 50శాతం కలిపి చట్టబద్ధ కనీస మద్దతు ధర ఇవ్వాలని చేసిన సిఫార్సు అందులో ప్రధానమైనది. దీనిని అమలుచేస్తామని 2014 ఎన్నికల సందర్భంగా బీజేపీ ఎన్నికల ప్రణాళికలో పేర్కొనడమే కాక, ప్రధాన మంత్రి అభ్యర్థి నరేంద్ర మోదీ పలు బహిరంగ సభలలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారు. అనంతరం ఆ హామీని అమలుచేయడం సాధ్యం కాదని సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది మోదీ ప్రభుత్వం.

ఎంఎస్‌పి అంశాన్ని పరిశీలించడానికి 29మంది పేర్లతో రూపొందించిన కమిటీలో కేంద్ర ప్రభుత్వమే 25 పేర్లు నింపి, సంయుక్త కిసాన్ మోర్చా తరఫున కేవలం ముగ్గురి పేర్లు అవి కూడా తమకు ఆమోదయోగ్యమైన పేర్లను మాత్రమే చేర్చింది. దీంతో ఎస్‌కెయం పేర్లను పంపలేదు. ప్రభుత్వానికి అనుకూలమైన ఆర్థికవేత్తలతో C2+50శాతం డిమాండ్‌ను అమలు చేయాలంటే ఏటా 10లక్షల కోట్ల రూపాయలు కేంద్రం ఖర్చు చేయవలసి ఉంటుందంటూ విస్తృతంగా ప్రచారం చేస్తుండటం దురదృష్టకరం. కేంద్రం ఇప్పటివరకు రైతులు పంట పండించేందుకు నగదుగా చెల్లించవలసిన మొత్తానికి (A2 నకు) కుటుంబసభ్యుల శ్రమ విలువ (F.L.)కు 50శాతం కలిపి లెక్కించి ఎంఎస్‌పిని 22 పంటలకు ప్రకటిస్తున్నా, దానికి చట్టబద్ధత కల్పించలేదు. దీంతో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ) సేకరించినప్పుడు తప్ప రైతులకు ఎంఎస్‌పి లభించడం లేదు. ఇప్పటివరకు బియ్యం, గోధుమలను మాత్రమే పెద్ద ఎత్తున, అది కూడా పంజాబ్, హర్యానాలలో, కొద్ది మేరకు ఆంధ్రప్రదేశ్, యూపీ మున్నగు రాష్ట్రాలలో ఎంఎస్‌పి ధరలకు సేకరిస్తోంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొంతమేరకు పత్తి పంటను సేకరిస్తూ ఉంటుంది.


పండిన ఆహార పంటలలో కుటుంబ అవసరాలు పోగా, మిగిలిన భాగం మాత్రమే మార్కెట్‌లోకి అమ్మకానికి వస్తాయి. దేశం మొత్తం మీద 2400 రెగ్యులేటెడ్ మార్కెట్ యార్డులు, 4,800 సబ్ మార్కెట్ యార్డులు ఉన్నాయి. వీటిలో చాలా భాగం ఈ–నామ్‌తో అనుసంధానించబడి, ప్రతిరోజూ రైతు అమ్మిన పంట పరిమాణం, ధర నమోదవుతూ ఉంటాయి. ఎంఎస్‌పి రైతుకు లభించడం కోసం ప్రభుత్వమే కొనవలసిన అగత్యం లేదు. ఎంఎస్‌పికి, వ్యవసాయ మార్కెట్‌లో (AMC) రైతు అమ్మిన ధరకు మధ్య వున్న వ్యత్యాసాన్ని ధరల స్థిరీకరణ నిధి నుంచి రైతుకు అందిస్తే సరిపోతుంది. ఇప్పటికి ఉన్న గణాంకాల ప్రకారం చూస్తే A2+FL+50శాతం – ఎంఎస్‌పి రైతులకు అందించేందుకు రూ.50,000 కోట్లు అవసరమౌతుందని అంచనా. C2+50శాతం ఎంఎస్‌పి అందించాలంటే రూ.2.5 లక్షల కోట్ల రూపాయలు అవసరమౌతాయి. ఇందులో సింహభాగం కేంద్రం, కొంత భాగం రాష్ట్ర ప్రభుత్వాలు భరించే విధానం ఉంటే రైతుకు న్యాయం జరుగుతుంది.

ఇప్పటివరకు బియ్యం/గోధుమలు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజానీకానికి అందజేస్తున్నారు. వాటితో పాటుగా కొద్దిమేరకు పెసలు/మినుములు/కందిపప్పు లాంటి పప్పుధాన్యాలను కూడా అందజేయడం ప్రారంభిస్తే ప్రజలకు పోషక ఆహార లభ్యత స్థాయి పెరగడమేకాక, ఈ పంటల ఉత్పాదకత, ఉత్పత్తి పెరిగేందుకు, ఇతర దేశాల నుంచి దిగుమతులను తగ్గించేందుకు ఉపయోగపడుతుంది. లోగడే అరవింద్ సుబ్రమణియన్ కమిటీ టుబాకో బోర్డు నమూనాలో 'పప్పుధాన్యాల బోర్డు'ను ఏర్పాటు చేయడం అవసరమని సూచించినా మోదీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

ఇప్పటివరకు పంజాబ్, హర్యానా రాష్ట్రాలలో సేకరణకే ఎఫ్‌సిఐ అధిక ప్రాధాన్యత ఇస్తోంది. అలాకాకుండా మిగులు ఉత్పత్తి వున్న రాష్ట్రాలలో ఆయా పంటల పరిమాణాలను అనుసరించి, లభ్యమైన మేరకు సేకరణ చేసే విధానాన్ని అనుసరిస్తే దాని ప్రభావం ప్రైవేట్ అమ్మకాలపైన కూడా పడి, రైతులకు మెరుగైన ధరలు లభిస్తాయి. దేశం మొత్తం మీద దాదాపు 20,000 సంతలు/చిన్న మార్కెట్లు ఉన్నాయని, వాటన్నిటినీ గ్రామీణ మార్కెట్లుగా అభివృద్ధి చేసి ఈ–నామ్‌లకు అనుసంధానిస్తామని 2015లో నాటి కేంద్ర వ్యవసాయ మంత్రి రాధామోహన్ సింగ్ ప్రకటించినా, ఇప్పటివరకు పురోగతి లేదు. ఏటా జాతీయ రహదారుల అభివృద్ధికి దాదాపు లక్ష కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేస్తున్న మోదీ ప్రభుత్వం, ఈ చిన్న చిన్న మార్కెట్ల అభివృద్ధికి, కుంటినడకన నడుస్తూ వున్న ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తి చేయడానికి తగినంత నిధులను సమకూరిస్తే వ్యవసాయ రంగం, దానితోపాటు రైతులు, వ్యవసాయ కార్మికుల ఆదాయాలు కూడా మెరుగవుతాయి.

2022–23లో కమిషన్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్ (CACP) లెక్కల ప్రకారం C2+50% ఎంఎస్‌పి రూ.2,707, A2+FL+50% ఎంఎస్‌పి గ్రేడ్–A క్వింటాలుకు రూ.2,060/–లు అంటే క్వింటాలుకు రూ.647/–లు వ్యత్యాసం ఉంది. దేశంలో 1308 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, ఇందులో గృహావసరాలు పోగా దాదాపు 1000 లక్షల టన్నుల ధాన్యం అమ్మకమై ఉంటుంది అంటే దేశం మొత్తం మీద ధాన్యం పండించిన రైతులకు సుమారు రూ.64,000 కోట్లు నష్టం వాటిల్లింది.


కేంద్ర ప్రభుత్వం C2 +50 శాతం చొప్పున లెక్కించి, మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలి. సేకరణ విధానాన్ని సవరించి ఎక్కువ రాష్ట్రాలలో రైతులకు ఎంఎస్‌పి ధరలు లభించేలా కృషి జరగాలి. ఉద్యోగ, వ్యాపార వర్గాలతో పోలిస్తే వ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న సన్నకారు, చిన్న రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల జీవన స్థాయిలో మెరుగుదల కోసం కేంద్రం తప్పనిసరిగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సులన్నిటినీ అమలు చేయడం ఆయనకు అర్పించగలిగిన ఘనమైన నివాళి అవుతుంది.



ఈ విధంగా చూస్తే వివిధ పంటలకు C2 +50% ధర లభించకపోవడం వల్ల భారత రైతాంగానికి రెండున్నర లక్షల కోట్ల రూపాయల నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా. ప్రతి బడ్జెట్‌లోనూ ఇన్‌కంటాక్సు, ఎక్సైజ్, కస్టమ్స్ డ్యూటీలో పారిశ్రామిక, ధనిక వర్గాలకు ఇచ్చే రాయితీల వల్ల దాదాపు లక్ష కోట్ల రూపాయలపైన ప్రభుత్వానికి రావలసిన ఆదాయం తగ్గుతోంది. 14.5 కోట్ల రైతు కుటుంబాలు, అందులోనూ 86 శాతంగా ఉన్న సన్నకారు, చిన్న రైతులకు, కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు మేలు చేకూర్చడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ మాత్రం భారం వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాబట్టి మీనమేషాలు లెక్కించకుండా ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం C2 +50% చొప్పున లెక్కించి, మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలి. సేకరణ విధానాన్ని సవరించి ఎక్కువ రాష్ట్రాలలో రైతులకు ఎంఎస్‌పి ధరలు లభించేలా కృషి జరగాలి. ఉద్యోగ, వ్యాపార వర్గాలతో పోలిస్తే వ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న సన్నకారు, చిన్న రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల జీవన స్థాయిలో మెరుగుదల కోసం కేంద్రం తప్పనిసరిగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సులన్నిటినీ అమలు చేయడం ఆయనకు అర్పించగలిగిన ఘనమైన నివాళి అవుతుంది.

● వడ్డే శోభనాద్రీశ్వరరావు
మాజీ మంత్రి

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
బుధవారం 28 ఫిబ్రవరి 2024





జడ్పీ సీఈఓ జ్యోతిబసు

ఉమ్మడి కృష్ణా జిల్లాలో కొందరు ఉన్నతాధికారులు ఇంకా సొంత జిల్లాలోనే విధులు నిర్వహిస్తున్నారు. సొంత జిల్లాలో ఉన్న అధికారులను తక్షణం బదిలీ చేయాల్సిందిగా తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలున్నా ఉమ్మడి కృష్ణాజిల్లాలో అమలు కావటం లేదు. పైగా సొంత జిల్లా అధికారుల పేర్ల జాబితా నుంచి పలువురు పేర్లను తప్పించటం గమనార్హం. ప్రధానంగా జడ్పీ సీఈఓ జ్యోతిబసును ఇంకా సొంత జిల్లాలో కొనసాగించటం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.

ఎన్నికల సంఘాన్ని ఏమార్చి..

జడ్పీ సీఈఓ కొనసాగింపు

సొంత జిల్లాలో పనిచేస్తున్నా బదిలీ చేయని అధికారులు

- ఎన్నికల సంఘాన్ని తప్పుదారి పట్టిస్తూ.. బదిలీల జాబితా నుంచి పేరు తొలగింపు
- అధికార పార్టీ నేతల సేవలో తరిస్తున్న జడ్పీ సీఈఓ
- జడ్పీ చైర్‌పర్సన్ భర్త కార్యాలయంలో జడ్పీ ఉద్యోగులకు అనధికారిక విధులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణాజిల్లా గుడివాడ దగ్గర వెంట్రప్రగడలోని విఉజరంపాడుకు చెందిన జడ్పీ సీఈఓను కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం కృష్ణాజిల్లా యంత్రాంగం బదిలీ చేయాల్సి ఉండగా.. అతని పేరును బదిలీల నుంచి తప్పించింది. జడ్పీ సీఈఓగా వ్యవహరిస్తున్న జ్యోతిబసు అధికార పార్టీకి వీరవిధేయునిగా పనిచేస్తున్నారు. వైసీపీకి చెందిన జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక భర్త ప్రస్తుతం పెడన నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు.

అధికార పార్టీకి అనుకూలంగా జడ్పీ సీఈఓ నిర్ణయాలు

జడ్పీ చైర్‌పర్సన్ ఆదేశాల మేరకు జడ్పీ సీఈఓ ఇప్పటికే అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. జడ్పీ చైర్‌పర్సన్ సూచనలతో పెడన నియోజకవర్గంలోని పార్టీ కార్యాలయంలో అధికార పార్టీ నాయకులకు సేవలందించటానికి పది మంది జడ్పీ ఉద్యోగులను అనధికారికంగా నియమించారు. టీలు, ఫలహారాలు, స్వీట్లు, స్నాక్స్, భోజనాలు వంటివి జడ్పీ ఉద్యోగులే దగ్గరుండి మరీ చూసుకుంటున్నారు. అధికార పార్టీకి పక్షపాతిగా వ్యవహరిస్తున్న జడ్పీ సీఈఓ తీరు కారణంగా ఒక్క పెడన నియోజకవర్గమే కాదు.. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా అధికార పార్టీ నేతలకు అనుకూలంగా సేవలందించే పరిస్థితులు ఉంటాయి.

ఎన్నికల విధుల నుంచి తప్పుకునేందుకు కలెక్టర్‌పై ఒత్తిడి

ఇప్పటికే బదిలీల జాబితా నుంచి తన పేరును తొలగించుకోవటానికి అధికార పార్టీ పెద్దల ద్వారా కలెక్టర్ మీద ఒత్తిళ్లు తీసుకువచ్చారు. అధికార పార్టీతో ఉన్న అనుబంధం కారణంగా స్థానికంగా అధికారులు, ఉద్యోగులను కూడా బలవంతంగా పని చేయించే పరిస్థితులు ఉంటాయన్న అంశాన్ని జిల్లా యంత్రాంగం ఆలోచించటం లేదు. ఎన్నికల విధుల నుంచి తప్పించుకునేందుకు జడ్పీ సీఈఓ వేసిన ఎత్తుగడను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు తిప్పికొట్టారు. ఆయనకు ఎన్నికల డ్యూటీ వేశారు. కృష్ణా కలెక్టర్ రాజబాబు మాత్రం బదిలీల జాబితా నుంచి ఆయన పేరును తప్పించేశారు. అధికార పార్టీ అండదండలతో స్థానికంగా అధికారులు, ఉద్యోగులను ప్రభావితం చేసే పరిస్థితులు కనిపిస్తున్న నేపథ్యంలో, రాష్ట్ర ఎన్నికల జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి అయితే తప్పకుండా కనిపిస్తోంది.

విజయవాడ ఏ1 రైల్వేస్టేషన్ ఆధునీకరణ ఇంకెన్నాళ్లు?

దేశంలోనే రెండో అతిపెద్ద జంక్షన్ పట్ల పక్షపాతం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దేశంలోనే రెండో అతిపెద్ద రైల్వే జంక్షన్ అయిన విజయవాడ పట్ల రైల్వేబోర్డు ఇంకా పక్షపాతం చూపిస్తూనే ఉంది. దేశ వ్యాప్తంగా వందల సంఖ్యలో స్టేషన్లను రీ డెవలప్‌మెంట్ చేస్తున్నట్టు ప్రకటిస్తున్నారు కానీ, విజయవాడ ఏ1 రైల్వేస్టేషన్ పట్ల మాత్రం ఆ స్థాయి శ్రద్ధ తీసుకోవటం లేదు. ఇప్పటి వరకు విజయవాడ డివిజన్ పరిధిలో రెండు దశల్లో దాదాపుగా పాతిక స్టేషన్లను రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. దేశానికి భారీగా ఆదాయాన్ని సమకూరుస్తున్న విజయవాడ డివిజన్‌కు కనీస ప్రాధాన్యత కూడా ఇవ్వడం లేదు. ఇదే విషయాన్ని డీఆర్ఎంను అడిగితే.. విజయవాడ చాలాపెద్ద రైల్వే స్టేషన్ అని .. దీనికి భారీగా అంచనాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. విజయవాడ స్టేషన్ రీ డెవలప్‌మెంట్‌కు సంబంధించి ఇప్పటికిప్పుడు అంచనాలు తయారు చేయటం లేదు.

ఖర్చు తగ్గించుకునేందుకేనా?

విజయవాడ రైల్వేస్టేషన్‌ను గతంలో ప్రైవేటీకరించేందుకు నిర్ణయించారు. అవుట్‌రేట్‌గా ప్రైవేటు సంస్థల చేతిలో పెడదామని చూస్తే అది కాస్తా బెడిసి కొట్టింది. విజయవాడ ఏ1 రైల్వేస్టేషన్‌ను కమర్షియల్‌గా ఆదాయం రాబట్టుకునే విషయంలో రైల్వే ఉన్నతాధికారుల ఆలోచనలు కూడా భిన్నంగా ఉంటున్నాయి. ఈ రైల్వేస్టేషన్‌ను కేంద్రం 2025 నాటికి మానిటైజేషన్ జాబితాలో కూడా పెట్టిన సంగతి తెలిసిందే. ఎన్నికల తదనంతరం మళ్లీ ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తే మానిటైజేషన్ అంశాన్ని మళ్లీ తిరగదోడే అవకాశాలు ఉన్నాయని కొందరు రైల్వే అధికారులే ఆందోళన చెందుతున్నారు. విజయవాడ రైల్వే స్టేషన్‌ను రీ డెవలప్‌మెంట్ చేయాలంటే.. వందల కోట్ల రూపాయలు ఖర్చు చేయాలి. ఇంత ఖర్చు చేయాలంటే రైల్వే శాఖకు భారంగా మారుతుంది. కాబట్టి విజయవాడ ఏ1 రైల్వేస్టేషన్ విషయంలో రైల్వే బోర్డు సొంత ఖర్చును తగ్గించుకునే అంశంపై దృష్టి సారించినట్టుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ ప్రక్రియకు పటిష్ట ఏర్పాట్లు
» కలెక్టర్ ఢిల్లీరావు
- 6లో..



ఆయన పేరుకే ఎమ్మెల్యే.. కానీ రూ.3వేలు ఆదాయాన్ని కూడా వదలకుండా వసూలు చేయడంలో ఘనాపాటి. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న నియోజకవర్గంలో ట్రాక్టర్‌తో సొంత పొలం నుంచి మట్టి తోలుకున్నా 'మామూలు'గా రూ.3వేల నుంచి రూ.5వేలు వసూలు చేసిన ఘనుడు. ఆ తర్వాత కాలం కలిసొచ్చి మంత్రి అయ్యారు. గెలిచిన నియోజకవర్గంతోపాటు సొంత నియోజకవర్గంపైనా దృష్టి సారించారు. అక్కడ గ్రావెల్, బూడిద వ్యాపారం లాభసాటిగా ఉండటంతో ఏడాది కాలంగా అడ్డగోలుగా దోచేయడం ప్రారంభించారు. ఎన్నికల సమయం రావడంతో ఆయన సీటును మార్చారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి దోపిడీకి తెరదీశారు. ఎక్కువ సమయం లేకపోవడంతో రోజుకి ఒకటి రెండు కోట్ల రూపాయలు ఆర్జించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు.

మంత్రి గారా.. మజాకా!



నిన్న గ్రావెల్, బూడిద... నేడు ఇసుక దోపిడీ

నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉంటూ అక్రమం

- » రోజుకు ఇసుక ఆదాయం రూ.కోటిన్నర
- » 3వేల ఎకరాల జగనన్న కాలనీల్లో మెరక తోలాలట
- » దాని కోసం బుసక తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలట
- » జిల్లాస్థాయి అధికారిపై మంత్రి ఒత్తిడి

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : జగనన్న కాలనీల్లో మెరక పేరుతో రెండేళ్లుగా దోచుకుంటున్న వైసీపీ నేతలు కాలనీల్లో స్థలాలను లబ్ధిదారులకు కేటాయించేసినా ఇప్పటికీ మెరక పేరుతో దోపిడీ కొనసాగిస్తున్నారు. కృష్ణా జిల్లాలో 3వేల ఎకరాల్లో జగనన్న కాలనీలకు మెరక తోలాలని, దానికోసం బుసక తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలని జిల్లాస్థాయి అధికారిపై జిల్లాకు చెందిన మంత్రి తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ మంత్రి పెడన నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకుడికి వైసీపీ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని వైసీపీలోకి తీసుకొచ్చారు. ఆ నాయకుడి వద్ద మంత్రి భారీగా సొమ్ములు లాగేసినట్టు సమాచారం. కానీ జగన్ వద్ద ఈ మంత్రి పప్పులు ఉడకలేదు. సదరు నాయకుడికి టికెట్ దక్కలేదు. దీంతో ఆ నాయకుడి మంత్రిపై తన డబ్బుల కోసం ఒత్తిడి తీసుకురావడం మొదలుపెట్టారు. దీని నుంచి తప్పించుకునేందుకు సదరు నాయకుడికి బుసక తోలకం కాంట్రాక్టును ఇప్పించేందుకు మంత్రి మెరక.. బుసక తోలకాన్ని తెరపైకి తెచ్చి జిల్లాస్థాయి అధికారిపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తేవడం ప్రారంభించారు. ప్రస్తుతం మంత్రి ఇన్‌చార్జిగా ఉన్న నియోజకవర్గంతోపాటు పక్కనే ఉన్న మరో నియోజకవర్గంలోని ప్రాంతం నుంచి కూడా బుసక తోలకానికి అనుమతులు ఇవ్వాల్సిందిగా జిల్లా స్థాయి అధికారిపై ఒత్తిడి తెస్తుండటం గమనార్హం. మంత్రి తీరుపై పక్కనే ఉన్న నియోజకవర్గ ప్రజాప్రతినిధి గుర్రుగా ఉన్నట్టు సమాచారం.

రోజుకు రూ.కోటిన్నర ఇసుక దోపిడీ

ఉమ్మడి కృష్ణా జిల్లాలో 56 ఇసుక రీచ్‌లు ఉండగా ఎన్టీఆర్ జిల్లాలో 16 ఇసుక రీచ్‌లు ఉన్నాయి. వీటికి 2023 మేలో పర్యావరణ అనుమతులను రద్దు చేశారు. ఆ తర్వాత 9 రీచ్‌లకు పర్యావరణ అనుమతులు ఇచ్చారని అధికారులు చెబుతున్నారు. అయితే కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు లేవు. వాస్తవానికి ఏ ఒక్క అనుమతి లేకున్నా రీచ్‌లలో తవ్వకాలు జరపకూడదు. కానీ కృష్ణా జిల్లా పరిధిలోని చోడవరం, మద్దూరు, రొయ్యూరు, లంకపల్లి, వల్లూరుపాలెం, శ్రీకాకుళం రీచ్‌ల్లో యథేచ్ఛగా తవ్వకాలు జరుగుతున్నాయి. ఇవన్నీ మంత్రి అనుచరుల ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి. రోజుకి అన్ని రీచ్‌ల నుంచి కలిపి నిత్యం 500 పైచిలుకు లారీల ఇసుక తరలిపోతోంది. ఒక్కో లారీలో సుమారు 30 టన్నుల ఇసుక లెక్క వేసుకున్నా రోజుకి 15,000 టన్నుల ఇసుకను తరలిస్తున్నారు. టన్ను వెయ్యి రూపాయల చొప్పున కోటిన్నర రూపాయల విలువైన ప్రజల సొమ్మును మంత్రి, ఆయన అనుచరులు కాజేస్తున్నారు.

ప్రస్తుతం మంత్రి ఇన్‌చార్జిగా ఉన్న నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఉమ్మడి కృష్ణా జిల్లాలోనూ ఎక్కడా లేనంత ఉంటుంది. దీంతో లే-అవుట్లు వేసే రియల్టర్ల నుంచి అపార్ట్‌మెంట్లు నిర్మించుకునే బిల్డర్ల నుంచి వసూళ్ల దందా నడిపేందుకు గతంలో ఎమ్మెల్యే చెంత ఉండి ఆయనకు అవి

రియల్ దోపిడీకి దళారి హనుమంతుడు

నీతి మరక అంటించిన హనుమంతుడిని మంత్రి దళారిగా నియమించుకున్నారు. ఎకరా లేఔట్‌కు రూ.10 లక్షలు, ఒక్కో ఫ్లాట్‌కు సక్రమ నిర్మాణం అయితే రూ.లక్ష, అక్రమ కట్టడమైతే ఫ్లాట్‌కు రూ.2 లక్షలు చొప్పున రేట్లు నిర్ణయించి మరీ వసూళ్లు చేస్తున్నారు.

రూ. 2 కోట్లు ఏడాదిలో స్వాహా



కాసులుంటేనే దుర్గగుడిలో ఏ పనైనా.. ప్రతి పనికీ ప్యాకేజీ

అధికారంలో ఉండగా నాలుగు రూపాయలు వెనకేసుకోవడం ప్రతిఒక్కరికీ మామూలే. అయితే దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం పాలకమండలిలోని ఓ కీలక వ్యక్తి నాలుగు రూపాయలు ఏం ఖర్మ ఏకంగా కోట్లాది రూపాయలే వెనకేసుకుంటున్నారు. అమ్మవారి సొమ్ము అనే భయం లేకుండా అడ్డగోలుగా దోచుకుంటున్నాడు. ఈ 'బాబు' దూకుడికి అటు అధికారులు బెంబేలెత్తుతుంటే ఇటు పాలకమండలి సభ్యులు తమ వాటా సొమ్మూ ఆయనే లాగేస్తున్నాడంటూ గగ్గోలుపెడుతున్నారు.

- ఆయన వచ్చారు.. దుర్గగుడిని వ్యాపార కేంద్రంగా మార్చేశారు
- ఎన్ఎంఆర్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని ఓ ప్యాకేజీ
- దసరా, భవానీ దీక్ష విరమణల్లో వ్యాపారులకు మరో ప్యాకేజీ

(విజయవాడ - ఆంధ్రజ్యోతి/వన్‌టౌన్) : దుర్గగుడికి ప్రతిరోజూ వస్తూ సేవకుడి మాదిరి క్యూలలో భక్తుల నియంత్రణ చేయడం చూస్తే బాబు ఎంత భక్తుడో అనుకుంటారు. తరచూ పలు విభాగాల్లో తనిఖీలంటూ వెళ్లి హడావిడి చేయడం చూస్తే బాబు ఎంత నిజాయితీపరుడో అని భ్రమపడతాం. బాబు వచ్చి ఏడాది అవుతున్నా ఇన్నిసార్లు తనిఖీలు నిర్వహించినా ఇంతవరకు ఆయా విభాగాల్లో చిన్న తప్పును కూడా బయట పెట్టలేదంటేనే బాబు తనిఖీల్లో మర్మం అర్థమవుతుంది. దేవస్థానం ఉద్యోగులపై వేధించడం, బెదిరించడం, తన మాట వినేలా చేసుకోవడం ఈ బాబు నైజం. పాలకమండలి కొలువుదీరి ఫిబ్రవరి 7వ తేదీకి ఏడాది పూర్తి అయింది. ఏడాది సమయంలోనే దుర్గగుడి ఆదాయం సుమారు రూ.2 కోట్లు పైచిలుకు బాబు స్వాహా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. పదవి కోసం సుమారు రూ.అరకోటి వరకు అప్పటి వైసీపీ ఎమ్మెల్యేకు సమర్పించుకున్న ఈ బాబు అంతకు నాలుగు రెట్లు సంపాదించుకోవాలన్న ఆత్రంలో ఉన్నారు.

● దర్శనాల్లో దందా

దర్శనాల పేరుతో తన అనుచరులను పెట్టుకుని దందా నడిపిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎవరైనా కుటుంబాలతో గ్రూపులుగా వచ్చినప్పుడు టికెట్ల పేరుతో డబ్బులు దండుకుంటున్నారు. వాస్తవంగా అంతరాలయ దర్శనానికి ఒక్కొక్కరికి రూ.500, ఆశీర్వచనానికి మరో రూ.500, హారతులు రూ.500 చొప్పున చెల్లించాల్సి ఉంది. కానీ టికెట్లు కొనకుండానే మనిషికి రూ.2వేలు వరకు వసూలు చేసి ఆ డబ్బులు జేబులో వేసుకుంటుండటం గమనార్హం. ఫలానా వ్యక్తి చెప్పాడంటూ ఆ వచ్చిన వారిని దర్శనాలకు అనుమతిస్తారు. ఇలా రద్దీ రోజుల్లో బాబుకి భారీగానే ఆదాయం సమకూరుతోంది.



● వ్యాపారులు, కాంట్రాక్టర్ల వద్ద పర్సంటేజీలు

సరుకుల కాంట్రాక్టర్ల వద్ద నుంచి పర్సంటేజీలు వసూలు చేస్తున్నారు. తనిఖీల్లో నాసిరకం వస్తువులు అని చెబుతూ కాంట్రాక్టర్‌ను బెదిరించి మరీ మామూళ్ల వసూలుకు తెర లేపారు. దసరా, భవానీ దీక్షా విరమణలు సమయంలో భక్తుల రాకపోకలకు ఆటంకం ఉంటుందన్న ఉద్దేశంతో షాపులను తొలగిస్తున్నారు. కానీ ఈయన వచ్చిన తర్వాత భక్తుల రాకపోకలకు ఆటంకాలు ఎదురైనా సరే షాపులను కొనసాగించి వ్యాపారాలు చేసుకోవడానికి అనుమతిచ్చారు. అలా అనుమతి ఇచ్చినందుకు వ్యాపారుల నుంచి భారీగానే సొమ్ము చేసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో షాపు నుంచి ఒక్కో విధంగా వారి వ్యాపారస్థితిని బట్టి డబ్బులు వసూలు చేశారు. కనకదుర్గానగర్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్న క్రమంలో అక్కడి షాపులను తొలగించడం ఖాయం. కానీ అక్కడ షాపులు వారికి వేరేచోట షాపులు కేటాయిస్తామంటూ వారితో బేరసారాలు సాగిస్తున్నారు. భారీ మొత్తంలో ముడుపులు బాబుకి ఇచ్చేలా ఒప్పందాలు జరిగినట్టు ఆలయ ఉద్యోగులే చెబుతున్నారు.

● తాత్కాలిక ఉద్యోగులనూ వదల్లేదు

దుర్గగుడిలో పనిచేసే ఎన్ఎంఆర్ ఉద్యోగులది ఎడతెగని కథ. వారిని పర్మినెంట్ చేయిస్తానని బాబు వారి వద్ద బేరసారాలు సాగిస్తున్నారు. అలాగే గతంలో చెప్పుల స్టాండ్‌ను దుర్గగుడి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆ సమయంలో రోజువారీ వేతనాలపై 12 మంది తాత్కాలిక ఉద్యోగులను తీసుకున్నారు. ఇటీవల చెప్పుల స్టాండ్‌ను ప్రైవేటు కాంట్రాక్టర్‌కు కట్టబెట్టారు. ఈ పరిస్థితుల్లో 12 మంది తాత్కాలిక ఉద్యోగులను వెనక్కి పంపేయాల్సి ఉంటుంది. కానీ వాళ్ల దగ్గర కూడా బాబు బేరసారాలు సాగిస్తున్నారు. మరో 2 నెలల్లో కొత్త ప్రభుత్వం వస్తే తన పదవికి ఎసరు వస్తుందన్న ఉద్దేశంతో ఈయన ఇటీవల వసూళ్ల దందాలో జోరు పెంచారని ఆలయ ఉద్యోగులు, పాలకమండలి సభ్యులు ఆరోపిస్తున్నారు.

- వివాహితపై సన్నిహితుడి దాడి
- కత్తితో నరికి... అదే ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య
- కొన ఊపిరితో ఉన్న మహిళ
- సన్నిహితుడి మృతి

పరిచయం... దారుణం...!



మాధురి (ఫైల్)



ఉరి వేసుకున్న నాని

విజయవాడ/సత్యనారాయణపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఆమె ప్రైవేటు స్కూల్‌లో ఉద్యోగి. అతడి పిల్లలు అదే స్కూల్‌లో విద్యాభ్యాసం చేస్తున్నారు. పిల్లలను స్కూల్‌కి తీసుకెళ్లే క్రమంలో ఇద్దరి మధ్య పరిచయం పెరిగింది. ఒకరి ఫోన్ నంబర్లు మరొకరు తీసుకుని మాట్లాడుకునే వరకు వెళ్లింది. ఉన్నట్టుండి ఆమె ఉంటున్న ప్రదేశం నుంచి కొత్త ప్రదేశానికి వెళ్లింది. ఆమె తనతో ఇంకా దూరం పెంచుకుంటుందని భావించి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన విజయవాడ సత్యనారాయణపురం శ్రీనగర్‌కాలనీలో మంగళవారం రాత్రి జరిగింది. గుడివాడకు చెందిన వక్కలగడ్డ మాధురి అక్కడున్న ఓ ప్రైవేటు స్కూల్‌లో పనిచేస్తోంది. ఆమె భర్త మరో ప్రైవేటు స్కూల్‌లో ఉద్యోగి. వారికి ఒక పాప, బాబు ఉన్నారు. గుడివాడకు చెందిన నాని అనే వ్యక్తికి ఇద్దరు పిల్లలు. మాధురి పనిచేసే స్కూల్‌లో విద్యాభ్యాసం చేస్తున్నారు. చేపల వ్యాపారం చేసుకునే నాని రోజూ పిల్లలను స్కూల్‌కి తీసుకెళ్లి దింపుతుంటాడు. ఈ క్రమంలో మాధురితో నానికి పరిచయం పెరిగింది. ఒకరి ఫోన్ నంబర్‌ను మరొకరు ఇచ్చిపుచ్చుకున్నారు. ఇద్దరూ ఫోన్లలో మాట్లాడు కుంటున్నారు. ఈ విషయం మాధురి భర్తకు తెలిసింది. పలుమార్లు హెచ్చరించినా ఆమె ప్రవర్తన మారకపోవడంతో విజయవాడ శ్రీనగర్ కాలనీలో జాగర్లమూడి వారి వీధిలో ఉంటున్న ఇంటికి పిల్లలతో సహా పంపించేశాడు. వారం రోజుల క్రితం మాధురి గుడివాడ నుంచి బీఆర్టీఎస్ రోడ్డులో ఉన్న బ్రాంచ్‌కు బదిలీపై వచ్చింది. శ్రీనగర్ కాలనీ నుంచి స్కూల్‌కి వెళ్లి వస్తోంది. పిల్లలను ఇదే స్కూల్‌లో చేర్పించింది. తల్లి కుందేటి కనకదుర్గతో కలిసి మాధురి జీవిస్తోంది. ఇక్కడికి వచ్చిన తర్వాత కూడా నానితో మాధురి ఫోన్‌లో సంభాషణలు చేసినట్టు తెలిసింది. ఈ సమయంలోనే తాను ఉంటున్న చిరునామాను నానికి చెప్పిందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇక గుడివాడకు వచ్చే అవకాశం లేదని మాధురి చెప్పడంతో నాని కొబ్బరిబొండాల కత్తి తీసుకుని జాగర్లమూడి వారి వీధిలోకి వచ్చాడు. తల్లి కనకదుర్గ ఇంట్లో లేకపోవడంతో మంగళవారం రాత్రి మాధురి, నాని కాసేపు మాట్లాడుకున్నారు. పిల్లలు ఇద్దరూ పక్క గదిలో ఉన్నారు. ఇద్దరూ మాట్లాడుకుంటుండగానే నాని ఆమెను మెడపై కత్తితో బలంగా నరికాడు. ఆమె రక్తపు మడుగులో పడిపోయిన తర్వాత అదే హాలులో చీరతో నాని ఉరిపోసుకున్నాడు. స్థానికులు గమనించి సత్యనారాయణపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పి.వెంకటనారాయణ వెంటనే తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. నాని అప్పటికే ప్రాణాలు కోల్పోయాడు. కొన ఊపిరితో రక్తపు మడుగులో ఉన్న మాధురిని పోలీసు జీపులో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసును సత్యనారాయణపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చీరల లెక్క పక్కా

● వీఐపీ దర్శనాల్లో చీరల లెక్కలు చూపాల్సిందే

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రొటోకాల్ కేటగిరీలో వచ్చిన భక్తులు అమ్మవారికి ఇచ్చే చీరలు లెక్క పక్కాగా ఉండాల్సిందేనని అధికారులు నిర్ణయించారు. అమ్మవారికి అలంకారంలో ఉన్న చీరను ఇచ్చిన భక్తుల పేర్లు నంబరు బోర్డుపై కచ్చితంగా ఉండాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రొటోకాల్ కేటగిరీలో దర్శనాలకు వెళ్తున్న భక్తులు సమర్పించే చీరలను ధర్మకర్తల మండలిలోని ఓ కీలక వ్యక్తి పక్కదారి పట్టిస్తున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి ఆంధ్రజ్యోతిలో 'దుర్గగుడిలో దోపిడీ' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై ఆలయ అధికారులు స్పందించారు. ప్రొటోకాల్ కేటగిరీలో దర్శనాలకు వస్తున్న భక్తులు సమర్పించే చీరలకు కౌంటర్‌లో కచ్చితంగా నంబరు ఇవ్వాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. భక్తులు ఏ రోజున ఆ చీరను అమ్మవారికి అలంకరించాలని చెప్పారో ఆ రోజున సంబంధిత భక్తుల సీరియల్ నంబర్‌ను పలకపై రాయాలని చెప్పారు. ప్రొటోకాల్‌లో వచ్చే భక్తుల వెంట ధర్మకర్తల మండలి సభ్యులున్నా, ఆలయ సిబ్బంది ఉన్నా కచ్చితంగా చీర మాత్రం కౌంటర్‌లోకి వెళ్లాలని స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● చీర ఎవరిచ్చారు?

అమ్మవారికి మంగళవారం రూ.10వేల విలువ చేసే చీరను అలంకరించారు. ఇది సమర్పించిన భక్తుల పేరు మాత్రం లేదు. దీనిపై ప్రధాన ఆలయం అధికారి పురోహితులను వివరణ అడిగారు. ఓ అధికారి ఈ చీరను ఇచ్చినట్టు వారు తెలిపారు. వారి పేర్లు రికార్డులో ఎందుకు లేదని ప్రశ్నించారు. చీరలు సమర్పించిన భక్తుల వివరాలను కచ్చితంగా తెలియజేయాల్సిందేనని అధికారి స్పష్టం చేశారు.


ఆంజనేయస్వామి విగ్రహాన్ని పరిశీలిస్తున్న ఈవో రామారావు తదితరులు

దక్షిణముఖ ఆంజనేయ, వినాయక
ఆలయాల పునఃప్రతిష్ఠకు సిద్ధం


దక్షిణముఖ ఆంజనేయస్వామి ఆలయం

వన్‌టౌన్, ఫిబ్రవరి 27 : 2016 పుష్కరాల సమయంలో భక్తుల, వాహన రాకపోకలు, రోడ్డు విస్తరణ కోసం తొలగించిన సీతమ్మవారి పాదాల వద్ద ఉన్న దక్షిణముఖ ఆంజనేయ స్వామి ఆలయాన్ని ఈ నెల 29వ తేదీన పునఃప్రారంభించనున్నారు. ఈ ఆలయం చాలా పురాతనమైనదని, దక్షిణ ముఖ ఆంజనేయస్వామి ఇక్కడ మాత్రమే భక్తుల నుంచి విశేషపూజలు అందుకుంటున్నారు. పుష్కరాల సమయంలో తొలగించిన ఆలయాన్ని దేవదాయశాఖ కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) నుంచి రూ.13లక్షల వ్యయంతో పునర్నిర్మించారు. గురువారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదే క్రమంలో దుర్గ గుడి పాతమెట్ల మార్గం వద్ద ఉన్న వినాయకుడి ఆలయం కూడా ఆధునీకరించి స్వామివారి పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి అధికారులు సిద్ధం చేస్తున్నారు. మంగళవారం ఆలయ స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, ముఖ్య అర్చకుడు యజ్ఞనారాయణ తదితర వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య పూజాదికాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో కేఎస్ రామారావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, దేవదాయశాఖ సహాయ


పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేద పండితులు, అర్చకులు

వైభవంగా ముగిసిన తిరుపతమ్మ పెద్ద తిరునాళ్ల

పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్లు మంగళవారం పూర్ణాహుతితో ముగిసాయి. వేద పండితులు శివరాంభొట్ల ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో ప్రధానార్చకులు మర్రి బోయిన గోపీబాబు వేదమంత్రోచ్చరణల మధ్య పూర్ణాహుతి నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఏఇవో తిరులేశ్వరరావు, అమ్మవారి వంశీకులు, ధర్మకర్తలు, దీక్షా గురుస్వాములు తదితరులు పాల్గొన్నారు.

కానుకల కోసం కీచులాట.. ముగ్గురు అర్చకులపై వేటు


క్యూలైన్‌లో ఘర్షణ పడుతున్న అర్చకులు

పెద్ద తిరునాళ్ల ముగింపు సందర్భంగా మంగళవారం పూర్ణాహుతి వద్ద దీక్షాస్వాములు సమర్పించిన కానుకలు పంచుకునే విషయంలో ఇద్దరు అర్చకులు భక్తుల సమక్షంలోనే దుర్భాష లాడుకోవటం, ఆ దృశ్యాన్ని భక్తులు తమ సెల్‌ఫోన్‌లో వీడియో తీసి వైరల్ చేయటంతో దేవస్థానం అధికారులు స్పందించారు. దేవస్థానం పరువు తీసేలా వ్యవహరించటం తీవ్ర చర్చనీయాంశమైంది. ఉపప్రధానార్చకుడు మర్రి బోయిన ద్వారకారావు, అర్చకుడు సూరిబాబు, తాత్కాలిక అర్చకుడు గుని శెట్టి కాసులను విధుల నుంచి సస్పెండ్ చేస్తు ఇవో కే.రమేష్‌నాయుడు ఉత్తర్వులు ఇచ్చారు.


ధ్వంసం చేసిన జెండాదిమ్మె వద్ద కార్యకర్తలతో ఎస్సై చర్చలు

జనసేన జెండా దిమ్మె ధ్వంసం

- తక్షణమే పునర్నిర్మించిన జనసైనికులు

పామర్రు, ఫిబ్రవరి 27 : పట్టణంలో ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించనున్న విద్యాదీవెన వేదిక సమీపంలో ఉన్న జనసేన జెండాదిమ్మెను సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న జనసేన నేతలు బండ్రెడ్డి రామకృష్ణ, తాడిశెట్టి నరేశ్ కార్యకర్తలతో అక్కడకు చేరుకుని కొద్దిసేపు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సీఎం పర్యటన నేపథ్యంలో జెండా దిమ్మెను కావాలనే వైసీపీ నేతల ప్రోద్బలంతో ధ్వంసం చేశారని ఆరోపించారు. టీడీపీ, జనసేన కలయికతో ఓటమి భయంతోనే ఇలాంటి విధ్వంసాలకు పాల్పడుతున్నారన్నారు. జనసైనికులతో ఎస్సై పి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి చర్చలు జరిపారు. అనంతరం యుద్ధప్రాతిపదికన జెండాదిమ్మెను పునర్నిర్మాణం చేశారు. అనంతరం ఏఎస్సై రాజ్‌కుమార్ నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు.

పామర్రులో సీఎం పర్యటన వాయిదా..

పట్టణంలో ఈనెల 29న ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రారంభించ వలసి ఉన్న జగనన్న విద్యాదీవెన కార్యక్రమ సభ అనివార్య కారణాలతో వాయిదా పడినట్టు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి మార్చి ఒకటోతేదీన జరుగుతుందని సూచన ప్రాయంగా వెల్లడించారు.

కూల్చివేతల ప్రభుత్వాన్ని ప్రజలే కూల్చేస్తారు : వర్ల



తాడంకి(పమిడిముక్కల) : కూల్చివేతల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో కూల్చివేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జనసేన, టీడీపీ నాయకులు అన్నారు. పామర్రులో జనసేన జెండా దిమ్మె ధ్వంసంపై తాడంకిలో మంగళవారం నిరసన వ్యక్తంచేసి ఎమ్మెల్యే కైలే అనిల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన పేరుతో చెట్లను నరికి వేయడం, పార్టీ జెండా స్థూపాలను కూల్చేస్తూ విధ్వంసాలకు పాల్పడటాన్ని సహించేది లేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వర్ల కుమార్ రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర పార్టీల జెండా దిమ్మెలు కూల్చడం అప్రజాస్వామికమని జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ అన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి : జేసీ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 27 : బాల్య వివాహాల వల్ల అనర్థాలను ప్రజలకు వివరిస్తూ సమష్టి కృషితో వాటిని అరికట్టాలని కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. మంగళవారం జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో బాల్య వివాహాల వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన సదస్సు జరిగింది. సదస్సుకు జేసీ గీతాంజలి శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. జిల్లాలో ఇంకా బాల్య వివాహాలు జరగడం దురదృష్టకరమన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ, బాల్య వివాహాలు జరిపితే చట్ట రీత్యా చర్యలు తీసుకోకతప్పదన్నారు. సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ సువర్ణ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ సువార్త, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, దిశ సిబ్బంది, ఎంఈవోలు పాల్గొన్నారు.


ఎంఈవోకు స్వాగతం పలుకుతూ వేసిన ముగ్గులు, పాఠశాల ప్రవేశ ద్వారం వద్ద అరటి చెట్లు, తోరణాలు, రంగుల కాగితాలతో డెకరేషన్

అయ్యోరి మెనూ.. అధ్యాపకుల జేబుకు చిల్లు!

- తోరణాలు, ముగ్గుతో అలంకరణలు
- కదిలివస్తున్న కార్యాలయ సిబ్బంది
- మెనూలో కోరిన నాన్ వెజ్ ఉండాల్సిందే
- పాఠశాల తనిఖీల్లో ఎంఈవో తీరు
- వణికిపోతున్న ప్రధానోపాధ్యాయులు

సాధారణంగా పాఠశాల తనిఖీల్లో అధికారులు టీచర్ల విద్యాబోధన, పిల్లలకు అందుతున్న భోజనం, స్కూల్‌లో వసతి ఏర్పాట్లు పరిశీలించాల్సి ఉంటుంది.. అందుకు భిన్నంగా గుడివాడలో ఓ ఎంఈవో తన సొంత మెనూతో ఉపాధ్యాయులకు చెమటలు పట్టిస్తున్నారు. ఆయన వస్తున్నారంటే.. ఉదయం టిఫిన్ నుంచి సాయంత్రం స్నాక్స్ వరకు అన్నింటిని సిద్ధంగా ఉంచాలి.. పాఠశాలలో పండుగ వాతావరణాన్ని సృష్టించాలి.. తోరణాలతో అందంగా అలంకరించాలి.. ముగ్గులు వేయాలి.. ఎంచుకున్న హోటల్ నుంచి భోజనం రావాలి.. మెనూలో తప్పనిసరిగా మటన్, చికెన్, రొయ్యలు, అపోలో ఫిష్ ఉండాల్సిందే అని టీచర్లు వాపోతున్నారు.

గుడివాడ, ఫిబ్రవరి 27 : మండల విద్యాశాఖాధికారి తనిఖీ లీలలు గుడివాడలో విస్తుగొల్పుతున్నాయి. వెళ్లిన చోట తప్పనిసరిగా పేర్కొన్న నియామాలను పాటించాలి.. ముందుగా చెప్పిన మెనూ సిద్ధంగా ఉంచాలి. తనిఖీలకు ఒకరు లేదా ఇద్దరు వెళ్లడం ఆనవాయితీ. ఇక్కడ మధ్యాహ్న భోజనాలకు కార్యాలయం యావత్తు కదిలి వెళుతుండటంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖర్చుకు భయపడిపోతున్నారు. ఎంఈవో తీరుతో ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారు.

జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు మండల విద్యాశాఖాధికారులు పాఠశాలల తనిఖీలు చేపట్టారు. దీనికోసం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. నియోజకవర్గంలోని ఒక ఎంఈవో వ్యవహరిస్తున్న తీరుతో ఉపాధ్యాయులు నోరెళ్లపెడుతున్నారు. ప్రతిరోజు పాఠశాల తనిఖీలకు బయలుదేరే ముందురోజే కార్యాలయం నుంచి ప్రధానోపాధ్యాయునికి సందేశం పంపుతారు. ఉదయం టిఫిన్ నుంచి సాయంత్రం స్నాక్స్ వరకు అన్నింటిని సిద్ధంగా ఉంచాలి. పాఠశాలలో పండుగ వాతావరణాన్ని సృష్టించాలి. తప్పనిసరిగా తోరణాలు, కొబ్బరిమట్టలతో అందంగా అలంకరించాలి. రంగుల ముగ్గులు వేయాల్సిందే. ఎంచుకున్న హోటల్ నుంచి మాత్రమే భోజనం రావాలి. మెనూలో తప్పనిసరిగా మటన్, చికెన్, రొయ్యలు, అపోలో ఫిష్ ఉండాల్సిందే. కార్యాలయ సిబ్బంది అందరికి భోజన సదుపాయం ఏర్పాటు చేయాల్సిందే. వెళ్లేటప్పుడు అధికారులను సంతోషపెట్టడం తప్పనిసరి.

ప్రధానోపాధ్యాయుల వణుకు..

ఇప్పటికే పాఠశాల నిర్వహణకు అవసరమయ్యే సాధారణ సామగ్రిని కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదు. ఈ క్రమంలో కనీసం చాక్‌పీస్‌లు కొనుక్కోవాలన్నా సొంతగా ఖర్చు పెట్టాల్సిందే. పాఠశాల రికార్డులు, జిరాక్స్ కాపీ, స్వాతంత్ర్య దినోత్సవ, గణతంత్ర దినోత్సవం, పాఠశాల వార్షికోత్సవాలు వగైరా వంటి ఖర్చులు అదనం. తనిఖీలకు వస్తే స్వాగత పుష్పగుచ్ఛాల నుంచి అధికారులతో పాటు కార్యాలయం మొత్తానికి భోజన వసతి వరకు వేల రూపాయలు ఖర్చు అవుతోంది. దీంతో ఖర్చులో రెండింతలను ప్రధానోపాధ్యాయులు, ఒక వంతు ఉపాధ్యాయులు భరించాల్సిన అవశ్యకత ఏర్పడింది. దీంతో అదనపు ఖర్చుకు ఉపాధ్యాయులు భయపడిపోతున్నారు.

పిల్లల మధ్యాహ్న భోజనం పట్టదు..

ఎక్కడైనా అధికారులు పాఠశాల తనిఖీలకు వెళితే తప్పనిసరిగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తారు. ఈ అయ్యవార్లు మాత్రం దీనికి భిన్నంగా ప్రవర్తిస్తారు. మధ్యాహ్న భోజన పరిశీలన మాత్రం చేయరు.

స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ ప్రక్రియకు పటిష్ట ఏర్పాట్లు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు


స్ట్రాంగ్ రూం ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, తదితరులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 27 : భారత ఎన్నికల కమిషన్ ఆదేశాలను తు.చ తప్పక పాటిస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పేర్కొన్నారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలు పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం మండలం జూపూడిలోని నిమ్రా, నోవా ఇంజనీరింగ్ కళాశాల భవనాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్‌లు, కౌటింగ్ కేంద్రాలను మంగళవారం ఆయన, సీపీ కాంతిరాణా, జేసీ పి.సంపత్‌కుమార్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విజయవాడ సెంట్రల్, పశ్చిమ, తిరువూరు, నందిగామ, నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు నోవా కళాశాల.. జగ్గయ్యపేట, విజయవాడ తూర్పు, మైలవరం నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు నిమ్రా కళాశాలను ప్రతిపాదించినట్టు ఆయన తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం కట్టుదిట్టమైన భద్రతతో ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు చేర్చి భద్రపరచడం, వాటిని కౌంటింగ్ కేంద్రాలకు చేర్చడం, కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు అనువుగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఒక్కొక్క నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ కేంద్రం లే అవుట్ ప్రకారం 28 టేబుల్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఇక్కడ అన్ని రకాల వసతులు కల్పిస్తామన్నారు. నిరంతరం సీసీ కెమేరాల నిఘాతో పాటు ప్రత్యేక సాయుధ బలగాల ప్రహారా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎస్.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్‌డీవో బీహెచ్ భవానీశంకర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి.వెంకటేశ్వర్లు, రెవెన్యూ, పోలీస్ పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

జగన్ వ్యాఖ్యలు మానసిక వైకల్యానికి నిదర్శనం

- వెనిగండ్ల రాము



గుడివాడ రూరల్, ఫిబ్రవరి 27 : కుప్పం సభలో టీడీపీ అధినేత చంద్రబాబును ఉద్దేశించి సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలు ఆయన మానసిక వైకల్యానికి నిదర్శమని గుడివాడ నియోజకవర్గ టీడీపీ, జనసేన అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం గుడివాడ రూరల్ మండలంలో బిళ్లపాడులో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, రాము కలిసి 'బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన మినీ మ్యానిఫెస్టో కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, ప్రజలు వైసీపీకి చరమగీతం పాడబోతున్నారని తెలిసి జగన్ నిస్సిగ్గుగా అబద్దాలు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.


పార్థసారథికి స్వాగతం పలుకుతున్న బాపులపాడు టీడీపీ నాయకులు

వైసీపీది స్ఫూర్తి రహిత పాలన : సారథి

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 27 : రాష్ట్రంలో పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వ విధానంలో స్ఫూర్తి కొరవడిందని నూజివీడు టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్థసారథి విమర్శించారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన తరువాత నూజివీడు నియోజకవర్గ అభ్యర్థిగా పేరు ఖరారు కావడంతో మొదటిసారి ఆయన మంగళవారం హనుమాన్‌జంక్షన్ మీదుగా నూజివీడు వెళ్లారు. ముందుగా స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలక మండలి చైర్మన్ నెరుసు నాగబూషణం, ఈవో కె.శ్రీనివాస్ ఆలయ మర్యాదలతో సత్కరించగా.. బాపులపాడు, పెదపాడు, నూజివీడు మండల టీడీపీ నేతలు సారథికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం చెప్పే ప్రతి విషయం స్ఫూర్తి రహితంగా ఉంటుందన్నారు. క్రికెట్ రంజీ ఆటగాడు ఆనంద్ విహారి వైసీపీ నేతను విమర్శించాడన్న అక్కసుతో అతడ్ని కెప్టెన్సీ నుంచి తొలగించడం దుర్మార్గమన్నారు. సామాజిక న్యాయంలో కేవలం ఉపన్యాసం కోసం ఎవరో స్క్రిప్టు రాసిస్తే చదవడం తప్ప కార్యక్రమంలో స్ఫూర్తి ఉండదని విమర్శించారు. అందుకే దుర్మార్గ పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడానికి ప్రజలంతా కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. ఈరోజు చంద్రబాబు, పవన్ కల్యాణ్ నాయకత్వాన్ని బలపరచడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు. పట్టణ అధ్యక్షుడు అట్లూరిశ్రీనివాసరావు, నూజివీడు నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే టీడీపీ ఎజెండా : యార్లగడ్డ



గుణదల, ఫిబ్రవరి 27 : పేదల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా టీడీపీ, జనసేన మ్యానిఫెస్టోకు ప్రజల నుంచి మంచి ఆదరణ వస్తోందని గన్నవరం నియోజకర్గ టీడీపీ, జనసేన అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్న సంకల్పంతో యార్లగడ్డ వెంకట్రావు ప్రసాదంపాడులోని పార్టీ కార్యాలయంలో రెండు రోజులుగా యాగం చేస్తున్నామన్నారు. మొదటగా మహాసుదర్శన అష్టద్రవ్య అభిషేకం, అష్ట లక్ష్మీనారాయణ హృదయ హోమం, త్రిలోక్య మోహనగౌరి పుష్పార్చన పూజలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ.. ఎన్నికల వేళ వైసీపీ ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రయోజనం లేదన్నారు. ఎన్ని హామీలు ఇచ్చినా.. పథకాలు ప్రవేశపెడతామని చెప్పినా.. రాష్ట్ర ప్రజలు వైసీపీని నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఎటువంటి దుష్టశక్తులు అడ్డుపడకుండా ఉండాలని.. చంద్రబాబును మరోమారు ముఖ్యమంత్రిగా చూడాలన్న ఆకాంక్షతో యాగం చేయిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గూడవల్లి నరసయ్య, గొడ్డళ్ల చినరామారావు, అద్దేపల్లి సాంబు, బొప్పన హరికృష్ణ, కోనేరు సందీప్, శుభాషిణి, పట్టపు చంటి, తాతినేని రవికుమార్, కొల్లా ఆనంద్ కుమార్, అట్లూరి శ్రీనివాసరావు, దయాల రాజేశ్వరరావు, వేగిరెడ్డి పాపారావు, గుజ్జర్ల బాబూరావు, పరుచూరి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి!

- జగనన్న కాలనీ పేరుతో స్థలం కాజేసే కుట్ర
- విలేకరుల ఎదుట బాధితుల ఆవేదన


విలేకరులకు వివరాలు చెబుతున్న మహిళ

బంటుమిల్లి, ఫిబ్రవరి 27: బంటుమిల్లి జగనన్న కాలనీ సమీపంలో 13 సెంట్ల ఇళ్ల స్థలం కావాలంటూ వైసీపీ, రెవెన్యూ అధికారులు ఒత్తిడి చేస్తున్నారంటూ శ్రీకాకుళపు బేబి సరోజిని కుటంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల క్రితం శ్రీకాకుళపు గురునాథంకు తండ్రి నుంచి 13 సెంట్ల స్థలం వారసత్వంగా వచ్చింది. అతడికి నలుగురు కుమార్తెలు. పసుపు కుంకుమ నిమిత్తం నలుగురు పిల్లలకు భూమిని పంచారు. గత కొద్ది రోజులుగా జగనన్న కాలనీ పేరుతో పేదలకు ఇచ్చేందుకుగాను 13 సెంట్లు తమకు కావాలంటూ రెవెన్యూ అధికారులు, వైసీపీ నాయకులు ఒత్తిడి తెస్తున్నారని ఆ కుటుంబసభ్యులు ఆరోపించారు. ఎక్స్‌కవేటర్‌తో నేల చదును చేస్తామని, అడ్డు వస్తే తొక్కించేస్తామని భయబ్రాంతులకు గురి చేస్తున్నారని శ్రీకాకుళపు బేబిసరోజిని కుటంబసభ్యులు పేర్కొన్నారు. ఒక్కో ఆడపిల్లకు సెంటున్నర స్థలం, రూ. 4.5 లక్షల నగదు ఇస్తామని, ఇందుకు ఇష్టపడకపోతే మొత్తం తీసుకుంటామని రెవెన్యూ అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నట్టు కన్నీటి పర్యంతమయ్యారు. మాకు ఈ స్థలం తప్ప ఇతర మరే ఆస్తులు లేవని ఇళ్లలో పాచి పనులు చేసి బతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్యలే తమకు శరణ్యమని పురుగుల మందు, పెట్రోల్ పోసుకుని చనిపోయేందుకు కూడా సిద్ధమని స్థలం వద్ద తమ ఆవేదన వ్యక్త పరిచారు. ఈ సందర్భంలో వారికి అండగా ఉంటామని, న్యాయం జరిగే వరకు పోరాడదామని టీడీపీ, జనసేన నాయకులు భరోసా ఇచ్చారు.


మచిలీపట్నంలో పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులు

ప్రశాంతంగా టెట్

- ఐదు పరీక్షా కేంద్రాల్లో 91.25 శాతం హాజరు
- అమ్మఒడి హాజరుపై ప్రశ్న

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 27 : ఏపీ టెట్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 3615 మంది అభ్యర్థులకు 3299 మంది హాజరయ్యారు. 91.25 శాతం హాజరు నమోదైంది. ఉదయం 1637 మంది, మధ్యాహ్నం 1662 మంది హాజరయ్యారు. విద్యాశాఖ కమిషనర్ సురేశ్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా, డైట్ ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణలు కానూరు అయాన్ డిజిటల్ జోన్, కానూరు శైలేష్ ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ కేంద్రాలను సందర్శించారు. మచిలీపట్నం ఎస్వీహెచ్ డీఎంఎస్ ఇంజనీరింగ్ కళాశాలను ఏడీ మనోహర్ నాయక్, ఎంఈవో దుర్గా ప్రసాద్‌లు సందర్శించారు.

ప్రశ్నాపత్రంలో అమ్మఒడి!

టెట్ 150 మార్కుల ప్రశ్నాపత్రం ఆబ్జెక్టివ్ విధానంలో ఇవ్వగా ఉదయం 9.30 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. ప్రశ్నాపత్రంలో అమ్మఒడికి సంబంధించి విద్యార్థులకు పథకం వర్తించేందుకు హాజరుశాతం ఎంత ఉండాలనే ప్రశ్న ఇచ్చారు.


మాట్లాడుతున్న వెలుగు పీడీ శివరామప్రసాద్

సీఎం సభకు 84 బస్సుల్లో జనాన్ని తీసుకురావాలి

- వెలుగు పీడీ శివరామప్రసాద్ ఆదేశాలు

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 27 : ఈ నెల 29న పామర్రులో జరగనున్న సీఎం జగన్ విద్యాదీవెన కార్యక్రమానికి మండలం నుంచి 84 బస్సుల్లో జనాన్ని తరలించాలని, ఒక్కో బస్సులో 50 మందికి తగ్గకుండా ఉండాలని వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ శివరామప్రసాద్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జనం తరలింపుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. డ్వాక్రా మహిళలందరిని సభకు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్ రెడ్డి, సర్పంచ్ పెనుముత్స రాధిక, మండల వెలుగు ఏపీఎం జికృష్ణంరాజు, కంకిపాడు ఏరియా కో-ఆర్డినేటర్ రంగారావు, ఈవోపీఆర్డీ నవరత్నం, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు డి.హిమకుమారి, కార్యదర్శి జి గౌతమి, ఉపాధిహామి ఎఫ్ఎలు, వివోఏలు పాల్గొన్నారు.


విన్నర్‌గా నిలిచిన సీఆర్ రెడ్డి కళాశాల జట్టు

సెంట్రల్‌జోన్ క్రికెట్ కప్ విజేత సీఆర్ రెడ్డి కళాశాల

కంచికచర్ల: జేఎన్‌టీయూ కాకినాడ సెంట్రల్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ కప్‌ను ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాల జట్టు కైవశం చేసుకుంది. స్థానిక మిక్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిసాయి. ఫైనల్ పోటీలో టాస్ గెలిచిన వీఆర్ సిద్ధార్థ విజయవాడ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. సీఆర్ రెడ్డి కళాశాల జట్టు నిర్ణీత 20ఓవర్లలో ఆరువికెట్లు కోల్పోయి 122 పరుగులు సాధించింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన వీఆర్ సిద్ధార్థ జట్టు 20 ఓవర్లలో పది వికెట్లు కోల్పోయి వంద పరుగులు మాత్రమే చేసింది. జేఎన్‌టీయూకే ఐసీటీ కార్యదర్శి డాక్టర్ జీపీ రాజు విజేతలకు బహుమతులు అందజేశారు.


వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్

యువత సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికి శిక్షణ

- రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్

వన్‌టౌన్, ఫిబ్రవరి 27: పారిశ్రామిక అవసరాలకనుగుణంగా యువతకు సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు శిక్షణ ఇవ్వనున్నట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. బందర్‌రోడ్డులోని ఓ హోటల్‌లో మంగళవారం స్కిల్ ఏ థాన్ పై ఏపీఎస్ఎస్‌డీసీ పై వెబ్‌సైట్ ఆవిష్కరణ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన వెబ్‌సైట్ ఆవిష్కరణతో పాటు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎడ్యుటెక్ కంపెనీ గువి భాగస్వామ్యంతో సాంకేతిక కోర్సులను ఆన్‌లైన్ ద్వారా అందించనున్నట్టు తెలిపారు. ఉచిత ఆన్‌లైన్ కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీఎస్‌సీహెచ్‌ఈ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ, సీఈవో డాక్టర్ వినోద్‌కుమార్, సీజీఎం (సాంకేతికత) డాక్టర్ రవి కె.గుజ్జుల, గువీ సీవోవో అనిత, సహ వ్యవస్థాపకుడు ఎస్.బాలమురుగన్, ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సి.నాగరాణి, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెయినింగ్ డైరెక్టర్ బి.భవ్య ఎస్ఎసీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ కె.దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)



బ్రాయిలర్ బర్డ్	154, 163, 174
చికెన్ విత్ స్కిన్	298
చికెన్ స్కిన్‌లెస్	306

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

వృద్ధాశ్రమంలో అన్నదానం



వన్‌టౌన్, ఫిబ్రవరి 27: మైత్రీ లోటస్ వాకర్స్ అసోసియేషన్ మంగళవారం సింగ్‌నగర్ వాంబేకాలనీ సమీపంలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఫౌండర్ జమలయ్య, రవిశంకర్, అధ్యక్షుడు ప్రసాదరావు, సెక్రటరీ రామకృష్ణ, కోశాధికారి నాగేశ్వరరావు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం సభకు రైతులందరూ తరలిరావాలి : ఆళ్ల

వన్‌టౌన్, ఫిబ్రవరి 27: తాడేపల్లిగూడెంలో బుధవారం జరగనున్న టీడీపీ-జనసేన భారీ బహిరంగ సభకు పెద్దసంఖ్యలో రైతులందరూ తరలిరావాలని తాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర నాయకుడు ఆళ్ల వెంకటగోపాల కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని రాష్ట్ర సమాఖ్య కార్యాలయం నుంచి ఆయన ఈ మేరకు ప్రకటన విడుదల చేస్తూ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత జలవనరుల రంగం నిర్వీర్యమైందన్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు గాడిలో పడాలన్నా, పోలవరం పూర్తి కావాలన్నా రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడాల్సిన అవశ్యకత ఉందన్నారు. 13 జిల్లాల్లోని సాగునీటి సంఘాల ప్రతినిధులు, రైతులు భారీ సంఖ్యలో పాల్గొనాలన్నారు.



మంతెన రామారాజుతో ఎంఎస్ బేగ్

● తాడేపల్లిగూడెంలో బుధవారం జరగనున్న టీడీపీ-జనసేన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఉండి ఎమ్మెల్యే మంతెన రామారాజు, తాడేపల్లిగూడెం సభ ఉండి నియోజకవర్గం పరిశీలకుడు, విజయవాడ పశ్చిమ టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్‌లు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబు రానున్న ఎన్నికల సందర్భంగా ఈ సభ నుంచి రాష్ట్ర ప్రజలకు ఒక మహత్తర సందేశాన్ని అందించనున్నారని, ఈ సభను విజయవంతం చేయాలని కోరారు.

జగన్‌ను గద్దె దింపండి

తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



జనసేన నాయకులతో సమావేశమైన గద్దె రామ్మోహన్

రాణిగారితోట, ఫిబ్రవరి 27: విధ్వంసం, అరాచక పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన రెడ్డిని ఇంటికి పంపి, సంక్షేమం, అభివృద్ధి, చక్కటి పాలన అందించే టీడీపీ- జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. మంగళవారం 20, 21, 22 డివిజన్లకు చెందిన జనసేన పార్టీ నాయకుల ఇళ్లకు వెళ్లి మద్దతు కోరారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుంటూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమం పథకాలను అందించేందుకు చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ ఉమ్మడిగా ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని, జగన్‌మోహన్‌రెడ్డిని గద్దె దింపి ప్రజలకు చక్కని పాలన అందించేందమే వారి లక్ష్యమని తెలిపారు. అందులో భాగంగా తూర్పు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన విజయానికి ప్రతి టీడీపీ- జనసేన కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో టీడీపీ- జనసేన అభ్యర్థుల విజయం తథ్యమని, గద్దెను తాము స్వాగతిస్తున్నమని తెలిపారు. మూడో సారి పోటీ చేస్తున్న గద్దెకు హ్యాట్రిక్‌తో పాటు అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని అన్నారు. జనసేన 20వ డివిజన్ అధ్యక్షుడు జి.జయకుమార్, గంగిరెడ్డి శ్రీను, ముళ్లపూడి నాగేశ్వరరావు, కాజా భాయ్, పోతిరెడ్డి రమణ, తోట శ్రీను, బుల్లెట్ శివ, నడికొప్పుల రవి, బి.స్వామి, టీడీపీ నాయకులు మోటేపల్లి చిన్నా, వేములపల్లి రంగారావు, అన్నారావు, శ్రీనివాస్, నామేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సాయిబాబు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం సభతో సైకో పాలనకు చెక్

జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేశ్



ప్రచార కార్యక్రమంలో స్థానికులతో మాట్లాడుతున్న పోతిన మహేశ్

వన్‌టౌన్, ఫిబ్రవరి 27: తాడేపల్లిగూడెంలో జరగనున్న టీడీపీ-జనసేన భారీ బహిరంగ సభతో సైకో పాలనకు చెక్ పడుతుందని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి, పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేశ్ పేర్కొన్నారు. 39వ డివిజన్‌లో మంగళవారం ఇంటింటికీ రాబోయే జనసేన-టీడీపీ కార్యక్రమంలో ఆయన స్థానికులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమలో స్వయంగా సీఎం జగన్ పోటీ చేసినా సరే డిపాజిట్లు దక్కవని స్పష్టం చేశారు. టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి 25వేల ఓట్ల మెజారిటీతో భారీ విజయం సాధిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. డివిజన్ జనసేన అధ్యక్షుడు సాయి శరత్, డివిజన్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో లొల్లా వారి వీధి, శంకా వారి వీధి తదితర వీధుల్లో ప్రతి ఇంటికి వెళ్లి ఈ రాష్ట్రానికి పట్టిన దరిద్రం పోవాలంటే వైసీపీని ఇంటికి పంపించాలని ఆయన కోరారు. తాడేపల్లిగూడెం సభను విజయవంతం చేయడానికి ప్రచార ఆటోలను కూడా ఏర్పాటు చేశామని, బుధవారం ఉదయం 9 గంటల కల్లా సితార సెంటర్ వద్దకు ప్రతి ఒక్కరు రావాలని తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు



వన్‌టౌన్, ఫిబ్రవరి 27: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాగాంధీ మునిసిపల్ హైస్కూల్‌లో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్, ఈఎస్‌ఐ విజయవాడ, ఆంధ్రా ఆసుపత్రిలు సమన్వయంతో నిర్వహించిన ఈ క్యాంప్‌లో 400 మంది పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. వైద్యులు బి.జ్యోతి, కె.నారాయణరావు, గౌతమి, ప్రవీణ్‌కుమార్, సునీత, శ్యామల, సుప్రియ, ప్రసన్న కుమార్, నిఖిల్, శరత్, అనూషలు వివిధ విభాగాలలో వైద్య సేవలందించారు. మెడికల్ సర్వీసెస్ విజయవాడ డైరెక్టర్ డి.ఆంజనేయులు, నగరపాలక సంస్థ మేనేజర్ బి.శ్రీనివాస్, ఆప్కాస్ జీఎం నాగప్రసాద్, ఎస్.వీఎస్ చలం, గోపి పాల్గొన్నారు.

టీడీపీ- జనసేన సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుందాం

● జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ



టిఫిన్ బండిని, తోపుడు బండిని పంపిణీ చేస్తున్న గద్దె అనురాధ

భారతీనగర్, ఫిబ్రవరి 27: రాష్ట్రంలో మద్యం నిషేధం చేస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా తీసుకుని పాలన సాగిస్తున్నారని కృష్ణాజిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ విమర్శించారు. తూర్పు పరిధిలోని ఏపీఐఐసీ కాలనీలోని రైతు బజార్ ఏరియా ప్రాంతంలో మంగళవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆమె ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుచేసే సంక్షేమ కార్యక్రమాలను వివరించి కరపత్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కొనుగోలు చేసిన టిఫిన్ బండిని డివిజన్‌లోని ఆకుల సత్యవతికి, తోపుడు బండిని పట్టెం వెంకట నరసమ్మకు అనురాధ అందజేశారు. ఈ సందర్భంగా గద్దె అనురాధ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సంక్షేమ పాలన తెచ్చుకునేందుకు టీడీపీ- జనసేన సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుందామన్నారు. డివిజన్ పార్టీ అధ్యక్షుడు గొల్లపూడి నాగేశ్వరరావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గద్దె రామ్మోహన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, వెంకటరమణ, అమ్మిరెడ్డి గోపాల్, జాస్తి సురేష్, కోడూరు ఆంజనేయవాసు, నన్నపనేని నరసింహారావు, అబ్దుల్ మతీత్, గొట్టిపాటి బాబు, మాదాల చిన్నతల్లి, చలసాని రోజా, రత్నశ్రీ, పాల్గొన్నారు.

సురభి కల్చరల్ ఫెస్ట్‌లో నలంద విద్యార్థుల ప్రతిభ



గవర్నర్‌పేట, ఫిబ్రవరి 27: కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన సురభి ఇంటర్నేషనల్ కల్చరల్ ఫెస్ట్‌లో అత్యంత ప్రతిభ చాటి బహుమతులు సాధించిన నలంద విద్యానికేతన్ విద్యార్థులకు మంగళవారం నలంద స్కూల్ ప్రాంగణంలో అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నలంద విద్యానికేతన్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ మాట్లాడుతూ వెస్ట్రన్ గ్రూప్ మ్యూజిక్ జూనియర్ విభాగం నుంచి తమ విద్యార్థులు ప్రథమ బహుమతిగా రూ. 5 వేలు గెలుచుకున్నారని తెలిపారు. బాటెల్ ఆఫ్ బాండ్ జూనియర్ విభాగంలో 6, 7 తరగతులకు చెందిన విద్యార్థుల టీమ్ తృతీయ బహుమతి కింద రూ. 5 వేలు సాధించారని తెలిపారు. సోలో పెర్కషన్ (సంగీత వాయిద్యం) పోటీకి 6వ తరగతి విద్యార్థి పి. రేహన్‌నాగ్ ప్రథమ బహుమతి సాధించారని పేర్కొన్నారు. సింగింగ్ జోడి సీనియర్ విభాగం నుంచి తృతీయ బహుమతిని గెలుచుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన సౌమ్యరూప్ ముఖర్జీకి, విజేతలకు అభినందనలు తెలిపారు.

ప్రాంగణ ఎంపికల్లో నలంద విద్యార్థులకు ఉద్యోగాలు

లబ్బీపేట: కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో పలువురు విద్యార్థులు ఉద్యోగార్హత సాధించినట్లు నలంద కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ తెలిపారు. మంగళవారం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరిగాయని, హైదారాబాద్ నుంచి వచ్చిన సంస్థ హెచ్‌ఆర్ ప్రతినిధులు సేల్స్ అండ్ డిస్ట్రిబ్యూషన్ టీమ్ లీడర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. మరికొన్ని కంపెనీలు ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తాయని తెలిపారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.చంద్రగిరి, టెక్నికల్ హెడ్ యు.తిరుపతిరావు, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్ డిపార్ట్‌మెంట్ సభ్యులు పాల్గొన్నారు.

కేఎస్ వాస్ మృతి చిత్ర కళారంగానికి తీరని లోటు



మాట్లాడుతున్న సాయిబాబు

సత్యనారాయణపురం, ఫిబ్రవరి 27: ప్రముఖ చిత్రకారుడు ఆంధ్రా అకాడమీ ఆర్ట్స్ ఉపాధ్యక్షుడు కేఎస్ వాస్ (77) మృతి చిత్రకళారంగానికి తీరని లోటని ఆంధ్రా అకాడమీ ఆర్ట్స్ కార్యదర్శి ఎం.వీ సాయిబబాబు అన్నారు. ముత్యాలంపాడులోని ఎంఎస్ మూర్తి కళా ఆర్ట్స్ గ్యాలరీలో మంగళవారం ఆంధ్రా అకాడమీ ఆర్ట్స్ ఆధ్వర్యంలో చిత్రకారుడు కేఎస్ వాస్ సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎస్ వాస్ చిత్రకళ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించారని కొనియాడారు. నేడు భౌతికంగా మన మధ్య లేకున్నప్పటికి ఆయన అందించిన సేవలు ప్రతీ ఒక్కరి మనస్సులో ఎన్నటికీ నిలిచే ఉంటాయన్నారు. చిత్రకారులు మల్లిక్, దుర్గా ప్రసాదరావు, రమేష్, సునీల్, వెంకటేష్, వరి తదితరులు పాల్గొని వాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

రసాయన, జీవరసాయన విధానాలపై నేడు, రేపు సమావేశం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ కల్పన తదితరులు

లబ్బీపేట, ఫిబ్రవరి 27: ఆధునిక వ్యాధులకు వ్యతిరేకంగా, లక్ష్యాల అభివృద్ధి కోసం రసాయన, జీవరసాయన విధానాలపై ఈ నెల 28, 29 తేదీల్లో రెండు రోజుల అంతర్జాతీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తెలిపారు. కళాశాలలో బుధవారం సమావేశం బ్రోచర్‌ను కళాశాల డైరెక్టర్ టి.విజయలక్ష్మితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల జీవ రసాయన శాస్త్రం, రసాయన శాస్త్రం విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా కృష్ణాయూనివర్సిటీ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ అండ్ డీన్ డాక్టర్ డి.రామశేఖర రెడ్డి, ప్రధాన వక్తగా యూకేకు చెందిన బయో ఫార్మ్ క్లినికల్ సర్వీస్ డైరెక్టర్ డాక్టర్ సేతురామ్ కావేరిలు పాల్గొంటారని తెలిపారు. సిద్ధార్థ అకాడమి ప్రెసిడెంట్ సి.నాగేశ్వరరావు, సెక్రటరీ పి.లక్ష్మణరావు, జాయింట్ సెక్రటరీ ఎన్.లలిత ప్రసాద్, ట్రెజరర్ ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. కళాశాల అధ్యాపకులు ఎ.హారిక, ఎం.సుభాషిణి, ఎ.పల్లవి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భారతీనగర్, ఫిబ్రవరి 27 : రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలోని విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వహక ఇంజనీర్ పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరనగర్ (1,2,3) రోడ్లు, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, స్పెన్సర్ సర్వీస్ రోడ్డు, సెంటినీ హాస్పిటల్ ఏరియా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

కొణిజేటి రమేష్‌కు సత్కారం



వన్‌టౌన్, ఫిబ్రవరి 27: ఇటీవల టీడీపీలో చేరిన ప్రముఖ వ్యాపారి కొణిజేటి రమేష్‌కు పలువురు అభినందనలు తెలిపారు. దుశ్శాలువా కప్పి అభినందించారు.. ఈ క్రమంలో మంగళవారం ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన సమితి ఆయనకు అభినందనలు తెలిపి సత్కరించింది. నాయకులు వేములూరి సత్యనారాయణ, గురునాథం, కనిగిచర్ల ప్రసాద్, సముద్రాల నాగేశ్వరరావులు ఆయనను సత్కరించిన వారిలో ఉన్నారు.

మొబైల్ కోర్టులో 11 కేసులపై విచారణ



పటమట, ఫిబ్రవరి 27 : ప్రతి మంగళవారం జరిగే మొబైల్ కోర్టులో భాగంగా సర్కిల్-3 పరిధిలో కోర్టు న్యాయమూర్తి బి. విజయ్ కుమార్ రెడ్డి మొబైల్ కోర్టు నిర్వహించారు. కార్పొరేషన్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నమోదు చేసిన 11 కేసులపై విచారణ జరిపి రూ.6,150లు జరిమానా విధించారు. జోనల్ కమిషనర్-3 డి. వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ హెల్త్ ఆఫీసర్-3 డాక్టర్ సిహెచ్ బాబు శ్రీనివాస్, శానిటరీ సూపర్‌వైజర్-3 డి. సోమరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు

సీపీఎం పక్ష పార్టీలను గెలిపించండి

● సీపీఎం జన శంఖారావంలో బాబూరావు

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 27: వైఎస్ జగన్ పాలన రాష్ట్ర ప్రజలకు గుదిబండగా మారిందని, ఈ ప్రభుత్వం గద్దె దిగే సమయం ఆసన్నమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. సీపీఎం నిర్వహిస్తున్న జన శంఖారావం కార్యక్రమంలో భాగంగా మంగళవారం 24వ డివిజన్లలోని మైసూర్ కేఫ్ సెంటర్, సీతారామపురం, కస్తూరిబాయిపేట, గిరిపురం ప్రాంతాల్లో ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటూ ప్రచారం నిర్వహించారు. రెడ్ సర్కిల్ సెంటర్‌లో బెల్లపు శోభనాద్రి విగ్రహానికి, శిఖామణి సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్-బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేసి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ, వైఎస్ జగన్ పాలనలో పెద్దలే బాగుపడ్డారని, పేదలు మరిన్ని కష్టాలు పడుతున్నారని అన్నారు. ప్రజా కంటకంగా ఉన్న బీజేపీ, దాన్ని సమర్థించే పార్టీలను, వైసీపీని ఓడించాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సీపీఎం పక్ష పార్టీలను గెలిపించాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, కె. శ్రీదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, కృష్ణ, భూపతి, రమణ, కె. దుర్గారావు, బి. సత్తిబాబు, టి. ప్రవీణ్, నగర కమిటీ సభ్యులు వై. సుబ్బారావు, కాజ సరోజ, చింత శ్రీనివాస్, ఈవీ నారాయణ, ఝాన్సీ, చిన్నారావు, ఎస్‌కె పీరు, ఎం. బాబూరావు, సీపీఐ నాయకుడు రాము పాల్గొన్నారు.

ఉమ్మడి చంటి సేవా తత్పరత

వన్‌టౌన్, ఫిబ్రవరి 27: కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి వద్ద తెనాలికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి నడవలేని స్థితిలో పడి ఉన్న సమాచారాన్ని తెలుసుకున్న 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు ఆ వ్యక్తిని బందరురోడ్డులోని నిర్మల్ హృదయ్ భవన్‌లో చేర్పించారు. రామకృష్ణకు చెందిన బంధువులు గాని లేదా ఆ వ్యక్తి గురించిన సమాచారం కానీ తెలిసినట్లయితే నిర్మల్ హృదయ్ భవన్‌లో సంప్రదించాలన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
బుధవారం • 28 ఫిబ్రవరి 2024
cinema@andhrajyothy.com



జక్కన కోసం జేమ్స్ కామెరూన్?





షూటింగ్‌కు డేట్ ఖాయం కాలేదు, సినిమాకు పేరు ఖరారు కాలేదు, తారాగణం ఎవరనేది తేలనేలేదు అయినా నిత్యం ఏదో ఒక చర్చతో వార్తల్లో నిలుస్తోంది మహేశ్‌బాబు-రాజమౌళి సినిమా. ఈ చిత్రానికి 'ఎస్ఎస్ఎంబీ 29' అనేది అనధికారికంగా ప్రచారంలో ఉన్న వర్కింగ్ టైటిల్. ఈ సినిమా గురించి అడపా దడపా కథకులు విజయేంద్ర ప్రసాద్ చూచాయగా చెప్పిన విషయాలను బట్టి ఇదొక అడ్వంచరస్ యాక్షన్ డ్రామా అని తెలవడం తప్ప మరేదీ బయటకు రాలేదు. గుప్పిట మూసి ఉన్నంతవరకే గుట్టు అన్నట్లు రాజమౌళి కూడా ఈ సినిమా విషయంలో గుంభనంగా ఉంటున్నారు. కానీ కొంతమంది ఔత్సాహికులు మాత్రం ఏదో ఒక విషయంతో ఈ సినిమాను ప్రతి రోజూ చర్చనీయాంశం చేస్తున్నారు. ఈ సినిమా గురించి సోషల్ మీడియాలో, సినీ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతున్న కొన్ని విషయాలు ఆసక్తికరంగా ఉన్నాయి. మేకింగ్‌లోనే కాదు సినిమాకు ప్రచారం తేవడంలోనూ రాజమౌళి సిద్ధహస్తుడు. సినిమాకు మంచి హైప్ తేవడం కోసం జాతీయ మీడియాను ఆయన ఆహ్వానించనున్నారని చెబుతున్నారు. ఆ పాత్రికేయ సమావేశంలోనే సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించాలని రాజమౌళి భావిస్తున్నారనేది సారాంశం. ఇక ఈ మధ్యన సోషల్ మీడియాలో బాగా హల్‌చల్ చేస్తున్న విషయం ఈ సినిమా ప్రారంభోత్సవం గురించే. హాలీవుడ్ స్టార్ డైరెక్టర్ జేమ్స్ కామెరూన్‌తో రాజమౌళి క్లాప్ కొట్టించేబోతున్నారట. ఆస్కార్ సహా పలు వేదికలపై 'ఆర్ఆర్ఆర్' చిత్రం గురించి మాట్లాడుతూ రాజమౌళి దర్శకత్వ ప్రతిభను కామెరూన్ కొనియాడారు. ఈ నేపథ్యం వల్లనే కామెరూన్ వస్తాడా అనే సంశయం ఉన్నా తేలిగ్గా తీసివేయలేకపోతున్నారు. ఇక ఇటీవలే 'గుంటూరు కారం' చిత్రంతో అభిమానులను అలరించారు మహేశ్‌బాబు. ప్రస్తుతం రాజమౌళి చిత్రం కోసం ఆయన సన్నాహాలు మొదలుపెట్టారు. ఇందులో మహేశ్‌ను సరికొత్త లుక్‌లో చూపించబోతున్నారని తెలుస్తోంది. ఆ లుక్ బయటకు రాకుండా ఉండేందుకు మహేశ్ ప్రైవేట్ కార్యక్రమాలకు కూడా హాజరవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారనే మాట వినిపిస్తోంది. భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం కావడంతో ప్రీ ప్రొడక్షన్‌కు మరింత సమయం పట్టనుందట. తొలుత ఉగాదికి ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేసినా, ఇప్పుడు మహేశ్ పుట్టిన రోజైన ఆగస్టు 9న ఓపెనింగ్ కార్యక్రమం నిర్వహించనున్నారని తెలుస్తోంది. అయితే ఇవన్నీ అనధికారిక వార్తలే. వీటిలో ఏ ఒక్కదానిపైనా ఇప్పటివరకూ రాజమౌళి కానీ చిత్రబృందం కానీ స్పందించలేదు.



వీరమల్లు విజృంభణ ఖాయం

పవన్ కల్యాణ్ హీరోగా దర్శకుడు క్రిష్ తెరకెక్కిస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. చారిత్రక నేపథ్యంలో కాల్పనిక గాథతో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. పవన్ కల్యాణ్ రాజకీయాలపై దృష్టి పెట్టడమా? లేక మరేదైనా కారణమో తెలియదు కానీ కొన్ని షెడ్యూల్స్ పూర్తయ్యాక తాత్కాలికంగా చిత్రీకరణ నిలిచిపోయింది. అయితే పవన్ కల్యాణ్ ఈ సినిమాను దాదాపుగా పక్కనపెట్టినట్లేనని కొన్నాళ్లుగా సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం జరుగుతోంది. పలు సందర్భాల్లో మేకర్స్ ఈ ప్రచారాన్ని ఖండించారు. 'హరిహర వీరమల్లు' చిత్రం ఆగిపోలేదని చెబుతూ ఈ మధ్యనే కొత్త రిలీజ్ డేట్‌ను కూడా ప్రకటించారు. అయితే క్రిష్ అనుష్కతో హీరోయిన్ ఓరియంటెడ్ సినిమా తీస్తున్నాడంటూ ప్రచారం మొదలైంది. దీంతో 'హరిహర వీరమల్లు'ను పక్కనపెట్టడం వల్లే ఆయన కొత్త ప్రాజెక్ట్‌ను ఓకే చేశారనే టాక్ నడుస్తోంది. దీంతో ఈ ఊహాగానాలకు తెరదించేందుకు నిర్మాత ఏఎం రత్నం రంగంలోకి దిగారు. చెన్నైలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'హరిహర వీరమల్లు' సినిమా ఆగిపోలేదు. దీనికి కొనసాగింపు చిత్రం కూడా ఉంటుంది. పవన్ కల్యాణ్‌ను హీరోగా మరో స్థాయికి తీసుకెళ్లే చిత్రమిది' అని తెలిపారు. 'డబ్బు కోసమే అయితే పవన్ కల్యాణ్‌తో ఏదో ఒక సినిమా చేసి సంపాదించుకోవచ్చు. కానీ మేం అలా అనుకోవడం లేదు. 'హరిహర వీరమల్లు' సినిమాతో ఆయనకు పేరు రావాలి, మాకు ఎప్పటికీ గుర్తుండిపోవాలనేదే మా కోరిక' అన్నారు. 'హరిహర వీరమల్లు చిత్రం ఆగిపోయిందంటూ కొంత మంది చేస్తున్న ప్రచారం నిజం కాదు. అవన్నీ అసత్యాలే. వాటిని నమ్మకండి' అని పవన్ అభిమానులను కోరారు. అత్యున్నత ప్రమాణాలతో వీఎఫ్ఎక్స్ పనులు చేయాల్సి రావడం వల్ల మేకింగ్‌కు ఎక్కువ సమయం పడుతోందని గతంలో ఏఎం రత్నం చెప్పారు.

ప్రతి భారతీయుడూ ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతాడు

వరుణ్‌తేజ్ నటించిన ఎయిర్‌ఫోర్స్ యాక్షన్ మూవీ 'ఆపరేషన్ వాలెంటైన్' మార్చి ఒకటిన విడుదల కానుంది. శక్తి ప్రతాప్‌సింగ్ హడా దర్శకత్వంలో సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్మించింది. విడుదల సందర్భంగా మంగళవారం వరుణ్‌తేజ్ మీడియాతో మాట్లాడుతూ చిత్ర విశేషాలు వెల్లడించారు.



- దర్శకుడు శక్తి ప్రతాప్‌సింగ్ 2020లో ఈ కథతో నన్ను సంప్రదించారు. కథ నాకు బాగా నచ్చింది. సోనీ పిక్చర్స్ సంస్థకే నేను ఓ సినిమా చేయాల్సి ఉంది. కొన్ని కారణాల వల్ల అది టేకాఫ్ కాలేదు. నేషనల్ అప్పీల్ ఉన్న కంటెంట్ కావడంతో ఇది వారికి కూడా నచ్చింది. చాలా గ్రాండ్ బడ్జెట్‌తో పక్కాగా ప్లాన్ చేసి సినిమా తీశారు. దర్శకుడు ఉత్తరాదివాడే అయినా తెలుగులో చేయాలనే కోరిక ఉంది. అందుకే తెలుగు, హిందీ వెర్షన్స్‌లో తీశాం. ఒక భాషలో తీసిన వెంటనే మరో భాషలో చిత్రీకరించారు.
- దర్శకుడు శక్తి ప్రతాప్‌సింగ్ ఈ ప్రాజెక్ట్ కోసం చాలా రీసెర్చ్ చేశారు. సినిమా అంటే అతనికి ప్యాషన్. అయినా ఏదో ఒక సినిమా చేయాలని అనుకోకుండా నా ద్వారా ఈ చిత్రకథను చెప్పాలని అనుకున్నాడు. ఇంతకుముందు అతను చేసిన షార్ట్ ఫిల్మ్ బాగా వైరల్ అయింది. ఎయిర్‌ఫోర్స్ అధికారులు కూడా అది చూసి ఆశ్చర్యపోయారు. దాన్నే సినిమా చేయాలనుకుంటే కావాల్సిన సహకారాన్ని అందిస్తామని వారు చెప్పారు. దర్శకుడికి వీఎఫ్ఎక్స్ పై మంచి పట్టు ఉండడంతో విజువల్‌గా కూడా చాలా బాగా వచ్చిందీ చిత్రం
- పుల్వామాలో 2019 ఫిబ్రవరి 14న జరిగిన ఉగ్ర దాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు వీర మరణం పొందారు. దానికి కారణమైన ఉగ్రవాదులపై ప్రతీకారం తీర్చుకునేందుకు భారత వైమానిక దళం ఆపరేషన్ నిర్వహించింది. వాలెంటైన్ డే నాడు జరిగింది కనుక అలా టైటిల్ పెట్టాం. ప్రతి భారతీయుడు ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యే సినిమా ఇది.
- 'అంతరిక్షం' చిత్ర నిర్మాణ సమయంలో తొలిసారిగా విజువల్ ఎఫెక్ట్స్‌తో వర్క్ చేయడం మొదట్లో ఇబ్బందిగా అనిపించినా తర్వాత అలవాటైంది. 'ఆపరేషన్ వాలెంటైన్' షూటింగ్ కోసం ఫైటర్ జెట్ ఎలా పని చేస్తుంది, ఎంత స్పీడ్‌లో వెళుతుంది అనే వివరాలు ఓ పైలెట్ ద్వారా తెలుసుకున్నా. ఒక ఫైట్ సిమ్యులేటర్‌లో కూర్చోబెట్టి రియల్ లైఫ్ ప్రొజెక్షన్ అనుభూతి ఇచ్చేలా చేశారు. అందులో కూర్చుంటే నిజంగా ఫ్లైట్ నడిపినట్లే అనిపిస్తుంది. ఇలాంటి పాత్రలు చేయడం ఓ ఛాలెంజ్. ఇందులో నేను రుద్ర పాత్రలో కనిపిస్తాను. కొందరు రియల్ ఎయిర్ ఫైటర్స్ స్ఫూర్తితో నా పాత్రని అద్భుతంగా డిజైన్ చేశారు దర్శకుడు.
- తొలిసారిగా హిందీలో నటిస్తున్నాను కనుక హిందీ నేర్చుకోవడం కోసం రెండు నెలలు క్లాసులు తీసుకున్నాను. నా భార్య లావణ్య కూడా ఈ విషయంలో హెల్ప్ చేసింది. ఒక సీన్ మొదట హిందీలో షూట్ చేసి, తర్వాత తెలుగులో తీసేవాళ్లు. అప్పుడు మధ్య మధ్యలో హిందీ డైలాగులు కూడా వచ్చేసేవి.
- ఈ సినిమా టీజర్ రిలీజ్ అయ్యాక బాబాయ్‌ను కలిశాను. ఆయన సినిమాల గురించి పెద్దగా మాట్లాడరు. కానీ 'ఆపరేషన్ వాలెంటైన్' టీజర్‌ని ఐదారు సార్లు చూసి 'చాలా బాగుంది. ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్‌గా చక్కగా ఉన్నావు. ఈ సినిమా చూడాలని ఉంది' అని ఆయన అనడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఇటువంటి సినిమాలు అంటే బాబాయ్‌కి చాలా ఇష్టం.

క్రేజీ కాంబినేషన్ కుదిరింది



జైలర్' చిత్రం ఇచ్చిన సక్సెస్‌తో రజనీకాంత్ జోష్‌లో ఉన్నారు. వరుస చిత్రాలతో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రసుతం ఆయన దర్శకుడు టీజే జ్ఞానవేల్ రాజా, లోకేశ్ కనగరాజ్‌తో సినిమాలు చేస్తున్నారు. తాజాగా రజనీకాంత్ హీరోగా మరో చిత్రం ఖాయమైంది. పలు కమర్షియల్ హిట్లు ఇచ్చిన బాలీవుడ్ నిర్మాత సాజిద్ నడియాడ్ వాలా కొత్త చిత్రాన్ని నిర్మించనున్నారు. మంగళవారం ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. రజనీకాంత్‌ను కలసిన ఫొటోను షేర్ చేసి, 'లెజండరీతో కలసి పనిచేసే అవకాశం నాకు దక్కిన గౌరవం. త్వరలోనే మా మరపురాని ప్రయాణం ప్రారంభిస్తాం' అన్నారు. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో ప్రకటించే అవకాశముంది.

ఆ టైమ్ వచ్చింది

తన రాజకీయ అరంగేట్రానికి ఇదే సరైన సమయం అన్నారు బాలీవుడ్ నటి కంగనా రనౌత్. ఆమె రాజకీయాల్లోకి వస్తున్నట్లు కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంలో ఆమె మాట్లాడుతూ 'సినిమాల్లో ఉంటూనే రాజకీయ పార్టీలతో తలపడ్డాను. నటిగా కన్నా దేశహితం కోరుకునే జాతీయవాదిగానే నాకు గుర్తింపు ఎక్కువ. దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు నాపై చాలా ప్రేమ చూపించారు. దేశం నాకు చాలా ఇచ్చింది. తిరిగి ఇవ్వడం నా బాధ్యత. ఒకవేళ నేను రాజకీయాల్లోకి అడుగుపెట్టాలనుకుంటే అందుకు ఇదే సరైన సమయం' అన్నారు. ఆమె త్వరలోనే బీజేపీలో చేరబోతున్నారని బాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తోంది. ప్రస్తుతం ఆమె నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. ఇందులో కంగనా రనౌత్ దివంగత ప్రధాని ఇందిరాగాంధీ పాత్రను పోషించారు. ఎమర్జెన్సీ నాటి పరిస్థితులను ఈ చిత్రంలో ఆవిష్కరించనున్నారు. అలాగే 'తను వెడ్స్ మను', 'క్వీన్ 2' చిత్రాల్లో కంగన నటిస్తున్నారు.





న్యూ ఏజ్ ఫిల్మ్ లవ్ మీ

ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటించిన చిత్రానికి 'లవ్ మీ' అనే టైటిల్ నిర్ణయించారు. 'ఇఫ్ యు డేర్' అనేది ఉప శీర్షిక. దిల్ రాజు ప్రొడక్షన్స్ బేనర్‌పై అరుణ్ భీమవరపు దర్శకత్వంలో హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించారు. టైటిల్ ప్రకటించిన అనంతరం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దిల్ రాజు మాట్లాడుతూ ' ఇదొక న్యూ ఏజ్ ఫిల్మ్. 'ఆర్య' కథ విని ఎలా ఎగ్జయిట్ అయ్యానో ఈ చిత్ర కథ విని అదే అనుభూతి పొందాను. ఈ సినిమా ప్రారంభం కావడానికి కారణం నాగ మల్లిడి. అతను నాకు ఎప్పటి నుంచో పరిచయం. ఓ స్క్రిప్ట్ వినండి.. ఫ్రెండ్‌తో కలసి తయారు చేశానని నాగ చెబితే కథ విన్నాను. నాకు నచ్చడంతో చాలా మందికి చెప్పాను. అందరూ ఎగ్జైట్ అయ్యారు. ఇలా స్క్రిప్ట్ దశలో ఎగ్జైట్ అవడం అరుదుగా జరుగుతుంటుంది. హీరోగా ఆశిష్ కావాలని అడిగారు. అలాగే హర్షిత్, హన్షితలను ఇవ్వమని నాగ అడిగాడు. స్క్రిప్ట్ పూర్తయాక టెక్నీషియన్ల పేరు చెబితే భయం వేసింది. అయినా ఛాయాగ్రాహకుడు పీసీ శ్రీరామ్‌నీ, కీరవాణిగారిని కలసి కథ చెప్పి ఒప్పించారు. ఫిబ్రవరి 27న టైటిల్ అనౌన్స్ చేశాం. ఏప్రిల్ 27న సినిమా విడుదల చేయబోతున్నాం.' ఆర్య' విషయంలో నాకు జరిగిందే ఈ టీమ్‌కు జరగబోతోందనే వైబ్స్ వస్తున్నాయి' అన్నారు. చిత్ర కథానాయిక వైష్ణవి చైతన్య మాట్లాడుతూ 'ఈ మూవీ నాకు ప్రత్యేకం. ఇలాంటి స్టోరీ లైన్ ఎక్కడా చూడలేదు. త్వరలో టీజర్ ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఈ సినిమా చూశాక డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్‌తో ప్రేక్షకులు బయటకు వస్తారు' అని చెప్పారు.

వెన్నెల కిశోర్‌కు టైలర్ మేడ్ క్యారెక్టర్



వెన్నెల కిశోర్ హీరోగా నటించిన 'చారి 111' చిత్రం మార్చి ఒకటిన విడుదల కానుంది. కీర్తి కుమార్ దర్శకత్వంలో ఆదితి సోని ఈ సినిమా నిర్మించారు. సంయుక్త విశ్వనాథన్ హీరోయిన్. మంగళవారం ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో గీత రచయిత రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ 'ఈ సినిమాలో ఒకే ఒక్క పాట ఉంది. అది రాసే బాధ్యతను నాకు అప్పగించారు. నన్ను నమ్మి దర్శక నిర్మాతలు రావడంతో పాట బాగా రావాలని మూడు నెలల సమయం తీసుకున్నా. మంచి సాహిత్యం కుదిరింది. వెన్నెల కిశోర్ ఈ సినిమాలో బాగా నవ్విస్తారు' అని చెప్పారు. 'బెంగళూరులో పదేళ్ల యాడ్ ఫీల్డ్‌లో ఉండి సినిమాల్లోకి వచ్చా. ఇంతకు ముందు 'మళ్లీ మొదలైంది' అనే సినిమా చేశా. అందులో వెన్నెల కిశోర్‌గారు కామెడీ రోల్ చేశారు. అప్పుడే ఈ చిత్ర కథ ఆయనకు చెప్పా. కిశోర్‌గారికి ఇది టైలర్ మేడ్ క్యారెక్టర్. ఇదొక స్పై యాక్షన్ కామెడీ జానర్ ఫిల్మ్. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు ఏ మాత్రం తగ్గకుండా ఉంటుంది. మొదట ఈ సినిమాను మే నెలలో విడుదల చేయాలనుకున్నాం. కానీ మంచి డేట్ దొరకడంతో మార్చి ఒకటిన విడుదల చేస్తున్నాం.' అని చెప్పారు దర్శకుడు కీర్తి కుమార్. నిర్మాత ఆదితి సోని మాట్లాడుతూ 'నిర్మాతగా నాకు ఇది తొలి సినిమా. కొత్తగా ట్రై చేశాం. మంచి టీమ్ దొరికింది. వెన్నెల కిశోర్‌గారికి నేను అభిమానిని. ఆయనతో సినిమా చేయడం ఆనందంగా ఉంది' అన్నారు. తెలుగులో తనకు ఇది తొలి చిత్రమని హీరోయిన్ సంయుక్త చెప్పారు. సినిమాలో తను ఫైట్స్ కూడా చేసినట్లు ఆమె తెలిపారు.

భవానీ వార్డ్‌లో ఏం జరిగింది?



గాయత్రీ గుప్తా, గణేశ్ రెడ్డి, పూజా కేంద్రే ముఖ్య పాత్రలు పోషించిన హారర్ థ్రిల్లర్ 'భవానీ వార్డ్' ఫస్ట్ లుక్‌ను సోమవారం సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటయిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు జీడీ నరసింహ మాట్లాడుతూ 'నేను చెప్పిన కథ నచ్చి ఇందులో నటించడమే కాకుండా పూర్తి సహకారం అందించిన గాయత్రిగారికి ధన్యవాదాలు. నిర్మాత ప్రోత్సాహంతో, నటీనటుల సహకారంతో అందరికీ నచ్చేలా ఈ సినిమా తీశాను. భవానీ వార్డ్‌లో జరిగే సంఘటనలు ఉత్కంఠభరితంగా ఉంటాయి. హారర్ చిత్రాలను ఇష్టపడే వారికే కాకుండా అందరినీ అలరిస్తుంది' అన్నారు. చిన్న సినిమాలకు ప్రోత్సాహం అందించాలనే ఈ సినిమా తీసినట్టు నిర్మాతల్లో ఒకరైన కల్యాణ్ చక్రవర్తి చెప్పారు. టెక్నికల్‌గా సినిమా చాలా బాగుంటుందని గాయత్రి గుప్తా చెప్పారు. హీరోగా తనకు అవకాశం ఇచ్చిన దర్శకనిర్మాతలకు గణేశ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సినిమాలో ఒక మంచి పాత్ర చేసినందుకు ఆనందంగా ఉందని జర్నలిస్టు సాయి సతీశ్ చెప్పారు.

ఆంధ్రజ్యోతి
9
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం
28 ఫిబ్రవరి 2024

న్యూస్‌మేకర్



ఆమెది రాజకీయ వారసత్వం.
కానీ... అలుపెరుగని ప్రజా పోరాటం.
కేసులతో నియంత్రించాలని చూసినా...
జైలు జీవితం గడిపినా... చెదరని ఆత్మస్థయిర్యం.
పురుషాధిక్యంగల దాయాది దేశ రాజకీయాల్లో...
మడమ తిప్పని నాయకురాలు **మరియమ్ నవాజ్.**
దూసుకుపోయే తత్వం... సడలని ధైర్యం...
ఎంతటివారినైనా మెప్పించే వాక్చాతుర్యం...
ఇవే నేడు ఆమెను పాకిస్తాన్‌లోనే తొలి మహిళా ముఖ్యమంత్రిని చేశాయి.
పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ తనయగా...
జన నేతగా... ప్రజల హృదయాలు గెలిచిన యాభై ఏళ్ల మరియమ్...
ఇటీవలే పంజాబ్ రాష్ట్ర సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. నవచరితకు నాంది పలికారు.



తండ్రికి తగ్గ తనయ

మరియమ్ నవాజ్... ఇప్పుడు పాకిస్తాన్ అంతటా మారుమోగుతున్న పేరు. ఎన్నాళ్లో వేచిన ఉదయం... ఎన్నో ఏళ్ల పోరాటాల ఫలితం... నేడు ఆమె సాధించిన విజయం. తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని రాజకీయాల్లోకి వచ్చినా... తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు ఆమె. మూడుసార్లు ప్రధానిగా పాక్‌ను పరిపాలించిన నవాజ్ షరీఫ్... దేశం వదిలి లండన్‌కు వెళ్లినప్పటి నుంచీ... 'పీఎంఎల్-ఎన్' (పాకిస్తాన్ ముస్లిం లీగ్) పార్టీని ముందుండి నడిపిస్తున్నారు. అంగబలం, అర్థబలం ఉన్నా... అద్దాల మేడలకే పరిమితం కాకుండా... నిత్యం జనంతో మమేకమయ్యారు. దేశ రాజకీయాల్లో కీలకంగా మారారు.

సామాజిక సేవ...

వైద్య విద్య అభ్యసించేందుకు లాహోర్‌లోని ఓ మెడికల్ కాలేజీలో చేరిన మరియమ్... తన అడ్మిషన్ వివాదాస్పదం కావడంతో మధ్యలోనే ఆపేశారు. 1992లో అప్పటి పాకిస్తాన్ సైన్యంలో కెప్టెన్‌గా ఉన్న మహమ్మద్ సఫ్దార్‌ను వివాహం చేసుకున్నారు. అప్పుడు ఆమె తండ్రి నవాజ్ షరీఫ్ పాక్ ప్రధాని. రాజకీయాల్లోకి రాకముందు తమ కుటుంబం ఆధ్వర్యంలో నడుస్తున్న స్వచ్ఛంద సంస్థలతో కలిసి సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారు. అప్పటి వరకు జనం ముందుకు రాని మరియమ్... 2013లో నవాజ్ ఎన్నికల ప్రచారానికి సహకరించారు. క్రికెట్ దిగ్గజం, 'పీటీఐ' పార్టీ చీఫ్ ఇమ్రాన్‌ఖాన్ తన తండ్రిపై సంధించిన విమర్శనాస్త్రాలను మరియమ్ సమర్థంగా తిప్పికొట్టగలిగారు. నాటి వారి మాటల యుద్ధం యువతను బాగా ఆకట్టుకుంది. అదే మరియమ్‌ను పాక్ ప్రజలకు పరిచయం చేసింది.

జనాకర్షక గళం...

నవాజ్ ప్రధానిగా ఉన్నప్పుడు 'ప్రైమ్‌మినిస్టర్ యూత్ లోన్ ప్రోగ్రామ్'కు మరియమ్‌ను చైర్‌పర్సన్‌గా నియమించింది నాటి ప్రభుత్వం. ఇమ్రాన్ పార్టీ 'పీటీఐ' దాన్ని కోర్టులో సవాలు చేసింది. 'ఆ పదవిని కట్టబెట్టడానికి ఆమెకు ఉన్న అర్హతలేమిట'ని ప్రశ్నించింది. దీన్ని తిప్పికొట్టేందుకు 'పీఎంఎల్-ఎన్' సామాజిక మాధ్యమాల బాధ్యతలను ఆమె భుజానికెత్తుకున్నారు. సమస్య ఎంత పెద్దదయినా వెనకడుగు వేసే నైజం కాదు ఆమెది. సవాళ్లను స్వీకరించి... ధైర్యంగా వాటిని అధిగమించగల నేర్పరి. 2018కి వచ్చేసరికి ఇటు సొంత పార్టీలో... అటు జాతీయ రాజకీయాల్లో కీలకంగా మారారు. తండ్రి పాల్గొన్న ప్రచార కార్యక్రమాలను పర్యవేక్షించారు. తిరుగులేని వాగ్ధాటితో జనాన్ని ఆకర్షించడంలో, నవాజ్ షరీఫ్‌పై ఎక్కుపెట్టిన విమర్శలను తిప్పికొట్టడంలో మరియమ్‌ది ప్రత్యేక శైలి. ఆమె ప్రసంగం ఉందంటే... జనం పోటెత్తడం పార్టీకి పెద్ద బలంగా మారింది. తరువాతి రోజుల్లో మరియమ్‌కు అదే ప్రధాన బలం అయింది.

కేసులు... జైలు గోడలు...

కీలక నేతగా ఎదుగుతున్న మరియమ్‌కు... నాటి ఎన్నికల్లో జాతీయ అసెంబ్లీతో పాటు పంజాబ్ ప్రావిన్స్ అసెంబ్లీ సీట్లను పార్టీ కేటాయించింది. తద్వారా ఆమెను ప్రత్యక్ష రాజకీయాల్లోకి తేవాలన్నది నవాజ్ ఆలోచన. అయితే సరిగ్గా ఎన్నికలు ముందు ఆమెకు ఊహించని షాక్ తగిలింది. ఓ కేసులో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మరియమ్, ఆమె భర్త సఫ్దార్, తండ్రి నవాజ్‌ను కోర్టు దోషులుగా తేల్చింది. ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. దాంతో పదేళ్ల ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు పడింది. దీన్ని ఇస్లామాబాద్ హైకోర్టులో ఆమె సవాలు చేశారు. అనర్హత ఉత్తర్వులపై హైకోర్టు స్టే ఇచ్చి, బెయిల్ మంజూరు చేసింది. అయితే 2019 ఆగస్టులో మరో కేసులో పోలీసులు ఆమెను అరెస్టు చేసి జైలుకు పంపారు. అదే ఏడాది నవంబర్‌లో కోర్టు బెయిల్ ఇవ్వడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ధైర్యసాహసాలున్న నేత...

తండ్రి నవాజ్ షరీఫ్ నివాసం లండన్‌కు మారాక మరియమ్ పార్టీలో మరింత కీలక నాయకురాలు అయ్యారు. 2019లో తొలిసారి పార్టీ ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఇక అక్కడి నుంచి వేగం పెంచారు. ఇమ్రాన్‌ఖాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించారు. పాకిస్తాన్ సైన్యాన్ని, న్యాయవ్యవస్థనూ ఆమె వదల్లేదు. తన తండ్రిని పదవీచ్యుతుడిని చేసి, ఇమ్రాన్‌ను గద్దెనెక్కించడంలో ఈ రెండు వ్యవస్థలూ దోహదపడ్డాయని ఆరోపించారు. దీంతో ధైర్యసాహసాలున్న నేతగా ఆమె ప్రజలకు మరింత దగ్గరయ్యారు.

మళ్లీ ఎన్నికల బరిలో...

2022లో మరియమ్, ఆమె భర్తకు విధించిన శిక్షను ఇస్లామాబాద్ హైకోర్టు కొట్టేసింది. ప్రధాన అడ్డంకి తొలగిపోవడంతో మరియమ్‌కు మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మార్గం సుగమం అయింది. మరుసటి ఏడాది జనవరిలో ఆమెకు పార్టీ కీలక బాధ్యతలు అప్పగించింది. సీనియర్ వైస్‌ప్రెసిడెంట్‌గా, చీఫ్ ఆర్గనైజర్‌గా నియమించింది. నవాజ్ షరీఫ్ కూడా లండన్ నుంచి తిరిగి రావడంతో... ఆమె మరింత జోరు పెంచారు. ఈనెలలో జరిగిన ఎన్నికల్లో జాతీయ అసెంబ్లీకి, అలాగే పంజాబ్ ప్రావిన్షియల్ అసెంబ్లీకీ పోటీపడి, విజయం సాధించారు. ఇటీవలే పంజాబ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రతీకారేచ్ఛ లేదు...

అయితే తనను ఇబ్బంది పెట్టినవారిపై తనకు ప్రతీకారేచ్ఛ లేదని, ప్రజా సంక్షేమం కోసం మాత్రమే పాటుపడతానని మరియమ్ సీఎంగా తన తొలి ప్రసంగంలో చెప్పుకొచ్చారు. విశేషమేమంటే... ఆమె తండ్రి కూడా గతంలో పంజాబ్ సీఎంగా ఉన్నారు. 'నా విజయం పాకిస్తాన్‌లోని స్త్రీ జాతికి అంకితం. మా నాన్న కూర్చున్న కుర్చీలో కూర్చున్నప్పుడు ఎంతో గర్వంగా అనిపించింది. పాకిస్తాన్‌కు మూడుసార్లు ప్రధాని అయిన ఏకైక వ్యక్తి ఆయన. నేను కూడా నవాజ్ షరీఫ్ లాంటి దార్శనికుడి అడుగుజాడల్లో నడుస్తాను' అంటూ మరియమ్ భావోద్వేగంతో ప్రసంగించారు. పాకిస్తాన్ చరిత్రలో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించిన మొట్టమొదటి మహిళగా, తండ్రికి తగ్గ తనయగా ఆమె నవ శకానికి నాంది పలికారు.

అత్యాచారయత్నాన్ని ప్రతిఘటించి బయటపడిన ఆమె... తోటి మహిళల్లో ఆత్మవిశ్వాసం నింపాలనుకున్నారు. తన 'రెడ్ బ్రిగేడ్' సంస్థ ద్వారా దాదాపు 2 లక్షల మందికి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇచ్చారు. 'బాలికలకు చదువే కాదు ఆత్మరక్షణ నైపుణ్యం కూడా ప్రధానమే' అంటున్న 36 ఏళ్ల **ఉషా విశ్వకర్మ** కథ ఆమె మాటల్లోనే...

ఆత్మరక్షా కవచం

రెడ్ బ్రిగేడ్

"స్త్రీని శక్తి స్వరూపిణిగా ఆరాధించే సంస్కృతి మనది. కానీ స్త్రీలు శక్తిమంతులు కాకుండా సమాజం ఎక్కడికక్కడ నిరోధిస్తూనే ఉంటుంది. మహిళలు విద్యావంతులవుతున్నారు. ఆర్థికంగా స్థిరపడుతున్నారు. కానీ భౌతికమైన, లైంగికమైన దాడి ఎదురైనప్పుడు... దాన్ని ఎదిరించే శక్తి సామర్థ్యాలు ఉన్నవారు చాలా తక్కువ. అందుకే సమాచార మాధ్యమాల్లో అత్యాచార వార్తలు లేని రోజంటూ ఉండదు. 2022తో పోలిస్తే గత ఏడాది మహిళలపై నేరాలు నాలుగు శాతానికి పైగా పెరిగాయని జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాలు చెబుతున్నాయి. నమోదుకాని అఘాయిత్యాలు ఇంకెన్నో! నా జీవితంలోనూ అలాంటి సంఘటన జరిగింది. మాది లక్నో. చిన్ననాటినుంచి మహిళలపై హింసను చూస్తూనే పెరిగాను.



మా నాన్నకు మా అమ్మ ఏం చేసినా తప్పుగానే కనిపించేది. ఆమెను కొట్టడం ఆయనకు నిత్యకృత్యంలా ఉండేది. అమ్మ వేదన చూసి బాధపడేదాన్ని. మరోవైపు ఆర్థికమైన ఇబ్బందులు. అలాంటి పరిస్థితుల మధ్యే ఇంటర్మీడియెట్ పూర్తి చేశాను. ఆ తరువాత ఒక స్వచ్ఛంద సంస్థలో చేరి... మురికివాడల్లో పిల్లలకు పాఠాలు చెప్పడం ప్రారంభించాను. దాని కోసం ఒక చిన్న పాకను కూడా ఏర్పాటు చేయించాను. అప్పుడు నా వయసు పద్దెనిమిదేళ్లు. టీచర్‌గా స్థిరపడాలని కలలుకంటున్న నాకు ఊహించని సంఘటన ఎదురయింది. ఒక రోజు పాఠాలు పూర్తి చేశాక... పిల్లలను పంపించి... పుస్తకాలు సర్దుకుంటున్నాను. నాతో పని చేసే ఒక వ్యక్తి హఠాత్తుగా గదిలోకి వచ్చాడు. తలుపు మూసి గడియ పెట్టాడు. నాపై అత్యాచారానికి ప్రయత్నించాడు. అంతవరకూ మంచివాడనీ, శ్రేయోభిలాషనీ అనుకుంటున్న మనిషి ఈ దారుణానికి తెగబడడం చూసి దిగ్భ్రాంతికి గురయ్యాను. వణికిపోయాను. ధైర్యం కూడదీసుకొని ప్రతిఘటించాను. అతన్ని కొట్టి, బలవంతంగా తోసేసి... బైటపడ్డాను. ఆ తరువాత దాని గురించి నేను పనిచేసే స్వచ్ఛంద సంస్థకు ఫిర్యాదు చేశాను. ఎలాంటి హానీ జరగకుండా బయటపడినా... ఆ సంఘటన నన్ను మానసికంగా తీవ్రంగా కుంగదీసింది. చాలా రోజులు మనిషిని కాలేకపోయాను. జరిగిన దాని గురించి ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి. నాన్నకి తెలిస్తే "చేస్తున్న ఉద్యోగం చాలు. ఇంట్లోనే పడి ఉండు. పెళ్ళి చేసేస్తాం" అనీ, బంధువులకి తెలిస్తే "నువ్వు చనువు ఇవ్వకపోతే అతనెందుకు అలా చేస్తాడు?" అనీ అంటారేమోననీ భయం. ఆ రోజు అదృష్టం కొద్దీ నేను క్షేమంగా బయటపడగలిగాను. కానీ రోజూ ఎందరో బలైపోతున్నారు. వారి కోసం నేనేం చెయ్యగలను? ఇదే ఆలోచన నన్ను వెంటాడుతూ వచ్చింది. ఏం చెయ్యాలనే స్పష్టత త్వరలోనే వచ్చింది.

'అదుపు తప్పి వీధుల్లో పడింద'న్నారు...

నా దగ్గర చదువుకుంటున్న పదకొండేళ్ళ అమ్మాయి మీద అత్యాచారం జరిగిందనీ, అది చేసింది ఆమె దగ్గర బంధువేననీ తెలిసింది. అది విని నా రక్తం మరిగిపోయింది. ఆడపిల్లలు ఎంత చదువుకున్నా, ఆర్థికంగా ఎంత స్థోమత ఉన్నా... వారి వ్యక్తిగత భద్రతకు మన సమాజంలో గ్యారెంటీ లేదని అర్థమయింది. చదువుతోపాటే వారికి సాధికారత కల్పించాలని నిశ్చయించుకున్నాను. అబలల్లో ఆత్మవిశ్వాసం పెంచడమే ధ్యేయంగా... పదిహేను మందితో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి... మహిళలు, బాలికలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా వీధి నాటకాల ప్రదర్శన ప్రారంభించాను. బృందంలో అందరూ బాలికలే. అందరూ అత్యాచారాలకో, లైంగిక వేధింపులకో గురైనవాళ్ళే. వాళ్ళు ఎర్రటి కుర్తా, నల్లటి సల్వార్, దుపట్టా వేసుకొనేవారు. ఎరుపు పోరాటానికి, నలుపు ప్రతిఘటనకు చిహ్నం. ఒకసారి మేము వీధిలో నాటకాన్ని వేసినప్పుడు 'శక్తిమంతమైన రెడ్ బ్రిగేడ్' అంటూ మాకు ప్రశంసలు వచ్చాయి. ఆ పదం మాకెంతో నచ్చింది. మా సంస్థను రిజిస్టర్ చేసి, 'రెడ్ బ్రిగేడ్' అని పేరు పెట్టాం. కళాశాలల్లో, పాఠశాలల్లో సదస్సుల ద్వారా బాలికల్లో చైతన్యం కలిగించడం ప్రారంభించాం. అయితే దీన్ని నా కుటుంబం, స్నేహితులు తీవ్రంగా వ్యతిరేకించారు. "మీ అమ్మాయి అదుపుతప్పి వీధుల్లో పడింది. ఆమె చేస్తున్న పనులు మీ కుటుంబానికి నష్టం కలిగిస్తాయి" అని ఇరుగుపొరుగువాళ్ళు మా అమ్మతో అనేవాళ్ళు. రెండేళ్ళకు పైగా ఇదే కొనసాగింది. నేను కౌన్సెలింగ్ ఇచ్చి, సహాయం చేసిన ఒక బాలిక, ఆమె కుటుంబం మా ఇంటికి వచ్చారు. "మా బిడ్డపై అత్యాచారం జరిగినప్పుడు మీ అమ్మాయి ఇచ్చిన నైతిక స్థైర్యం వల్లే మా బిడ్డ కోలుకుంది. కుంగిపోకుండా శక్తిని కూడదీసుకుంది" అని వాళ్ళు చెప్పారు. అప్పటి నుంచి నా కుటుంబ సభ్యుల ధోరణి మారి, నాకు మద్దతు ఇవ్వడం ఆరంభించారు.

ఆ మార్పే మా ఆశయం...

2012లో 'నిర్భయ' సంఘటన, తదనంతరం దేశవ్యాప్తంగా నిరసనలు జరిగినప్పుడు... అనేక చోట్ల మా 'రెడ్ బ్రిగేడ్' కూడా ఆందోళనలు, వివిధ కార్యక్రమాలు చేపట్టింది. మహిళలకు ఆత్మరక్షణ నైపుణ్యం తప్పనిసరిగా కావాలని ఈ సంఘటనతో నాకు అర్థమైంది. నేను మార్షల్ ఆర్ట్స్ నేర్చుకొని, బాలికలకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించాను. వాటిని వీడియోలుగా చిత్రీకరించి, సోషల్ మీడియాలో ఉంచాను. వాటికి మంచి స్పందన లభించింది. ప్రభుత్వం, అధికారులు, వివిధ సంస్థల ప్రోత్సాహంతో... దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రాథమిక స్థాయి నుంచి యూనివర్సిటీల వరకు విద్యాసంస్థలు, బ్యాంకులు, రైల్వే, పోలీస్ విభాగాలు, దాదాపు అరవైకి పైగా ప్రైవేటు సంస్థలకు చెందిన మహిళలకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇచ్చాను. ఇప్పటివరకూ రెండు లక్షల మందికి పైగా బాలికలు, మహిళలు ఈ శిక్షణ పొందారు. మరోవైపు సుమారు 300 సెమినార్లు, వెయ్యి వరకూ వీధినాటకాల



ద్వారా... లైంగిక దాడులను ఎదుర్కొనే పద్ధతులు, 'మంచి స్పర్శ - చెడు స్పర్శ' మధ్య తేడా తెలుసుకోవడం, ఏదైనా దుర్ఘటన ఎదురైనప్పుడు చట్టపరంగా, న్యాయపరంగా సహాయాన్ని పొందడం తదితర అంశాలను వివరించాం. బాధితులకు అవసరమైన అన్ని సహాయాలనూ అందిస్తున్నాం. ఇది ఒక నిరంతర ప్రక్రియ. వేధింపులకు లేదా అత్యాచారాలకు గురైనవారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపి, వారిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడం చాలా కష్టమని నాకు తెలుసు. ఇల్లు, వీధి, బడి, ఆఫీసు... ఇలా ఏ ప్రదేశమూ మహిళలకు సురక్షితం కాదు. అత్యాచారాలకు పాల్పడేవారిలో దగ్గర బంధువులు, కుటుంబానికి సన్నిహితులు, ఇరుగుపొరుగువారు, పరిచయస్తులే ఎక్కువ. చాలామంది తమపై జరిగిన అత్యాచారాల గురించి రిపోర్ట్ చెయ్యడానికి భయపడతారు. దీనికి అనేక కారణాలున్నాయి. దీనివల్ల నిందితులకు మరింత ధైర్యం వస్తోంది. తాము ఏం చేసినా... ఎవరూ నోరు విప్పలేరని వాళ్ళు భావిస్తారు. మళ్ళీ మళ్ళీ అఘాయిత్యాలకు పాల్పడతారు. ఇటువంటి సంఘటనలను ఎదిరించే ధైర్యం మహిళలకు అవసరం. అలాగే... అత్యాచార బాధితుల పట్ల సమాజం వ్యవహరించే తీరులోనూ మార్పు రావాలి. అలాంటి మార్పే 'రెడ్ బ్రిగేడ్' ఆశయం."

ఫ్యాషన్ టిప్

సమ్మర్ స్టైల్స్!



వాతావరణం చల్లగా ఉంటే ఎలాంటి దుస్తులైనా ఎంచుకోవచ్చు. స్వెటర్లు, జాకెట్స్‌తో మరింత ఫ్యాషన్‌గా కనిపించవచ్చు. కానీ ఇప్పుడు ఎండలు అదరగొట్టడం మొదలు పెట్టాయి. కాబట్టి ఇలాంటి స్టయిల్ కుదరదు. సింపుల్‌గా, సౌకర్యవంతంగా ఉండే స్టయిల్స్ ఫాలో కావాలి.

- **వైట్ ఈజ్ బెస్ట్:** వేసవి వేడికి విరుగుడు తెలుపు రంగు దుస్తులు. తెలుపు టాప్‌తో ఏ రంగు బాటమ్‌నైనా మ్యాచ్ చేసేయవచ్చు. విభిన్నంగా, ఆధునికంగా కనిపించాలంటే వైట్ టాప్‌కు ముదురు రంగు ప్యాంట్ లేదా పలాజో ధరించాలి. మ్యాచింగ్ హీల్స్ తప్పనిసరి.
- **ఫ్లవర్ పవర్:** పువ్వుల డిజైన్లకు సరైన సీజన్... సమ్మర్! కాబట్టి ఫ్లవర్ ప్రింటు ఉన్న డ్రస్‌లు ధరించండి. అయితే ఈ డ్రస్‌కు తగ్గట్టు భారీ జ్యువెలరీ ధరించకూడదు. సింపుల్‌గా ఉండే ఇయర్ హ్యాంగింగ్స్, పాదాలకు ఫ్లాట్స్ బాగుంటాయి.
- **ఇంటరెస్టింగ్ యాక్సెసరీస్:** గ్రాఫిక్ డిజైన్లకు తగిన సీజన్ ఇది. షూ, ఇయర్ హ్యాంగింగ్స్, ఫ్యాన్సీ బ్యాంగిల్స్, హ్యాండ్ బ్యాగ్...ఏది ఎంచుకున్నా సింపుల్‌గా ఉండేలా చూసుకోవాలి. జీన్స్ ధరిస్తే, పెద్దసైజు హ్యాండ్ బ్యాగ్, స్కర్ట్ ధరిస్తే, మినీ పర్స్...ఇలా డ్రస్‌తో యాక్సెసరీస్ మ్యాచ్ చేయాలి.
- **కూల్ స్కార్ఫ్:** ఇప్పటివరకూ స్టోల్స్ వాడినా, ఇకపై వాటి అవసరం ఉండదు. ఎండ నుంచి తట్టుకోవడం కోసం, అదే సమయంలో ఫ్యాషన్‌గా కనిపించడం కోసం స్కార్ఫ్‌లను తలకు చుట్టుకోవాలి. అయితే స్కార్ఫ్ పలుచని మెటీరియల్‌తో తయారయినదై ఉండాలి.

బ్యూటీ

మొటిమలు రాకుండా

అందానికి శత్రువులు మొటిమలు. వీటిని అడ్డుకోవాలంటే సులువైన సౌందర్య చిట్కాలు పాటించక తప్పదు. అవేంటంటే...

- **టోనర్:** మూడు వంతుల యాపిల్ సిడార్ వెనిగర్‌కు నాలుగు వంతుల నీళ్ల కలిపి ముఖానికి పట్టించాలి. ఆరిన తర్వాత కడిగేయాలి. ఈ మిశ్రమం చర్మాన్ని టోన్ చేస్తుంది. ఫలితంగా మొటిమలు తగ్గుతాయి.
- **నిమ్మరసం:** నిమ్మరసంలోని సిట్రిక్ యాసిడ్ జిడ్డును తొలగించడంతోపాటు చర్మపు పి.హెచ్ బ్యాలెన్స్ కాపాడుతుంది. దాంతో మొటిమలు దరి చేరవు.
- **తేనె:** వారానికి రెండు సార్లు తేనెతో ఫేస్ ప్యాక్ వేయాలి. ఇలా చేస్తే మొటిమలు లేని ముఖం మీ సొంతమవుతుంది.



- **బేకింగ్ పౌడర్:** ఒక టీస్పూను బేకింగ్ పౌడర్‌లో తగినన్ని నీళ్లు కలిపి ముఖ చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేయాలి. ఇందుకోసం ఈ మిశ్రమంతో ముఖాన్ని సున్నితంగా రుద్ది, ఆరిన తర్వాత కడిగేసుకోవాలి.
- **బొప్పాయి:** దీన్లోని యాంటీబ్యాక్టీరియల్ గుణాలు చర్మానికి తాజాదనాన్ని అందిస్తాయి. చర్మ రంధ్రాలను శుభ్రపరుస్తాయి కాబట్టి మొటిమల బాధ వదులుతుంది.
- **దోస:** దోస ముక్కలను ముఖం మీద రుద్ది 30 నిమిషాల తర్వాత కడిగేయాలి. ఇలా చేయడం వల్ల చర్మానికి చల్లదనం అంది మొటిమలు, మొటిమల తాలూకు మచ్చలు తగ్గుతాయి.

ఫ్యాషన్

ధోతీ శారీ అదరహో!



చీర కట్టు సంప్రదాయ వేడుకలకే పరిమితమా? 'అంతే మరి. ఈ తరం కలర్‌ఫుల్ ఈవెంట్లు, ఫ్యాషన్ షోలు, మ్యారేజ్ ఫంక్షన్లలో చీరకు చోటేది? కచ్చితంగా మోడర్న్ డ్రస్‌లో హాజరవవలసిందే! అంటున్నారా?' అదేం కాదు. చీరకు ధోతీ స్టయిల్ జోడించి, ఇదిగో ఇలా మోడర్న్ 'ధోతీ శారీ'లో సరికొత్తగా మెరిసిపో వచ్చు!



యాక్సెసరీస్

చేతిలో క్లచ్, పాదాలకు హీల్స్, తల మీద కొప్పు, పొడవాటి ఇయర్ హ్యాంగింగ్స్... ఇవీ ధోతీ శారీకి మ్యాచ్ అయ్యేలా అనుసరించవలసిన స్టయిల్స్. ఒకవేళ పొడవాటి జుట్టు వదిలేద్దామనుకుంటే చెవులకు హ్యాంగింగ్స్ పెట్టకుండా మెడలో భారీ రాళ్ల నెక్లెస్ ధరిస్తే సరిపోతుంది. ఈ డ్రస్‌కు గాజులు, రిస్ట్ వాచీలు మ్యాచ్ అవవు. కాబట్టి ఆ యాక్సెసరీల జోలికి వెళ్లకుండా చేతి వేలికి పెద్దదిగా, కొట్టొచ్చినట్టు కనిపించే ఉంగరం పెట్టేసుకోండి. అంతే! ఎలాంటి వేడుకలో అయినా సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ మీరే అయిపోతారు.

శారీ వేర్

'చీర కట్టు పెద్ద ప్రహసనం' అని చిరాకు పడేవాళ్ల కోసం వాడుకలోకొచ్చిన స్టయిల్ ధోతీ శారీ. ఈ చీరను చుట్టుకోవలసిన అవసరం లేదు. మిగతా మోడర్న్ డ్రస్‌ల మాదిరిగానే ధరించవచ్చు. డ్రస్‌లో భాగంగా కలిసిపోయే బ్లౌజ్ మోడర్న్ లుక్ తెచ్చిపెడుతుంది. మ్యాచ్ అయ్యే జ్యువెలరీ, శాండిల్స్ ధరిస్తే డ్రస్ మొత్తానికే అందమొస్తుంది.

ఏడాదికి 5 కోట్ల

డెంగ్యూ వ్యాక్సిన్ల తయారీ



'బయోలాజికల్-ఈ'తో తకెడా భాగస్వామ్యం

హైదరాబాద్: జపాన్‌కు చెందిన బయోఫార్మాస్యూటికల్స్ కంపెనీ తకెడా డెంగ్యూ వ్యాక్సిన్ల (క్యూడెంగా) తయారీని వేగవంతం చేయడానికి హైదరాబాద్‌కు చెందిన 'బయోలాజికల్-ఈ' (బీఈ)తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. బయోఆసియా వేదికగా కుదిరిన ఈ ఒప్పందం కింద బయోలాజికల్-ఈ ఏడాదికి 5 కోట్ల డెంగ్యూ వ్యాక్సిన్ డోసేజీలు తయారుచేస్తుంది. ఒక దశాబ్ది కాలంలో ఏడాదికి 10 కోట్ల వ్యాక్సిన్ డోసేజీలు తయారుచేయాలన్న తకెడా లక్ష్యాన్ని ఈ భాగస్వామ్యం వేగవంతం చేస్తుంది. దీనివల్ల డెంగ్యూ వ్యాధి ప్రబలంగా ఉన్న దేశాలకు జాతీయ ఇమ్యునైజేషన్ కార్యక్రమం కింద క్యూడెంగా వ్యాక్సిన్లు తగినన్ని అందుబాటులోకి వస్తాయని తకెడా గ్లోబల్ వ్యాక్సిన్ బిజినెస్ యూనిట్ ప్రెసిడెంట్ గ్యారీ డబిన్ అన్నారు. వ్యాక్సిన్ల తయారీలో బీఈకి లోతైన నైపుణ్యం ఉన్నదంటూ తమ భాగస్వామ్యం ప్రపంచం నుంచి డెంగ్యూను నిర్మూలించగలదన్న విశ్వాసం ఆయన ప్రకటించారు. క్యూడెంగా వ్యాక్సిన్ల తయారీలో తకెడాతో భాగస్వామ్యం కుదుర్చుకోవడం గర్వంగా ఉన్నదని బీఈ మేనేజింగ్ డైరెక్టర్ మహిమ దాట్ల అన్నారు. ప్రస్తుతం క్యూడెంగా వ్యాక్సిన్లు యూరప్, ఇండోనేషియా, థాయ్‌లాండ్‌లలో పిల్లలకు, పెద్దలకు కూడా ప్రైవేటుగా అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం ఈ వ్యాక్సిన్ వినియోగానికి భారత్‌లో అనుమతి లేదు.

హైదరాబాద్‌లో మిల్టెనీ బయోటెక్ సీఓఈ

జర్మనీకి చెందిన బయో మెడికల్ ఉత్పత్తులు, సేవల కంపెనీ మిల్టెనీ బయోటెక్ హైదరాబాద్‌లో తొలి కార్యాలయాన్ని, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను (సీఓఈ) ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. భారత్‌లో ఈ తరహా సీఓఈల్లో ఇదే మొదటిదని కంపెనీ తెలిపింది. శాస్త్రవేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు, క్లినికల్ నిపుణులు ఈ కేంద్రంలో సెల్, జీన్ థెరపీల్లో ప్రత్యక్ష శిక్షణ పొందగలుగుతారని కంపెనీ ఎండీ బోరిస్ స్టోఫెల్ బయోఆసియా సదస్సు సందర్భంగా ప్రకటించారు. దీనివల్ల ప్రీ క్లినికల్/క్లినికల్ అభివృద్ధి, వాణిజ్యపరంగా వాటిని అందుబాటులోకి తేవడంపై వారికి అవగాహన ఏర్పడుతుందన్నారు. రోగులకు ఇప్పటివరకు అందుబాటులో లేని వైద్య అవసరాలు తీర్చడానికి వీలుగా కొత్త థెరపీల అభివృద్ధిపై ప్రభుత్వ సహకారాన్ని ఆయన కోరారు.

పరిశోధనలకు నిధులే పెద్ద అవరోధం

ఔషధ అభివృద్ధి రంగంలో పరిశోధనలకు నిధులే పెద్ద అవరోధమని బయో ఆసియా సందర్భంగా "ఆర్ అండ్ డీ 2.0: ఇప్పుడు కాకపోతే ఇక ఎన్నటికీ సాధ్యం కాదు" అనే అంశంపై జరిగిన గోష్ఠిలో పాల్గొన్న వక్తలన్నారు. ఔషధ పరిశోధనలు అత్యంత ఆసక్తికరమైన, రిస్క్‌తో కూడిన విభాగమని డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ కో ఛైర్మన్ జీవీ ప్రసాద్ అన్నారు. 1990 దశకంలో ఆర్ అండ్ డీలోకి అడుగుపెట్టిన తాము 2010 నాటికే 15 కోట్ల డాలర్ల వరకు ఆ విభాగంపై ఖర్చు చేశామని తెలిపారు. తాము ఎన్నడూ లాభాల నుంచి ఆర్ అండ్ డీకి వనరులు ఖర్చు చేయలేదని, అనుబంధ ఆర్ అండ్ డీ విభాగం సహకార భాగస్వామ్యాల ద్వారా అందుకు నిధులు సమకూర్చుకున్నదని చెప్పారు. ఔషధ పరిశోధనల రంగంలో ప్రభుత్వ సంస్థలు కూడా బలంగా లేవంటూ నిధులు, మౌలిక వసతుల కొరత తీర్చడానికి సహకార భాగస్వామ్యాలే పెద్ద ఆలంబన అని స్పష్టం చేశారు.

భారత మార్కెట్లోకి ఫోర్డ్ రీఎంట్రీ

» ఈసారి హైబ్రిడ్, ఈవీలపై ఫోకస్

న్యూఢిల్లీ: రెండేళ్ల క్రితం భారత మార్కెట్ నుంచి వైదొలిగిన అంతర్జాతీయ వాహన దిగ్గజం ఫోర్డ్ పునఃప్రవేశ ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. అయితే, ఈసారి హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ) పైనే దృష్టిసారించనున్నట్లు సమాచారం. చెన్నైలోని తన ప్లాంట్‌లో వీటిని ఉత్పత్తి చేయాలనుకుంటోంది. తాజాగా కంపెనీ అంతర్జాతీయంగా ఏ మార్కెట్లోనూ ప్రవేశపెట్టని కాంపాక్ట్ ఎస్‌యూవీ కార్ డిజైన్‌కు పేటెంట్ పొందింది. హ్యుండయ్ క్రెటాకు పోటీగా ఫోర్డ్ ఈ మోడల్‌ను దేశీ మార్కెట్లో ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. చెన్నై ప్లాంట్ ఏటా 2 లక్షల వాహనాలు, 3.40 లక్షల ఇంజన్ల తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉంది.

రూ.9,000 లోపే జియో 5జీ ఫోన్!

న్యూఢిల్లీ: ముకేశ్ అంబానీకి చెందిన టెలికాం కంపెనీ రిలయన్స్ జియో చౌకగా 5జీ ఫోన్‌ను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. అమెరికన్ చిప్ తయారీ దిగ్గజం క్వాల్‌కామ్‌తో కలిసి అభివృద్ధి చేస్తున్న ఈ ఎంట్రీ లెవెల్ 5జీ జియో ఫోన్‌ను ఏడాది చివరినాటికి మార్కెట్లోకి విడుదల చేసే అవకాశాలున్నాయి. దీని ధర రూ.9,000 లోపే ఉండవచ్చని సమాచారం.

వొడాఫోన్ ఐడియా రూ. 45,000 కోట్ల సమీకరణ

ఈక్విటీ జారీ ద్వారా రూ.20,000 కోట్లు

» రుణ పత్రాల ద్వారా రూ.25 వేల కోట్లు

» కంపెనీపై రూ.2.1 లక్షల కోట్ల రుణ భారం



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా (వి) భారీ నిధుల సమీకరణ ప్రణాళికను ప్రకటించింది. ఈక్విటీ, ఈక్విటీ అనుసంధానిత సాధనాల ద్వారా రూ.20,000 కోట్ల సమీకరణకు కంపెనీ బోర్డు మంగళవారం ఆమోదం తెలిపింది. ఈక్విటీ జారీ ప్రక్రియలో ప్రమోటర్లు సైతం పాల్గొననున్నట్లు వొడాఫోన్ ఐడియా తెలిపింది. ఈక్విటీ, డెట్ (రుణ పత్రాలు) జారీ ద్వారా మొత్తం రూ.45,000 కోట్లు సమీకరించాలనుకుంటున్నట్లు కంపెనీ ఈ సందర్భంగా వెల్లడించింది. రూ.2.1 లక్షల కోట్ల రుణ భారం, వందల కోట్ల నష్టాలతో పాటు నెలనెలా చేజారుతున్న వినియోగదారులతో ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోయిన కంపెనీ ప్రస్తుతం మనుగడ కోసం పోరాడుతోంది. సంస్థ పునరుద్ధరణతో పాటు రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ నుంచి పోటీ తట్టుకుని మార్కెట్లో నిలబడేందుకు వొడాఫోన్ ఐడియాకు ఈ నిధుల సమీకరణ కీలకంగా మారింది. ఇందుకోసం బ్యాంకర్లు, కౌన్సిళ్ల నియామకానికి కంపెనీ బోర్డు తాజా సమావేశంలో యాజమాన్యానికి అధికారం కల్పించింది. ఈ ప్రక్రియకు అనుమతి కోరేందుకు కంపెనీ ఏప్రిల్ 2న వాటాదారుల సమావేశం నిర్వహించనుంది. వారి ఆమోదం లభించాక వచ్చే త్రైమాసికంలో ఈక్విటీ జారీ ద్వారా నిధులను సమీకరించనుంది. ఈ సొమ్ములో మెజారిటీ భాగాన్ని 4జీ సేవల విస్తరణతో పాటు 5జీ నెట్‌వర్క్ ఏర్పాటుకు వినియోగించుకోనున్నట్లు కంపెనీ వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం కంపెనీ నుంచి రావాల్సిన బకాయిలను గత ఏడాదిలో ఈక్విటీ రూపంలోకి మార్చుకుంది. తద్వారా కంపెనీలో కేంద్రానికి 33.1 శాతం వాటా లభించింది. కాగా, బ్రిటిష్ టెలికాం దిగ్గజం వొడాఫోన్ పీఎల్‌సీ 32 శాతం, కుమార మంగళం బిర్లాకు చెందిన ఆదిత్య బిర్లా గ్రూప్ 18 శాతం వాటా కలిగి ఉన్నాయి.

వాటా విక్రయ యత్నాల్లో ఆహా!

హైదరాబాద్: తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఆహాలో వ్యూహాత్మక వాటా విక్రయించేందుకు ప్రమోటర్లు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం కేపీఎంజీ కార్పొరేట్ ఫైనాన్స్‌ను సలహాదారుగా నియమించుకున్నట్లు విశ్వసనీయ వర్గాల వ్యాఖ్యలను ఉటంకిస్తూ మనీకంట్రోల్ కథనం పేర్కొంది. మై హోమ్ గ్రూప్‌నకు చెందిన రాము రావు, తెలుగు సినీ నిర్మాత అల్లు అరవింద్ ఈ ఓటీటీకి ప్రమోటర్లుగా ఉన్నారు. సబ్‌స్క్రైబర్లను పెంచుకోవడంతో పాటు కంటెంట్‌ను మరిన్ని దక్షిణాది భాషలకు విస్తరించే వ్యూహంలో భాగంగానే ప్రస్తుత ప్రమోటర్లు మరో భాగస్వామిని చేర్చుకోవాలని భావిస్తున్నట్లు కథనం వెల్లడించింది. ఈ ప్రక్రియలో భాగంగా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌కు రూ.2,000 కోట్ల స్థాయి మార్కెట్ విలువను ఆశిస్తున్నట్లు సమాచారం. జీ గ్రూప్‌తో విలీన ఒప్పందాన్ని రద్దు చేసుకున్న సోనీ గ్రూప్ ఆహాలో వాటాపై ఆసక్తిగా ఉందన్న ఊహాగానాలు వెలువడినప్పటికీ, సోనీ ఆ వార్తలను ఖండించింది. 2020లో ప్రారంభమైన ఆహా.. దక్షిణాది భాషలకు చెందిన ప్రముఖ ఓటీటీల్లో ఒకటిగా ఎదిగింది. ప్రస్తుతం ఈ ప్లాట్‌ఫామ్‌కు 70 లక్షలకు పైగా మంత్లీ యాక్టివ్ సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ప్రస్తుతం తెలుగు, తమిళ కంటెంట్‌ను అందిస్తున్న ఈ ఓటీటీ.. కన్నడ, మలయాళంలోకీ విస్తరించడంతోపాటు ఒక్కో వినియోగదారు నుంచి లభించే సగటు ఆదాయాన్ని సైతం పెంచుకునే ప్రయత్నాల్లో ఉంది. ఆహా ఓటీటీ యాజమాన్య సంస్థ అర్హ మీడియా అండ్ బ్రాడ్‌కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం (2022-23)లో రూ.122.08 కోట్ల ఆదాయాన్ని ప్రకటించింది.

జీఆర్‌టీ జువెలర్స్ 'చెవి రింగుల సంబరాలు'

హైదరాబాద్: జీఆర్‌టీ జువెలర్స్.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 'చెవి రింగుల సంబరాలు' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. వినియోగదారులకు వినూత్నమైన షాపింగ్ అనుభూతిని కలిగించే ఉద్దేశంతో దీన్ని ప్రారంభించినట్లు తెలిపింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటకల్లో కూడా ఇది అందుబాటులో ఉంటుందని వెల్లడించింది. ఇందులో భాగంగా ప్రత్యేకంగా చేతితో రూపొందించబడిన అద్భుతమైన, ఆకర్షణీయమైన చెవి రింగుల కలెక్షన్‌ను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు జీఆర్‌టీ జువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్స్ జీఆర్ ఆనంద్ అనంత పద్మనాభన్, జీఆర్ రాధాకృష్ణన్ తెలిపారు. క్లాసిక్ డిజైన్స్ నుంచి ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగా ఉండే విధంగా వీటిని రూపొందించినట్లు పేర్కొంది. కాగా బంగారు ఆభరణాలపై ప్రత్యేక ఆఫర్లను తీసుకువచ్చినట్లు తెలిపింది. పాత బంగారు ఆభరణాల ఎక్స్ఛేంజీపై ప్రతి గ్రాముకు అదనంగా రూ.50 అందించటంతో పాటు కొత్త బంగారు ఆభరణాల కొనుగోలుపై ప్రతి గ్రాముకు రూ.50 తగ్గింపును ఇవ్వనున్నట్లు జీఆర్‌టీ జువెలర్స్ తెలిపింది.

CHEVI RINGULA Sambaraalu

హిందుజాల చేతికి రిలయన్స్ క్యాపిటల్

ముంబై: రిలయన్స్ క్యాపిటల్ (ఆర్ క్యాప్) దివాలా ప్రక్రియ కొలిక్కి వస్తోంది. అనిల్ అంబానీ గ్రూప్ అడాగ్ ప్రమోట్ చేసిన ఈ కంపెనీ ఆస్తులు, వ్యాపారం కొనుగోలు కోసం హిందుజా గ్రూప్ కంపెనీ ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ (ఐఐహెచ్) గత ఏడాది జూన్‌లో సమర్పించిన రూ.9,650 కోట్ల బిడ్‌ను ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్ ఆమోదించింది. కంపెనీ రుణదాతలు కూడా ఇందుకు ఆమోదం తెలిపారు. దీంతో వారికి రావలసిన రూ.38,526.42 కోట్ల బకాయిల్లో రూ.9,661 కోట్లు (37 శాతం) మాత్రమే వసూలు కానున్నాయి. డీహెచ్‌ఎఫ్‌ఎల్ తర్వాత ఎన్‌సీఎల్‌టీ దివాలా ప్రక్రియకు వచ్చిన రెండో ఎన్‌బీఎఫ్‌సీ ఆర్ క్యాప్ మాత్రమే.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,850 ▲	57,610 ▲	75,500 ▼
ముంబై	62,271 ▲	57,040 ▲	69,902 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

27వ తేదీ	
హైదరాబాద్	490
28వ తేదీ	
చిత్తూరు	553
గోదావరి	475
విజయవాడ	475
విశాఖపట్నం	500
వరంగల్	492
డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	140
వరంగల్	140
కరీంనగర్	140
మహబూబ్‌నగర్	140
కర్నూలు	140
విశాఖపట్నం	127
గోదావరి	144
విజయవాడ	144
గుంటూరు	144
ఒంగోలు	144
చిత్తూరు	144

ఈ ఏడాది వేతనాల్లో 10% వృద్ధి: మెర్సర్

న్యూఢిల్లీ: ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా ఈ సంవత్సరం కూడా మన దేశంలో ఉద్యోగుల జీతాలు పెరగనున్నాయి. అన్ని రంగాల్లో ఈ పెరుగుదల సగటున 10 శాతం వరకు ఉంటుందని మెర్సర్ అనే కన్సల్టెన్సీ సంస్థ అంచనా. గత ఏడాదితో పోలిస్తే ఇది అర శాతం ఎక్కువ. 'టోటల్ రెమ్యునరేషన్ సర్వే' పేరుతో మెర్సర్ సంస్థ విడుదల చేసిన ఒక నివేదిక ఈ విషయం తెలిపింది. ఆటోమొబైల్, తయారీ, ఇంజనీరింగ్, లైఫ్ సైన్సెస్ రంగాల కంపెనీల్లో పని చేసే ఉద్యోగుల జీతాల పెరుగుదల మరింత ఎక్కువగా ఉంటుందని ఆ సర్వే పేర్కొంది. 'ఇది భారత ఆర్థిక వ్యవస్థ పనితీరు, సృజనాత్మకత, నైపుణ్యాలను సూచిస్తోంది' అని సర్వే తెలిపింది.

టాటా షేర్లలో ర్యాలీ

305 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: టాటా గ్రూప్‌లోని ప్రధాన కంపెనీల షేర్లలో కొనుగోళ్లు ప్రామాణిక ఈక్విటీ సూచీలను ముందుకు నడిపించాయి. అంతర్జాతీయ మార్కెట్లో సానుకూల ట్రేడింగ్ ట్రెండ్ సైతం ర్యాలీకి దోహదపడింది. మంగళవారం ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ 305.09 పాయింట్ల లాభంతో 73,095.22 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 76.30 పాయింట్ల వృద్ధితో 22,198.35 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 19 లాభపడ్డాయి. టాటా మోటార్స్ 2.78 శాతం పెరిగి సూచీ టాప్ గెయినర్‌గా నిలవగా.. టీసీఎస్ 2.56 శాతం, టాటా స్టీల్ 1.09 శాతం, టైటాన్ 0.87 శాతం వృద్ధి చెందాయి. ఎస్‌బీఐ, బజాజ్ ఫైనాన్స్ షేర్లు మాత్రం ఒక శాతానికి పైగా నష్టపోయాయి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం 0.25 శాతం వరకు నష్టపోయాయి. రంగాలవారీ సూచీల్లో రియల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ సూచీలు ఒక శాతానికి పైగా పెరగగా.. ఐటీ, టెక్నాలజీ, క్యాపిటల్ గూడ్స్ ఇండెక్స్‌లు అర శాతానికి పైగా పెరిగాయి. ఫారెక్స్ మార్కెట్ విషయానికొస్తే, డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక పైసా తగ్గి 82.89 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ రకం ముడి చమురు పీపా ధర ఒక దశలో స్వల్ప పెరుగుదలతో 82.66 డాలర్ల వద్ద ట్రేడైంది.

అప్పర్ సర్క్యూట్ నుంచి స్వల్ప నష్టాల్లోకి పేటీఎం షేరు: పేటీఎం బ్రాండ్ యాజమాన్య సంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ షేరు వరుసగా రెండో రోజూ అప్పర్ సర్క్యూట్‌ను తాకినప్పటికీ చివరికి స్వల్ప నష్టాల్లో ముగిసింది. బీఎస్ఈలో కంపెనీ షేరు ఒక దశలో 4.98 శాతం వృద్ధితో రూ.449.30 వద్దకు చేరినప్పటికీ.. ట్రేడింగ్ నిలిచేసరికి 0.11 శాతం నష్టంతో రూ.427.50 వద్ద స్థిరపడింది.

ఐపీఓ అప్‌డేట్స్: మంగళవారం ప్రారంభమైన రెండు పబ్లిక్ ఇష్యూలకు ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన లభించింది. ఈవీ చార్జర్ల తయారీదారు ఎక్సికామ్ టెలీ-సిస్టమ్స్ లిమిటెడ్ ఐపీఓ తొలి రోజు ముగిసేసరికి, ఇష్యూ సైజుకు 10 రెట్ల బిడ్లు దాఖలు కాగా.. స్టెబిలైజర్ల తయారీ కంపెనీ ప్లాటినమ్ ఇండస్ట్రీస్ ఐపీఓకు 8 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

1ఇంటిగ్రేటెడ్ మార్కెటింగ్ సర్వీసెస్ కంపెనీ ఆర్‌కే స్వామి లిమిటెడ్ ఐపీఓ వచ్చే నెల 4న ప్రారంభమై 6న ముగియనుంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా రూ.173 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత వాటాదారులకు చెందిన 87 లక్షల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిలో విక్రయించనుంది.

రెండేళ్ల గరిష్ఠానికి బిట్‌కాయిన్: ప్రముఖ క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్ ఒకే రోజులో 9 శాతం మేర పెరిగి 57,000 డాలర్లు దాటింది. ఈ కరెన్సీకి రెండేళ్లకు పైగా గరిష్ఠ స్థాయిది.

స్పోర్ట్స్

33 బంతుల్లోనే సెంచరీ

» నమీబియా బ్యాటర్ విధ్వంసం

» టీ20ల్లో ఇదే ఫాస్టెస్ట్


లాఫ్టీ ఈటన్

కీర్తిపూర్ (నేపాల్): నమీబియా బ్యాటర్ జాన్ నికోల్ లాఫ్టీ ఈటన్ అంతర్జాతీయ టీ20ల్లో చరిత్ర సృష్టించాడు. కేవలం 33 బంతుల్లోనే సెంచరీ బాదేసి అత్యంత వేగంగా ఈ ఫీట్ సాధించిన బ్యాటర్‌గా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, 8 సిక్సర్లున్నాయి. నేపాల్ ప్లేయర్ కుశాల్ మల్ల (34 బంతుల్లో మంగోలియాపై) పేరిట ఉన్న రికార్డును తను అధిగమించాడు. నేపాల్-నమీబియా-నెదర్లాండ్స్ దేశాల ముక్కోణపు టీ20 సిరీస్‌లో భాగంగా మంగళవారం నమీబియా-నేపాల్ మధ్య మ్యాచ్ జరిగింది. నికోల్ మొత్తంగా 36 బంతుల్లో 101 రన్స్ చేసి ఆఖరి ఓవర్‌లో వెనుదిరిగాడు. అతడి ధాటికి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నమీబియా 20 ఓవర్లలో 4 వికెట్లకు 206 పరుగులు చేసింది. ఆ తర్వాత ఛేదనలో నేపాల్ 18.5 ఓవర్లలో 186 పరుగులు చేసి ఓటమి పాలైంది.



ఫైనల్ చేరేదెవరో?

» ప్రొ కబడ్డీ సెమీఫైనల్స్ నేడే

» రాత్రి 8 గం. నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో..

హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ ముగింపు దశకు చేరుకొంది. బుధవారం జరిగే తొలి సెమీస్‌లో టేబుల్ టాపర్ పుణెరి పల్టన్‌తో పట్నా పైరేట్స్, రెండో సెమీస్‌లో హరియాణా స్టీలర్స్‌తో డిఫెండింగ్ చాంప్ జైపూర్ పింక్ పాంథర్స్ అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఎలిమినేటర్ మ్యాచ్‌ల్లో గుజరాత్ జెయింట్స్‌పై హరియాణా, దబాంగ్ ఢిల్లీపై పట్నా గెలిచి ఫైనల్ ఫోర్‌కు అర్హత సాధించాయి. కాగా, పాయింట్ల పట్టికలో టాప్-2లో నిలిచిన పుణె, జైపూర్‌లు నేరుగా సెమీస్‌కు చేరుకొన్నాయి.

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ముంబై X యూపీ
రాత్రి 7.30 గం. నుంచి

ఆర్‌సీబీ ఆల్‌రౌండ్ షో


స్మృతి మంధాన (27 బంతుల్లో 43)

వరుసగా రెండో విజయం
రాణించిన మంధాన, మేఘన
గుజరాత్‌తో మ్యాచ్

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జోరు చూపుతోంది. మంగళవారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్‌షోతో ఆకట్టుకుని 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆర్‌సీబీకిది వరుసగా రెండో విజయం కాగా, టైటాన్స్‌కు రెండో ఓటమి. స్వల్ప ఛేదనలో కెప్టెన్ స్మృతి మంధాన (27 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్‌తో 43)తో పాటు తెలుగు బ్యాటర్ సబ్బినేని మేఘన (28 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 36 నాటౌట్) ఆకట్టుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌ను ఆర్‌సీబీ బౌలర్లు కట్టడి చేశారు. దీంతో 20 ఓవర్లలో 7 వికెట్లకు 107 పరుగులు మాత్రమే చేసింది. మిడిలార్డర్‌లో హేమలత (31 నాటౌట్) మాత్రమే పోరాడినా ఫలితం లేకపోయింది. ఆరుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. పేసర్ రేణుకా సింగ్ (2/14) పొదుపైన బౌలింగ్‌లో టాపార్డర్ పని బట్టింది. స్పిన్నర్ మోలినెక్స్‌కు మూడు వికెట్లు దక్కాయి.

తొలి ఓవర్ నుంచే..

ఛేదన కోసం బరిలోకి దిగిన ఆర్‌సీబీ 12.3 ఓవర్లలో 2 వికెట్లకు 110 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ మంధాన తొలి ఓవర్‌లోనే మూడు ఫోర్లతో బాదుడు ఆరంభించింది. నాలుగో ఓవర్‌లో డివైన్ (6) అవుటైనా.. మేఘన జత కలవడంతో స్కోరు మరింత వేగంగా దూసుకెళ్లింది. ఇద్దరూ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ఐదు, ఎనిమిదో ఓవర్లలో మేఘన రెండేసి ఫోర్లతో జోరు చూపింది. రెండో వికెట్‌కు మంధానతో కలిసి 40 పరుగులు అందించిన మేఘన, 11వ ఓవర్‌లో 6,4తో మరింత దూకుడు కనబరిచింది. అటు ఎలిస్ పెర్రీ (14 బంతుల్లో 4 ఫోర్లతో 23 నాటౌట్) తనకు సహకారం అందించడంతో మరో 45 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది. మూడో వికెట్‌కు ఈ జోడీ అజేయంగా 38 రన్స్ జోడించింది.

సంక్షిప్త స్కోర్లు

గుజరాత్: 20 ఓవర్లలో 7 వికెట్లకు 107 (హేమలత 31 నాటౌట్, హర్లీన్ 22; మోలినెక్స్ 3/25, రేణుకా సింగ్ 2/14); **బెంగళూరు:** 12.3 ఓవర్లలో 2 వికెట్లకు 110 (స్మృతి మంధాన 43, మేఘన 36 నాటౌట్, పెర్రీ 23 నాటౌట్; గార్డ్‌నర్ 1/15, తనూజ 1/20).

జురెల్ ఆటకు ఫిదా

● అద్భుతమైన ఆటగాడంటున్న మాజీలు
● ధోనీతో పోల్చిన గవాస్కర్


ధ్రువ్ జురెల్

న్యూఢిల్లీ: సరైన వికెట్ కీపర్-బ్యాటర్ కోసం వెతుకుతున్న భారత్‌కు తానే తగిన సమాధానమంటూ ధ్రువ్ జురెల్ తెరపైకి దూసుకొచ్చాడు. 2022లో జరిగిన యాక్సిడెంట్ కారణంగా రిషభ్ పంత్ దూరం కావడంతో.. ఆ స్థానాన్ని భర్తీ చేసే వికెట్ కీపర్ కోసం టీమిండియా ఎదురు చూస్తోంది. ఇంగ్లండ్‌తో తొలి రెండు టెస్టుల్లో కేఎస్ భరత్ బ్యాటర్‌గా ఆకట్టుకోలేక పోవడంతో.. మూడో టెస్ట్‌లో జురెల్‌కు చాన్స్ దక్కింది. ఆ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులు చేసిన ధ్రువ్.. రాంచీ టెస్ట్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో 90 పరుగులతో ఆపద్బాంధవుడిగా నిలిచాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఒడిదొడుకులు ఎదురైనా.. గిల్‌తో కలసి జట్టును గెలిపించాడు. క్లిష్టపరిస్థితుల్లోనూ కంగారుపడకుండా.. స్ట్రయిక్ రొటేట్ చేసిన తీరుకు మాజీ క్రికెటర్లు ఫిదా అయ్యారు. భారత్‌కు 'రత్నం' దొరికిందని కొనియాడారు. మాజీ కెప్టెన్ గవాస్కర్ అయితే.. ధ్రువ్‌ను మహేంద్ర సింగ్ ధోనీతో పోల్చాడు. సెహ్వాగ్, లక్ష్మణ్‌తోపాటు ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు టామ్ మూడీ కూడా ఈ యువ ఆటగాడి పోరాట పటిమను ప్రశంసించాడు.

ఫోక్స్ సలాం..!: ప్రత్యర్థి ఆటగాళ్లు మెచ్చుకోవడమంటే సామాన్యం కాదు. అలాంటిది ఇంగ్లండ్ కీపర్ ఫోక్స్ కూడా ధ్రువ్ పోరాటపటిమకు అభివందనాలు తెలిపాడు. 'ఫోక్స్‌కు జురెల్‌పై అభిమానం ఏర్పడింద'ని ఇంగ్లిష్ టీమ్ కెప్టెన్ స్టోక్స్ చెప్పాడు. ఒంటరి పోరాటం చేసి 90 పరుగుల వద్ద అవుటైనప్పుడు రూట్ కూడా జురెల్‌ను అభినందించాడు.

జడేజా కంటే ముందు పంపాలి : కుక్

రెండు మ్యాచ్‌లతోనే ఆకట్టుకొన్న జురెల్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో జడేజా కంటే ముందుగా పంపాలని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్ సూచించాడు. 'జురెల్ బ్యాటింగ్‌లో సమతుల్యత ఉంది. పాదాల కదలికల్లో వేగం ఉంది. మరోవైపు జడేజా రిస్క్ తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్నట్టుగా ఉంది. షాట్ ఆడే విషయంలో జడేజాతో పోల్చితే ధ్రువ్ బెటర్' అని అన్నాడు.

కెరీర్‌కు వాగ్నర్ వీడ్కోలు



వెల్లింగ్టన్: న్యూజిలాండ్ టెస్ట్ టీమ్ పేసర్ నీల్ వాగ్నర్ (37) కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఆస్ట్రేలియాతో గురువారం నుంచి జరిగే రెండు టెస్టుల సిరీస్‌లోని తుది జట్టులో అతడికి చోటులేదనే విషయాన్ని మేనేజ్‌మెంట్ స్పష్టం చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నాడు. 64 టెస్టులాడిన వాగ్నర్ 260 వికెట్లు పడగొట్టాడు. కాగా రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించే సమయంలో వాగ్నర్ కన్నీటి పర్యంతమయ్యాడు.

ముంబై జట్టులో అయ్యర్

ముంబై: తమిళనాడుతో జరిగే రంజీ సెమీస్‌లో ముంబై తరఫున శ్రేయాస్ అయ్యర్ ఆడనున్నాడు. ఫామ్ లేమితోపాటు గాయంతో బాధపడుతున్న అయ్యర్‌ను ఇంగ్లండ్‌తో చివరి మూడు టెస్ట్‌ల నుంచి తప్పించారు. అయితే, సెంట్రల్ కాంట్రాక్ట్ ప్లేయర్లు జాతీయ జట్టుకు దూరమైన పరిస్థితుల్లో ఫిట్‌గా ఉంటే తప్పనిసరిగా రంజీలు ఆడాల్సిందేనని బీసీసీఐ కార్యదర్శి జై షా అల్టిమేటం జారీ చేశాడు. వాషింగ్టన్ సుందర్ తమిళనాడు తరఫున బరిలోకి దిగనున్నాడు. ఇక మంగళవారం ప్రారంభమైన డీవై పాటిల్ టోర్నీలో ఆర్‌బీఐ తరఫున ఇషాన్ కిషన్ బరిలోకి దిగాడు.

షమి కాలికి సర్జరీ


ఐపీఎల్‌కు దూరం

న్యూఢిల్లీ: టీమిండియా సీనియర్ పేసర్ మహ్మద్ షమి కాలికి లండన్‌లోని ఓ ఆసుపత్రిలో సర్జరీ జరిగింది. కాలి మడమ కండర బంధనానికి నిర్వహించిన ఈ సర్జరీ నుంచి కోలుకోవడానికి కనీసం మూడు నెలల సమయం పట్టనుంది. దీంతో రాబోయే ఐపీఎల్‌కు అతడు పూర్తిగా దూరం కానున్నాడు. ఆ తర్వాత జూన్‌లో అమెరికాలో జరిగే టీ20 వరల్డ్‌కప్‌నకు కూడా అనుమానమే. గతేడాది వన్డే వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాతో ఫైనల్ తర్వాత.. గాయం కారణంగా షమి మళ్లీ బరిలోకి దిగలేదు. కాగా షమి త్వరగా కోలుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు.

హాకీ ఇండియా సీఈవో రాజీనామా


ఎలెనా నార్మన్

న్యూఢిల్లీ: హాకీ ఇండియాలో మరో రాజీనామా చోటు చేసుకుంది. ఈసారి ఏకంగా హెచ్‌ఐ సీఈవో ఎలెనా నార్మన్ తన పదవి నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించింది. ఆస్ట్రేలియాకు చెందిన ఎలెనా దాదాపు 13 ఏళ్లుగా ఈ పదవిలో కొనసాగడం గమనార్హం. హాకీ ఇండియాలో గ్రూపులు ఎక్కువయ్యాయని, అలాంటి చోట బాధ్యతలను నెరవేర్చడం అత్యంత కష్టమని నార్మన్ స్పష్టం చేసింది. ఆమె హయాంలో హాకీ ఇండియా వరుసగా రెండు పురుషుల వరల్డ్‌కప్ (2018, 2023)లకు ఆతిథ్యమిచ్చింది. మహిళల హాకీ జట్టు చీఫ్ కోచ్ జన్నెక్ షాప్‌మన్ సైతం హెచ్‌ఐలో తగిన గౌరవం లభించదంటూ గత వారం రాజీనామా చేసింది.

టెయిలెండర్ల శతకాలు

తనుష్-తుషార్ రికార్డు 1సెమీస్‌లో ముంబై, విదర్భ

ముంబై: బరోడా-ముంబై జట్ల మధ్య జరిగిన రంజీ క్వార్టర్ ఫైనల్లో సంచలన ప్రదర్శన నమోదైంది. ముంబై జట్టు పదో బ్యాటర్ తనుష్ కోటియన్ (120 నాటౌట్), ఆఖరి బ్యాటర్ తుషార్ దేశ్‌పాండే (123) శతకాలు సాధించి రంజీల్లో చరిత్ర సృష్టించారు. ఓవరాల్‌గా ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఇలా ఒకే ఇన్నింగ్స్‌లో చివరి ఇద్దరు బ్యాటర్లు సెంచరీలు చేయడం రెండోసారి మాత్రమే. 1946లో భారత ఆటగాళ్లు చందూ సర్వటే-షుట్ బెనర్జీ సర్రే కౌంటీపై ఓవల్‌లో ఈ ఫీట్ సాధించారు. ఇదే జోరులో బరోడాపై ఆఖరి వికెట్‌కు 232 పరుగులు జోడించడం విశేషం. అయితే కేవలం ఒక్క పరుగు తేడాతో ఈ వికెట్‌కు అత్యధిక భాగస్వామ్య రికార్డును అందుకోలేకపోయారు. వీరి ఆటతో ముంబై రెండో ఇన్నింగ్స్‌లో 599 పరుగులు సాధించింది. ఇక 606 పరుగుల ఛేదన కోసం బరిలోకి దిగిన బరోడా రెండో ఇన్నింగ్స్‌లో టీ బ్రేక్ సమయానికి 121/3 స్కోరుతో నిలువగా.. ఫలితం తేలే అవకాశం లేక ఆఖరి సెషన్‌ను రద్దు చేశారు. దీంతో మ్యాచ్ డ్రా కాగా 36 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ముంబై సెమీస్‌కు చేరింది.

కర్ణాటకకు షాక్

నాగ్‌పూర్: కర్ణాటకతో జరిగిన మరో క్వార్టర్స్‌లో విదర్భ 128 పరుగుల తేడాతో నెగ్గి సెమీస్‌కు చేరింది. 371 పరుగుల ఛేదనలో ఆఖరి రోజు మంగళవారం కర్ణాటక కుప్పకూలింది. 103/1 ఓవర్‌నైట్ స్కోరుతో పటిష్ఠంగానే కనిపించినా..హర్ష్ దూబే, ఆదిత్య నాలుగేసి వికెట్లతో వణికించగా జట్టు 243 పరుగులే చేయగలిగింది. మయాంక్ (70) టాప్ స్కోరర్. విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 460, రెండో ఇన్నింగ్స్‌లో 196 రన్స్ చేయగా, కర్ణాటక తొలి ఇన్నింగ్స్‌లో 286 పరుగులు చేసింది.

ఎవరెవరితో?
విదర్భ X మధ్యప్రదేశ్
ముంబై X తమిళనాడు
సెమీస్ మార్చి 2 నుంచి..


తుషార్ (123) తనుష్ (120 నాటౌట్)

రామానుజర్ సన్నిధిలో లోకేశ్



చెన్నై, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంగళవారం కాంచీపురం జిల్లా శ్రీపెరంబుదూర్‌లోని శ్రీరామానుజర్ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఉదయం 8.40 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా చెన్నై చేరుకున్న ఆయనకు, టీడీపీ చెన్నై విభాగ అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రముఖ ఆడిటర్ నూతలపాటి శ్రీకృష్ణ, పలువురు నగర ప్రముఖులు, టీడీపీ మద్దతుదారులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డుమార్గం ద్వారా ఆలయానికి చేరుకున్న లోకేశ్‌కు అక్కడి ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం లోకేశ్ సంప్రదాయపూర్వకంగా స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అన్నానగర్ ఎమ్మెల్యే మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడే ఉమ్మడి భేరి!



పశ్చిమ గోదావరి జిల్లా ప్రత్తిపాడులో టీడీపీ, జనసేన బహిరంగసభకు సిద్ధమవుతున్న వేదిక

భీమవరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ-జనసేన పార్టీల ఉమ్మడి తొలి బహిరంగ సభ 'తెలుగు జన విజయకేతన జెండా'కు సర్వం సిద్ధమైంది. పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు మండలం ప్రత్తిపాడులో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న 25 ఎకరాల విస్తీర్ణంలో ఈ సభ నిర్వహించనున్నారు. తొలి భారీ బహిరంగ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పాల్గొననున్నారు. వారిద్దరూ హెలికాప్టర్లో వేదిక వద్దకు చేరుకుంటారు. రెండు పార్టీల ముఖ్య నాయకులు, ఇన్‌చార్జులు, కమిటీల ప్రతినిధులు 500 మంది వరకు వేదికపై ఆశీనులు కానున్నారు. ఐదు లక్షల మంది జనం తరలివస్తారని అంచనా వేస్తున్నారు. సభ ఏర్పాట్లను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పర్యవేక్షించారు. అచ్చెన్నాయుడు విలేకరులతో మాట్లాడుతూ 'వైసీపీ సభలు మాత్రమే జరగాలి. ఇతర పార్టీలు ఏవీ కూడా సభలు నిర్వహించకూడదు. సభలు నిర్వహిస్తే అవాంతరాలు సృష్టిస్తున్నారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వైసీపీ విముక్త రాష్ట్రం కోసమే టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకున్నాయి. ప్రజలంతా స్వాగతిస్తున్నారు' అని చెప్పారు.

బస్సులు ఇవ్వొద్దని ఆదేశాలు

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదుకు నిర్దేశం

భీమవరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం-జనసేన పార్టీలు పశ్చిమ గోదావరి జిల్లా ప్రత్తిపాడులో నిర్వహించనున్న ఉమ్మడి బహిరంగసభపై వైసీపీ ప్రభుత్వం నిఘా పెట్టింది. ఏ జిల్లా నుంచి ఎంతమంది వస్తున్నారో గమనిస్తోంది. నియోజకవర్గాల వారీగా ఆరా తీస్తోంది. సభ ఏర్పాట్లలో తలమునకలైన నాయకుల వివరాలను సేకరిస్తోంది. సభకు జనం తరలిరాకుండా అవరోధాలు సృష్టించే ప్రయత్నం చేస్తోంది. ఆర్టీసీ బస్సులను ఇవ్వకుండా అడ్డుకుంది. ప్రైవేటు స్కూల్ బస్సులు ఇవ్వకుండా హెచ్చరికలు జారీచేసింది. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు అధికంగా నమోదు చేయాలని పోలీసులకు దిశానిర్దేశం చేసింది. సభ విజయవంతం అవకుండా చూసేందుకు అన్ని మార్గాలను అనుసరిస్తోంది.

జగన్‌పై పోటీచేస్తా

- ఏపీ పోలీసులపై నాకు నమ్మకం లేదు
- తెలంగాణ పోలీసులతో రక్షణ కల్పించండి
- రూ. 20 కోట్లు ఆఫర్ చేశారు: దస్తగిరి
- హైదరాబాద్ సీబీఐ కోర్టుకు హాజరు

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై పోటీ చేస్తానని వివేకానందరెడ్డి హత్యకేసులో అప్రూవర్ దస్తగిరి వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లోని నాంపల్లి సీబీఐ కోర్టు విచారణకు దస్తగిరి హాజరయ్యారు. విచారణ అనంతరం కోర్టు వెలుపల మీడియాతో మాట్లాడుతూ "వైసీపీ నేతలు ఎంపీ అవినాశ్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి, మనోహర్ రెడ్డి నన్ను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. సీబీఐ ఎస్పీ రామ్ సింగ్ నన్ను కొట్టి అప్రూవర్‌గా మార్చినట్టు చెప్పాలని ఒత్తిడి తెస్తున్నారు. వివేకా పీఏ కృష్ణారెడ్డి...రామ్ సింగ్ పై ఎలాంటి ఆరోపణలు చేశారో, నేనూ అలాగే చేయాలని ప్రలోభాలకు గురి చేస్తున్నారు. డబ్బు ఆఫర్ చేశారు" అని తెలిపారు. కిడ్నాప్ కేసులో అక్రమంగా అరెస్ట్ చేసి జైల్లో పెట్టిన సమయంలో దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి కుమారుడు చైతన్యరెడ్డి డాక్టర్ ముసుగులో జైలు లోపలకు వచ్చారని, రూ. 20 కోట్లు అడ్వాన్స్ కింద తీసుకోవాలని ప్రలోభాలకు గురి చేశారని ఆరోపించారు. ఏపీ పోలీసులపై తనకు నమ్మకం లేదని, తెలంగాణ పోలీసులతో భద్రత కల్పించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

టీడీపీ నేత మల్లెలపై రౌడీషీట్..!

- వైసీపీ నేతల ఒత్తిళ్లతో తెగించిన ఖాకీలు

కర్నూలు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మల్లెల రాజశేఖర్‌పై ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ తెరిచారు. ఎన్నికల ముందు ఆయన్ను కట్టడి చేసేందుకే వైసీపీ నేతల ఒత్తిళ్లతో పోలీసులు ఈ చర్యకు తెగించారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండలం హుశేనాపురం గ్రామానికి చెందిన ఈడిగ(గౌడ) సామాజికవర్గానికి చెందిన మల్లెల రాజశేఖర్ మొదటి నుంచి గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి దంపతుల ముఖ్య అనుచరుడిగా కొనసాగుతున్నారు. నంద్యాల జిల్లా పార్టీ అధ్యక్షునిగా పనిచేస్తున్న ఆయన పార్టీ బలోపేతం కోసం చురుగ్గా పనిచేస్తున్నారు.

బుజ్జగింపులు.. హామీలు..!

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వలేదంటే.. మిమ్మల్ని పార్టీ వద్దని అనుకున్నట్టు కాదని చంద్రబాబు స్పష్టం చేశారు. సర్వేలు, రాజకీయ సమీకరణలు, ప్రజాభిప్రాయం మేరకే ఎంపికలు జరిగాయన్నారు. నేతలంతా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ఆయనకు మాటిచ్చారు. అనంతపురం జిల్లా శింగనమల (ఎస్సీ) స్థానానికి శ్రావణి అభ్యర్థిత్వాన్ని ప్రకటించడంతో అసంతృప్తికి గురైన ముఖ్య నేతలు కేశవరెడ్డి, నర్సానాయుడుతో బాబు మాట్లాడారు. సర్వేల్లో వచ్చిన ప్రజాభిప్రాయం ప్రకారం ఆమెను ఎంపిక చేశామని, పార్టీ నిర్ణయానికి అనుగుణంగా పార్టీ యంత్రాంగం పనిచేసేలా చూడాలని వారిని కోరారు. పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే వారికి భవిష్యత్‌లో తగిన అవకాశాలు వస్తాయని చెప్పారు. అదే జిల్లా మడకశిర (ఎస్సీ) నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామిని కూడా ఆయన పిలిపించారు. యువ అభ్యర్థి అనిల్ కుమార్‌కు సహకరించి గెలిపించి తీసుకురావాలని కోరారు. కార్యకర్తల అభీష్టానికి వ్యతిరేకంగా అభ్యర్థి నిర్ణయం జరిగిందని తిప్పేస్వామి ఫిర్యాదు చేయగా.. సర్వేల ఆధారంగానే నిర్ణయం తీసుకున్నామని అధినేత చెప్పారు. మాజీ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి కుమారుడు పవన్‌కుమార్‌రెడ్డి కూడా చంద్రబాబును కలిశారు. అనంతపురం ఎంపీ సీటుకు తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని, అనంతపురం అర్బన్ సీటును ముస్లిం మైనారిటీలకు ఇచ్చే విషయాన్ని పరిశీలించాలని కోరారు. కదిరి మాజీ ఎమ్మెల్యే చాంద్‌బాషా కూడా కలిసిన వారిలో ఉన్నారు. కదిరి ప్రస్తుత ఇన్‌చార్జి కందికుంట వెంకట ప్రసాద్ పోటీకి న్యాయపరమైన ఇబ్బందులు ఉన్నాయని వింటున్నామని, ఆయనకు అవకాశం లేకపోతే తనకు టికెట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. హిందూపురం లోక్‌సభ స్థానానికైనా తన పేరును పరిశీలించాలని, గతంలో ఈ సీటు నుంచి ముస్లిం మైనారిటీ అభ్యర్థి ఎంపీగా గెలిచిన చరిత్ర ఉందని చెప్పారు. పరిశీలిస్తానని బాబు వారికి హామీఇచ్చారు.

నియోజకవర్గంలో ఉండాలని చెప్పానా..?

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్‌కు టికెట్ ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ ఆయన అనుచర గణం చంద్రబాబు నివాసం వద్ద సోమవారం హడావుడి చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధినేత ఆయన్ను పిలిపించి మాట్లాడారు. కార్యకర్తల మద్దతు తనకు ఉందని, తనకే అవకాశమివ్వాలని శంకర్ కోరారు. 'నియోజకవర్గంలో ఉండి పనిచేయాలని నీకు అనేకసార్లు చెప్పాను. మూడు నెలల క్రితం కూడా గట్టిగా చెప్పాను. అయినా వినలేదు. తంబళ్లపల్లెలో అధికార పార్టీ వేధింపులు బాగా ఎక్కువగా ఉన్నాయి. కార్యకర్తలకు అందుబాటులో ఉండి పనిచేసేవారిని నిలపాలని కొత్త అభ్యర్థిని ఎంపిక చేశాం. నీకు ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పిస్తాం. తగు గుర్తింపు ఇస్తాం' అని చంద్రబాబు మాటిచ్చారు. రాయచోటి టికెట్ రాంప్రసాద్‌రెడ్డికి ఇవ్వడంపై ఆ నియోజకవర్గ ముఖ్య నేత సుగవాసి ప్రసాద్‌తో ఆయన మాట్లాడారు. ఇద్దరూ చేతులు కలిపి సీటు గెలిచి రావాలని సూచించారు. ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి కూడా చంద్రబాబును కలిశారు. తొలి జాబితాలో తన పేరు రాకపోవడంతో ఆయన వచ్చినట్లు సమాచారం. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా పార్టీని అంటిపెట్టుకుని పనిచేస్తున్నానని, ఒకరిద్దరు నేతలు నియోజకవర్గంలో అలజడి సృష్టిస్తున్నారని ఫిర్యాదు చేశారు. నెల్లిమర్ల టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు కూడా చంద్రబాబును కలిశారు. పొత్తులో భాగంగా ఆ సీటును జనసేనకు ఇవ్వాల్సి వచ్చిందని.. ఆ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని సూచించారు. సీట్లు కోల్పోయినవారికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కర్నూలు పార్లమెంటు నేతలు భానుశంకర్, నాగరాజు, నంద్యాల పార్లమెంటు నాయకుడు కేవీ సుబ్బారెడ్డి, రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి కూడా ఆయన్ను కలిశారు. గుంటూరు జిల్లా నేతలు కోవెలమూడి నాని, ఆలపాటి రాజేంద్రప్రసాద్ కూడా విడివిడిగా చంద్రబాబును కలిశారు. అనంతపురం జిల్లాకు కొత్తగా సమన్వయకర్తగా నియమితుడైన నాని అక్కడ తన పరిశీలనకు వచ్చిన విషయాలను ఆయనకు వివరించారు. మరోవైపు.. పెద్దసంఖ్యలో శ్రీకాళహస్తి నేతలతో వచ్చిన మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహనరావును కలిశారు. తనకు అవకాశం ఇస్తే శ్రీకాళహస్తిలో ఘన విజయం సాధిస్తానని, తన పేరు పరిశీలించాలని కోరారు. సత్యవేడులో తన పేరు పరిశీలించాలని తాళ్లపాక అన్నమాచార్య వంశస్థుడైన తాళ్లపాక దాము కూడా కంభంపాటికి విజ్ఞప్తి చేశారు.

టీడీపీలోకి వేమిరెడ్డి, లావు

వైసీపీ పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి(రాజ్యసభ), లావు శ్రీకృష్ణదేవరాయలు(లోక్‌సభ) త్వరలో టీడీపీలో చేరనున్నారు. మార్చి మొదటి వారంలో సైకిల్ ఎక్కనున్నారు. వీరికి నెల్లూరు, నర్సరావుపేట లోక్‌సభ టికెట్లు ఇవ్వాలని టీడీపీ నిర్ణయించింది. మార్చి 2న నెల్లూరులో నిర్వహించనున్న కార్యక్రమంలో వేమిరెడ్డి దంపతులు టీడీపీలో చేరనున్నారని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత పొంగూరు నారాయణ తెలిపారు. మంగళవారం ఆయన చంద్రబాబును కలిశారు. "మార్చి 2న నెల్లూరుకు రావాలని చంద్రబాబును ఆహ్వానించా. ఆ రోజు ఉమ్మడి జిల్లాలోని అనేక నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో వైసీపీ నేతలు టీడీపీలో చేరనున్నారు. నెల్లూరులో మొత్తం 10 అసెంబ్లీ స్థానాలు గెలుస్తున్నాం. జిల్లా మొత్తాన్ని క్లీన్ స్వీప్ చేస్తున్నాం" అని ధీమా వ్యక్తం చేశారు. లావు శ్రీకృష్ణదేవరాయలు కూడా విడిగా చంద్రబాబును కలిసి మాట్లాడారు. టీడీపీలో చేరుతున్నానని చెప్పారు. కాగా, వైసీపీకి ఇటీవల రాజీనామా చేసిన నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు అభ్యర్థిత్వంపై టీడీపీ మంగళవారం ఫోన్ సర్వే నిర్వహించింది. బీజేపీతో పొత్తు ఉండే పక్షంలో ఆయన ఆ పార్టీ తరఫున నరసాపురం నుంచి పోటీ చేస్తారని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరిగింది.

పి.గన్నవరం 'మహాసేన'కు ఇవ్వొద్దు!

- జనసైనికుల పట్టు.. టీడీపీ సమన్వయ భేటీలో తీవ్ర ఉద్రిక్తత
- లోక్‌సభ ఇన్‌చార్జి హరీశ్ కారు అద్దాలు ధ్వంసం
- సర్దిచెప్పిన టీడీపీ-జనసేన నేతలు



జనసేన కార్యకర్తల దాడిలో ధ్వంసమైన టీడీపీ నేత హరీశ్ కారు

అమలాపురం/అంబాజీపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం(ఎస్సీ) నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం మంగళవారం రసాభాసగా ముగిసింది. టీడీపీ అభ్యర్థిగా సరిపెల్ల రాజేశ్(మహాసేన రాజేష్) పేరును ప్రకటించడాన్ని నిరసిస్తూ జనసేన శ్రేణులు ఆందోళనకు దిగాయి. ఈ సీటును రాజేశ్‌కు కేటాయించడానికి జనసేనతో పాటు టీడీపీ కార్యకర్తలు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం అంబాజీపేటలో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దీనికి టీడీపీ జోన్-2 పరిశీలకుడు సుజయకృష్ణ రంగారావు హాజరయ్యారు. టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, అమలాపురం పార్లమెంట రీ ఇన్‌చార్జి గంటి హరీశ్ మాధుర్, పార్టీ పరిశీలకుడు షేక్ సుభాన్ హాజరయ్యారు. టీడీపీకి చెందిన 4 మండలాల సమన్వయ కమిటీ నేతలతో సంప్రదింపులు చేపట్టారు. తొలుత అయినవిల్లి మండల నేతలతో చర్చలు మొదలుపెట్టారు. ఇదే సమయంలో అక్కడకు సమీపంలోని కొర్లపాటివారిపాలెంలో జనసేన నేతలు బుధవారం జరిగే తాడేపల్లిగూడెం సభపై చర్చించుకుంటున్నారు. టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం జరుగుతోందని తెలిసి వారంతా హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. మహాసేన రాజేశ్‌కు టికెట్ రద్దు చేయాలన్నారు. రాజేశ్ గో బ్యాక్ అంటూ నినాదాలు ఇచ్చారు. ఓ టీడీపీ నేత ఆయనతో మంతనాలు జరిపినట్లు తెలిసి.. అతడిపై దాడికి విఫలయత్నం చేశారు. కుర్చీలు, బల్లలను గాల్లోకి విసురుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో.. టీడీపీ నేతలు వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. లోపల గదిలో ఉన్న హరీశ్ బయటకు వచ్చి బుజ్జగించేందుకు ప్రయత్నిస్తుండగా.. జనసైనికులు ఆయనపై విరుచుకుపడ్డారు. టీడీపీ శ్రేణులను తోసుకుంటూ ప్రత్యేక గదిలో సమావేశమైన టీడీపీ నేతలు రంగారావు, రెడ్డి అనంతకుమారి వద్దకు చొచ్చుకువెళ్లారు. పరిస్థితి చేజారడంతో రంగారావు, అనంతకుమారి, సుభాన్‌లను టీడీపీ నాయకులు గదిలో ఉంచి తలుపులు వేశారు. జనసైనికులు అక్కడే ఉన్న హరీశ్ కారు అద్దాలను ధ్వంసం చేశారు. వెంటనే టీడీపీ, జనసేన నేతలు జోక్యం చేసుకుని సర్దుబాటు చేశారు. పోలీసులు రావడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. తర్వాత హరీశ్.. జనసేన నేతలు శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, దొమ్మేటి సాయికృష్ణ, అడబాల తాతకాపుల మంతనాలు జరిపారు. అనంతరం రంగారావు, సుభాన్, అనంతకుమారి, హరీశ్ మండలాల వారీగా టీడీపీ సమన్వయ కమిటీ నేతలతో సంప్రదింపులు కొనసాగించారు. రాజేశ్ ఎంపికకు దారితీసిన పరిస్థితులను కేడర్‌కు వివరించారు. వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వీటిని అధిష్ఠానానికి నివేదిస్తామని రంగారావు ఆ తర్వాత విలేకరులకు వెల్లడించారు.

క్రీడాకారుల జీవితాలతో వైసీపీ చెలగాటం

రాష్ట్రం పరువు బంగాళాఖాతంలో కలిసిపోయింది: లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): 'జగన్ జమానాలో ఆడుదాం ఆంధ్రా అంటే ఏమో అనుకున్నా. క్రీడాకారుల జీవితాలతో చెలగాటమాడటం అని కొత్తగా తెలిసింది. 17వ ఆటగాడిగా ఉన్న తిరుపతి వైసీపీ కార్పొరేటర్ పుత్రరత్నాన్ని పద్ధతి మార్చుకోవాలని మందలించడమే ఆంధ్రా రంజీ జట్టు కెప్టెన్ హనుమ విహారీ చేసిన అపరాధం. భారత్ తరపున 16 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి, ఆంధ్రా రంజీ జట్టుకు ఏడేళ్లు ఏకధాటి కెప్టెన్‌గా వ్యవహరించిన అనుభవం వైసీపీ వీధి నాయకుడి పంతం ముందు దిగదుడుపే' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. ఢిల్లీ లిక్కర్‌స్కాం నిందితుడు శరత్ చంద్రారెడ్డిని ఆంధ్రా క్రికెట్ అసోషియేషన్ అధ్యక్షుడిగా నియమించినప్పుడే ఏపీ పరువు బంగాళాఖాతంలో కలిసిపోయిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో జగన్‌రెడ్డి అరాచకాలకు క్రీడాకారులు కూడా బలైపోతున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. క్రికెటర్‌కు అన్యాయం చేసిన సొంత పార్టీ నేతలపై క్రీడా మంత్రి రోజా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏసీఏ వివక్షపై చింతిస్తున్నాం: పవన్

భారత క్రికెటర్ కంటే వైసీపీ నాయకుడే ముఖ్యమా? అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హనుమ విహారికి జరిగిన అన్యాయంపై మంగళవారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. హనుమ విహారి భారత క్రికెట్ జట్టు తరఫున 16 టెస్టు మ్యాచుల్లో ప్రాతినిధ్యం వహించి 5 హాఫ్ సెంచరీలు, ఒక సెంచరీ సాధించారని, ఆస్ట్రేలియాతో జరిగిన సిడ్నీ టెస్టులో అతని క్రీడా పటిమ మరువలేనిదని తెలిపారు. కానీ, ఈ రోజు, ఒక వైసీపీ కార్పొరేటర్ కారణంగా ఏసీఏ కెప్టెన్సీకి విహారి రాజీనామా సమర్పించాల్సి వచ్చిందన్నారు.

క్రీడలపైనా దౌర్భాగ్య రాజకీయాలా?: షర్మిల

రంజీ జట్టు మాజీ కెప్టెన్ హనుమ విహారిపై వైసీపీ దౌర్భాగ్య రాజకీయాలు చేస్తోందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. 'ఇంతకంటే సిగ్గుచేటైన విషయం ఇంకేమన్నా ఉంటుందా? అన్నింటిలోనూ నీచ రాజకీయాలు చేస్తున్న వైసీపీ వాళ్లు, ఇప్పుడు క్రీడలపైనా వారి దౌర్భాగ్య రాజకీయాలను, అధికార మదాన్ని చూపిస్తున్నారు. రాష్ట్ర ప్రతిష్ఠను అన్నివిధాలుగా నాశనం చేసిన వీళ్లు ఇంకా ఎంత లోతులకు దిగజారతారో ఊహించలేం' అని షర్మిల పేర్కొన్నారు.

కేడర్‌తోనూ కోతలే!

- మార్చాల్సిన సీట్లు మార్చేశారట!.. ఇక మార్పులు లేవట!
- ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేశామంటూ అబద్ధాల వల్లెవేత



అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నిత్యం అబద్ధాలతో 58నెలల పాలన గడిపేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి.... సొంత కేడర్‌తోనూ కోతలు కోశారు. రాష్ట్రంలో ఏకంగా 87 నుంచి 95 శాతం ఇళ్లకు జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు వెళ్తున్నాయని, వారందరూ ఓటేస్తే మళ్లీ అధికారంలోకి వచ్చేస్తామని వైసీపీ శ్రేణులకు నమ్మబలికారు. మంగళవారం మంగళగిరిలోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఏర్పాటుచేసిన 'మేం సిద్ధం..మాపోలింగ్‌బూత్ సిద్ధం' వర్క్‌షాపులో జగన్ మాట్లాడారు. అధికారంలోకి వచ్చేముందు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చేశామన్నారు. కానీ, ప్రత్యేకహోదా, విశాఖ రైల్వేజోన్, ప్రభుత్వోద్యోగులకు సీపీఎస్ రద్దు, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్, కడప స్టీల్ ప్లాంట్, పోలవరం, దుగరాజపట్నం ఓడరేవు, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల సహా అత్యంత ప్రధానమైన సంపూర్ణ మద్య నిషేధంలాంటి నెరవేర్చని హామీల ప్రస్తావన మాత్రం రానీయలేదు. "క్యాడర్‌లో ప్రతిఒక్కరూ గర్వంగా జగనన్న ప్రభుత్వం ఫలానా పని చేసిందని చెప్పుకోవచ్చు"ంటూ సొంతడబ్బా వాయించుకున్నారు. "జగన్ ఉంటేనే పేదవాడు బాగుపడతాడు. మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అయితేనే గ్రామాల్లో విలేజ్ క్లినిక్కులు పనిచేస్తాయి. ఆరోగ్యశ్రీ వంటి స్కీమ్‌లు కొనసాగుతాయి. పొరపాటున మరోసారి జగన్ ముఖ్యమంత్రి కాకపోతే.. వలంటీర్ల వ్యవస్థను వద్దనుకుని జన్మభూమి కమిటీలను ఆహ్వానించినట్టే. పథకాలు వద్దని ఓటర్లు సంతకం చేసినట్లే" అని చెప్పుకొచ్చారు. ఈ విషయాలన్నీ బూత్ స్థాయిలో ప్రజల వద్దకు తీసుకెళ్లాలని శ్రేణులను ఆదేశించారు. వైసీపీలో అందరికీ టికెట్లు ఖరారు అయినట్టేనని జగన్ తెలిపారు. వాస్తవానికి 70 చోట్ల మాత్రమే సమన్వయకర్తలను వైసీపీ పెద్దలు మార్చారు. అది కూడా ఏడు విడతల్లో అటు తిప్పి ఇటు తిప్పి ఎన్నెన్నో మార్పులు చేస్తూపోయారు. కానీ, మొత్తం మార్చేశామని క్యాడర్‌కు జగన్ నమ్మబలికారు. కుప్పంలో 93.29 శాతం ఇళ్లకు మంచి చేశామని, అక్కడ 87 వేలఇళ్లు ఉంటే, 83 వేల ఇళ్లకు సంక్షేమ పథకాలు అందించామని చెప్పుకొచ్చారు. బూత్‌స్థాయిలో ఓటర్లతో మమేకం కావాలని, ఓటర్లందరి ఫోన్ నంబర్లు తీసుకోవాలని సూచించారు. ఈ వర్క్‌షాపులో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, ప్రాంతీయ సమన్వయకర్తలు, బూత్‌స్థాయి నేతలు పాల్గొన్నారు.

బుద్ధప్రసాద్ చూపు.. వైసీపీ వైపు!

విజయవాడ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సీనియర్ నేత, అవనిగడ్డ టీడీపీ ఇన్‌చార్జి మండలి బుద్ధప్రసాద్ వైసీపీ వైపు చూస్తున్నారు. మంగళవారం ఆయన తన అనుచరులతో సమావేశమయ్యారు. అవనిగడ్డ టికెట్ జనసేనకు కేటాయిస్తారన్న ప్రచారం నేపథ్యంలో ఆయన అనుచరులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మంగళవారం నాటి సమావేశంలో మాట్లాడిన బుద్ధప్రసాద్ తనకు వైసీపీ నుంచి ఆహ్వానం ఉందని, దీనిపై నాయకుల అభిప్రాయం ఏమిటని ప్రశ్నించినట్లు సమాచారం. అవనిగడ్డ టికెట్ ఇస్తామని వైసీపీ వారు చెబుతున్నారని వివరించారు. ఒకరిద్దరు అనుచరులు ఆయనతో కలిసి నడుస్తామని చెప్పినప్పటికీ మెజారిటీ నేతలు మాత్రం తాము టీడీపీలోనే కొనసాగుతామని తెగేసి చెప్పినట్లు సమాచారం. ఒకట్రెండు రోజుల్లో బుద్ధప్రసాద్ వైసీపీలో చేరికపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

సిటింగులకూ కుర్చీ దొరకలేదు

వర్క్‌షాపు కోసం తీసుకున్న ప్రైవేటు కన్వెన్షన్ సెంటర్‌లో 2,000 మందికే కుర్చీలు వేసేందుకు చోటుంటుంది. కానీ .. నిర్వాహకులు దాదాపు 5,000 మందిని ఆహ్వానించారు. ఎన్నికల వేళ సమావేశం అనగానే, ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు ముఖ్యనేతలంతా వచ్చేశారు. దీంతో.. కన్వెన్షన్ సెంటర్ కిక్కిరిసిపోయింది. ఎమ్మెల్యేలకూ చోటులేకుండా పోయింది. సహజంగా ఇలాంటి వర్క్‌షాపులు నిర్వహించే ముందు అభ్యర్థులను కేడర్‌కు పరిచయం చేస్తారు. దానివల్ల వారికి ప్రత్యేక స్థానాలు ఉంటాయి. కానీ .. వర్క్‌షాపులో ఇలాంటి క్రమశిక్షణ దరిదాపుల్లో కనిపించలేదు. సీట్ల కోసం వెతుకులాట ప్రారంభించిన చాలామంది ఎమ్మెల్యేలు, చివరకు విసుగెత్తి బయటకు వచ్చేసి కారెక్కి సొంతూరికి వెళ్లిపోయారు.





ఏలూరులో సభకు హాజరైన బీజేపీ శ్రేణులు, ప్రసంగిస్తున్న రాజ్‌నాథ్‌సింగ్

అమరావతే రాజధాని

(మొదటి పేజీ తరువాయి)

ప్రముఖులతో సమావేశమైన ఆయన.. విజయవాడలో కోర్ కమిటీ భేటీలో పాల్గొన్నారు. ఏలూరులో పోలింగ్ బూత్ ఏజెంట్లతో జరిగిన సభలోనూ ప్రసంగించారు. విజయవాడ సమావేశంలో ఓ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. 'ప్రజా పోరు యాత్రకు వెళ్తుంటే రాజధాని ఏదని ప్రజలు అడుగుతున్నారు' అని అన్నారు. దానికి స్పందించిన రాజ్‌నాథ్... రాష్ట్ర రాజధాని అమరావతేనని స్పష్టం చేశారు. 'రాష్ట్రంలో ఏర్పడబోయేది మన ప్రభుత్వమే. రాష్ట్ర ప్రభుత్వ దౌర్జన్యాలపై గట్టిగా పోరాడండి. ఆంధ్రప్రదేశ్‌లో అరాచకాలు ఎక్కువగా ఉన్నాయి. వాటిని గట్టిగా ఎదుర్కోవడానికి పూర్తిస్థాయిలో సంసిద్ధం కావాలి. ప్రజా క్షేత్రం నుంచి సాగించే ఉద్యమాలు, ఆందోళనల ద్వారానే పార్టీ ప్రజల్లోకి బలంగా వెళ్తుంది. ప్రతి ఇంటికీ బీజేపీ కార్యకర్త వెళ్లాలి. ప్రధాని మోదీ ప్రతినిధిగా నమస్కారం చెప్పి కేంద్ర సంక్షేమ పథకాలను వివరించాలి.' అని అన్నారు.

దార్శనికత ఏదీ?

'రాష్ట్రంలో దార్శనికత లేదు. సంక్షేమం, అభివృద్ధిపైన సంకల్పం లేదు. ఇప్పటికే అప్పులపాలయ్యారు. కేంద్రం వివిధ పథకాల కింద ఇస్తున్న నిధులు ఖర్చు చేయడం లేదు సరికదా.. ఆ డబ్బంతా ఎక్కడకు పోతోందో తెలియడం లేదు' అని రాజ్‌నాథ్ ధ్వజమెత్తారు. లిక్కర్, మైనింగ్ మాఫియాలతో అవినీతిమయమైందన్నారు. ప్రజల కష్టాలు తెలుసుకునే పరిస్థితి కూడా ఈ ప్రభుత్వానికి లేదని.. పేద ప్రజలకు తాగు నీరందించే ఉద్దేశంతో జలమిషన్ పథకాన్ని రూ.4 వేల కోట్లతో ప్రవేశపెడితే పేదల కష్టాలు తెలియని వైసీపీ ప్రభుత్వం కనీసం తన వాటా కూడా చెల్లించలేదు. దీనికో విజన్ లేదు.. వ్యవస్థ అంతకంటే లేదు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక ప్రభుత్వం, పార్టీ ఉన్నాయి. ఇక్కడప్పుడు బీజేపీ ప్రభుత్వం వస్తుందో అప్పుడే ఈ ప్రాజెక్టు పూర్తవుతుంది' అని స్పష్టం చేశారు. విశాఖ-చెన్నై ఆర్థిక కారిడార్‌కు వందల కోట్ల పెట్టుబడులు రానున్నాయని.. ఫలితంగా 10 లక్షల ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. అమరావతి-బెంగళూరు హైవే పూర్తయితే అనేక మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయన్నారు. 'గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అవినీతి ఆరోపణలు వచ్చాయి. బీజేపీ హయాంలో గడచిన పదేళ్లుగా ఒక్క ఆరోపణా రాలేదు. రెండు సార్లు అధికారంలోకి వచ్చాం. మూడోసారి 370 లేదా 400 సీట్లు వస్తాయని విశ్లేషకులు చెబుతున్నారు. బీజేపీ మేనిఫెస్టోలో ఏం చెబుతోందో అదే చేస్తున్నాం. 2027 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే మూడో స్థాయికి చేరుతుందని ఆర్థిక సంస్థలు విశ్లేషిస్తున్నాయి' అని తెలిపారు. ఉత్తర, దక్షిణ భారతాల పేరుతో దేశాన్ని విభజించాలని రాజకీయ కుట్రలు జరుగుతున్నాయని.. హిందీ మాట్లాడని రాష్ట్రాల్లో కూడా బీజేపీ అధికారంలో ఉందనే విషయాన్ని వారంతా గుర్తించాలని సూచించారు. అనేక రాష్ట్రాల్లో బీజేపీ ద్వితీయ స్థానంలో ఉందనే వాస్తవం తెలుసుకోవాలన్నారు.

రైల్వే జోన్‌కు భూములివ్వకుండా తాత్సారం: పురందేశ్వరి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ.. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రం అన్ని చర్యలు చేపట్టిందని.. నిధులు కూడా మంజూరు చేసిందని.. రాష్ట్ర ప్రభుత్వమే అవసరమైన భూములివ్వకుండా తాత్సారం చేస్తోందని విమర్శించారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరణ చేయడం లేదన్నారు. దానిని లాభాల బాటలోకి తేవడానికి అధికారుల ద్వారా అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. 'కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు విషయంలో రాష్ట్రంలోని అధికారులు సరిగా సహకరించడం లేదు. ప్రజా సమస్యలపై మాట్లాడే బీజేపీ నేతలతోపాటు కార్యకర్తలపైనా పోలీసులు దాడులు చేస్తున్నారు' అని విమర్శించారు. రాష్ట్రంలో విధ్వంసకర ప్రభుత్వం ఉందని.. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా వేదిక కూల్చడం ద్వారా వైసీపీ తన విధానాన్ని బయటపెట్టిందని.. జేబులు నింపుకోవడంతోనే సరిపోయిందని, సంక్షేమం ఏనాడో మరిచిపోయారని దుయ్యబట్టారు. కాగా, పలువురు నేతలు రాజ్‌నాథ్‌తో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పథకాలకు తమ స్టిక్కర్లను వేసుకుని వైసీపీ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్న తీరును వివరించారు. దానిపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలా చేయడం తప్పని, కేంద్ర నిధులను తమవిగా ఎలా చెబుతుందని ప్రశ్నించారు. ఆయా సమావేశాల్లో పార్టీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్, కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్, కేంద్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వల్లూరు జయప్రకాశ్ నారాయణ, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, సెయిల్ డైరెక్టర్ కాశీ విశ్వనాథరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌నాథ్‌తో కాపు రామచంద్రారెడ్డి భేటీ...

రాజ్‌నాథ్‌సింగ్‌తో రాయదుర్గం వైసీపీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి భేటీ అయ్యారు. విజయవాడలోని ఒక హోటల్లో బీజేపీ కోర్ కమిటీ సమావేశానికి ముందు ఆ పార్టీ పెద్దలను కలిశారు. 'రాజ్‌నాథ్‌సింగ్ ఆశీర్వాదం తీసుకున్నా. ప్రజా క్షేత్రంలో ఉండాలని అనుకుంటున్నా. భవిష్యత్‌పై త్వరలోనే వెల్లడిస్తా' అని చెప్పారు. పురందేశ్వరితోనూ కొన్ని విషయాలు చర్చించినట్లు తెలిపారు.

భీమవరం కాదు.. పిఠాపురం!

పవన్ పోటీచేసే స్థానంపై ఎట్టకేలకు స్పష్టత



కాకినాడ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పోటీచేసే అసెంబ్లీ స్థానంపై స్పష్టత వచ్చింది. ఆయన కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో బరిలోకి దిగనున్నారు. వాస్తవానికి వచ్చే ఎన్నికల్లో ఆయన భీమవరం నుంచి పోటీ చేస్తారంటూ ప్రచారం జరిగింది. ఇటీవల ఇరు పార్టీల అధినేతలు అభ్యర్థుల జాబితా వెల్లడించే సమయంలో జనసేన నుంచి ఐదుగురు అభ్యర్థులను ప్రకటించారు. అందులో పవన్ భీమవరం నుంచి పోటీచేస్తారని ఎందుకు ప్రకటించలేదనే దానిపై సందేహాలు నెలకొన్నాయి. విస్తృత కసరత్తు తర్వాత ఎట్టకేలకు పిఠాపురం నుంచే పవన్ మొగ్గుచూపినట్లు తెలిసింది. పిఠాపురం నియోజకవర్గంలో కాపు సామాజికవర్గం ఓట్లు దాదాపు 91 వేలు ఉన్నాయి. ఇక్కడి నుంచి పోటీచేస్తే పవన్ భారీ విజయానికి ఢోకా ఉండదని జనసేన వర్గాల్లో బలంగా ఉంది. ఈ నేపథ్యంలోనే పిఠాపురం నుంచి పోటీకి పవన్ మొగ్గుచూపినట్టు తెలుస్తోంది. ఇప్పటికే కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థి పంతం నానాజీని ప్రకటించారు. కాకినాడ ఎంపీ సీటు కూడా దాదాపు జనసేనకే ఖాయమైంది. పవన్ పిఠాపురం నుంచి బరిలోకి దిగితే ఆ ప్రభావంతో కాకినాడ రూరల్, ఎంపీ స్థానం కూడా సునాయాసంగా గెలవచ్చనేది జనసేన వ్యూహంగా ఉంది. కాగా.. పిఠాపురంలో టీడీపీ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే వర్మ కొనసాగుతున్నారు. ఈయనకు బలమైన నేతగా పేరుంది. అయితే పిఠాపురం సీటును తొలుత జనసేన కోరినప్పుడు వర్మను దృష్టిలో ఉంచుకుని వేరే నియోజకవర్గాన్ని అడగాలని టీడీపీ కోరింది. కానీ జనసేన ఈ సీటుపై పట్టుబట్టడం, అది కూడా స్వయంగా పవన్ పోటీచేయాలని నిర్ణయించడంతో టీడీపీ అంగీకరించినట్లు సమాచారం.

ముందే హెలిప్యాడ్ సిద్ధం..

రాబోయే ఎన్నికల కోసం జనసేన మొదటి నుంచీ కాకినాడ జిల్లాపైనే ఎక్కువ దృష్టిసారించింది. గతేడాది పవన్ ప్రారంభించిన తొలివిడత వారాహి యాత్ర కూడా ఈ జిల్లా నుంచే ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఠాపురంలో రెండ్రోజులు బస చేసి.. ఇక్కడ పార్టీ ఆఫీసు కూడా ప్రారంభిస్తామని ప్రకటించారు. మరోపక్క కొన్ని రోజుల కిందట పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు వద్ద నాలుగు ఎకరాల్లోని ఓ హెలిప్యాడ్‌ను జనసేన రెండు నెలలకు లీజుకు తీసుకుంది. పిఠాపురం నుంచి పోటీచేసే ఉద్దేశంతోనే ముందుగానే హెలిప్యాడ్‌ను సిద్ధం చేసినట్లు సమాచారం. ఎన్నికల గంట మోగగానే పవన్ పిఠాపురానికి నేరుగా హెలికాప్టర్లో వచ్చి నామినేషన్ వేస్తారని.. ప్రచారం కూడా చేస్తారని అంటున్నారు.


అనంతపురం నగరపాలిక ఎదుట ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న ప్రజలు

తాగునీటి కోసం 'అనంత'వాసుల ఆందోళన

- నగరపాలక కార్యాలయాన్ని ముట్టడించిన జనం
- ఓట్ల కోసం వస్తే చెప్పుతో కొడతాం... ఓ మహిళ హెచ్చరిక

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 27: తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అనంతపురం నగరంలోని పలు కాలనీల ప్రజలు నగరపాలక సంస్థ కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించారు. కుండలు, ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. అధికార పార్టీకి చెందిన 23వ డివిజన్ కార్పొరేటర్ హరిత, ఆమె భర్త, 12వ డివిజన్ కార్పొరేటర్ బాబా ఫక్రుద్దీన్, మాజీ కార్పొరేటర్ జయరాం నాయుడు ఈ ఆందోళనకు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ, 'నగరంలో 50 డివిజన్లకుగానూ 48 డివిజన్లలో వైసీపీని ప్రజలు గెలిపించారు. అలాంటివారికి గుక్కెడు తాగునీరు ఇవ్వలేరా? ఇంత పెద్ద కార్పొరేషన్‌లో రెండు మోటార్లకు మరమ్మతు చేయించలేరా? మీకు చేతకాకుంటే చెప్పండి. చందాలు వేసుకుని, జోలెపట్టి అడుక్కుని కొత్త మోటార్లను కొనిస్తాం. ఆందోళనకు దిగేతే పార్టీ పరువు పోతుందని ఇన్నాళ్లూ ఓపిక పట్టాం. ఇకపై ఉపేక్షించేది లేదు' అని హెచ్చరించారు. ఓ మహిళ మాట్లాడుతూ, ఓటు కోసం వస్తే చెప్పుతో కొడతామంటూ హెచ్చరించారు. అనంతరం కార్యాలయంలోకి చొరబడి కమిషనర్ చాంబర్‌నూ ముట్టడించారు. వచ్చే నెల 10లోగా సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

అమ్మ.. జగనా!

(మొదటి పేజీ తరువాయి)

అప్పటికే తేలడంతో సగం పరువు పోయింది. ఇప్పుడు... పెట్టిన గేటు సెటప్‌ను కూడా లేపేయడంతో పూర్తిగా పరువు పోయినట్లేనని వైసీపీ నేతలు కంగారు పడ్డారు. అప్పటికప్పుడు అధికారులను ఆదేశించడంతో... అదే గేటును మళ్లీ తీసుకొచ్చి, యథాస్థానంలో పెట్టారు. అసలు విషయం ఏమిటంటే... అక్కడ ఎలాంటి గేటూ పెట్టాల్సిన అవసరం లేదు. అది కాల్వలో నీళ్లు వాటంతట పోయే చోటు! కానీ... 'షో' కోసమే అక్కడ గేటు పెట్టారు. దీనికోసం నాలుగైదు రోజులు కష్టపడి, రూ.6 లక్షల దాకా ఖర్చుపెట్టారు. 'షో' అయిపోగానే... గేటు సెటప్‌ను ఎత్తేశారు.

నిజ్జంగానే నీటి మూటలు!

రాజుపేటవద్ద అట్టహాసంగా 'గేటు' ఎత్తిన తర్వాత... శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి వద్ద జగన్ బహిరంగ సభలో పాల్గొన్నారు. అక్కడ విడుదల చేసిన నీళ్లు ఇక్కడి దాకా కూడా రాలేదు. ప్రారంభోత్సవ సమయంలో సుమారు ఐదున్నర నుంచి ఆరు అడుగులున్న నీరు రెండో రోజుకే రెండూ రెండున్నర అడుగులకు చేరింది. గేటుకు అటూ ఇటూ నిశ్చలంగా నిలిచిపోయిన నీళ్లు విసురుగా గాలి కొట్టినప్పుడు మాత్రమే గేటు దిగువకు జారుతున్నాయి. సోమవారం సాయంత్రం కనిపించిన నీటి ప్రవాహం.. మంగళవారం తెల్లారేసరికి మాయమైంది. 'కుప్పం నియోజకవర్గంలోని 54 చెరువులకు కృష్ణ నీళ్లు ఇచ్చేస్తున్నా' అని చెప్పిన జగన్ మాటలను ఎగతాళి చేస్తున్నట్టుగా నీటి చెమ్మ మాత్రమే మిగిలింది. కనీసం నాలుగైదు కిలోమీటర్లు దూరం కూడా నీరు కదిలి పారలేదు.

చుక్కనీరులేని కాలువలో టీడీపీ నిరసన



రాజుపేట నుంచి వదిలిన నీళ్లు గుండిశెట్టిపల్లె వద్దకు సన్నగా చేరుకుని మంగళవారం ఉదయానికి ఎండిపోయాయి. దీంతో కాలువ ఖాళీగా కనిపించింది. గుండిశెట్టిపల్లె నుంచి గ్రావిటీ మీద ప్రవహించే అవకాశం ఉన్నా, ఆపాటి నీళ్లు కూడా చేరలేదు. టీడీపీ శ్రేణులు ఉయ్యాల జయరామిరెడ్డి ఆధ్వర్యంలో ఎంకే పురం సమీపంలో ఖాళీగా ఉన్న కాలువలోకి దిగి మంగళవారం నిరసన తెలిపారు.

నాట్కోలో మరో వంద పడకలు!

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలోని నాట్కో సెంటర్‌కు లెవెల్-1 క్యాన్సర్ సెంటర్‌గా ప్రభుత్వం గుర్తింపు ఇచ్చింది. ఇప్పుడున్న వంద పడకలకు అదనంగా మరో వంద పడకలతోపాటు మరిన్ని వసతుల్ని ఏర్పాటు చేసేందుకు ఈ సెంటర్‌ను అనుకుని ఉన్న 1500 గజాల స్థలాన్ని నాట్కో ట్రస్ట్‌కు ప్రభుత్వం కేటాయించింది. ఇందుకు సంబంధించిన అవగాహన ఒప్పంద పత్రాల్ని వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు సమక్షంలో డీఎంఈ నరసింహం, నాట్కో ఫార్మా వ్యవస్థాపకులు, నాట్కో ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ వి.సి.నన్నపనేని మార్పిడి చేసుకున్నారు. నాట్కోలో మెడికల్, సర్జికల్ విభాగాల్ని ఏర్పాటు చేయడం వల్ల క్యాన్సర్ రోగులకు సమగ్ర చికిత్స అందుతుందని, అన్ని విభాగాల్లో వైద్యులు ఉండేట్లు చర్యలు తీసుకున్నామని కృష్ణబాబు తెలిపారు.

'కోడ్' కూయకముందే కోట్లు పంచుడు

(మొదటి పేజీ తరువాయి)

ముందే రాష్ట్రమంతా ఓ దఫా కానుకల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటం.. సర్వేల్లో ప్రతికూల ఫలితా లు వస్తుండటంతో అధికారంలోకి వచ్చేందుకు వైసీపీ నేతలు అడ్డదారులు తొక్కుతున్నారు. ఇప్పటి నుంచే విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేస్తున్నారు. ఇళ్లకు వెళ్లడంతో పాటు విందులు, సమావేశాల పేరిట కానుకలు పంపిణీ చేస్తున్నారు. చీరలు, జాకెట్లు, స్వీట్లు, బిర్యానీ, మందు, డబ్బులు.. ఇలా రకరకాల కానుకలు బహిరంగంగా పంపిణీ చేస్తున్నారు. కానుకలను బాక్సుల్లో పెట్టి అందజేస్తున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఆశావహులు.. ఈ నెలలో గ్రామాల్లో విందులు, సహ పంక్తి భోజనాల పేరిట తాయిలాల పంపిణీకి తెర లేపారు. వేడి వేడి బిర్యానీ వడ్డిస్తున్నారు. భోజనాలు అయిపోయాక నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త.. వచ్చిన వారికి రిటర్న్ గిఫ్ట్‌గా మహిళలకు చీర, జాకెట్ ఇస్తున్నారు. వీటితో పాటు ఒక్కొక్కరికి రూ.500 నోటు ఇస్తున్నారు. మగవారికి బిర్యానీతో పాటు మందు బాటిల్, అక్కడక్కడా డబ్బులు ఇస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తమకే ఓటు వేయాలంటూ 'బాసలు' కూడా చేయిస్తున్నారు. 'ఇది మొదటి విడత మాత్రమే! ఎన్నికల ముందు మరోసారి డబ్బులు పంపిణీ చేస్తాం' అని కూడా చెబుతున్నారు.


ఓ చేతిలో చీర ప్యాకెట్ పట్టుకుని.. మరో చేత్తో తన ప్యాంట్ జేబులో నుంచి 500 నోటు తీసి.. పార్వతీపురం ఎమ్మెల్యే జోగారావు మహిళలకు చకచకా అందజేశారు. ప్యాంటు జేబులోంచి ఒక్కో నోటు మాత్రమే బయటకు తీస్తూ మహిళల చేతిలో పెట్టారు. ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం పనుకుపేటలో ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది.

వలంటీర్లకూ వల

ఎన్నికల విధులకు వలంటీర్లను దూరంగా పెట్టాలని కేంద్ర ఎన్నికల కమిషన్ ఇటీవల ఆదేశించింది. వారిని పోల్ ఏజెంట్లుగా కూడా నియమించవద్దని స్పష్టం చేసింది. అయినా సరే... వలంటీర్లను ఎన్నికల్లో పూర్తిస్థాయిలో వాడుకోవడానికి వైసీపీ నేతలు సిద్ధమయ్యారు. వారికి ప్రత్యేక తాయిలాలు అందిస్తున్నారు. నేరుగా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు వలంటీర్లతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. 'మిమ్మల్నే నమ్ముకున్నాం. మీరే గెలిపించాలి' అని వేడుకుంటున్నారు. చివర్లో... కుక్కర్లు, దుస్తులను సంచుల్లో పెట్టి ఇస్తున్నారు. ఒక్కో చోట రూ.5వేల దాకా నగదును అందిస్తున్నారు. మంగళవారం మంత్రి దాడిశెట్టి రాజా వలంటీర్లకు ఏకంగా సెల్‌ఫోన్లు అందించడం గమనార్హం. ఇక... విలేకరులపైనా ఇదే స్థాయిలో వల విసురుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా తొలుత ఐ-ప్యాక్ టీమ్ ద్వారా విలేకరులకు గిఫ్ట్ కిట్‌లు అందించారు. ఇప్పుడు వైసీపీ నేతలే రకరకాల కానుకలు ఇస్తున్నారు.

ఈసీ ఏం చేస్తున్నట్లు?

'సరిహద్దు రాష్ట్రాల నుంచి డబ్బులు, మద్యం రాకుండా చూడండి. తనిఖీలు చేయండి. అప్రమత్తంగా ఉండండి' అంటూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. అదంతా సరేగానీ... ఎక్కడికక్కడ వైసీపీ నేతల పందేరాల సంగతేమిటి? బహిరంగంగా సాగుతున్న ప్రలోభాలు ఈసీ, పోలీసుల దృష్టికి రాలేదా? అంటే... అన్నీ తెలిసీ కళ్లు మూసుకున్నారనే సమాధానమే లభిస్తోంది. మరికొన్ని రోజుల్లో ఎన్నికలు ఉన్నాయనగా... మీటింగులు పెట్టి కానుకలు, డబ్బులు ఇస్తున్నారు. ఇది ఓటర్లను ప్రభావితం చేయడమే అని స్పష్టంగా తెలిసినా ఈసీ పట్టించుకోవడంలేదు. 'కోడ్' వస్తేకానీ ఈసీకి కోరలు రావా? అప్పటిదాకా ఏం జరిగినా పట్టించుకోరా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పోలింగ్‌కు ముందు ఓటర్లకు దొంగచాటుగా డబ్బులు, మద్యం, కానుకలు పంపిణీ చేయడం చూశాంగానీ... ఎన్నికల కోడ్ రాకముందే ఇలా పెద్దఎత్తున ఓటర్లకు కానుకలు పంపిణీ చేయడం రాష్ట్రంలో ఇదే తొలిసారి అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

మచ్చుకు కొన్ని..

- ఇటీవల విశాఖలో ఎంపీ, విశాఖ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంవీవీ సత్యనారాయణ చీరలు, సౌత్ ఇన్‌చార్జ్ వాసుపల్లి గణేశ్ మందుసీసా, కోడి పంచారు.
- పార్వతీపురం ఎమ్మెల్యే జోగారావు ఒక చేత్తో మహిళలకు చీరను ఇస్తూ.. మరో చేత్తో ఐదు వందల నోటు ఇచ్చారు. మంగళవారం తామరఖండి గ్రామంలో వైసీపీ నాయకులు మహిళలకు చీరలు, నగదు పంపిణీ చేశారు.
- విజయనగరం, విశాఖ జిల్లాల్లో కానుకలు, డబ్బుల పంపిణీ యథేచ్ఛగా సాగుతోంది.
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తుని నియోజకవర్గంలో మంత్రి దాడిశెట్టి రాజా మంగళవారం నియోజకవర్గంలోని వలంటీర్లందరికీ 1700 సెల్‌ఫోన్లు పంపిణీ చేశారు. ఉత్తమ పనితీరు కనబర్చిన వారికి సన్మానం పేరుతో విందు ఏర్పాటు చేశారు. అనంతరం ఒక్కొక్కరిని ప్రత్యేక గదిలోకి ఆహ్వానించి రూ.11,999 విలువైన ఫోన్‌లను గిఫ్ట్‌గా అందించారు. తమ పరిధిలోని కుటుంబాలతో వైసీపీకి ఓటు వేయించాలని వలంటీర్లను కోరారు. ఓటు వేయకపోతే పథకాలు కట్ చేస్తామని బెదిరించాలని సూచించారు.
- కాకినాడ వైసీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ మనుషులు పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లిలో వలంటీర్లతో రహస్య సమావేశం ఏర్పాటు చేసి రూ.1000 చొప్పున నగదు అందించారు. పోలింగ్ సమీపించగానే ఒక్కొక్కరికి రూ.పది వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. వలంటీర్ పరిధిలోని కుటుంబాలకు సంబంధించి బ్యాంకు ఖాతాలు సేకరించారు.
- ఉమ్మడి తూర్పు గోదావరిలో ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో వైసీపీ ఇన్‌చార్జ్‌లు వలంటీర్లకు కుక్కర్లు, దుస్తులు పంపిణీ చేశారు.
- విజయవాడ సెంట్రల్‌లో వెలంపల్లి శ్రీనివాస్ వలంటీర్లకు ఇటీవల కుక్కర్లు పంపిణీ చేశారు.

టెట్ ప్రారంభం

- తొలి రోజు పరీక్షకు 87శాతం హాజరు

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) మంగళవారం ప్రారంభమైంది. తొలిరోజు సగటున 87శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. పేపర్-1ఎ పరీక్షకు ఉదయం 17,316 మందికిగాను 14,801 మంది.. మధ్యాహ్నం 17,253 మందికిగాను 14,801 మంది హాజరైనట్లు పాఠశాల విద్యాశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. 40 మంది అభ్యర్థులకు హాజరులో సాంకేతిక సమస్యలు ఏర్పడినట్లు పేర్కొంది. హాల్ టికెట్‌లో పూర్తిగా తప్పులుంటే పరీక్షకు అనుమతి ఉండదని, స్వల్ప పొరపాట్లు ఉంటే డీఈవో వద్ద సరిదిద్దుకోవచ్చని వివరించింది. కోర్టు ఉత్తర్వుల కారణంగా పేపర్-1ఎ రాయడానికి అనర్హులుగా మారిన బీఈడీ అభ్యర్థులకు వారు చెల్లించిన ఫీజులను తిరిగి చెల్లిస్తామని అధికారులు తెలిపారు. అలాగే బీఈడీ, డీఈడీ రెండు అర్హతలుంటే వారికి రెండో హాల్ టికెట్ ఇస్తామన్నారు. విజయవాడలోని టెట్ పరీక్ష కేంద్రాలను పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, కమిషనర్ సురేష్‌కుమార్ పరిశీలించారు.

గ్రూప్-2 మెయిన్స్‌కు ఎంపిక నిష్పత్తి పెంచాలి

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 ప్రశ్నపత్రం అత్యంత కఠినంగా ఇచ్చినందున మెయిన్స్‌కు ఎంపిక చేసే అభ్యర్థుల నిష్పత్తిని 1:100కు పెంచాలని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్ధిక్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సిలబస్ పరిధి దాటి ప్రశ్నలు ఇచ్చారని, గ్రామీణ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. సామాజిక శాస్త్రం, గణితం ప్రశ్నలు చదవడానికే ఎక్కువ సమయం పట్టిందని, స్థాయికి మించిన ప్రశ్నలు ఇచ్చి నిరుద్యోగులను ఆందోళనకు గురిచేశారని ఆక్షేపించారు.

సీబీఐ కోర్టుకు ఎంపీ అవినాశ్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఏపీ సీఎం జగన్ బాబాయి, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ-8గా ఉన్న కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్ సీబీఐ కేసుల ప్రత్యేక కోర్టులో హాజరయ్యారు. ఇదే కేసులో నిందితులుగా ఉన్న చంచల్‌గూడ జైల్లో ఉన్న గంగిరెడ్డి, సునీల్‌యాదవ్, గజ్జల ఉమాశంకర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డిలను జైలు నుంచి తరలించి కోర్టులో హాజరుపర్చారు. వీరి రిమాండ్‌ను మార్చి 12 వరకు పొడిగిస్తూ సీబీఐ కోర్టు ఆదేశాలు జారీచేసింది. ఇదే కేసులో ఏ-4 ఉండి అప్రూవర్‌గా మారిన దస్తగిరి కోర్టుకు హాజరు కాకపోవడంతో గతంలో జారీచేసిన నాన్‌బెయిలబుల్ వారంట్‌ను సీబీఐ కోర్టు ఉపసంహరిస్తూ (రీకాల్) ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై దస్తగిరి వేసిన రీకాల్ పిటిషన్‌ను అనుమతించిన సీబీఐ కోర్టు.. వారంట్‌ను ఉపసంహరించింది.

వాళ్లు న్యాయస్థానానికి వెళ్లొచ్చు

- కోటంరెడ్డి వ్యాఖ్యలపై స్పీకర్ తమ్మినేని

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై చట్ట ప్రకారమే అనర్హత వేటు వేశానని అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి వద్ద సీఎం జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన వైసీపీ నిర్వహించిన సిద్ధం వర్క్‌షాప్‌నకు స్పీకర్ తమ్మినేని హాజరయ్యారు. ఈ సందర్భంగా అనర్హత వేటు నిర్ణయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామంటూ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేసిన ప్రకటనపై స్పందిస్తూ... 'అసెంబ్లీ కూడా న్యాయస్థానమే. నా నిర్ణయంతో విభేదించేవారు న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు. నేను మాత్రం చట్టపరిధిలోనే వ్యవహరించాను. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేశాను' అని తమ్మినేని స్పష్టం చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



రాజ్‌నాథ్ సింగ్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ నేతలు

మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ఘనస్వాగతం

గన్నవరం, ఫిబ్రవరి 27: కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. విశాఖపట్నం నుంచి ప్రత్యేక విమానంలో మంగళవారం మధ్యాహ్నం ఇక్కడికి విచ్చేశారు. మాజీ ఎంపీ సుజనాచౌదరి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్ రెడ్డి, మల్లిఖార్జునరాజు, నాదిండ్ల మోహన్, కానూరు శేషమాధవి, కె.ఫణికుమార్, అనిల్ తదితర నేతలు స్వాగతం పలికారు. రాజ్‌నాథ్ సింగ్ వెంట బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి వచ్చారు. అనంతరం విజయవాడ వెళ్లారు.

ఇంద్రకీలాద్రి సౌందర్యాన్ని ఆవిష్కరించిన మాడుగుల నాగఫణి శర్మ



విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 27: అవధానాలకు సాహిత్య దీప్తిని ప్రసాదించి పునఃవైభవాన్ని కల్పించిన మహాకవి అవధాన సరస్వతి పీఠాధీశుడు డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ అని మల్లాప్రగడ శ్రీమన్నారాయణ అన్నారు. దేవదాయ శాఖ, శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న దుర్గా సౌందర్యలహరి మహాశతావతావధానం మంగళవారం ఘనంగా సాగింది. ఈవో మాట్లాడుతూ దుర్గామాతను సాహితీ రూపంలో శర్మ అవధాన పద్య కుసుమాలతో ఆరాధించడం పుణ్యఫలమన్నారు. ప్రసాద్, జగన్నాథశాస్త్రి, శివశ్రీశర్మ, వద్వాన్, సాయికృష్ణ పాల్గొన్నారు.



ఎన్జీవో డే సందర్భంగా ఏఆర్ఎం, సూపరింటెండెంట్‌లకు స్ట్రెచర్, వీల్‌చైర్‌ను అందిస్తున్న తరుణ్ కాకానీ

జనరల్ ఆసుపత్రికి స్ట్రెచర్, వీల్‌చైర్ వితరణ

భవానీపురం, ఫిబ్రవరి 27: ప్రపంచ ఎన్జీవో (ప్రభుత్వేతర సంస్థలు) దినోత్సవం సందర్భంగా మాజీ మంత్రి కాకాని వెంకటరత్నం, ఆయన తండ్రి దివంగత కాకాని రామ్‌మోహన్‌రావుల స్మారకార్థం డాక్టర్ తరుణ్ కాకానీ స్థాపించిన కాకాని ఆశయ సాధన సమితి స్వచ్ఛంద సంస్థతో కలిసి నగరంలోని కొత్త ప్రభుత్వాసుపత్రికి రూ.20వేల విలువైన ఫుల్‌బాడీ స్ట్రెచర్, వీల్‌చైర్‌ను మంగళవారం ఏఆర్ఎంవో డాక్టర్ నమ్రత, సూపరింటెండెంట్ ఆదినారాయణ అందించారు. జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు, న్యాయమూర్తి చిరంజీవి నేలపాడు పాల్గొన్నారు.

ఇగ్నో ప్రాంతీయ సంచాలకుడిగా డీఆర్ శర్మ



బాధ్యతలు స్వీకరించిన శర్మకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న ఉమలత

వన్‌టౌన్, ఫిబ్రవరి 27: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) విజయవాడ ప్రాంతీయ కేంద్ర సీనియర్ ప్రాంతీయ సంచాలకుడిగా డాక్టర్ దోనేపూడి రామాంజనేయ శర్మ (డీఆర్ శర్మ) మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన మహారాష్ట్రలోని పూణెలో పనిచేశారు. అక్కడి నుంచి బదిలీపై నగరానికి వచ్చారు. గతంలో ఆయన హైదరాబాద్, విజయవాడ, మధురై, ఢిల్లీలోనూ పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాంతీయ కేంద్రం పరిధిలోని విద్యార్థులకు మరింత మెరుగైన విద్యసేవలందించనున్నట్టు తెలిపారు. డీఆర్ శర్మకు ప్రస్తుత సంచాలకురాలు కె.సుమలత అభినందనలు తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేఏసీ నేతలు

మార్చి 1న సీఎం క్యాంపు కార్యాలయ ముట్టడి

ధర్నాచౌక్, ఫిబ్రవరి 27: రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ, కేజీ బేసిన్ పెట్రోలియం ఉత్పత్తులపై రాష్ట్రానికి వాటా అంశాలపై వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా మార్చి 1న సీఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని ప్రత్యేక హోదా సాధన విద్యార్థి, యువజన ఐక్య రాష్ట్ర జేఏసీ నేతలు పేర్కొన్నారు. ఈ పోస్టర్‌ను గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ జిలానీ, బి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకువస్తానని 2019 ఎన్నికల సందర్భంగా చెప్పిన సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక 5కోట్ల రాష్ట్ర ప్రజల భవిష్యత్తును మోదీకి తాకట్టు పెట్టారన్నారు. మార్చి 1న జరిగే కార్యక్రమానికి జై భారత్ పార్టీ, ప్రత్యేక హోదా సాధన సమితి, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఆప్, బీఎస్పీ, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల మద్దతు తెలిపాయన్నారు.

వరకట్న వేధింపుల కేసులో ఎస్ఐకి జైలు

కింది కోర్టులో వేసిన శిక్ష పైకోర్టులో ఖరారు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): వరకట్నం వేధింపుల కేసులో ఎస్ఐ మల్లుల సతీశ్ కుమార్‌కు దిగువకోర్టు వేసిన శిక్షను పైకోర్టు ఖరారు చేసింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన శిరీషతో హైదరాబాద్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న పశ్చిమగోదావరి జిల్లా తణుకు ప్రాంతానికి చెందిన మల్లుల సతీశ్ కుమార్‌కు 2014 లో వివాహమైంది. పెళ్లయిన 9 రోజులకే అదనపు కట్నం తీసుకురమ్మని వేధింపులు ఆరంభమయ్యాయి. దీంతో శిరీష రాజమహేంద్రవరం పోలీసులను ఆశ్రయించారు. కేసు విచారించిన రాజమహేంద్రవరంలోని 5వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేటు కోర్టు 2018లో సతీశ్‌కి ఐదేళ్లు, అతని తల్లి విజయ శారదకు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. దీంతో అతన్ని ఎస్ఐ ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించారు. శిక్ష పడిన ఎస్ఐ రాజమహేంద్రవరంలోని పదో అదనపు జిల్లా కోర్టులో అప్పీల్ చేశారు. వాదోపవాదాలు విన్న కోర్టు కింది కోర్టు వేసిన శిక్షను ఖరారు చేస్తూ మంగళవారం తీర్పు వెలువరించింది. బాధితురాలి తరఫున బార్ కౌన్సిల్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటరత్నంబాబు వాదనలు వినిపించారు.

ఉద్యోగులను తాకట్టు పెట్టేస్తున్నారు

● ఇరిగేషన్ ఉద్యోగుల సంఘ నేత లంకేశ్వరరావు

విజయవాడ: ఉద్యోగుల సంఘాల నేతలు తమ పదవుల కోసం ఉద్యోగులను ప్రభుత్వానికి తాకట్టు పెడుతున్నారని ఇరిగేషన్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు లంకేశ్వరరావు మీడియా సమావేశంలో విమర్శించారు. ఉద్యోగుల పట్ల వైసీపీ ప్రభుత్వం వ్యవహరించినంత దారుణంగా ఏ ప్రభుత్వమూ వ్యవహరించలేదన్నారు. డిమాండ్ల సాధనకు ఇంతకుముందు ప్రభుత్వంతో చర్చలు నిర్వహించినా సఫలం కాలేనప్పుడు బహిష్కరించి బయటకు వచ్చినా పిలిచి మాట్లాడేదన్నారు.

సమస్యలన్నీ ఇక్కడే!

రామారావు వీధిలో మౌలిక సదుపాయాల్లేక 2వేల మంది ఇక్కట్లు

భవానీపురం, ఫిబ్రవరి 27: 500 గడపలు, 10 అపార్టుమెంట్లలో 2వేల మంది నిత్యం రాకపోకలు సాగించే ప్రధాన రహదారి మాదాసు రామారావు వీధిలోని నివాసితులు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. 45వ డివిజన్ సితార మెయిన్ రోడ్డులోనే ఎడమవైపునున్న ఈ ప్రధాన రోడ్డు, దానికి అనుసంధానంగా ఉన్న అడ్డరోడ్డు వద్ద వీధిలైట్లు, మౌలిక సదుపాయాల్లేక నానా అగచాట్లు పడుతున్నారు. ఈ వీధుల్లోంచే డైరెక్ట్‌గా జోజినగర్ కరెంట్ ఆఫీసుకు, ఇతర ప్రాంతాలకు వెళ్లే అనువైన రోడ్డు ఇదే. ఎత్తుపల్లాలు, గుంతలతో పల్లెటూరిని తలపించేలా ఉన్న రహదారితో రోజూ ప్రమాదాల బారినపడుతున్నారు. ఇటీవల కాలంలో ఆటో బోల్తా పడి స్వల్పగాయాలతో ఒకరిద్దరు బయటపడ్డారు. వీధిలైట్లు ఒకవైపు అమర్చక, రెండోవైపు ఇళ్లవైపు ఒక లైటు లేక రాత్రి వేళల్లో చీకట్లోనే రాకపోకలు సాగిస్తున్నారు. ఇక కుక్కల బెడద అంతా ఇంతా కాదు. చాలాకాలం క్రితం నిర్మించిన డ్రెయిన్లలో మురుగునీటి పారుదల లేదు. పూడికలు తీయడం లేదని ఆరోపిస్తున్నా పట్టించుకునేవారు లేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక 10 సార్లకు పైనే ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్‌ను అదే సామాజికవర్గానికి చెందిన వివిధ వ్యాపారస్థులు, నివాసితులు కలిసి రోడ్డు వేయండి మహాప్రభో అని మొరపెట్టుకున్నా అతీగతీ లేదని పెదవి విరుస్తున్నారు. ఆరేడు నెలలు క్రితం యూజీడీ కనెక్షన్ల ఏర్పాటుకు లైను వేసి మ్యాన్‌హోల్స్‌ను అమర్చినా కనెక్షన్లు ఇవ్వలేదు. మూతలు రోడ్డు కంటే ఎత్తులో ఉండటంతో వీటిని ఢీకొని పడిపోతున్నారు. గతేడాది డిసెంబరులో ఈ సమీప ప్రాంతాల్లోని రోడ్లకు కలిపి రూ.2.25 కోట్లతో పనులు చేయడానికి వెలంపల్లి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్లు ముందుకు రాక మంజూరైన రూ.17 లక్షల విలువైన పని జరగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా రోడ్డును అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



మాదాసు రామారావు వీధిలో అధ్వానంగా రోడ్డు, వాటర్ లీకేజీతో గుంతలు పడిన ప్రాంతం

ప్రత్యక్ష నరకం చూస్తున్నాం స్థానికుడు విజయ్‌కుమార్



మాదాసు రామారావు వీధిలో సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్‌ను కమిటి పెద్దలు ఉస్మాన్, శ్రీనివాస్‌తో కలిసి 10సార్లు పైనే కలిశాం. అయినా ఇప్పటికీ రోడ్డు వేయలేదు. దగ్గరికి వెళితే చేయిస్తామని చెబుతూ కాలం గడుపుతున్నారు. అధ్వాన్నంగా ఉన్న రోడ్డుతో నరకం చవిచూస్తున్నాం. ఇప్పటికైనా రోడ్డును వేయాలని కోరుకుంటున్నాం.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌బీఐ జనరల్ మేనేజర్

ప్రజలకు బ్యాంకులకు వారధి..

ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాలు

● ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ ఆర్.కె.మహాన

గుణదల, ఫిబ్రవరి 27: బ్యాంకులు ప్రవేశపెడుతున్న పథకాలు, సేవలపై సమాజంలోని ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ఆర్.కె.మహాన అన్నారు. రామవరప్పాడు గ్రామంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అక్షరాస్యత కేంద్రం ప్రారంభం మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్.కె.మహాన వినియోగదారులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కల్పిస్తున్న పథకాలు సామాజిక భద్రత డిజిటల్ చెల్లింపు వ్యవస్థలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ మువ్వల శ్రీధర్ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత ద్వారా కుటుంబ ఆదాయాలు పెరుగుతాయన్నారు. జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కె.ప్రియాంక మాట్లాడుతూ ప్రజలకు బ్యాంకులకు మధ్య వారధిగా అక్షరాస్యత కేంద్రాలు పని చేస్తాయన్నారు. జిల్లాలో 15 మండలాల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఆర్థిక సహకారంతో ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు అధికారులు గౌతమ్, వి.అశోక్ కుమార్, వై.బాబూరావు, కె.శ్రీనివాసరావు, చింతరాల చక్రవర్తి, సగ్గుర్తి వినోద్ పాల్గొన్నారు.

రాఘవేంద్రరావు కార్యదక్షతకు

ప్రతిఫలమే నాఫ్కబ్ పదవి

● వక్తల అభినందన

భవానీపురం, ఫిబ్రవరి 27: చలసాని రాఘవేంద్రరావు సమర్థ నాయకత్వం, కార్యదక్షతకు ప్రతిఫలమే నాఫ్కబ్ డైరెక్టర్ పదవి అని వక్తలు కొనియాడారు. విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రాఘవేంద్రరావు నాఫ్కబ్ డైరెక్టర్ పదవికి జరిగిన ఎన్నికల్లో విజయాన్ని సాధించినందుకు ఏపీ స్టేట్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్, క్రెడిట్ సొసైటీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని హెల్త్ వర్శిటీ సమీపంలోని ఎంఎస్ఆర్ లైబ్రరీ హాల్లో మంగళవారం ఘనంగా సన్మాన సభ జరిగింది. మాజీ ఎంపీ, ఫెడరేషన్ అధ్యక్షుడు చిట్టూరి రవీంద్ర అధ్యక్షత వహించారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన మానం ఆంజనేయులు మాట్లాడుతూ నాఫ్కబ్ డైరెక్టర్‌గా రాఘవేంద్ర ఎన్నిక ఆషామాషీ కాదని, తాను 3దశాబ్దాలకు పైగా డైరెక్టర్‌గా ఉన్న ఫెడరేషన్ తరఫున పరోక్ష పద్ధతిలో కొనసాగనన్నారు. సన్మానం అందుకున్న రాఘవేంద్రరావు మాట్లాడుతూ సేవాదృక్పథం, సమాజంపై నిబద్ధతతో సహకార సంఘాలు నడిపితే అవి ఎప్పటికి విఫలం కావన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన సభ్యులు రాఘవేంద్రరావును శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కోపరేటివ్ బ్యాంకుల చైర్మన్లు, నాఫ్కబ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్ జిలానీ పాల్గొన్నారు.



సన్మానం అందుకున్న చలసాని రాఘవేంద్రరావు

జాబ్‌మేళాతో యువతకు ఉద్యోగాలు

● డిప్యూటీ డైరెక్టర్ హిమబిందు

పటమట, ఫిబ్రవరి 27: రాష్ట్ర ప్రభుత్వం జాబ్‌మేళాలు నిర్వహించి యువతకు వారి విద్యార్హతలకు తగ్గట్టుగా స్థానికంగానే పెద్దసంఖ్యలో ఉద్యోగవకాశాలు కల్పిస్తుందని ఉపాధి కల్పన శాఖ డిప్యూటీ డైరెక్టర్ వి.హిమబిందు తెలిపారు. ఉపాధి కల్పన శాఖ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉపాధి కల్పన కార్యాలయ ఆవరణలో జరిగిన మెగాజాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ముఖ్యఅతిథి హిమబిందు మాట్లాడుతూ ఉపాధి కల్పన శాఖ అందించే సేవలన్నింటిని భారత ప్రభుత్వం వారి నేషనల్ కెరియర్ సెంటర్‌తో అనుసంధానం చేశారన్నారు. యువత మక్కువ చూపడంతో వారి అవసరాలకనుగుణంగా ఉపాధి కల్పన శాఖ సేవలన్నింటినీ ఎంప్లాయిమెంట్ వెబ్ పోర్టల్ ద్వారా మరింత సులభతరం చేశామన్నారు. రీజినల్ ఎంప్లాయిమెంట్ అధికారి రామమోహన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా నిరుద్యోగ సమస్య అనేది ఉండకూడదని, చదువుకున్న ప్రతి ఒక్కరికి ఉద్యోగావకాశాలు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు మాట్లాడుతూ ఇంటర్వ్యూలో ప్రశ్నలకు ధైర్యంగా సమాధానాలు చెప్పాలని, లాంగ్వేజెస్‌లో కమ్యూనికేషన్ స్కిల్స్‌ను ఎంత ఇంప్రూవ్ చేసుకుంటే భవిష్యత్తు బాగుంటుందన్నారు. నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు ఈ జాబ్‌మేళాకు 210 మంది హాజరుకాగా వారిలో 53 మందిని ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేశారన్నారు. వై.సత్యబ్రహ్మం, ఎస్.జయరాజు, ప్లేస్‌మెంట్ అధికారి మధు, సంస్థల ప్రతినిధులు, నిరుద్యోగ యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఉన్నతాధికారులు



సూట్‌కేసు దొంగ అరెస్టు

రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 27: ఈనెల 17న శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో వెళుతున్న ప్రయాణికురాలి సూట్‌కేసును అపహరించిన కేసులో మంగళవారం తెలంగాణలోని కొత్తగూడానికి చెందిన తంబాల నితిన్ (25)ను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. రాజగోపాలచారి వీధిలో నితిన్‌ను గుర్తించిన పోలీసులు అరెస్టు చేసి అతడి నుంచి రూ.9లక్షలను స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ వర్మ ఆదేశాలతో రైల్వే డీఎస్పీ ఆర్ నాగేశ్వరరావు పర్యవేక్షణలో జీఆర్పీ సీఐ పి శ్రీనివాస్, ఆర్పీఎఫ్ సీఐ టి చంద్రశేఖరరెడ్డి జీఆర్పీ ఎస్ఐ ఖాదర్ హుసేన్, ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎస్ఎస్ రావు తమ సిబ్బందితో దర్యాప్తు చేసి నేరస్థుడిని పట్టుకున్నారు.

మరో ప్రయాణికురాలి అభరణాల అపహరణ

అదేరోజు శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న తిరుపతి తుమ్మలగుంట రోడ్డుకు చెందిన యండపల్లి మునీతకు చెందిన బ్యాగు దొంగతనం జరిగింది. ఆమె ప్రయాణిస్తున్న బెర్త్ కింద రెండు బ్యాగులు పెట్టగా అందులో ఒక బ్యాగ్ లేనట్టు తోటి ప్రయాణికుడు తెలియజేయగా, ఆమె నగరంలోని రైల్వేస్టేషన్‌లో బ్యాగ్ పోయినట్టు భీమవరం రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఆ ఫిర్యాదును నగర రైల్వే పోలీసులకు రిఫర్ చేశారు. మునీత రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్‌గా పనిచేస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు బ్యాగ్‌ను దొంగతనం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అందులో 367 గ్రాముల బరువున్న బంగారు ఆభరణాలున్నాయి. విలువ మొత్తం రూ.7,34,000 ఉంటుందన్నారు. రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీకి మద్దతు సరికాదు

● రౌండ్ టేబుల్ సమావేశంలో మాదిగ సంఘాల నేతలు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 27: ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోని బీజేపీకి మంద కృష్ణమాదిగ మద్దతివ్వడాన్ని మాదిగ సంఘాల నేతలు తప్పుబట్టారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లలో 50శాతం మాదిగలకు కేటాయించని పార్టీలను ఓడిస్తామన్నారు. ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై త్వరలో సుప్రీంకోర్టు తీర్పు వెలువడనున్న నేపథ్యంలో తీర్పు అనంతరం మాదిగ సంఘాలు భవిష్యత్ కార్యాచరణ తీసుకునేందుకు జేఏసీగా ఏర్పడేందుకు కృషి చేస్తామన్నారు. దీనిలో భాగంగా మహాసభను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. వివిధ మాదిగ సంఘాల నేతలు దండు వీరయ్య మాదిగ, ఉరుసు బ్రహ్మయ్య మాదిగ, కొడమల జెంజ్‌మెన్, వెజెండ్ల సుబ్బారావు, నాగయ్య, రెల్లి, డెక్కలి నేతలు పాల్గొన్నారు.

ఫైలెట్ ప్రాజెక్టును మురుగునీటితో నింపటం సరికాదు

● సీపీఎం నేతల హెచ్చరిక

గన్నవరం, ఫిబ్రవరి 27: పట్టణంలోని సగం మంది ప్రజలకు మంచినీటిని అందించే ఫైలెట్ ప్రాజెక్టులో మురుగునీటిని పెట్టేందుకు కొట్టిన గండిని తక్షణమే పూడ్చి వేయాలని, లేకుంటే ప్రజలందరితో కలిసి పంచాయతీ ముట్టడిస్తామని సీపీఎం నేతలు హెచ్చరించారు. మంగళవారం స్థానిక కోనాయి చెరువు, తొండంగట్టును సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచినీటి చెరువులోకి తొండంగట్టులోని మురుగునీటిని మళ్లించటం సరికాదన్నారు. నీటి కలుషితం వల్ల అనేక రోగాలు వచ్చి ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే ఎస్టీ కాలనీలోని మురుగు తొండంగట్టులో కలుస్తుందన్నారు. మర్లపాలెం, గన్నవరం పరిధిలోని పొలాల్లో మురుగునీరు దానిలోనే చేస్తుందన్నారు. పంచాయతీ అధికారులు తొండంగట్టులో చేపల పెంపకానికి అనుమతివ్వడంతో చెరువులో వ్యర్థాలను కలుపుతున్న విషయం గుర్తుచేశారు. ఈ క్రమంలో తొండంగట్టులోని నీరంతా కలుషితమైందని, దాన్ని ఫైలెట్ ప్రాజెక్టు మంచినీటి చెరువులో కలపటం వల్ల నీరు పూర్తిగా కలుషితమై ప్రజలకు రోగాలు తెచ్చే పరిస్థితిని వస్తుందన్నారు. ఇప్పటికైన పంచాయతీ అధికారులు గండిని పూర్తి స్థాయిలో పూడ్చాలని డిమాండ్ చేశారు. వార్డు సభ్యులు గుండిమెడ ఉదయభాస్కర్, పఠాన్ సర్ధార్, మిరప నాగేశ్వరరావు, సూరగాని సాంబశివరావు, చెరువు గట్టు ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటర్‌నెట్ లేకపోతే మానవ జీవితం

సాఫీగా సాగేలా లేదు

● కేఆర్‌యూ వైస్ చాన్సలర్ జ్ఞానమణి

పటమట, ఫిబ్రవరి 27: కంప్యూటర్ టెక్నాలజీ, ఆధునిక సాంకేతిక దైనందిన జీవితంలో ఒక భాగమైపోయిందని, కంప్యూటర్స్ మొబైల్స్ ఇంటర్‌నెట్ సౌకర్యాలు లేకపోతే మానవ జీవితం సాఫీగా సాగేలా లేదని కృష్ణ వర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జ్ఞానమణి అన్నారు. స్థానిక మేరిస్ స్టెల్లా కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 3 రోజుల పాటు జరిగే జాతీయ సదస్సును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్, సైబర్ టెక్నాలజీ, క్లౌడ్ టెక్నాలజీ, బిగ్‌డేటా వంటి అంశాలు విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. అనంతరం కాన్ఫరెన్స్ సంచికను విడుదల చేసారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ రేఖ మాట్లాడుతూ రీసెంట్ రీసెర్చ్ అడ్వాన్స్‌మెంట్ ఇన్‌కంప్యూటర్ సైన్సెస్ అనే అంశంపై 3 రోజుల సదస్సును ఏర్పాటు చేశామన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్సెస్ సెంట్రల్ వర్శిటీ ప్రొఫెసర్ త్యాగరాజన్, క్రైస్ట్ వర్శిటీ బెంగుళూరుకు చెందిన డీకె బాలకృష్ణ, డాక్టర్ లీనా క్వాడ్రస్, డాక్టర్ సిస్టర్ జసింతా క్వాడ్రస్, ఉషాకుమారి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మార్చి 23న

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు

బస్టేషన్: మార్చి 23న నగరంలోని ఆర్టీసీ బస్టేషన్ నుంచి అరుణాచల క్షేత్ర సందర్శనకు ప్రత్యేక బస్సు బయలుదేరుతుందని ఆర్టీసీ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 23న రాత్రి 9గంటలకు బస్సు బయలుదేరి 24న ఉదయం శ్రీకాళహస్తి, కాణిపాకం క్షేత్రాలను దర్శించుకుని, సాయత్రం గోల్డెన్ టెంపుల్ దర్శనం చేసుకుని ఆదేరోజు రాత్రికి అరుణాచలం చేరుకుంటుందని, గిరి ప్రదక్షణ, దర్శనానంతరం 25న సాయంత్రం బయలుదేరి 26న ఉదయం 5 గంటలకు నగరానికి చేరుకుంటారు. రాను, పోను టికెట్ చార్జి రూ.2500 కాగా మిగతా ఖర్చులు ఎవరికి వారే భరించుకోవాలి. 95 266 సర్వీసు నెంబరు బస్సుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. వివరాలకు 8074298487, 7382898942 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

ఎన్నికల స్టేషనరీ సీల్డ్ కొటేషన్స్ ఆహ్వానం

వన్‌టౌన్: సాధారణ ఎన్నికలకు సంబంధించి స్టేషనరీ బ్రోచర్లు, సైన్ బోర్డులు, స్టీల్ ర్యాక్‌లు, తదితరాలను సరఫరా చేసేందుకు ఆసక్తి గలవారి నుంచి సీల్డ్ కొటేషన్స్ ఆహ్వానిస్తున్నట్టు జిల్లా కొనుగోలు కమిటీ చైర్మన్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సప్లయ్ రంగంలో అనుభవం ఉన్నవారు మార్చి 4న సాయంత్రం 5గంటల్లోపు తమ సీల్డ్ కొటేషన్స్‌ను జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్‌లో స్టేషనరీ వివరాలను టెండర్ నిబంధనలను పొందుపరిచినట్టు తెలిపారు.

రేపు పోరంకిలో మినీ జాబ్‌మేళా

పటమట: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఫిబ్రవరి 29న ఉదయం 9.30 గంటలకు పోరంకిలోని శ్రీనివాసనగర్‌లో గల హ్యాపిమైండ్స్ ట్రైనింగ్ సెంటర్ నందు మినీ జాబ్ మేళాను నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9666615539 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

మంగళగిరి,

తాడికొండలో జడ శ్రావణ్ పోటీ

ధర్నాచౌక్: రాష్ట్రంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లో జై భీమ్ రావు భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు సోమవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయనతో పాటు 61 మంది ఎమ్మెల్యే, 7 ఎంపీ అభ్యర్థులతో మొదటి జాబితాను విడుదల చేసినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారన్నారు. విజయవాడ వెస్ట్ పరసా సురేష్‌కుమార్, పులివెందుల పూర్ణరెడ్డి బాబుకు తొలి జాబితాలో చోటు లభించింది.జ

రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు

ఎన్నికల్లో పోటీ: మేడా

ధర్నాచౌక్: దోపిడీకి గురవుతున్న రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు నాటి జైఆంధ్ర ఉద్యమ స్ఫూర్తితో 2024 పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (ఆర్పీసీ) రాష్ట్ర అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ తెలిపారు. పార్లమెంట్ స్థానాలకు తొలిజాబితాను గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విడుదల చేశారు. ప్రత్యేకహోదా, విభజన హామీలు, పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా, రూ. 300కే వంటగ్యాస్ సిలిండర్, విశాఖ ఉక్కు ప్రైవేట్‌పరం కాకుండా చూడటం తో పాటుగా ఒకే రాష్ట్రం ఒకే రాజధాని అన్నదే తమ నినాదమన్నారు. పెళ్లకూరు సురేంద్రరెడ్డి, బూసిం వైపీ సత్యనారాయణ, పెండ్యాల కామరాజు పాల్గొన్నారు.

వెలమలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించండి

● సీఎంకు వెలమ సంఘం లేఖ

విజయవాడ: వివిధ రాజకీయ పార్టీలకు ఆస్తులు అమ్ముకుని సేవలందించిన వెలమ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా వెలమ సంఘ మాజీ అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు సీఎంకు లేఖ రాశారు. ఈ సామాజిక వర్గానికి మంత్రి పదవి, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవి గానీ ఇవ్వలేదన్నారు. తమ సామాజిక వర్గానికి రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.



పార్థసారథి అభినందనలు తెలుపుతున్న రాష్ట్ర రైతు సంఘాల నేతలు

రాష్ట్రాభివృద్ధికి

టీడీపీ-జనసేనకు మద్దతివ్వాలి

● టీడీపీ నూజివీడు అభ్యర్థి కొలుసు పార్థసారథి

● మర్యాదపూర్వకంగా కలిసిన రైతు సంఘాల నేతలు

హనుమాన్‌జంక్షన్ రూరల్, ఫిబ్రవరి 27: రాష్ట్రాభివృద్ధితో పాటు పేదలకు సంక్షేమ పథకాలు సకాలంలో అందాలంటే టీడీపీ-జనసేన అభ్యర్థులకు మద్దతు తెలపాలని టీడీపీ నూజివీడు అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన్ను నూజివీడు టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర రైతు సంఘాల నేతలు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రజల కోసమే టీడీపీ-జనసేన పొత్తు అని, చంద్రబాబును సీఎంగా చేయాల్సిన చరిత్రాత్మక అవసరం ప్రజలపై ఉందని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేసి రాష్ట్రాభివృద్ధికి టీడీపీ-జనసేనకు మద్దతు తెలపాలన్నారు. రాష్ట్ర సాగునీటి సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ, తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా నరేంద్ర, కార్యనిర్వాహక కార్యదర్శి గుండపనేని ఉమావరప్రసాద్, కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నామినేషన్ చివరి పదిరోజుల వరకు

కొత్త ఓటర్లు దరఖాస్తు చేసుకోవచ్చు

చిట్టినగర్, ఫిబ్రవరి 27: కొత్త ఓటర్లు నామినేషన్ చివరి పదిరోజుల ముందు వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఏఈఆర్వో, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు దరఖాస్తులను సక్రమంగా పరిశీలన చేయాలని సెంట్రల్ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ అన్నారు. కొత్త ఓటర్ల దరఖాస్తుల్లో ఎలాంటి తప్పులు దొర్లకుండా ఒకటికి రెండు సార్లు పరిశీలించాలన్నారు. మంగళవారం వీఎంసీ ప్రధాన కార్యాలయం కమిషనర్ చాంబర్‌లో పొలిటికల్ పార్టీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు పార్టీల నేతలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. నవనీతం సాంబశివరావు (టీడీపీ), నేతలు ఎస్సీ అన్సారీ, వినోద్‌కుమార్, సుందర్‌పాల్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

బీఈడీ కాలేజీల్లో
ఈడబ్ల్యూఎస్ కోటా కోసం వ్యాజ్యం

కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈడబ్ల్యూఎస్) కోటా కింద బీఈడీ కళాశాలల్లో 10శాతం సీట్ల భర్తీకి అనుమతి నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి, ఉపాధ్యాయ విద్య జాతీయ కౌన్సిల్‌కు నోటీసులు జారీ చేసింది. విచారణను మార్చి 1వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత మంగళవారం ఆదేశాలిచ్చారు. వినుకొండకు చెందిన శ్రీవివేకానంద కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌తో పాటు మరో మూడు కాలేజీల యాజమాన్యాలు ఈ వ్యాజ్యం వేశాయి. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా, పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎ.సత్యప్రసాద్ వాదనలు వినిపించారు.

సోమిరెడ్డిపై హత్యాయత్నం దుర్మార్గం: అచ్చెన్న

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై హత్యాయత్నం బాధాకరమని, వైసీపీ రౌడీల బరితెగింపునకు ఈ దాడి నిదర్శనమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. సోమిరెడ్డిపై వైసీపీ నేత వెంకటయ్య, ఆయన అనుచరులు దాడి చేయడం దుర్మార్గమని ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ సమావేశం వద్ద వైసీపీ నేతలు కర్రలు, రాడ్లతో తిరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. దాడులు చేసే వారిని, హత్యలు చేసే వారిని జగన్ ప్రోత్సహించడం వల్లనే వైసీపీ గూండాలు రెచ్చిపోతున్నారని ఆరోపించారు. గతంలో సోమిరెడ్డిపై రకరకాల ఆరోపణలు చేసి, ఆ కేసుకు సంబంధించి ఫైల్స్‌ను కోర్టు నుంచి మాయం చేశారని, ఇప్పుడు ఏకంగా సోమిరెడ్డిని హత్య చేసేందుకు ప్రయత్నించారని, ఈ ఘటనకు స్థానిక మంత్రే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. దాడులు చేస్తాం, హత్యలు చేస్తామంటే టీడీపీ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని, జగన్ ప్రోద్బలంతో వైసీపీ ముఠా చేసిన ప్రతీ చర్యకు ప్రతిచర్య ఉంటుందని హెచ్చరించారు. ఇంకో 40 రోజుల్లో టీడీపీ ప్రభుత్వం ఏర్పడటం తథ్యమన్నారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన ఏ ఒక్కరినీ వదలకుండా చర్యలు తీసుకోవడం కూడా తథ్యమని తెలిపారు.

మానసిక వైకల్యంతో కుప్పంకు జగన్: కనకమేడల

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రసంగం జగన్ మానసిక వైకల్యానికి ప్రతీకగా ఉందని, తన వ్యాఖ్యలతో కుప్పం ప్రజల్ని ముఖ్యమంత్రి అవమానించారని టీడీపీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ విమర్శించారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ ప్రారంభోత్సవం పేరిట జరిపిన సభలో కుప్పం నాడు-నేడు అంటూ సీఎం వల్లె వేసిన అసత్యాలు, అనుచితాలను ఆయన తీవ్రంగా ఎండగట్టారు. మంగళవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కుప్పం సభలో చంద్రబాబును దూషించిన వైనం సీఎం మానసిక వ్యాధితో బాధపడుతున్నారని తెలియజేస్తోందన్నారు. రాజ్యాంగ వ్యవస్థను జగన్ నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. జగన్ పాలనలో కుప్పం ఆయన బృందగణం దోపిడీకి ఆలవాలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉద్యోగుల సమస్యలపై
నేడు శాఖాధిపతులతో సీఎస్ భేటీ

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సంఘాల డిమాండ్లు, సమస్యలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి శాఖాధిపతులతో విజయవాడలోని తన కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించనున్నారు. ఆయా శాఖాధిపతులకు సాధారణపరిపాలనశాఖ ఒక లేఖ ద్వారా ఈ సమాచారాన్ని తెలిపింది. ఈ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై శాఖల వారీగా సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. వీటితోపాటు ఏపీ జేఏసీ, ఏపీ జేఏసీ అమరావతి, ఇతర ఉద్యోగ సంఘాల డిమాండ్లు, సమస్యలపై వారు ఇచ్చిన వినతులు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలు తదితర అంశాలు ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.

అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలి: ఏపీటీఎఫ్

పాఠశాల విద్యకు సంబంధించి అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని, పాఠశాలల విలీనానికి సంబంధించిన 117 జీవోను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయరాజు, చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పంచాయతీరాజ్ టీచర్లకు ఉమ్మడి సర్వీస్ రూల్స్ రూపొందించాలని, అర్హత ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఒక ప్రకటనలో కోరారు. వీటితోపాటు ఉద్యోగులకు ఉన్న ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సమ్మె ఒప్పంద అంశాలకు జీవోలు ఇవ్వండి

ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ డిమాండ్

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల సమ్మె ఒప్పందంలో ప్రభుత్వం అంగీకరించిన అంశాలకు వెంటనే జీవోలు ఇవ్వాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. సీఎస్ జవహర్‌రెడ్డికి దీనిపై వినతిపత్రం ఇచ్చినట్లు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బేబిరాణి, సుబ్బరావమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అంగన్వాడీ కార్యకర్తకు రూ.50 వేల నుంచి లక్షకు, ఆయాకు రూ.20 వేల నుంచి రూ.40 వేలకు పెంచుతూ జీవో 47 ఇచ్చారని, దీనిని మార్పు చేస్తూ మినిట్స్ కాపీలో అంగీకరించిన విధంగా వర్కర్‌కు రూ. లక్షా ఇరవై వేలు, ఆయాకు రూ.60 వేలు ఇచ్చే విధంగా జీవోను మార్పు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె కాలంలో ఒప్పందం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు. సర్వీసులో ఉండి చనిపోయిన వారి దహన సంస్కారాలకు ఖర్చుల కింద రూ.20 వేలు చెల్లించేలా ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉందన్నారు. మృతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చేలా జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. 42 రోజుల సమ్మె కాలం వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు.

బదిలీలు, పదోన్నతుల వాయిదాకు డిమాండ్

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్న ఆలోచనను వాయిదా వేయాలని మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ డిమాండ్ చేశారు. త్వరలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయని, మరోవైపు సార్వత్రిక ఎన్నికలు రాబోతున్నాయని, ఈ తరుణంలో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ అన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తుందని తెలిపారు.



మిలాన్ ముగింపు సమావేశంలో వివిధ దేశాల నావల్ కమాండర్లు

ముగిసిన మిలాన్-24

విశాఖపట్నం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బహు పాక్షిక నౌకాదళ విన్యాసాలు (మిలాన్)-24 మంగళవారంతో ముగిశాయి. దీనికి 51 దేశాల ప్రతినిధులు హాజరు కాగా 35 యూనిట్లు (నౌకలు, సబ్‌మెరైన్లు, యుద్ధ విమానాలు) పాల్గొన్నాయి. రెండో దశలో భాగంగా 23 నుంచి 27వ తేదీ వరకు జరిగిన సముద్ర విన్యాసాల్లో విదేశాలకు చెందిన 13 యుద్ధనౌకలు, ఒక విమానం పాల్గొన్నాయి. భారతదేశం తరఫున విమాన వాహక నౌకలు ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్ రెండూ పాల్గొన్నాయి. మిలాన్ ముగింపు ఉత్సవంలో 35 యూనిట్లు యాంకరేజ్‌కు రాగా, వాటి కమాండర్లు అంతా ఐఎన్ఎస్ విక్రాంత్‌పై ఆఖరి సమావేశం నిర్వహించారు. సహకారం ఇచ్చిపుచ్చుకోవలసిన ఆవశ్యకత, ఇతర నౌకాదళాలపై అవగాహన మిలాన్ వల్ల కలిగిందని ఈ సందర్భంగా పలువురు కమాండర్లు చెప్పుకొచ్చారు.



సాగర గర్భంలో మిలాన్ నౌకా విన్యాసాలు

నిధులు మావే.. యజమానులమూ మేమే!



- మా అధీనంలోనే పోలవరం ప్రాజెక్టు: పీపీఏ
- సకాలంలో పూర్తిచేసే బాధ్యత మాత్రం మీదే
- రాష్ట్ర ప్రభుత్వానికి అథారిటీ స్పష్టీకరణ
- పనులు సొంతంగా చేపడతామంటే కుదరదు
- కేంద్ర సంస్థలు ఆమోదించిన డిజైన్లను కాంపోనెంట్ వారీగా అమలు చేయాలి
- పనులన్నీ వాప్కోస్ పర్యవేక్షణలో సాగాలి
- నాణ్యతపై పర్యవేక్షణకు క్వాలిటీ కంట్రోల్ లేబొరేటరీ
- భూసేకరణ, పునరావాసం బాధ్యతా రాష్ట్రానిదే
- నిర్వాసితుల వినతులు ఎలా పరిష్కరించారో కేంద్రానికి నివేదించాలి
- తేల్చిచెప్పిన ప్రాజెక్టు అథారిటీ
- ఈ షరతులకు అంగీకరిస్తే ఒప్పందంపై సంతకం చేయాలని సూచన
- అది జరిగాకే పనులు ముందుకు కదులుతాయని స్పష్టీకరణ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులకు నిధులు ఇస్తున్న యజమానిగా అధికారమంతా కేంద్రానిదేనని.. పనులు పూర్తిచేస్తానని అంగీకరించిన కాంట్రాక్టు సంస్థగా బాధ్యతంతా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానిదని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) స్పష్టం చేసింది. 2014 తర్వాత పోలవరం నిర్మాణానికి సంపూర్ణంగా నిధులు మంజూరు చేస్తున్నందున యాజమాన్య హక్కులన్నీ తనవేనని తేల్చిచెప్పింది. పనులు పూర్తిచేసే బాధ్యతను చేపట్టినందున.. నిర్దీత కాలవ్యవధిలో ప్రాజెక్టును పూర్తిచేసి అప్పగించే బాధ్యత మాత్రం రాష్ట్రానిదేనని తెలిపింది. పలు షరతులు విధిస్తూ అవగాహనా ఒప్పందం (ఎంవోయూ) ప్రతిని రాష్ట్ర జలవనరుల శాఖకు రెండ్రోజుల కిందట పంపింది. షరతులను పరిశీలించి ఆమోదయోగ్యమైతే సంతకాలు చేసి పంపాలని పేర్కొంది. అంతే కాకుండా ప్రాజెక్టును నిర్మించే క్రమంలో భూసేకరణ, నిర్వాసితులకు సహాయ పునరావాసం, నష్ట పరిహారం చెల్లింపులకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని అందులో స్పష్టం చేసింది. 'సహాయ పునరావాసానికి సంబంధించి ప్రజల నుంచి వస్తున్న వినతులను ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలి. భూసేకరణ, సహాయ పునరావాసానికి సంబంధించి ప్రజా వినతులు ఎలా పరిష్కరించారో పీపీఏ ద్వారా కేంద్రానికి వివరించాలి. ప్రాజెక్టు నిర్మాణ పనులు రాష్ట్రప్రభుత్వమే సొంతంగా చేపడతామంటే కుదరదు. నిర్మాణ సంస్థ డిజైన్లను రూపొందించి పీపీఏకు పంపించాలి. అథారిటీ.. ఏర్పాటు చేసుకున్న స్వతంత్ర సంస్థతో, కేంద్ర జల సంఘంతో, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థలతోనూ సంప్రదింపులు జరుపుతుంది. ఈ సంస్థలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన డిజైన్లను.. కాంపోనెంట్ వారీగా రాష్ట్రం అమలు చేయాల్సిందే. ఈ పనులన్నీ కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్ పర్యవేక్షణలో సాగాలి. అలాగే పనుల నాణ్యతపై పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా క్వాలిటీ కంట్రోల్ లేబొరేటరీని ఏర్పాటు చేయాలి' అని పేర్కొంది. వీటికి అంగీకరిస్తే తక్షణమే ఎంవోయూపై సంతకాలు చేసి పంపాలని పీపీఏ స్పష్టం చేసింది. ఈ ఒప్పందం జరిగాకే.. పోలవరం పనులు ముందుకు సాగుతాయని తెలిపింది.

రాష్ట్ర షరతుల తోసివేత..

రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా కేంద్ర జలశక్తి శాఖ పరిధిలో ఏర్పడిన పీపీఏ.. తన పరిధి ఏమిటో రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతలు ఏవిటో 2016లోనే ఎంవోయూ చేసుకోవాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ఇప్పుడు ప్రాజెక్టు కీలక దశకు చేరుకున్న తరుణంలో ఎంవోయూ చేసుకునేందుకు సిద్ధమైంది. అయితే రాష్ట్రప్రభుత్వం కొన్ని షరతులు విధించింది. ఇందులో ప్రధానమైనది.. పోలవరం ప్రాజెక్టు అంతా రాష్ట్రం అధీనంలోనే ఉండాలని.. కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రతినిధులు ప్రాజెక్టు క్షేత్రంలోకి వెళ్లాలంటే ముందస్తుగా తమకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేసింది. అయితే పీపీఏ వీటిని పూర్తిగా తోసిపుచ్చింది. తన షరతులతో ఎంవోయూ ప్రతిని రాష్ట్రానికి పంపింది.

అంతేలేని అంచనా కథ

జగన్ గద్దెనెక్కి, ఐదేళ్లు సమీపించి మళ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్నా.. పోలవరం అంచనా వ్యయానికి కేంద్రం ఆమోదం లభించలేదు. అదో అంతులేని కథగా మారింది. గతేడాది జూన్ 5న పోలవరం నిర్మాణం కోసం రూ.12,911 కోట్లు, మరమ్మతుల కోసం వ్యయం చేసిన రూ.2,000 కోట్లను చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామంటూ కేంద్ర ఆర్థికశాఖ నోట్‌ను విడుదల చేసింది. కానీ దీనికి కేంద్ర కేబినెట్ ఆమోదం కావాలని మెలికపెట్టింది. ఈ మధ్యలో జగన్ కనీసం నాలుగైదుసార్లు ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీని, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలిశారు. ఈ నిధుల కోసం ఒత్తిడి చేసిన దాఖలాలే లేవు. కేంద్ర కేబినెట్ ఆమోదం తప్పనిసరని అవగాహన ఉన్నా మోదీని ఒప్పించడంలో విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలే కేంద్ర కేబినెట్ సమావేశం జరిగినా పోలవరం ఫైలు దాని ముందుకు వెళ్లలేదు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ రానున్న నేపథ్యంలో ఇప్పట్లో కేంద్ర కేబినెట్ ముందుకు అది వెళ్లడం అనుమానమేనని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

వ్యక్తిగత కక్ష..
'పరీక్ష'తో రచ్చ!

కుటుంబ తగాదాలతో నకిలీ హాల్ టికెట్‌తో మోసం

చిత్తూరు, ఫిబ్రవరి 27: వారిద్దరూ బంధువులే. కానీ, రెండు కుటుంబాల మధ్య మనస్పర్థలున్నాయి. దీంతో గ్రూపు-2 ప్రిలిమినరీ స్ర్కీనింగ్ పరీక్షకు దరఖాస్తు చేయాలని ఒకరు.. మరొకరి మీ సేవా కేంద్రాన్ని ఆశ్రయిస్తే అతడు మోసం చేశాడు. తీరా ప్రభుత్వం పరీక్ష తేదీని ప్రకటించడంతో.. నకిలీ హాల్ టికెట్‌ను సృష్టించి ఇచ్చి.. పోలీసులకు పట్టించాలని పథకం పన్నాడు. తీరా అతడే నిందితుడిగా దొరికిపోయాడు. చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి కేసు వివరాలను మీడియాకు వివరించారు. ఏపీపీఎస్సీ గ్రూపు-2 ప్రిలిమినరీ స్ర్కీనింగ్ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని కర్నూలు జిల్లా డోన్‌లోని మీ సేవా కేంద్రంలో పనిచేస్తున్న బంధువైన ఇమ్మానుయేలును.. అదే జిల్లా కృష్ణగిరి మండలం కంబాలపాడుకు చెందిన సుదర్శనం కోరారు. గతంలో తమ రెండు కుటుంబాల మధ్య ఉన్న వైషమ్యాలను మనసులో పెట్టుకున్న ఇమ్మానుయేలు.. సుదర్శనం దరఖాస్తును నమోదు చేయకుండా దెబ్బతీయాలని భావించాడు. దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. హాల్ టికెట్‌ను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు ప్రకటించారు. ఆ మేరకు హాల్‌టికెట్ తీసివ్వాలని సుదర్శనం అడిగారు. దీంతో ఇమ్మానుయేలు వేరొకరి హాల్‌టికెట్‌లోని వివరాలను మార్చి.. సుదర్శనం వ్యక్తిగత వివరాలు, ఫొటోను అతికించి.. నకిలీ హాల్ టికెట్‌ను తయారు చేసిచ్చాడు. పరీక్షా కేంద్రాన్ని దూరంగా పెడితే వెళ్లడానికి సమయం చాలక.. పరీక్ష రాయకుండా వచ్చేస్తాడని అనుకున్నాడు. అందుకని చిత్తూరు నగరం మర్రిమాను వీధిలోని నారాయణ కాలేజీని పరీక్షా కేంద్రంగా నకిలీ హాల్‌టికెట్‌లో చూపించాడు. ఒకవేళ సకాలంలో పరీక్షకు వెళితే నకిలీ హాల్ టికెట్ కావడంతో పోలీసులకు పట్టుబడతాడని, అప్పుడు తన పంతం నెరవేరుతుందని ఇమ్మానుయేలు భావించాడు. ఈనెల 25న జరిగిన గ్రూప్ 2 ప్రిలిమినరీ పరీక్ష కోసం ఆ హాల్ టికెట్‌తో సుదర్శనం చిత్తూరుకు సకాలంలో చేరుకున్నారు. ఆ హాల్ టికెట్‌లో చూపిన నారాయణ కాలేజీని ప్రభుత్వం పరీక్షా కేంద్రంగా ఎంపిక చేయలేదు. దీంతో సుదర్శనం చిత్తూరులోని అధికారులను కలిసి హాల్ టికెట్‌ను చూపించారు. ఇది నకిలీదని అధికారులు గుర్తించారు. దీనిపై సుదర్శనం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు కర్నూలు జిల్లా డోన్‌లో ఉన్న ఇమ్మానుయేలును అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న కంప్యూటర్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని విచారించారు. నేరం రుజువుకావడంతో మంగళవారం ఇమ్మానుయేలు(24)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

త్వరలో జీనోమ్ వ్యాలీ-2

రూ. 2వేల కోట్ల 300 ఎకరాల్లో ఏర్పాటు: రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): వ్యాక్సిన్ల తయారీలో ప్రపంచానికే తలమానికంగా నిలిచిన హైదరాబాద్‌లో.. ఫార్మా కంపెనీల కేంద్రమైన జీనోమ్‌వ్యాలీని మరింత విస్తరించనున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. హెచ్ఐసీసీలో 21వ బయో ఆసియా సదస్సును మంగళవారం ప్రారంభించిన సీఎం.. 300 ఎకరాల్లో రూ.2000 కోట్ల పెట్టుబడులతో రెండో దశ జీనోమ్ వ్యాలీని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో పది ఫార్మా విలేజ్‌ల ఏర్పాటు ప్రక్రియ ఇప్పటికే మొదలైందని.. దీంతో మౌలిక సదుపాయాలతో పాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయని.. 5 లక్షల మందికి కొత్త ఉద్యోగాలు లభిస్తాయని ఆయన వివరించారు. వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాల్లో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా సెక్టార్లలో ఈ ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఒక గంట ప్రయాణ దూరంలోనే అత్యంత సమీపంలో వీటిని ఏర్పాటు చేస్తున్నందున ప్రపంచంలోని పారిశ్రామికవేత్తలందరికీ ఇది ఎంతో సదుపాయంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు ప్రపంచంలో వినియోగించే ప్రతి మూడు వ్యాక్సిన్లలో ఒకటి హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అవుతోందని సీఎం గుర్తు చేశారు. బయోసైన్స్ రాజధానిగా హైదరాబాద్ నేడు యావత్ మానవాళికీ భరోసాగా నిలిచిందని.. వైరస్ భయాలను దీటుగా ఎదుర్కోగలమనే నమ్మకాన్ని కలిగించిందని సగర్వంగా పేర్కొన్నారు. బయోసైన్సెస్‌లోనే కాక.. ఐటీ, రిసెర్చ్, స్టార్టప్ రంగాలకు రాజధానిగా ఉన్న హైదరాబాద్‌ను మరింత సమున్నతంగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ప్రకటించారు. అంతర్జాతీయ, దేశీయ సంస్థలు ఇక్కడ ఎలాంటి ఆటంకాలూ లేకుండా కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు అవసరమైన అనుకూల వ్యవస్థలను బలోపేతం చేశామన్నారు. చిన్న స్టార్టప్‌లు, పెద్ద కార్పొరేట్ కంపెనీలకు వారధిగా నిలిచే ఎంఎస్ఎంఈ రంగానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు.

ఐసీయూలో మహిళా పేషెంట్‌పై అత్యాచారం

జైపూర్, ఫిబ్రవరి 27: ఓ ప్రయివేటు ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న మహిళా పేషెంట్‌పై అత్యాచారం జరిగిన సంఘటన రాజస్థాన్‌లోని ఆల్వార్‌లో చోటుచేసుకుంది. ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ సమస్యతో బాధపడుతున్న 24 ఏళ్ల మహిళ ఆ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరింది. మంగళవారం వేకువఝాము నాలుగు గంటల సమయంలో ఐసీయూలో నర్సింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చిరాగ్ యాదవ్ ఆమెపై అత్యాచారం చేసినట్టు పోలీసులు తెలిపారు. అతడ్ని చూసి భయపడ్డ ఆమె కేకలు వేయడానికి ప్రయత్నించగా మత్తు మందు ఇంజెక్షన్ ఇచ్చాడు. దాంతో స్పృహ కోల్పోయిన ఆమెపై దారుణానికి పాల్పడ్డాడు. నిందితుడ్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు శివాజీ పార్క్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజ్‌పాల్ సింగ్ చెప్పారు.

నిరుద్యోగుల కలలకు
'మోదీ గ్రహణం': రాహుల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: కేంద్రం నిరుద్యోగుల జీవితాలతో చలగాటం ఆడుతోందని, మోదీ ప్రభుత్వం.. నిరుద్యోగుల కలలకు పట్టిన గ్రహణం అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో జరిగిన పేపర్ లీకేజీ ఘటనపై మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. దేశ భవిష్యత్తుకు మోదీ ప్రభుత్వం శత్రువుగా మారిందని మండిపడ్డారు. "నిరుద్యోగులు న్యాయం చేయాలని కోరితే వారిపై లాఠీ చార్జ్ చేస్తున్నారు. ఉద్యోగాలు కల్పించే సంస్థలను మోదీ తన స్నేహితులకు అమ్ముకుంటున్నారు. దోపిడీ.. మోదీ గ్యారంటీ. ఈ నేరం చేసిన మోదీని చరిత్ర ఎప్పటికీ క్షమించదు." అని రాహుల్ గాంధీ విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒక్క ఉద్యోగ నియామక పరీక్షను కూడా సరిగ్గా నిర్వహించలేక పోయిందని ఎద్దేవాచేశారు.

కుటుంబనియంత్రణ శస్త్రచికిత్సలు వికటించి
కర్ణాటలో ముగ్గురు మహిళల మృతి

బెంగళూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని తుమకూరు జిల్లా పావగడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 22న నిర్వహించిన కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు వికటించాయి. శస్త్ర చికిత్స చేయించుకున్న ఏడుగురు మహిళల్లో ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తరలించారు. మృతిచెందిన వారిలో పావగడ తాలూకాలోని రాజవంతి గ్రామానికి చెందిన అంజలి (22), వీర్ల గొంది గ్రామానికి చెందిన అనిత (28), బ్యాడనూరు గ్రామానికి చెందిన నరసమ్మ (40) ఉన్నారు. వీరిలో అంజలి, అనితకు సిజేరియన్ ఆపరేషన్‌తోపాటు కు.ని. చికిత్స కూడా నిర్వహించారు. నరసమ్మకు కేవలం కు.ని. శస్త్రచికిత్స చేశారు. అనిత ఆపరేషన్ జరిగిన రోజే మృతి చెందగా, మిగిలిన ఇద్దరు ఈనెల 24న మృతి చెందారు.

కుప్పం నీటిపై
జగన్ వంచన!

- బ్రాంచ్ కాలువ పూర్తికానే లేదు
- 350 ఎకరాల ఆయకట్టు ఉన్న 4 చెరువులకు కొద్దిపాటి నీటిని లాంఛనంగా ఇచ్చారు
- సాగునీటి నిపుణుడు లక్ష్మీనారాయణ ధ్వజం
- ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను పూర్తిచేయకుండానే ఆ నియోజకవర్గ ప్రజలకు నీరిస్తున్నట్లు సీఎం జగన్మోహన్‌రెడ్డి వంచనకు పాల్పడుతున్నారని సాగునీటి రంగ నిపుణుడు టి.లక్ష్మీనారాయణ విమర్శించారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల ద్వారా కుప్పానికి సాగు, తాగునీటిని తరలించే ఏర్పాట్లు చేశారా అని ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు బహిరంగ లేఖ రాశారు. కరవుపీడిత రాయలసీమలో మెట్టప్రాంతాలకు కృష్ణా నది వరద జలాలను శ్రీశైలం జలాశయం నుంచి తరలించడానికి.. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల గ్రామ సమీపంలో నిర్మించిన ఎత్తిపోతల పథకం ద్వారా 40 టీఎంసీలను 120 రోజుల్లో తరలించి 6,02,500 ఎకరాలకు సాగునీరందించేలా హంద్రీ-నీవా సుజల స్రవంతి చేపట్టారని గుర్తుచేశారు.కుప్పం బ్రాంచ్ కెనాల్ ఈ ప్రాజెక్టు వ్యవస్థ చివరి భాగంలో ఉందన్నారు. హంద్రీ-నీవా ప్రధాన కాలువ 400.50 కిలోమీటర్ల వద్ద నుంచి పుంగనూరు ఉపకాలువను నిర్మించాల్సి ఉందని.. ఆ పుంగనూరు ఉపకాలువ 207.8 కిలోమీటర్ల వద్ద నుంచి కుప్పం కెనాల్ నిర్మించాల్సి ఉందన్నారు. శ్రీశైలం జలాశయం నుంచి కృష్ణా వరద జలాలు మొత్తం 732 కిలోమీటర్లు ప్రయాణించాలని.. ప్రవాహ సామర్థ్యాన్ని పెంచకుండా ఎలా చేరతాయని నిలదీశారు. కుప్పం కెనాల్ ప్రవాహ సామర్థ్యం 216 క్యూసెక్కులేనని గుర్తుచేశారు. దీనిపై మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించి, వాటి ద్వారా 110 చెరువుల కింద ఉన్న 6300 ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని, ప్రజలకు తాగునీటిని అందించాల్సి ఉందన్నారు. ఈ లక్ష్యం త్వరితగతిన సాకారం కావాలని ప్రజలు ఏళ్లతరబడి కళ్లుకాయలు కాచేలా ఎదురు చూస్తున్నారని తెలిపారు. కుప్పం కెనాల్ అంచనా వ్యయం రూ.2015-16 ధరల ప్రకారం రూ.293.11 కోట్లు కాగా.. రూ.560.29 కోట్లకు ఎగబాకిందని, 2019 ఏప్రిల్ నాటికి ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.460.88 కోట్లని , వైసీపీ అధికారంలోకి వచ్చేనాటికి రూ.99.41 కోట్లు వ్యయం చేస్తే చాలని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయని తెలిపారు. సోమవారం కుప్పం కెనాల్ 70వ కిలోమీటరు నుంచి కేవలం 350 ఎకరాల ఆయకట్టు ఉన్న నాలుగు చెరువులకు కొద్దిపాటి నీటిని లాంఛనంగా విడుదల చేశారని.. దీనినిబట్టి కెనాల్ నిర్మాణ పనులు పూర్తికాలేదని ఎవరికైనా బోధపడుతుందని అన్నారు.

రోజా ఐటమ్ రాణి..
పులుసు పాప: బండ్ల గణేష్

హైదరాబాద్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేటీఆర్‌ను సీఎం చేస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రకటించి ఉంటే బీఆర్ఎస్‌కు మూడు సీట్లు కూడా వచ్చేవి కాదని టీపీసీసీ నాయకుడు బండ్ల గణేష్ వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి యాక్సిడెంటల్ సీఎం అని ఏపీ మంత్రి ఆర్కే రోజా వ్యాఖ్యానించడంపై తీవ్రంగా స్పందించారు. రోజా డైమండ్ రాణి, ఐటమ్ రాణి, పులుసు పాప అని ఎద్దేవా చేశారు. తండ్రి చనిపోతేనో, ఆమెలాగా పులుసు వండి పెడితేనో అవుతారని యాక్సిడెంటల్ అంటే సీఎం అవుతారని పేర్కొన్నారు. నిజమైన యాక్సిడెంటల్ సీఎం జగన్ అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో రోజాకు టికెట్ రావడమే కష్టమని జోస్యం చెప్పారు. రేపోమాపో రోజా మాజీ అవుతారని.. పగలు జబర్దస్త్, రాత్రి మాజీలందరూ కలిసి పులుసు వండుకోవాలని సూచించారు.

అందరికీ అందని 'భరోసా'!



- వాస్తవ సాగుదారులందరికీ పెట్టుబడి సాయం ఏదీ?
- తొలి ఏడాది లేని రైతులు ఇప్పుడు ఎక్కడి నుంచి వచ్చారో?
- కౌలురైతుల్లో అగ్రవర్ణాలు అనర్హులా?
- రైతులకు 12,500 ఇస్తానని హామీ.. ఇచ్చేది 7,500
- కేంద్రం సొమ్ము 6వేలు కలిపేసి భారం తగ్గించుకున్న జగన్ సర్కార్

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి రైతుకూ ఏటా రూ.12,500 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు తన పాదయాత్రలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. తీరా అధికారంలోకి వచ్చాక రైతుభరోసా కింద ఈ ఐదేళ్లలో పంట సాగుదారులందరికీ ఒక్క కిస్తీ కూడా పూర్తి స్థాయిలో అందించలేదన్న విమర్శలున్నాయి. అధికారం చేపట్టాక పెట్టుబడి సాయాన్ని రూ.13,500కు పెంచుతున్నట్లు ప్రకటించి.. అప్పటికే కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద ఇస్తున్న రూ.6వేలను కూడా కలిపేశారు. కేంద్రం ఇచ్చే రూ.6వేలను మినహాయిస్తే, జగన్ సర్కార్ ఇచ్చేది కేవలం రూ.7,500 మాత్రమే. అయితే కేంద్రం భూ యజమానులకు మాత్రమే ఇస్తున్నందున రాష్ట్ర ఖజానా నుంచి కౌలురైతులకు, అటవీ భూ హక్కుదారులకు సాయం చేస్తున్నారు. కానీ కౌలు రైతుల్లో 10% మందికి కూడా సాయం అందించట్లేదు. కేవలం పంట సాగు హక్కు పత్రం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే సాయం చేస్తున్నారు. కౌలు సేద్యంలో అగ్రభాగాన ఉన్న అగ్రవర్ణాలకు జగన్ మొండిచేయి చూపారు. రాష్ట్రంలో 64లక్షల మంది భూ యజమానులు, 16లక్షలపైగా కౌలుదారులు ఉండగా, అనేక నిబంధనలు పెట్టి, భూయజమానుల్లో 20% మందికి, కౌలురైతుల్లో 90% మందికి ఎగనామం పెట్టారు. సాగు హక్కు పత్రాలు 8లక్షల మందికి జారీ చేసినా, కేవలం 1.64లక్షల మంది కౌలుసాగుదారులకే లబ్ధి చేకూరుస్తున్నారు. ఇదిలా ఉండగా, జగన్ సర్కార్ తొలి ఏడాది 46.69లక్షల మందికి, రెండో ఏడాది 51.59 లక్షల మంది, మూడో ఏడాది 52.38లక్షల మంది, నాలుగో ఏడాది 51.40లక్షల మందికే సాయం అందించింది. ఈ ఏడాది రెండు కిస్తీలు 53.52లక్షల మందికి ఇవ్వగా, ఈ విడత 53.58లక్షల మంది లబ్ధిదారులుగా చూపుతున్నారు. మొదటి ఏడాది లేని రైతులు ఇప్పుడు దాదాపు 7లక్షల మంది ఎలా పెరిగారనే ప్రశ్న తలెత్తుతోంది. రైతుభరోసా చెల్లింపులకు ప్రతి విడతా రూ.కోట్లు వెచ్చించి, ఆర్భాటపు ప్రకటనలు చేసిన ప్రభుత్వం.. రైతులకు సాయంచేసే విషయంలో మాత్రం దృష్టి పెట్టలేదన్న కౌలురైతులు మండిపడుతున్నారు.

●ఏటేటా తగ్గిన క్లైములు

పంటల సాగు కోసం రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులకు గత ప్రభుత్వం వడ్డీ మినహాయించి, ఏడాదిలోగా అసలు వసూలు చేయగా, జగన్ సర్కార్ మాత్రం వడ్డీతో సహా సొమ్మంతా రాబట్టింది. ఇదేమంటే.. వడ్డీని తిరిగి రైతుల ఖాతాలకు జమ చేస్తామంది. తీరా అసలు, వడ్డీ చెల్లించి, నెలలు గడిచినా వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను తీవ్ర జాప్యం చేస్తోంది. పైగా గతంలో రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు పావలా వడ్డీ రుణాలకు జగన్ సర్కార్ వడ్డీ రాయితీ ఇవ్వబోమని తెగేసి చెప్పింది. దీంతో బ్యాంకులు, సహకార సంఘాలు ఇచ్చే అరకొర రుణాలు చాలక కొందరు రైతులు పంటల సాగుకు స్వస్తి చెప్పి, పొలాలను కౌలుకు ఇచ్చేస్తున్నారు. పైగా రూ.లక్ష లోపు రుణాలకు సంబంధించి వడ్డీ రీయింబర్స్‌మెంట్ క్లైములు ఏటేటా తగ్గిపోతున్నా.. 2021-22 రబీ, 2022 ఖరీఫ్ రుణాల వడ్డీ చెల్లింపుల్లో జాప్యం చేసింది. దీనిపై రైతులు ఆగ్రహంగా ఉన్నారని గుర్తించి, ఎట్టకేలకు బుధవారం విడుదల చేయడానికి సిద్ధమైంది. చంద్రబాబు హయాంలో బకాయిలు పెట్టిపోయారంటూ ప్రభుత్వ పెద్దలు తరచూ విమర్శలు చేస్తున్నారు. కానీ 2014-19 మధ్య వడ్డీ లేని రుణాల బకాయిలతో పాటు 2020-21 వడ్డీతో కలిపి 39.06లక్షల మందికి రూ.1,180కోట్లు విడుదల చేసిన ఈ ప్రభుత్వం.. 2020-21లో 2019 ఖరీఫ్ కింద 14.20లక్షల మందికి రూ.285కోట్లు, 2021-22లో 2019-20 రబీ, 2020ఖరీఫ్ కింద 12.31లక్షల మందికి రూ.207కోట్లు, 2022-23లో 2020-21 రబీ, 2021ఖరీఫ్ కింద 8.22లక్షల మందికి రూ.160కోట్లు మాత్రమే చెల్లించినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇప్పుడు 2021-22 రబీ, 2022 ఖరీఫ్ కింద 10.78లక్షల మందికి రూ.216కోట్లు విడుదలకు ఏర్పాట్లు చేశారు.

నేడు రైతు భరోసా- పీఎం కిసాన్ సొమ్ము విడుదల

సున్నావడ్డీ రాయితీ కూడా చెల్లింపు

వైఎస్సార్ రైతు భరోసా- పీఎం కిసాన్ మూడో విడత కిస్తీ సొమ్ము రైతుల ఖాతాలకు బుధవారం జమ కానున్నది. పీఎం కిసాన్ డబ్బులు ప్రధాని నరేంద్రమోదీ విడుదల చేయనుండగా, రైతుభరోసాకు సీఎం జగన్ తాడేపల్లి క్యాంప్ ఆఫీస్‌లో కంప్యూటర్‌లో బటన్ నొక్కి చెల్లింపులు చేయనున్నారు. మొత్తంగా ఈ విడత 53.58లక్షల మంది రైతులకు రూ.1,078కోట్లు విడుదల చేయనున్నారు. ఇందులో రైతుభరోసా కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు 1,64,705 మంది, అటవీ భూ హక్కుదారులు 93,600 మందికి మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం రూ.2వేల చొప్పున రూ.51.66కోట్లు జమ చేయనున్నది. గ్రీవెన్స్‌లో వచ్చిన వారితో కలిపితే రూ.58.36కోట్లు విడుదల చేయనున్నారు. మిగతా 51లక్షల మంది భూ యజమానులకు పీఎం కిసాన్ కింద రూ.2వేల చొప్పున రూ.1,020కోట్లు కేంద్రం జమ చేయనున్నది. కాగా, రూ.లక్ష లోపు పంట రుణాలపై వడ్డీ రాయితీని కూడా సీఎం విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● బుధవారం 28 ఫిబ్రవరి 2024

హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ)- లేటరల్ ఎంట్రీ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(ఎల్ఈఈఈ) 2024, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(పీజీఈఈ) 2024 నోటిఫికేషన్‌లను విడుదల చేసింది. లేటరల్ బీటెక్-ఎంఎస్; ఎంటెక్, ఎంఎస్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి వీటిని ఉద్దేశించారు. ఈ ఎగ్జామ్స్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

హైదరాబాద్ ఐఐఐటీలో
లేటరల్ ఎంట్రీ, పీజీ ఎంట్రెన్స్ టెస్ట్‌లు



లేటరల్ ఎంట్రీ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (ఎల్ఈఈఈ)

ఈ ఎగ్జామ్ ద్వారా డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్(బీటెక్-ఎంఎస్)లో లేటరల్ ఎంట్రీకి అవకాశం కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొదట బీటెక్ డిగ్రీని ఆ తరవాత రీసెర్చ్ థీసిస్ పూర్తిచేసి ఎంఎస్ డిగ్రీని పొందవచ్చు.

స్పెషలైజేషన్‌లు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీడీ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్‌డీ)

అర్హత: ఈసీడీ విభాగానికి బీఈ/బీటెక్(ఈసీఈ/ ఈటీఈ/ ఈఐఈ/ ఈఈఈ/ఐఓటీ/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ ఇంజనీరింగ్); సీఎస్‌డీ విభాగానికి బీఈ/బీటెక్(సీఎస్ఈ/ఐటీ/ఏఐ అండ్ ఎంఎల్/డేటా సైన్స్/సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్) చదువుతున్న అభ్యర్థులు అర్హులు. 2024 జూలై నాటికి నాలుగో సెమిస్టర్ పూర్తిచేసి ఉండాలి.

కొవిడ్-19 వల్ల అకడమిక్ ఇయర్‌లో వచ్చిన మార్పుల కారణంగా దరఖాస్తు నాటికి మూడో సెమిస్టర్ పూర్తిచేసినవారిని అనుమతిస్తున్నారు. కనీసం 80 శాతం మార్కులు తప్పనిసరి.

ఎల్ఈఈఈ 2024 వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగానికి నిర్వహించే పరీక్షలో జనరల్ ఆప్టిట్యూడ్, మేథమెటిక్స్, డిజిటల్ లాజిక్, సర్క్యూట్ థియరీ అండ్ నెట్‌వర్క్స్, ఎలక్ట్రానిక్ డివైజెస్ అండ్ సర్క్యూట్స్, సిగ్నల్స్ అండ్ సిస్టమ్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి నిర్వహించే ఎగ్జామ్‌లో జనరల్ ఆప్టిట్యూడ్, మేథమెటిక్స్, డిజిటల్ లాజిక్, సీ-ప్రోగ్రామింగ్, డేటా స్ట్రక్చర్స్, బేసిక్ అల్గారిథమ్స్ అండ్ ప్రాబ్లం సాల్వింగ్, డిస్క్రీట్ మేథమెటిక్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం మూడు గంటలు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(పీజీఈఈ)

ఈ ఎగ్జామ్ ద్వారా ఎంటెక్, ఎంఎస్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఎంటెక్, ఎంఎస్ ప్రోగ్రామ్‌ల వ్యవధి రెండేళ్లు. పీహెచ్‌డీ వ్యవధి అయిదేళ్లు. వీటిలో కోర్సు వర్క్ ప్రధానంగా ఉంటుంది. ఎంఎస్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో అదనంగా రీసెర్చ్ థీసిస్ పూర్తిచేయాల్సి ఉంటుంది.

ఎంటెక్ స్పెషలైజేషన్‌లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, కంప్యూటర్ ఎయిడెడ్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, ప్రొడక్ట్ డిజైన్ అండ్ మేనేజ్‌మెంట్

ఎంఎస్(రీసెర్చ్) స్పెషలైజేషన్‌లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, బయోఇన్ఫర్మాటిక్స్

పీహెచ్‌డీ స్పెషలైజేషన్‌లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, బయోఇన్ఫర్మాటిక్స్ కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, కంప్యూటేషనల్ నేచురల్ సైన్సెస్, స్పేషియల్ ఇన్ఫర్మాటిక్స్, కాగ్నిటివ్ సైన్స్, హ్యూమన్ సైన్సెస్

అర్హత: ఎంటెక్ ప్రోగ్రామ్‌లో కంప్యూటర్ ఎయిడెడ్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌కు సివిల్ ఇంజనీరింగ్‌లో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. ప్రొడక్ట్ డిజైన్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు డిగ్రీ(ఇంజనీరింగ్/టెక్నాలజీ/డిజైన్/సైన్స్) ఉత్తీర్ణులు లేదా మాస్టర్స్ డిగ్రీ(సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి కనీసం ఏడాది అనుభవం ఉండాలి. పీహెచ్‌డీలో కాగ్నిటివ్ సైన్స్ స్పెషలైజేషన్‌కు కాగ్నిటివ్ సైన్స్/సైకాలజీ/లింగ్విస్టిక్స్/ఫిలాసఫీ/సైన్సెస్ విభాగాల్లో డిగ్రీ/పీజీ పూర్తిచేసినవారు, ఎంబీబీఎస్/ఎండీ ఉత్తీర్ణులు అర్హులు. హ్యూమన్ సైన్సెస్ స్పెషలైజేషన్‌కు హ్యూమానిటీస్/సోషల్ సైన్సెస్ విభాగాల్లో ఎంఏ పూర్తిచేసినవారు; బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు అయిదేళ్ల అనుభవం ఉన్నవారు; ఎమ్మెస్సీ/ఎంఎస్/ఎంటెక్ ఉత్తీర్ణతతోపాటు రీసెర్చ్ థీసిస్ సబ్మిట్ చేసినవారు అర్హులు. కంప్యూటేషనల్ నేచురల్ సైన్సెస్‌కు ఎమ్మెస్సీ(ఫండమెంటల్ సైన్సెస్) లేదా సీఎస్/ఐటీ/బయోటెక్నాలజీ/బయోఇన్ఫర్మాటిక్స్/బయోమెడ్ విభాగాల్లో బీఈ/బీటెక్/ఎంఈ/ఎంటెక్ పూర్తిచేసి ఉండాలి. మిగిలిన స్పెషలైజేషన్‌లకు ఏదేని ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్/ఎంఈ/ఎంటెక్ పూర్తిచేసినవారు; ఎమ్మెస్సీ, ఎంసీఏ, ఎంఏ (మేథ్స్) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీఈఈ 2024 వివరాలు: దీనిని కూడా సీబీటీ మోడ్‌లోనే నిర్వహిస్తారు. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. మొదటిది జనరల్ ఆప్టిట్యూడ్. ఇందులో బేసిక్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, కంప్యూటర్స్, మేథమెటిక్స్ అంశాలకు సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు. రెండోది సబ్జెక్ట్ పేపర్. ఇందులో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్ సబ్జెక్టులు ఉంటాయి. అభ్యర్థి డిగ్రీ స్థాయిలో చదివిన విభాగాన్ని అనుసరించి సబ్జెక్ట్ పేపర్ ఎంచుకోవాలి. రెండు పేపర్లకూ నెగెటివ్ మార్కులు వర్తిస్తాయి. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పేపర్‌కు గంటన్నర చొప్పున మొత్తం పరీక్ష సమయం మూడు గంటలు. ఎంటెక్‌లో ప్రవేశానికి రెండు పేపర్లూ రాయాలి. ఎంఎస్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు సబ్జెక్ట్ పేపర్ ఉండదు. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారిని నేరుగా ఇంటర్వ్యూకి అనుమతిస్తారు. పీహెచ్‌డీలో హ్యూమన్ సైన్సెస్ స్పెషలైజేషన్‌కు ఎగ్జామ్ రాయనవసరం లేదు. వీరు రీసెర్చ్ స్టేట్‌మెంట్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.2,500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 1
- **ఎల్ఈఈఈ పీజీఈఈ తేదీ:** మే 4న
- **పరీక్ష కేంద్రాలు:** విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్
- **ఇంటర్వ్యూలు:** లేటరల్ ఎంట్రీకి మే 25న; ఎంఎస్(రీసెర్చ్) ప్రోగ్రామ్‌నకు జూన్ 5, 6; పీహెచ్‌డీకి జూన్ 7, 8
- **వెబ్‌సైట్:** iiit.ac.in

ఐఐటీ మద్రాస్‌లో
సమ్మర్ ఫెలోషిప్

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ మద్రాస్)- 'సమ్మర్ ఫెలోషిప్ ప్రోగ్రామ్ 2024'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండు నెలలు. దీనిని మే 22 నుంచి జూలై 21 వరకు నిర్వహిస్తారు. విద్యార్థుల సౌలభ్యాన్ని అనుసరించి ఈ షెడ్యూల్‌ను మార్చే అవకాశం ఉంది. ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, సైన్సెస్, హ్యూమానిటీస్ విభాగాలకు సంబంధించి సంస్థలో మినీ రీసెర్చ్ ప్రాజెక్ట్ వర్క్ చేయాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.6,000 చొప్పున గరిష్ఠంగా రెండు నెలలు స్టయిపెండ్ ఇస్తారు.

ఫెలోషిప్ విభాగాలు

ఇంజనీరింగ్: ఏరోస్పేస్ ఇంజనీరింగ్, అప్లయిడ్ మెకానిక్స్ అండ్ బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇంజనీరింగ్ డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెడికల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్, ఓషన్ ఇంజనీరింగ్

సైన్స్: ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్

మేనేజ్‌మెంట్: హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ స్టడీస్

అర్హత: బీఈ/బీటెక్/బీఎస్సీ ఇంజనీరింగ్ మూడో ఏడాది చదువుతున్నవారు; ఇంటిగ్రేటెడ్ ఎంఈ/ఎంటెక్ ప్రోగ్రామ్‌లకు సంబంధించి మూడు/నాలుగో ఏడాది చదువుతున్నవారు; ఎంఈ/ఎంటెక్/ఎమ్మెస్సీ/ఎంఏ/ఎంబీఏ మొదటి ఏడాది చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అకడమిక్ ఎగ్జామ్స్‌లో అధిక స్కోర్ సాధించినవారికి, సెమినార్లలో పేపర్స్ ప్రజెంట్ చేసినవారికి, ప్రాజెక్ట్‌లు నిర్వహించినవారికి, డిజైన్ కంటెస్ట్‌లలో పాల్గొన్నవారికి, మేథమెటిక్స్ ఒలింపియాడ్‌లో ర్యాంక్/స్కోర్ సాధించినవారికి ప్రాధాన్యం ఉంటుంది. విద్యార్థులు తమ ఇన్‌స్టిట్యూట్ నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా సబ్మిట్ చేయాలి. ఐఐటీ విద్యార్థులు దరఖాస్తుకు అనర్హులు.

ముఖ్య సమాచారం
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31న సాయంత్రం 5 గంటల వరకు
- **వెబ్‌సైట్:** https://sfp.iitm.ac.in

నమ్మక ద్రోహి




ఒక అడవిలో గద్ద, కుందేలు దగ్గర దగ్గరగా ఉండేవి. కుందేలు జోలికి గద్ద పోయేది కాదు. ఒక రోజు గద్ద ఆహారం కోసం బయటకు వెళ్లింది. తిరిగి రెండు రోజులయినా రాలేదు. దీంతో కుందేలుకు ఆ చెట్టు ఎక్కాలనిపించింది. చెట్టు మీద భలే ఉందే.. అనుకుంటూ చెట్ల కొమ్మల మీద ఆడుకుంది. ఇక ఏం చేయాలో తెలీక.. గెంతులేసింది. గద్ద కట్టుకున్న గూడు మీద కూర్చుంది. గుడ్లు కింద పడి పగిలిపోయాయి. ఏమీ తెలీనట్లు వెళ్లిపోయింది కుందేలు.

రెండు రోజుల తర్వాత గద్ద వచ్చింది. తన గుడ్లు, గూడు చెదిరిపోవటంతో కోపంతో ఊగిపోయింది. ఎవరు చేశారో వాళ్ల పని పడతానని భీష్మించుకుంది. ఆ మరుసటి రోజు దినసరి పనిలా ఆహారం కోసం వెళ్లింది. వెళ్లిన కాసేపట్లో తిరిగొచ్చింది. తన కొత్త గూటిలో కుందేలు ఉంది. 'ఈ పని నీదేనా? పక్కకు వెళ్లిపో' అన్నది గద్ద. 'ఇది నా గూడు. ఎవరు ఉంటే వారిదే ఆ స్థలం' అన్నది కుందేలు. రెండు గొడవ పడ్డాయి. ఆ గొడవకు మిగతా జంతువులు గుమికూడాయి. ఎవరికీ న్యాయం చెప్పలేక అందరూ అలా కూర్చుండిపోయారు.




రెండూ కొట్లాడుతూ నది పక్కకు వెళ్లాయి. నది పక్కన చెట్టు కింద ఓ ముసలి పిల్లి ఉంది. ఆ పిల్లిని తీర్పు చెప్పమని అడిగాయి. ఆ పిల్లి పట్టించుకోలేదు. ధ్యాన ముద్రలో ఉంది. 'మీరు పెద్దవారిలా ఉన్నారు. నా ఇంటిలో ఇలా చేసింది కుందేలు' అంటూ విషయం చెప్పింది. పిల్లి స్పందించలేదు. ఆ తర్వాత వెంటనే తన గోడును కుందేలు వెళ్లబోసుకుంది. పిల్లికి ఎవరి తరఫున మాట్లాడాలో అర్థం కాలేదు. మౌనంగా కూర్చున్న పిల్లి ఇలా అంది.. 'మీ బాధ అర్థమైంది. వయోభారం వల్ల ఇలా మౌనంగా ఉన్నా. చెవులు సరిగా వినపడలేదు. దయచేసి మళ్లీ చెప్పండి' అన్నది గద్ద. వెంటనే కుందేలు, గద్ద పిల్లి దగ్గరకు పోయాయి. వెంటనే రెండింటి మెడలను ఒకేసారి పట్టుకుని గట్టిగా నొక్కేసింది. రెండూ ప్రాణాలు విడిచాయి. 'నేనే దొరికానా మీకు న్యాయం చెప్పడానికి' అంటూ పిల్లి సంబరపడిపోయింది.

8 తేడాలను గుర్తించండి



ఎన్ని పక్షులు ఉన్నాయి?






మిస్సింగ్ నంబర్ టెస్ట్

పోటీ పరీక్షల ప్రత్యేకం

పార్ట్-2

1. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?




ఎ) 63 బి) 58 సి) 73 డి) 52

సమాధానం: (సి)

వివరణ: మొదటి డయాగ్రామ్‌లో
8 x 4 = 32 6 x 8 = 48 32 + 48 = 80
రెండో డయాగ్రామ్‌లో
7 x 8 = 56 6 x 4 = 24 56 + 24 = 80
అదేవిధంగా మూడో డయాగ్రామ్‌లో
9 x 5 = 45 7 x 4 = 28
45 + 28 = 73 సమాధానం అవుతుంది.

2. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 45 బి) 62 సి) 56 డి) 72

సమాధానం: (ఎ)

వివరణ: ప్రతి డయాగ్రామ్‌లో కింది రెండు అంకెల లబ్ధం పైన గల సంఖ్య
6 x 7 = 42 9 x 8 = 72 అదేవిధంగా
5 x 9 = 45 సమాధానం అవుతుంది.

3. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?

P32	R17	Q7
Q26	P38	R8
R12	Q24	?

ఎ) P_8 బి) P_6 సి) Q_8 డి) R_7


సమాధానం: (బి)

వివరణ: ఇచ్చిన డయాగ్రామ్‌లో ప్రతి వరుసలోను P, Q, Rలు నిలువుగా, అడ్డంగా ఏదో ఒక స్థానంలో ఉంటున్నాయి.

ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో ఉండాల్సిన అక్షరం P. ప్రతి అడ్డు వరుసలో మొదటి రెండు సంఖ్యలను కూడితే ఏర్పడే సంఖ్య, మూడో స్థానంలో గల సంఖ్యకు వర్గం.

32 + 17 = 49 అనేది 7^2
26 + 38 = 64 అనేది 8^2 అదేవిధంగా
12 + 24 = 36 అనేది 6^2. కాబట్టి సమాధానం P_6 అవుతుంది.

4. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?




ఎ) 15 బి) 72 సి) 54 డి) 32

సమాధానం: (సి)

వివరణ: మొదటి డయాగ్రామ్‌లో 8 x 7 = 56.
రెండో డయాగ్రామ్‌లో 3 x 5 = 15
కాబట్టి మూడో డయాగ్రామ్‌లో 9 x 6 = 54 సమాధానం అవుతుంది.

5. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 168 బి) 182 సి) 122 డి) 146

సమాధానం: (సి)

వివరణ: త్రిభుజానికి మూడువైపుల గల సంఖ్యల వర్గాలను కూడగా త్రిభుజంలోని సంఖ్య వస్తుంది.

$6^2 + 4^2 + 5^2 = 36 + 16 + 25 = 77$
$9^2 + 1^2 + 2^2 = 86$
కాబట్టి $7^2 + 8^2 + 3^2 = 49 + 64 + 9 = 122$



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

ఐఎంఎస్సీలో ఫ్యాకల్టీ



చెన్నైలోని ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేథమెటికల్ సైన్సెస్(ఐఎంఎస్సీ).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 8

విభాగాలు: ఫెలో-ఇ, రీడర్-ఎఫ్, ప్రొఫెసర్-జీ, ప్రొఫెసర్-హెచ్

అర్హత: ఫిజిక్స్, మేథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటేషనల్ బయాలజీలో పీహెచ్‌డీ ఉత్తీర్ణత. 5 నుంచి 15 ఏళ్ల పరిశోధనానుభవం ఉండాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 29 **వెబ్‌సైట్:** www.imsc.res.in/

SCHOLARSHIP ALERT

Description: K.C. Mahindra Scholarships for Post-Graduate Studies Abroad 2024 is an opportunity offered by the K. C. Mahindra Education Trust, a public charitable trust, for graduate students who are willing to pursue postgraduate studies abroad in various fields.

K.C. Mahindra Scholarships for Post-Graduate Studies Abroad



Eligibility: Open for Indian citizens who have a first-class degree or equivalent diploma of similar standard from recognised universities. Applicants must have secured admission or have applied for admission in reputable foreign universities for courses commencing from August 2024 but not later than February 2025.

Prizes & Rewards: Interest-free loan scholarship of up to 10,00,000

Last Date to Apply: 31-03-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/KCMQ1

ICRO Amrit Internship Programme

Description: ICRO Amrit Internship Programme 2024 is a joint initiative of the Indian Potash Limited (IPL) and the National Productivity Council (NPC) under the Ministry of Commerce and Industry, Government of India for Class 12 passed, final-year graduation students, graduates, and diploma holders.

Eligibility: Open for Indian nationals aged between 18-45 years. Applicants must be Class 12 passed, final-year graduation students, graduates, or diploma holders with a a valid Aadhaar card.

Prizes & Rewards: A monthly stipend of 6,000 and a certificate of completion.

Last Date to Apply: Round the year

Application mode: Online Only

Short Url: www.b4s.in/aj/ICRA1

India Fellow Social Leadership Program

Description: India Fellow Social Leadership Program 2024-25 is an opportunity offered by the India Fellow for graduate students and young professionals between 20 and 30 years of age. It is an 18- month leadership program designed to help participants develop their skills and make a positive impact on communities.

Eligibility: Open for Indian citizens aged between 20 to 30 years. Applicants must be graduates in any discipline or about to complete graduation by the fellowship start date. Students must be ready for an 18-month full-time commitment to the fellowship and prepared to be placed in any part of the country and any the matic area.

Prizes & Rewards: A monthly stipend of up to 22,000 and other benefits

Last Date to Apply: 15-08-2024

Application mode: Online Only

Short Url: www.b4s.in/aj/IFSA2

buddy4study.com

డైలీ సుడోకు - 241

9	3	8		2		7		
							1	
				4	6			
	7				1	9		
5		9				4		3
		2	6				7	
			4	1				
	9							
		1		8		6	2	7

సుడోకు - 240 సమాధానం

1	5	7	2	9	6	8	4	3
9	4	6	7	3	8	1	2	5
8	3	2	5	1	4	7	9	6
2	6	1	3	7	9	5	8	4
7	9	3	4	8	5	2	6	1
4	8	5	1	6	2	3	7	9
6	1	9	8	2	3	4	5	7
5	7	8	6	4	1	9	3	2
3	2	4	9	5	7	6	1	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.